Dwaraka

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 288

సోమవారం 8-1-2018

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR| KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



ఫేస్‌బుక్ చూసి అప్పిస్తారు

రుణ అర్హత తేల్చడానికి కొత్త విధానాలు అనుసరిస్తున్న బ్యాంకులు - 15లో



మూడో రోజు వర్షార్పణం

భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టుకు అంతరాయం – స్పోర్ట్స్‌లో

'ఓఆర్ఆర్' ప్రైవేటుకు!



- నిర్వహణ, టోల్ వసూళ్లను అప్పగించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు
- 20–30 ఏళ్లపాటు లీజు.. రూ. 2,000 – రూ. 3,000 కోట్ల ఆదాయం
- ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌ను నియమించి లెక్కలేస్తున్న అధికారులు
- రెండు నెలల్లో నివేదిక.. ఆ వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదన - 18లో

కరీంనగర్‌లో ఐటీ టవర్

నేడు శంకుస్థాపన చేయనున్న కేటీఆర్



- రూ. 25 కోట్లతో ఐటీ టవర్ నిర్మాణం
- 50 వేల చదరపు అడుగుల వైశాల్యంతో భవనం
- 3 ఎకరాల్లో భవనానికి డిజైన్ సిద్ధం
- వెయ్యి మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- అనంతరం భారీ బహిరంగ సభ

- వివరాలు 3లో

భద్రతపై ప్రత్యేక దృష్టి

డీజీపీ, ఐజీపీల సదస్సులో మోదీ



- కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని సూచన
- గత మూడేళ్ల నిర్ణయాల అమలుపై అధికారుల ప్రజెంటేషన్..
- నేడూ ఉన్నతాధికారులతో ప్రధాని భేటీ

- వివరాలు 11లో

'బీసీ' నిధికి 30,000 కోట్లు

వెనుకబడిన కులాల అభివృద్ధికి సర్కారు యోచన



- ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ తరహాలో చట్టబద్ధత
- జనాభాకు అనుగుణంగా సగం వాటా దక్కాలన్న కేబినెట్ సబ్ కమిటీ
- ప్రత్యేక నిధి వైపు మొగ్గు
- నివేదికకు తుది రూపు ఇస్తున్న బీసీ సంక్షేమ శాఖ
- వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో బిల్లు

సాక్షి, హైదరాబాద్

వెనుకబడిన కులాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. భారీ మొత్తంలో నిధిని కేటాయించి చట్టబద్ధత కల్పించాలని భావిస్తోంది. ఈ మేరకు బీసీ నివేదికకు మెరుగులు దిద్దుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల కోసం ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్సీ ఎస్‌డీఎఫ్), షెడ్యూల్డ్ తెగల కోసం ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్టీ ఎస్‌డీఎఫ్)ని అమలు చేస్తోంది. ఈ క్రమంలో బీసీలకు సైతం ప్రత్యేక అభివృద్ధి నిధిని ప్రవేశపెట్టాలనే డిమాండ్ మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో కేటగిరీల వారీగా జనాభా శాతం (2011 జనగణన ప్రకారం)

ఎస్సీలు.. 15.45	ఎస్టీలు.. 9.27
బీసీలు.. 51.09(అంచనా)	



ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన చాకలి పోరు గర్జన బహిరంగ సభకు తరలివచ్చిన రజకులు

రజకులను ఎస్సీల్లో చేర్చాలి

'చాకలి ఎస్సీ సాధన సమితి' రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి

- ఎస్సీ హోదా కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం
- రాజకీయ లబ్ధి కోసం కాదు.. చైతన్యం కోసమే పాదయాత్ర
- గెలిపించే దమ్ము లేకపోయినా.. ఓడించే సత్తా ఉంది
- రజకులను దళితులుగా గుర్తించాలి: బిహార్ మాజీ మంత్రి శ్యామ్ రజక
- సరూర్‌నగర్ స్టేడియంలో 'పోరు గర్జన'.. భారీగా హాజరైన రజకులు

5లో

14వేల బంకర్లు

పాక్ సరిహద్దు వెంట నిర్మాణానికి కేంద్రం ఆమోదం - వివరాలు 11లో

నాసిరకం విత్తు .. ఇకపై చిత్తు!



- కట్టుదిట్టంగా పత్తి విత్తన జన్యు స్వచ్ఛత పరీక్షలు
- దేశంలోనే తొలిసారిగా మార్గదర్శకాలు రూపొందించిన రాష్ట్ర వ్యవసాయశాఖ
- నాసిరకం విత్తనాలు మార్కెట్లోకి రాకుండా కఠిన నిబంధనలు
- స్వచ్ఛత 90 శాతం ఉండాల్సిందే.. అంతకన్నా తక్కువుంటే నాసిరకమే
- మార్గదర్శకాలు అమలు చేయాలంటూ కలెక్టర్లకు లేఖ - 12లో
- దేశవ్యాప్తంగా వీటినే అనుసరించాలని కేంద్రానికి విన్నవించిన రాష్ట్రం

'మత్తు' మింగేసింది!

నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు మరొకరు బలి

- జూబ్లీహిల్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడిపిన వ్యక్తి
- అదుపు తప్పి స్కూటీని వెనుక నుంచి ఢీ కొట్టిన వైనం
- వాహనంపై ఉన్న ముగ్గురు యువతుల్లో ఒకరు మృతి
- మరొకరి బ్రెయిన్ డెడ్, ఇంకో యువతికి తీవ్ర గాయాలు

5లో



ప్రమాదంలో మృతి చెందిన మస్తానీ(ఫైల్)

'సిర్పూర్'పై మళ్లీ ఆశలు


- పేపర్ మిల్లు పునరుద్ధరణ దిశగా పడిన ముందడుగు
- దివాలా వ్యాపార పరిష్కార ప్రక్రియ చేపట్టిన కంపెనీ లా ట్రిబ్యునల్.. టేకోవర్‌కు ముందుకొచ్చిన 8 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు
- మేలోగా పూర్తికానున్న ప్రక్రియ
- మరో 8 నెలల్లో పునరుద్ధరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రఖ్యాత కాగితపు తయారీ పరిశ్రమ, దశాబ్దాల చరిత్రగల 'ద సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్' పునరుద్ధరణపై ఆశలు చిగురిస్తున్నాయి. మూడున్నరేళ్లుగా మూతబడి ఉన్న ఈ పరిశ్రమ తిరిగి తెరుచుకునే దిశగా అడుగులు పడ్డాయి. ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) చేపట్టిన దివాలా వ్యాపార పరిష్కార ప్రక్రియ (కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిసల్యూషన్ ప్రాసెస్–సీఐఆర్‌పీ) ఓ కొలిక్కి వచ్చింది. 80 ఏళ్ల చరిత్రగల ఈ కంపెనీని సొంతం (టేకోవర్) చేసుకుని పునరుద్ధరించేందుకు 8 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు మిగతా 6వ పేజీలో ▶

చాకిరీ బారాణా జీతం చారాణా

ప్రైవేటు స్కూళ్ల టీచర్లకు అరకొర వేతనాలు



- పాఠశాల యాజమాన్యాల ఇష్టారాజ్యం
- తల్లిదండ్రుల నుంచి అడ్డగోలు వసూళ్లు
- 62 రకాల పేర్లతో నానా రకాల ఫీజులు
- ఉపాధ్యాయులకు మాత్రం మొండిచేయి
- ప్రభుత్వమే పట్టించుకోవాలని వేడుకోలు

సాక్షి, హైదరాబాద్: ఐఐటీ.. ఒలింపియాడ్.. టెక్నో.. కాన్సెప్ట్.. ఈ-శాస్త్ర.. ఒకటా రెండా.. ఇలా 62 రకాల పేర్లతో తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు గుంజుతున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు టీచర్లకు మాత్రం మొండిచేయి చూపుతున్నాయి! పొద్దుట్నుంచి రాత్రి వరకు క్లాసులు చెప్పిస్తున్నా జీతాలు మాత్రం అరకొరగా విదిలిస్తున్నాయి. కొన్ని అగ్రస్థాయి పాఠశాలలు మినహా మెజారిటీ స్కూళ్లు.. తమ టీచర్లకు చెల్లిస్తున్న వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రైవేటు మిగతా 2వ పేజీలో ▶

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శంకర్‌నారాయణ


శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శంకర్‌నారాయణ

సాక్షి, తిరుమల: ఏపీ, తెలంగాణ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శంకర్‌నారాయణ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన తన కుటుంబీకులతో కలిసి ఆలయానికి వచ్చి ధ్వజస్తంభానికి మొక్కుకున్నారు. అనంతరం శ్రీవారిని, వకుళమాతను దర్శించుకుని, హుండీలో కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్‌కు తిరుమల ప్రోటోకాల్ జడ్జి సన్యాసినాయుడు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో రతన్‌టాటా, చంద్రశేఖరన్




సాక్షి, తిరుమల: ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సంస్థల మాజీ చైర్మన్ రతన్ టాటా, ప్రస్తుత చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఆదివారం రాత్రి తిరుమల వచ్చారు. ఇక్కడి పద్మావతి గృహాల వద్ద వారికి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారితో ఈవో, జేఈవోలు మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే టీటీడీకి ఐటీ పరంగా టాటా సంస్థలకు చెందిన టీసీఎస్ సంపూర్ణ సహకారం అందిస్తోంది. టీటీడీ భవిష్యత్ అవసరాలు, భక్తుల సౌకర్యాల కల్పనకోసం మరింత సహకారం అందిస్తామని రతన్‌టాటా, చంద్రశేఖరన్ టీటీడీ అధికారులకు హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం వీరు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

బాబు ఇలాఖాలోనే ఇన్ని సమస్యలా?

55వ రోజు

07-01-2018, ఆదివారం
చౌడేపల్లి క్రాస్,
చిత్తూరు జిల్లా.



తప్పెట్లు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితులు, హారతులతో బారులు తీరిన అక్కాచెల్లెమ్మలు, నాన్నగారి ప్రతిమలను తలపై ఉంచుకుని నడుస్తున్న అభిమానులు, పార్టీ పతాకాలను చేతబట్టిన కార్యకర్తలు, పలు రకాల వేషధారులు, పౌరాణిక పాత్రధారులతో ఉత్సాహభరితంగా చంద్రగిరి నియోజకవర్గంలో యాత్ర సాగింది. పండుగ వాతావరణాన్ని తలపించింది.

ఇక్కడి ప్రజల ఇబ్బందులు, ఈ ప్రాంతంలో నెలకొన్న అనేకానేక సమస్యలు వింటుంటే ముఖ్యమంత్రి సొంత ప్రాంతంలోనే ఇన్ని సమస్యలా.. అని విస్మయం కలిగింది. 'జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసి' అన్నారు. అంతేకాదు, పుట్టిన ప్రాంతం కన్నతల్లితో సమానం అంటారు. ఎక్కడెక్కడో ఉన్న ఎన్నారైలు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం పుట్టిన ప్రాంతానికి ఏదో ఒకటి చేయాలని తాపత్రయపడుతూ ఉంటారు. సొంత ప్రాంతానికి మంచి చేసే అవకాశం రావడమే అదృష్టం. అటువంటి అవకాశం ఉండి కూడా ఏమీ చేయకపోవడాన్ని ఏమనుకోవాలి? ఈ నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, హాస్పిటల్, చంద్రబాబు చదువుకున్న స్కూలు, మామిడి మార్కెట్టు.. ఇలా చెప్పుకుంటూపోతే అన్నింట్లోనూ సమస్యలే. ముఖ్యమంత్రిగా ఉండి సొంత ప్రాంతానికి ఏమీ చేయని వ్యక్తి రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానంటాడు. ఏ దేశానికి పోతే ఆదేశంలాగా చేస్తానంటాడు. దీన్ని చూస్తుంటే చంద్రబాబుగారి గురించి నాన్నగారు తరచూ చెప్పే సామెత.. 'అమ్మకు అన్నం పెట్టనోడు.. పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానన్నాడట' గుర్తొచ్చింది.

దామలచెరువులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో చొక్కా లేకుండా వచ్చిన తాత మాట్లాడాడు. ఆయన పేరు వెంకటాచలంనాయుడు. వేలాది మంది రైతులకు, ఎంతో మంది కార్మికులకు జీవనాధారమైన చిత్తూరులోని విజయా డెయిరీ ఒకప్పటి ప్రాభవాన్ని, సొంత కంపెనీ హెరిటేజ్ ఎదుగుదల కోసం దాన్ని మూత వేయించడానికి చంద్రబాబు పన్నిన కుట్రలను, అది మూతపడటంతో నష్టపోయిన రైతాంగం గురించి, రోడ్డున పడ్డ కార్మిక కుటుంబాల గురించి కళ్లకు కట్టినట్టు వివరించాడు. అంతేకాదు, చంద్రబాబు నిర్వాకంతో రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, అదే సమయంలో ప్రయివేటు చక్కెర ఫ్యాక్టరీలు మాత్రం లాభాలతో విలసిల్లాయని తెలిపాడు. చంద్రబాబుగారి మోసాన్ని, చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ.. విజయా డెయిరీ తిరిగి ప్రారంభమయ్యే దాకా చొక్కా, చెప్పులు ధరించనని శపథం చేశాడట. చంద్రబాబు మోసాలకు వ్యతిరేకంగా సొంత ప్రాంతానికి చెందిన వ్యక్తే గాంధేయ మార్గంలో ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నాడంటేనే అది చంద్రబాబుకు సిగ్గుచేటయిన విషయం. దాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం మరింత దారుణం.

మధ్యాహ్నం గుండ్లపల్లి దగ్గర కూడా విజయా డెయిరీ కార్మికులు కలిసి 'అన్నా.. మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే డెయిరీని తెరిపించండి.. మమ్మల్ని, రైతుల్ని ఆదుకోండి' అని విన్నవించారు. మనసుకు చాలా బాధేసింది. కేవలం తన ఒక్కడి స్వార్థం కోసం ఇంతమంది రైతుల, కార్మికుల జీవితాలను బలిచేయడం ఎంత దారుణం. వారందరి ఉసురు పోసుకుని ఏం సాధించాలని! ఎంతకాలం బతికామన్నది కాదు.. ఎంతమంది గుండెల్లో బతికామన్నది ముఖ్యం.

చివరిగా, ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. పుట్టిన ఊరు, చదువుకున్న స్కూలు బాగోగులు పట్టించుకోని మీరు.. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా చేస్తాననడం హాస్యాస్పదం కాదా?


పుదిపట్లబైలు వద్ద వేదవిద్యార్థితో మాట్లాడుతున్న వైఎస్ జగన్


వైయస్. జగన్.

9, 29 తేదీల్లో వృద్ధులు, దివ్యాంగులకు శ్రీవారి ప్రత్యేక దర్శనం

ఈనెల 10, 30 తేదీల్లో చంటిపిల్లల తల్లిదండ్రులకు కూడా

సాక్షి, తిరుమల: వయో వృద్ధులు, దివ్యాంగులు, 5 సంవత్సరాలలోపు చంటి పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులకు సులభంగా శ్రీవారి దర్శనం కల్పించాలన్న ఉన్నతాశయంతో టీటీడీ ప్రతినెలా రెండు సాధారణ రోజుల్లో ప్రత్యేక దర్శనాలను కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 9, 29 తేదీల్లో వయోవృద్ధులు (65 సంవత్సరాలు పైబడినవారు), దివ్యాంగులకు 4 వేల టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2 వేల టోకెన్లు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లు జారీ చేస్తారు. 5 సంవత్సరాలలోపు చంటి పిల్లలను, వారి తల్లిదండ్రులను ఈనెల 10, 30 తేదీల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1.30 వరకు సుపథం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు.

ఇంటికో ఉద్యోగం ఇస్తామనలేదు: నాయిని



హైదరాబాద్: ఇంటికో ఉద్యోగం ఇస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయిని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. తాము ఇచ్చిన మాటప్రకారం లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని విజయపథంలో నడిపిస్తున్నారన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు చరిత్రలో మైలురాయిగా నిలుస్తాయన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. అంతకుముందు నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మేయర్ దంపతులు బొంతు రామ్మోహన్, శ్రీదేవి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాకిరీ బారాణా జీతం చారాణా

▶ మొదటి పేజీ తరువాయి

పాఠశాలల ఆదాయ, వ్యయాలను చూసే వ్యవస్థ లేకపోవడం, విద్యాశాఖ పట్టించుకోకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫీజుల నియంత్రణ చర్యలు చేపట్టిన ప్రభుత్వం తమ సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాలని ప్రైవేటు టీచర్ల సంఘం డిమాండ్ చేస్తోంది. రెగ్యులర్ టీచర్లకు చెల్లిస్తున్న తరహాలోనే తమకూ వేతనాలను చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరుతోంది.

ఎంతెంత ఇస్తున్నారో లెక్కే లేదు..

రాష్ట్రంలో దాదాపు 31 లక్షల మంది విద్యార్థులు 11,700 పైగా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. వీటిల్లో సుమారు 1.5 లక్షల మంది టీచర్లు పని చేస్తున్నారు. అయితే 50 వేల మంది వరకు టీచర్లను యాజమాన్యాలు అసలు వారి రికార్డుల్లోనే చూపించడం లేదు. వారందరికీ తక్కువ వేతనాలిస్తూ యాజమాన్యాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రికార్డుల్లో చూపించే టీచర్లకు చెల్లిస్తున్నది కూడా అంతంతే అని చెబుతున్నారు. ఇక టీచర్ల వేతనాలను బ్యాంకు ఖాతాల్లో వేస్తున్న యాజమాన్యాలూ తక్కువే ఉన్నాయి. దీంతో అత్యధిక స్కూళ్లు టీచర్లకు ఎంత మొత్తాన్ని వేతనంగా చెల్లిస్తున్నాయో తెలిసే పరిస్థితి లేదు. వాటికి ఓ లెక్కా పత్రం ఉండడం లేదు. తమతో నానా చాకిరీ చేయిస్తూ అరకొర వేతనాలివ్వడంతో జీవనం కూడా గడవడం కష్టమవుతోందని ప్రైవేటు పాఠశాలల టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతున్నారు.



వేతనాలు ఖాతాల్లోకి వేయరెందుకు?

ప్రైవేటు పాఠశాలలకు చెందిన టీచర్ల వేతనాలు, వారి సంక్షేమంపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నివేదికలోనూ స్పష్టమైన నిబంధనలు లేనట్టు తెలిసింది. అసలు టీచర్ల వేతనాలు ఎలా ఉన్నాయో కూడా పరిశీలించకుండా కేవలం ఫీజుల పెంపునకు అవసరమైన సిఫారసులు చేయడం విమర్శలకు దారి తీసింది. జీవో నంబర్-1 అమలు ప్రస్తావనే అందులో లేదు. వాస్తవానికి విద్యాశాఖ అంతకుముందు ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో టీచర్ల సంక్షేమం, వేతనాలకు సంబంధించి స్పష్టమైన నిబంధనలను పొందుపరిచింది. ఉపాధ్యాయుల వేతనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే ఆన్‌లైన్ ద్వారా వేయాలని సిఫారసు చేసింది. విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజుల్లో 50 శాతం ఉపాధ్యాయుల వేతనాలకు చెల్లించాలని పేర్కొంది. విద్యాశాఖ తెచ్చిన ఈ నిబంధన ప్రైవేటు యాజమాన్యాల్లో ఆందోళనకు కారణమైంది. అందుకే తిరుపతిరావు కమిటీపై ఒత్తిడి తెచ్చి ఆ నిబంధన లేకుండా యాజమాన్యాలు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది.

ఇష్టారాజ్య వసూళ్లకు అడ్డదారులెన్నో..

ఒకటో తరగతి నుంచే ఐఐటీ ఫౌండేషన్ అంటూ ప్రైవేటు యాజమాన్యాలు రకరకాల పేర్లతో ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా ఏయే జిల్లాలో ఎన్ని ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయన్న లెక్కలను విద్యాశాఖ తేల్చింది. ఆకర్షణీయ పేర్లతో అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తున్న స్కూళ్ల వివరాలను సేకరించింది. రాష్ట్రంలో 3,487 ప్రైవేటు స్కూళ్లు 62 రకాల పేర్లతో తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్నాయని నిర్ధారణకు వచ్చింది. ఐఐటీ, ఒలింపియాడ్, టెక్నో, కాన్సెప్ట్, ఈ-టెక్నో, ఈ-శాస్త్ర, కాన్వెంట్, పబ్లిక్ స్కూల్ వంటి పేర్లతో రూ.లక్షల్లో కేపిటేషన్ ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నాయని, చివరకు నర్సరీ నుంచే ఐఏఎస్ పాఠాలు అంటూ దోపిడీకి పాల్పడుతున్నాయని విద్యాశాఖ తేల్చింది.

జీవో నంబర్ 1 అమలేది?

ప్రైవేటు టీచర్ల వెతలు తీరాలంటే ప్రభుత్వం 1994లో జారీ చేసిన జీవో నంబరు-1 పక్కాగా అమలు చేయడమే సరైన మార్గమని విద్యాశాఖ అభిప్రాయపడుతోంది. అందుకే ప్రభుత్వానికి పంపిన నివేదికలో దీనికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఒక పాఠశాలకు ఫీజుల రూపంలో వచ్చే ఆదాయం 100 శాతం అనుకుంటే.. అందులో 50 శాతం టీచర్ల వేతనాలకు వెచ్చించాలి. 15 శాతం నిధులను పాఠశాల అభివృద్ధి, వసతుల కల్పనకు ఉపయోగించాలి. మరో 15 శాతం నిధులను పాఠశాల నిర్వహణకు వెచ్చించాలి. మరో 15 శాతం నిధులను ఉపాధ్యాయులు, సిబ్బంది సంక్షేమానికి ఉపయోగించాలి. యాజమాన్యం కేవలం 5 శాతం నిధులను మాత్రమే లాభంగా తీసుకోవాలని జీవో నంబర్-1 చెబుతోంది. ఈ ఉత్తర్వుల్లోని నిబంధనలను విద్యాశాఖ తమ నివేదికలో చేర్చింది.

'బీసీ' నిధికి 30,000 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రావడంతో గతేడాది అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దీనిపై ప్రకటన చేశారు. అనంతరం బీసీల సమగ్రాభివృద్ధికి సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేశారు. బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్న కమిటీ తొలిసారి సీఎం నేతృత్వంలో గతేడాది డిసెంబర్ 3న అసెంబ్లీ హాలులో సమావేశమైంది. సంతృప్తికర స్థాయిలో నిధులిస్తామని సీఎం ఈ భేటీలో స్పష్టం చేశారు. తర్వాత కమిటీ సభ్యులు డజనుకుపైగా సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం దీనికి తుది రూపు ఇస్తున్నారు. మెజారిటీ సభ్యులు బీసీ ప్రత్యేక అభివృద్ధి నిధి(బీసీ ప్లాన్)కి మొగ్గు చూపారు. దీంతో బీసీల కోసం అమలు చేసే కార్యక్రమాలన్నీ ఒకేచోటుకు తీసుకొచ్చి ప్రత్యేక అభివృద్ధి నిధిగా రూపొందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో బీసీ ఎస్‌డీఎఫ్ వైపు అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం.

జన సంఖ్యకు అనుగుణంగా కేటాయింపులు

2011 జనగణన ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లు. ఇందులో ఎస్సీ జనాభా శాతం 15.45, ఎస్టీ జనాభా 9.27 శాతంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే బీసీల జనాభాపై స్పష్టత ఇవ్వలేదు. అయినా అధికారిక అంచనాల్లో భాగంగా 51.09 శాతంగా లెక్కిస్తున్నారు. ఈ మేరకు సీఎంతో సహా మంత్రులు సైతం ఈ గణాంకాలను ప్రస్తావిస్తున్నారు. సబ్ కమిటీ సైతం 50 శాతాన్ని పరిగణిస్తూ బీసీలకు సగం వాటా దక్కాలని పేర్కొంది. నివేదిక తయారీలోనూ ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

2017-18లో ఎస్సీ, ఎస్టీ ఎస్‌డీఎఫ్ కేటాయింపులు ఇవీ..

కేటగిరీ	రూ.కోట్లలో
ఎస్సీలకు	14,375.12
ఎస్టీలకు	8,165.87

మున్ముందు మరిన్ని నిధులు

2018-19లో బీసీ అభివృద్ధి నిధికి ఓ రూపు తీసుకురావాలని భావిస్తున్న అధికార యంత్రాంగం.. ప్రాథమికంగా రూ.30 వేల కోట్ల నిధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. బీసీ ఎస్‌డీఎఫ్‌కు చట్టబద్ధత వస్తే తదుపరి ఏడాదిలో భారీ నిధులను కేటాయించే వీలుంటుందని బీసీ కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేసిన ఉప ప్రణాళికలకు బదులుగా 2017-18 నుంచి ఎస్సీ ఎస్‌డీఎఫ్, ఎస్టీ ఎస్‌డీఎఫ్‌లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బడ్జెట్‌లో మార్పుల దృష్ట్యా వీటిని ప్రత్యేక అభివృద్ధి నిధిగా మార్చి చట్టబద్ధత కల్పించింది. ఇందులో భాగంగా ఎస్సీలకు రూ.14,375.12 కోట్లు, ఎస్టీలకు రూ.8,165.87 కోట్లు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీల కంటే అధికంగా ఉన్న బీసీలకు ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కనిష్టంగా రూ.30 వేల కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలిసింది. జనాభా నిష్పత్తితో పోలిస్తే ఈ నిధి తక్కువైనప్పటికీ... తొలిసారి అమలు చేస్తున్నందున ఈ మొత్తాన్ని కేటాయిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదనలను సీఎంకు సమర్పించిన తర్వాత ఆయన నిర్ణయాన్ని బట్టి కేటాయింపులు మారే అవకాశం ఉంది. 2018-19 బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం బీసీ ప్రత్యేక అభివృద్ధి నిధిని ప్రవేశపెట్టనుందని బీసీ కమిటీ సభ్యుల్లో ఒకరు పేర్కొన్నారు.

నేడు ప్రభుత్వ కార్యదర్శుల సదస్సు

సాక్షి, హైదరాబాద్: 2017-18 ఆర్థిక సంవత్సరం త్వరలో ముగియనుండటంతో అన్ని శాఖల ఉన్నతాధికారులతో ప్రభుత్వం ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసింది. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది. అన్ని శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సదస్సుకు హాజరుకావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా ఏడు అంశాలకు సంబంధించిన వివరాలతో రావాలని ఎజెండాను విడుదల చేసింది. 2018-19 బడ్జెట్ రూపకల్పనకు అవసరమైన ప్రతిపాదనలు, ఆన్‌లైన్‌లో ప్రతిపాదనల సమర్పణను అత్యంత ప్రాధాన్యాంశంగా ఎజెండాలో పేర్కొన్నారు. దీంతో పాటు రాష్ట్ర ఆదాయ వ్యయాలు, ఆర్థిక పరిస్థితిపై 15వ ఆర్థిక సంఘానికి పంపించాల్సిన నిర్ణీత నమూనాలు.. అందుకు అవసరమైన సమాచారం, కొత్త జిల్లాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, శాఖలు, ఉద్యోగుల విభజనకు సంబంధించిన అంశాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగం, పెండింగ్‌లో ఉన్న యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, సెక్రటేరియట్‌లోని అన్ని శాఖల విభాగాధిపతి కార్యాలయాల్లో సిటిజన్ చార్టర్ అమలు తీరు, జోన్లపై రాష్ట్రపతి ఉత్తర్వులు, దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సులపై సమావేశంలో సమీక్ష జరుపుతారు.

5లక్షల ఏళ్లనాటి ఆనవాళ్లు గుర్తింపు

జెరూసలేం: ఐదు లక్షల ఏళ్లనాటి ఆనవాళ్లు ఇజ్రాయెల్‌లో బయట పడ్డాయి. జుల్‌జులియా సమీపంలో జరిపిన తవ్వకాల్లో రాతి గొడ్డళ్లను గుర్తించినట్లు టెల్ అవీవ్ ఆర్కియాలజీ విభాగం అధిపతి ర్యాన్ బర్కాయ్ తెలిపారు.

జిల్లాకో ఇన్వెస్టిగేషన్ సెంటర్

- ఏర్పాటుకు పోలీస్ శాఖ నిర్ణయం
- పెండింగ్ కేసులు పేరుకుపోకుండా చర్యలు
- రీజినల్ ఎఫ్ఎస్ఎల్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ల్యాబ్‌లు



సాక్షి, హైదరాబాద్: కేసుల దర్యాప్తు, విచారణలో ఎదురయ్యే సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులను చాకచక్యంగా పరిష్కరించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ వినూత్న చర్యలు చేపట్టబోతోంది. సంచలనాత్మక కేసుల విచారణలో దర్యాప్తు అధికారులకు సూచనలు, సలహాలు, సందేహాల నివృత్తికి ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేసేందుకు డీజీపీ మహేందర్‌రెడ్డి కార్యాచరణ రూపొందించారు. రాష్ట్ర పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సెల్‌లో అనుభవమున్న పోలీస్ అధికారి, న్యాయ నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులు, ఫింగర్ ప్రింట్స్, టెక్నాలజీ అనుభవమున్న వ్యక్తులు ఉంటారు. కేసు విచారణ సమయంలో ఏ సమస్యతో దర్యాప్తుకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి? వాటిని ఎలా అధిగమించాలి? ఆధారాల సేకరణలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన సూచనలు, సలహాలు ఈ సెల్ నుంచి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కేసుల పెండింగ్ తగ్గడంతో పాటు దర్యాప్తు అధికారికి కూడా అనుభవం వస్తుందన్న నేపథ్యంలో ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్‌ను తీర్చిదిద్దబోతున్నారు.

సైబర్ ల్యాబ్‌లు...

ఏదైనా కేసులో సాంకేతిక ఆధారాలైన సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, సీడీలు, పెన్‌డ్రైవ్‌లు, తదితరాల విశ్లేషణకు సైబర్ ల్యాబ్‌లే కీలకం. విదేశాల నుంచి భారీ ఖర్చుతో కొన్ని ముఖ్యమైన టూల్స్ కొనుగోలు చేస్తున్న పోలీస్ శాఖ వీటి ద్వారా విరిగిపోయిన సీడీల్లోని డేటాను కూడా బయటపెట్టగలదు. అలాగే లాక్ అయిన ఫోన్లలోని డేటాను తిరిగి తీయవచ్చు. మెయిల్స్ ట్రాకింగ్, నకిలీ వెబ్‌సైట్లు, ఇంటర్ నెట్ సంబంధిత కేసులను సైతం పరిష్కరించేందుకు ఈ ల్యాబ్‌లు అత్యంత కీలకపాత్ర పోషించనున్నాయి. రాష్ట్రంలో జిల్లాకో సైబర్ క్రైమ్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది.

సోషల్ మీడియా ల్యాబ్‌లు..

ప్రజల నుంచి నేరుగా సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ప్రతీ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ల్యాబ్ ఏర్పాటుచేయనున్నారు. పెరిగిపోతున్న టెక్నాలజీకి తగ్గట్లుగా ప్రతీ జిల్లా పోలీస్ యూనిట్‌గా ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ అకౌంట్లను ప్రారంభించనున్నారు. అలాగే వదంతులు వ్యాపించిన నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు సోషల్ మీడియా ల్యాబ్‌ను వినియోగించుకోవాలని భావిస్తున్నారు. సైబరాబాద్‌లోని సోషల్ మీడియా ల్యాబ్ లాంటి ప్రత్యేక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. సున్నితమైన అంశాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారి వివరాలు గుర్తించడం ఈ ఫీచర్ ప్రత్యేకత.

ఆ కేసుల కోసం ఫోరెన్సిక్...

అత్యాచారాలు, హత్యలు, తదితర కేసుల్లో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్) నివేదికలే ఆధారం. అయితే ఎక్కడో ఆదిలాబాద్‌లో కేసు జరిగితే.. ఆ కేసు సంబంధిత శాంపిల్స్ హైదరాబాద్‌లోని ఎఫ్ఎస్ఎల్‌కు రావడానికి చాలా సమయం తీసుకుంటోంది. దర్యాప్తు అధికారులు కూడా అలసత్వం వహిస్తున్నారు. దీంతో కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రతీ జిల్లాలో ఫోరెన్సిక్ ల్యాబ్, ఫింగర్ ప్రింట్ బ్యూరో సెంటర్లు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖ నిర్ణయించింది.

ఇదండీ సంగతి



.. అడుక్కోవడానికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు దానిలో నుంచే రావాలి

కరీంనగర్‌లో ఐటీ టవర్

రూ.25 కోట్లతో నిర్మాణం

- 50 వేల చదరపు అడుగుల వైశాల్యంతో భవనం
- 3 ఎకరాల్లో భవనానికి డిజైన్ సిద్ధం
- నేడు శంకుస్థాపన చేయనున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్న ఐటీ టవర్ నమూనా ఇదే

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, పుణే వంటి నగరాలకే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) పరిశ్రమ ఇప్పుడు కరీంనగర్‌కూ వస్తోంది. ఇప్పటికే స్మార్ట్‌సిటీ హోదా దక్కించుకుని దేశంలోని 100 నగరాల సరసన నిలిచిన కరీంనగర్ ఇప్పుడు ఐటీ పరిశ్రమల ఏర్పాటుతో ప్రపంచస్థాయి గుర్తింపును అందుకోనుంది. ప్రతిపాదిత ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే కరీంనగర్‌కు మహర్దశ పట్టనుంది. ద్వితీయ శ్రేణి నగరమైన కరీంనగర్ ఐటీతో కొత్త ఖ్యాతి సంపాదించుకోనుంది.

మంత్రి కేటీఆర్‌చే శంకుస్థాపన..

50 వేల చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మాణం తలపెట్టిన ఐటీ టవర్‌కు సోమవారం ఉదయం ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడే భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. నగరంలోని అన్ని డివిజన్ల కార్పొరేటర్లతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ రవీందర్‌సింగ్‌లు సమావేశమై ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించే బాధ్యతలను అప్పగించారు. అదే విధంగా కళాశాలల విద్యార్థులను కూడా పెద్ద సంఖ్యలో బహిరంగ సభకు తరలించి విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐటీ హబ్‌గా ఏర్పాటు...

ప్రధాన నగరాలకే పరిమితమైన ఐటీ సెక్టార్‌ను ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ నగరాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. 9 నెలల్లో దీనిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఐటీ టవర్‌లో 10కి పైగా అమెరికా, ఆస్ట్రేలియాలకు చెందిన బడా కంపెనీల శాఖలను ఇక్కడ ఏర్పాటు చేసే విధంగా రాయితీలు ఇవ్వనున్నారు. ఉత్తర తెలంగాణ నిరుద్యోగులకు ఐటీ ఉద్యోగాలే లక్ష్యంగా ఏర్పాటుచేస్తున్న ఈ ఐటీ టవర్స్‌తో సుమారు 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

ఉత్తర తెలంగాణ కేంద్ర బిందువు...

ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువుగా ఉన్న కరీంనగర్ విద్య, వైద్యం, ప్రాజెక్టుల రంగాల్లో దూసుకుపోతోంది. మానేరు డ్యామ్ ఒడ్డున ప్రకృతి ఒడిలో ప్రశాంత వాతావరణంలో బైపాస్ రోడ్డును ఆనుకొని 3 ఎకరాల స్థలాన్ని ఐటీ టవర్‌కు కేటాయించారు. రూ.25 కోట్లతో జీ+5 అంతస్తులతో భవనాన్ని నిర్మించేందుకు డిజైన్‌లు సిద్ధం చేశారు. టవర్ నిర్మాణానికి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ) టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు ఏజెన్సీకి పనులు అప్పగించారు. 50 వేల చదరపు అడుగుల వైశాల్యంతో అత్యాధునిక హంగులతో భవన నిర్మాణం పూర్తయితే ప్లగ్ అండ్ ప్లే విధానంతో నిరంతర విద్యుత్ సరఫరా, హైరేంజ్ వైఫై సేవలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పించనున్నారు. పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని సౌకర్యాలతో నిర్మాణం చేయనున్నారు.

శంషాబాద్‌లో అతిపెద్ద క్యాథలిక్ చర్చి

సిరో–మలబార్ డియోసిస్ ఎపార్చి బిషప్ రఫాయెల్ తట్టిల్

హైదరాబాద్: దేశంలోనే అతి పెద్ద క్యాథలిక్ చర్చిని శంషాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు సిరో–మలబార్ డియోసిస్ ఎపార్చి కొత్త బిషప్ మార్ రఫాయెల్ తట్టిల్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేటలో ఆదివారం జరిగిన ఆయన ప్రమాణ స్వీకారోత్సవంలో వివిధ చర్చిల ఫాదర్లు క్రీస్తు సందేశాలు విన్పించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేరళ ప్రధాన కేంద్రంగా.. 31వ డియోసిస్‌ను శంషాబాద్‌లో ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా డియోసిస్ ప్రారంభించాలని 400 ఏళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు నేటికి ఫలించాయన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్, రోమ్ ప్రతినిధి సిరిల్ వాసిల్, ఎస్‌జే హైదరాబాద్ ఆర్చిబిషప్ రెవరెండ్ తుమ్మబాల, ఫాదర్లు జార్జ్ కార్డినల్, అలెన్‌చెర్రీ, మోరన్‌మార్, కార్డినల్ క్లీమీస్ తదితరులు పాల్గొన్నారు.

పలు విమానాలు అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్: ఉత్తర భారతంలో తీవ్ర పొగమంచు కారణంగా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాలు అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. జెడ్డా నుంచి లక్నో బయలుదేరిన ఎస్‌వీ 890 విమానం, దుబాయి నుంచి ఢిల్లీ బయలుదేరిన విమానం, సింగపూర్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఫ్లైట్‌తో పాటు దుబాయి నుంచి బంగ్లాదేశ్ వెళ్తున్న విమానం ఆదివారం వేకువజామున అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. ఉదయం 10 గంటల తర్వాత విమానాలు తిరిగి బయలుదేరాయి.

విమానంలో ధూమపానం

ప్రయాణికుడిపై కేసు నమోదు

శంషాబాద్: విమానంలో సిగరెట్ తాగుతున్న ఓ ప్రయాణికుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మలక్‌పేట్‌కు చెందిన జలీల్‌పాషా ఆదివారం షార్జా నుంచి హైదరాబాద్‌కు విమానంలో వస్తున్నాడు. జలీల్ సిగరెట్ తాగుతుండగా గమనించిన ఎయిర్‌లైన్స్ సిబ్బంది అతడిని వారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారు విమానాశ్రయ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

షరియత్‌లో కేంద్ర జోక్యం సరికాదు

న్యాయవాదుల సదస్సులో మౌలానా ఖాలిద్ సైఫుల్లా



సదుస్సులో మాట్లాడుతున్న మౌలానా ఖాలిద్ సైఫుల్లా. చిత్రంలో రిజ్వాన్ సాహేబ్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన ట్రిపుల్ తలాక్ చట్టంతో పురుషుల కంటే మహిళలకే ఎక్కువ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదముందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధికార ప్రతినిధి, తఫీమే షరియత్ కమిటీ కన్వీనర్ మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ పేర్కొన్నారు. ఆదివారం తెలుగు విశ్వవిద్యాలయ ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో తంజీమే షరియత్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాద విద్యార్థులు, న్యాయవాదుల సదస్సు జరిగింది. సదస్సుకు హాజరైన మౌలానా మాట్లాడుతూ.. తలాక్‌కు సంబంధించి భర్తకు మూడేళ్ల జైలు విధించేలా కేంద్రం ప్రవేశ పెట్టిన బిల్లును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ట్రిపుల్ తలాక్ ఇచ్చిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తే అతని భార్య, పిల్లల జీవనోపాధి ఎవరు భరిస్తారని ప్రశ్నించారు. ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్రం ఇలాంటి చట్టం తీసుకురావడం అంటే షరియత్‌లో జోక్యం చేసుకోవడమే అవుతుందన్నారు. ఈ బిల్లులో ఎన్నో లోపాలున్నాయన్నారు. ముస్లిం మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వానికి సానుభూతి ఉంటే ముందుగా ముస్లిం మత గురువులను సంప్రదించి ట్రిపుల్ తలాక్ నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంలో ఎక్కువ శాతం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నవారు ఉన్నారని, దీంతో ముస్లిం షరియత్‌ను మార్చడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సదస్సులో కమిటీ కో ఆర్డినేటర్ అహ్మద్‌ఖాన్, కన్వీనర్ జలీసా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఆ రైళ్ల వేళల్లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: సోమవారం ఉదయం 6.25 గంటలకు బయలుదేరాల్సిన హైదరాబాద్–న్యూఢిల్లీ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ 11.55 గంటలకు బయలుదేరుతుందని దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే చెన్నై సెంట్రల్–హజ్రత్ నిజాముద్దీన్ దురంతో ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం 6.40 గంటలకు బదులుగా మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ వెల్లడించారు.

18 పురుగు మందులపై కేంద్రం నిషేధం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 18 రకాల పురుగు మందులపై నిషేధం విధిస్తూ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. మనుషులు, జంతువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున వీటిని నిషేధించినట్లు వెల్లడించింది. నిషేధం విధించిన వాటిలో బినోమిల్, కార్బారిల్, డయాజినాన్, ఫినారిమాల్, ఫెంతియాన్, లినురాన్, మెతాక్సీఎథైల్ మెర్క్యురిక్ క్లోరైడ్, మెథాల్ పారాతి యాన్, సోడియం సైనైడ్, తియోమిటాన్, ట్రైడెమోర్ఫ్, ట్రైఫ్లూరాలిన్, అలాక్లోర్, డిక్లొర్‌వాస్, పోరేట్, పాస్పామిడాన్, ట్రైజోఫాస్, ట్రైక్లోర్‌ఫాన్‌లు ఉన్నాయి.



పోలీసుల అదుపులో పందెం కోళ్లతో నిర్వాహకులు

మిద్దె ఫైనే బరి!


జూబ్లీహిల్స్‌లో ఓ బిల్డింగ్‌పై కోడి పందేలు

సాక్షి, హైదరాబాద్: రాజధాని ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్న 29 మందిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి నుంచి 17 కోడి పుంజులు, రూ.80 వేల నగదు, 26 సెల్‌ఫోన్లు సహా 60 కత్తులను స్వా ధీనం చేసుకున్నట్లు డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన వెంకటకృష్ణ జూబ్లీహిల్స్‌లోని శ్రీకృష్ణానగర్‌లో నివసిస్తూ బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో తేలిగ్గా డబ్బు సంపాదించడానికి మార్గాలు అన్వేషించాడు. సంక్రాం తి సీజన్ కావడంతో తానే ఓ బరి ఏర్పాటు చేసి, కోడి పందేలు నిర్వహించాలని పథకం వేశాడు. తన స్నేహితుడు వెంకటప్రసాద్‌తో కలసి శ్రీకృష్ణానగర్‌లోని ఓ ఐదంతస్తుల భవనం మిద్దెపై ఏర్పాట్లు చేశాడు. కోడి పందేలు నిర్వహిస్తూ కమీషన్లు తీసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు నేతృత్వంలోని బృందం దాడి చేసి, 29 మందిని అరెస్టు చేసింది. తదుపరి చర్యల నిమిత్తం జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించింది.

4
సాక్షి
సాహిత్యం
హైదరాబాద్ | సోమవారం | జనవరి | 8 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

కథాసారం

ప్రాణం ఖరీదు



కాన్‌స్టంట్‌నోపుల్‌లో లంగరు వేసింది ఓడ. పేరు మెజి డాల్టన్. దాని కాప్టెన్, జిబ్బిన్స్. పైపు పీలుస్తూ డెక్కు మీదకు దిగుతూనే ఆయనకు టర్కిష్ పోస్ట్‌మాన్ టెలిగ్రామ్ అందించాడు. న్యూఆర్లియన్స్‌లోని కంపెనీ అధిపతి నుండి వచ్చింది. మెజి డాల్టన్‌ను న్యూఆర్లియన్స్ నుండి ఒదేస్సకూ, తిరిగి న్యూఆర్లియన్స్‌కూ ప్రయాణం మీద పంపిన లెన్స్‌్పి అండ్ సన్ కంపెనీ త్వరగా సరుకు నింపుకొని రావాలని పట్టుబడుతున్నదని దాని సారాంశం. ఓడలో నింపబోయే పొద్దుతిరుగుడు పూలచెక్కకు మార్కెట్లో మంచి డిమాండ్ వచ్చేట్టుందట.

పిసినారి అధిపతి టన్నుకు రెండు సెంట్లకు కక్కుర్తి పడి నాసిరకం బొగ్గు నింపించాడు. దానివల్ల ఎదురు గాలికి అట్లాంటిక్ మహాసముద్రం దాటేప్పటికే అవసరమైనంత ఆవిరి పీడనం నిలవడం కష్టంగా ఉంది. కానీ త్వరగా రమ్మని ఉత్తరువు! దాన్ని నిర్వర్తించడం కాప్టెన్ బాధ్యత. పైగా త్వరగా వెళ్తే బోనస్ కూడా ఇస్తారు. వెంటనే ఓడ మెకానిక్ ఓహిడ్డీని పిలిపించాడు. కానీ బాయిలర్లు శుభ్రం చేసుకోవడానికి ఒదేస్సలో మనం ఆగాలి, అన్నాడు ఓహిడ్డీ. గత ప్రయాణంలో చేశాం కదా; యీ గలీజు పని మళ్లీ చేయకపోతేనేమని ప్రశ్నించాడు జిబ్బిన్స్. మసి పేరుకొని సగం గొట్టాలు పనిచేయడం లేదు; శుభ్రం చేయకపోతే మనం తిరిగి పోలేం; సరుకు వేసుకొని అసలు పోలేమని తేల్చాడు ఓహిడ్డీ. అయితే మన బోనస్ పోతుందన్నమాట! నిట్టూర్చాడు కాప్టెన్. ఒక్క నిమిషం వృథా చేయకుండా పని ముగించమన్నాడు.

•

రైలు కమ్మీల ఆవల ఉన్నది 'ఓడల బాయిలర్లను శుభ్రపరిచే ఆఫీసు'. యజమాని పి.కె.బీకొవ్. అనువాదకుడు లైజర్‌ను వెంటబెట్టుకుని బీకొవ్ ఆఫీసుకెళ్లాడు ఓహిడ్డీ. ఈయనకు రెండు రోజుల్లో బాయిలర్ శుభ్రం చేయాలి; అర్జెంటు రవాణా ఉంది; అమెరికాకు త్వరగా తిరిగి వెళ్లాలి, అని చెప్పాడు లైజర్. బదులుగా చాలా పెద్ద మొత్తం చెప్పాడు బీకొవ్. రెండు రోజులకు రెండు రోజుల్లాగే చెల్లించాలనీ అన్నాడు. చేసేదిలేక ఓహిడ్డీ అంగీకరించాడు. రెండ్రోజుల్లో పూర్తి కాకపోతే మాత్రం ప్రతిరోజుకూ మొత్తంలో ఇరవై ఐదు శాతం పట్టుకుంటామని మాత్రం ఖండితంగా చెప్పాడు. చెప్పిన సమయానికి పని పూర్తవుతుందని ధీమాగా ఉన్నాడు బీకొవ్.

ఈ ఒప్పందం చేసుకుంటున్నప్పుడే ఆఫీసు ముందర కుర్రాళ్ల గుంపొకటి కనబడింది ఓహిడ్డీకి. అందులోంచి ఓ చింపిరి బట్టల కుర్రాడొచ్చి, గివ్ మి షిలింగ్ ఇఫ్ యూ ప్లీజ్ అన్నాడు. వాణ్ని చూడగానే ఓహిడ్డీకి తన స్వదేశం కెనడా గొర్తొచ్చింది. ముచ్చటపడి డాలర్ నాణెం చేతిలో పెట్టాడు. హిప్ హిప్ హుర్రా అని అరిచాడు పిల్లాడు.

•

ఎలకా, సేన్కా, మీష్కా, పాష్కా, పేత్కా, అలోష్కా అని కేకేశాడు బీకొవ్. బాయిలర్ గొట్టాలకు మురికి పట్టినప్పుడు పెద్దవాళ్లు వాటి లోపలికి దూరలేరు. పదేళ్ల పిల్లాడైతే సరిగ్గా సరిపోతాడు. దానికోసం బీకొవ్ దగ్గర ఈ కుర్రాళ్ల గుంపు ఉంది. రేవులోని దారిద్ర్య దేవతల బిడ్డలు వాళ్లు. రోజుకు పదిహేను కోపెక్కుల చొప్పున వారికి చెల్లిస్తాడు. భోజనం వాళ్లదే. కుర్రాళ్లందరిలోకీ మీత్క ప్రత్యేకమైనవాడు. వాడికి యెముకలే లేవు. యిరుకైన గొట్టాల్లో కూడా ఈల్ చేపలా ఈదుతాడు. మూలల్లోకీ వంపుల్లోకీ కూడా పాకుతాడు. అందుకే వాణ్ని ఎలక అంటారు. ఎలకొక్కడే పదిమంది పని చేస్తాడని బీకొవ్‌కు తెలుసు.

ఒళ్లు గీచుకపోకుండా తార్‌పాలిన్ సంచులు తొడుక్కుని గొట్టాల్లో మాయమయ్యారు కుర్రాళ్లు. ఈలోపులో జిబ్బిన్స్‌కు ఓడ అధిపతి నుంచి మరో టెలిగ్రామ్ వచ్చింది. ప్రయాణకాలంలో మరి రెండు రోజులు తగ్గించగలిగితే బోనస్ రెట్టింపు చేస్తానని ఉంది. తన పిల్లల భవిష్యత్ కోసం బేంకులో డబ్బు వేయొచ్చనిపించింది.

లైజర్, ఓహిడ్డీ, జిబ్బిన్స్ కూర్చుని టీ తాగుతుండగా కాబిన్ తలుపు భళ్లున తెరుచుకుంది. ఫోర్‌మన్ విషయం చెప్పాడు. డామిట్ అనుకుంటూ ఓహిడ్డీ, లైజర్ ఉరికినారు. అబ్బాయిలూ ఏమైంది? మీత్క లోపలికి పాకినాడు, బయటికి రాలేకున్నాడు. యెలక ఇరుక్కుపోవడమా? లైజర్ నమ్మలేదు. నీ కాళ్లు విరగ, ఎంత పనిచేశావురా? దేవుడి తోడు నా తప్పేమీ లేదు; గొట్టం వెంబడి పాకినాను; నా చెయ్యి ఎలాగో వడిదిరిగి శరీరం కింద ఇరుక్కుంది; వూడదీసుకోలేకున్నానని ఏడ్వసాగాడు మీత్క. తనకు స్వదేశాన్ని గుర్తుతెచ్చిన కుర్రాడికే ఇలా జరగడంతో ఓహిడ్డీ ప్రాణం మూలిగింది. కాళ్లు పట్టుకుని లాగడానికి ప్రయత్నించారు. హృదయవిదారకమైన చావుకేక. ఓ వదలండి... నొప్పి... నా చేయి విరిగిపోతుంది.

విషయం తెలిసి బీకొవ్ దడదడలాడుతూ వచ్చాడు. సకాలంలో పని జరక్కపోతే మీరు డబ్బిస్తారా గాడద కొడుకుల్లారా అంటూ తిట్టిపోశాడు. మీత్కా, దొంగవేషాలు వేస్తున్నావా బద్మాష్ అని అరిచాడు. నా చేయి పూర్తిగా వడదిరిగింది అని మొత్తుకున్నాడు మీత్కా. మూతి పగలగొడతాను బయటికి రా! నన్ను చంపడం నయం, ఈ బాధ భరించలేను... గొట్టంలో బకెట్ నూనె పోశారు జిడ్డుగా ఉంటే సులభంగా తీయొచ్చని. రెండో బకెట్ కూడా పోశారు. ఎలక కాలికి తాడు కట్టి లాగారు. ఓ దేవుడా నొప్పి నొప్పి అయ్యో అయ్యో చచ్చేంత నొప్పి...

పిల్లాడిని హింసించడానికి ఓహిడ్డీ ఒప్పుకోలేదు. వాడు బయటికి రావాలంటే గొట్టం పగలగొట్టడం మినహా మార్గం లేదన్నాడు బీకొవ్. కంపెనీ యజమానుల అనుమతీ, సరుకు యజమానుల అనుమతీ లేకుండా పగలగొట్టడానికి ఒప్పుకోనన్నాడు కాప్టెన్. పిల్లవాడి సంగతి చెబుతూ యజమానికి టెలిగ్రామ్ పంపాడు. ఎలాంటి ఆలస్యమూ అనుమతించబడదనీ, దానికి యావత్తూ జిబ్బిన్స్ బాధ్యత వహించాలనీ జవాబు వచ్చింది. అతడి ముఖం కొయ్యబారి పోయింది. ఒక్క గంట ఆలస్యం కూడా ఒప్పుకోనని బీకొవ్‌కు తేల్చి చెప్పాడు. సాయంత్రం పొయ్యి అంటించి తీరాలి!

ఆలస్యానికి నేను డబ్బులు చెల్లించి బికారి కాదల్చుకోలేదన్నాడు బీకొవ్. గొట్టంలోనే చావదల్చుకున్నావటరా... అతని కుర్రవాడు అతని వ్యవహారం, సాయంత్రం మాత్రం పొయ్యి అంటించాలి అన్నాడు కాప్టెన్.

అందరూ భోజనానికి వెళ్లిపోయినారు. సందడి లేదు. ఆ నిశ్శబ్దంలో బీకొవ్ పథకం ఆలోచించాడు. గొట్టంలోకి పేత్కను పంపించాడు. అందరూ తిరిగి వచ్చేప్పటికి ఎలకను లాగినట్టుగా తాడుతో పేత్కను లాగాడు. ఎటూ ఊపిరాడక చచ్చిపోయే కుర్రాడి కోసం కాప్టెన్ తన బోనస్ వదులుకోవడానికి సిద్ధంగా లేడు.

•

సాయంత్రం పూర్తి సరుకుతో ఓడ బయల్దేరింది. నిజం తెలిసిపోయి, ఈ అర్జెంటు రవాణాలో ఓడ మీద తిరుగుబాటు చేయలేక అశక్తుడైన ఓహిడ్డీ సముద్రంలో దూకినాడు. మెకానిక్ మరణించినట్లు కాప్టెన్ తన దినచర్య పుస్తకంలో రాసుకున్నాడు.

న్యూఆర్లియన్స్ రేవులో ఓడ ఆగింది. ఆ కుర్రాడి సమస్యను ఎలా పరిష్కరించారని కాప్టెన్‌ను అడిగాడు యజమాని. అందులో చెప్పవలసిందేమీ లేదన్నాడు కాప్టెన్. రాత్రి సిబ్బంది నగరంలోకి పోయినప్పుడు కాప్టెన్ యింజిన్ గదిలోకి పోయినాడు. పెద్ద కొక్కెం తీసుకుని గొట్టం లోపలికి దూర్చి చాలాసేపు కలబెట్టినాడు. కొక్కాన్ని వెనక్కి లాగినప్పుడు ఆయన కాళ్ల వద్ద చిన్న పుర్రె, యెముకలు కింద పడ్డాయి. తర్వాత నల్లగా కమిలిన డాలర్! తెల్లారి కంసాలి దగ్గరకు వెళ్లి, దాన్ని తన వెండి పొగాకు పెట్టెకు అతికించమన్నాడు. యెక్కడిదీ డాలరు? కంసాలికి ఇలా జవాబిచ్చాడు కాప్టెన్: నాకు చెప్పడం ఇష్టం లేదు. అదొక విషాద కథ. కానీ యీ నాణాన్ని జ్ఞాపకార్థంగా వుంచుకోవాలనుకున్నాను.


బోరిస్ లవ్రెన్యోవ్

బోరిస్ లవ్రెన్యోవ్ 'అర్జెంటు రవాణా' కథ సారాంశం. ఈ రష్యన్ కథను రాచమల్లు రామచంద్రారెడ్డి తెలుగులోకి అనువదించారు.

గ్రేట్ రైటర్

ట్రూమెన్ కెపొటి



ఎనిమిదేళ్ల వయసులోనే తనకు రాయడం తెలుసని గుర్తించిన రచయిత ట్రూమెన్ కెపొటి (1924–1984). ఒక వాక్యంలో కామా, సెమీకోలన్ వాడకం గురించి కూడా అతిగా ఆలోచించే ఈ అమెరికన్ రాసిన 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫానీస్', 'ఇన్ కోల్డ్ బ్లడ్' క్లాసిక్స్‌గా ప్రశంసలు అందుకున్నాయి. కెపొటి రచనల ఆధారంగా కనీసం 20 సినిమాలూ టీవీ డ్రామాలూ రూపొందాయి. నటుడు కూడా అయిన కెపొటి, వూడీ అలెన్ దర్శకత్వం వహించిన 'ఏనీ హాల్' సినిమాలో కెపొటీగానే కనబడతారు. ఒక వాస్తవ గాథ ఆధారంగా రాసిన ఇన్ కోల్డ్ బ్లడ్‌ను కెపొటి నాన్‌ఫిక్షన్ నవల అన్నారు. దీన్ని రాయడానికి తన జీవితకాలపు నేస్తం హార్పర్ లీ ('టు కిల్ ఎ మాకింగ్‌బర్డ్' ఫేమ్) సహకారం తీసుకున్నారు. కెపొటికి ఉన్న చిత్రమైన అలవాటేమిటంటే, ఆయనకు మంచంలో సౌకర్యంగా పడుకుంటేగానీ చదవడంగానీ రాయడంగానీ అయ్యేది కాదు. కనీసం ఆలోచన కూడా పడుకుంటేనే వస్తుంది. అందుకే తనను తాను 'హరిజాంటల్ ఆథర్' అని అభివర్ణించుకున్నారు.


సాహిత్య మరమరాలు

సాంబార్‌కు లేదు 'ఎస్ట్రా'



విశ్వనాథ సత్యనారాయణ ఒకమారు మిత్రులతో కలిసి మద్రాసులోని ఒక భోజనశాలకు వెళ్లారు. ఆయన వెంట అబ్బూరి వరదరాజేశ్వరరావు, కపిల గోపాలరావు, నళిని రంజనకుమార్ ఉన్నారు. 'అరవ బ్రాహ్మలు' విస్తళ్లు పరిచి వడ్డించారు. 'నేతి బ్రాహ్మడు ఫిడేలు తీగ మోగించినట్లు చటుక్కున మెరుపులా నేయి వడ్డించేసి పోతున్నాడు'. విస్తరికో చుక్క. అంతే. విశ్వనాథ దాని వాసన పీల్చి, ఆయన్ని వెనక్కి పిలిచి మరింత నెయ్యి వడ్డించమన్నారు. ఆయన క్రీగంట చూస్తూ, 'ఎస్ట్రా సార్' అన్నాడు. విశ్వనాథకు ఉక్రోషం వచ్చింది. 'నెయ్యికి తప్ప మరేదానికి ఎస్ట్రా లేదా?' అని అడిగారు. లేదని జవాబు వచ్చింది. అయితే సాంబారు వడ్డిస్తున్నతణ్ని పిలిచి, పొయ్యమన్నారు. ఆయన పోస్తున్నాడు. ఈయన అన్నాన్ని కుదురు చేసుకొని తాగేస్తున్నారు. సాంబారు బకెట్ ఖాళీ అయిపోయింది. 'అలా చూస్తావేం పట్రా– ఎస్ట్రా లేదుగా' అన్నారు విశ్వనాథ. 'అగస్త్యుడు సముద్రాన్ని ఔపోసన పట్టేసినట్టు' తాగుతున్న విశ్వనాథ దగ్గరికి మరో ఆసామి పరుగెత్తుకొచ్చి, 'ఇంతటితో ఆపేసి మమ్మల్ని క్షమించండి. కావాలంటే నెయ్యి వడ్డించమంటాను' అని దండం పెట్టారు.

ప్రతిధ్వనించే పుస్తకం



కొడవటిగంటి కుటుంబరావు

తాపీగా చేసే పనులంటే సుందరానికి ఇష్టం. వాళ్లమ్మ కూరలు తరుగుతున్నా, లాంతర్లు తుడిచి నూనె పోస్తున్నా, పొయ్యి దగ్గర కూర్చుని వంట చేస్తున్నా గొప్ప దృశ్యం చూసినట్లు చూస్తాడు. వాళ్లమ్మ పుస్తకం చదువుతుంటే కాబోలు అలాంటి ఇష్టమే ఏర్పడి, చదువు మీద మమకారం పుడుతుంది. దీర్ఘాలూ, వత్తులూ ఇంకా నేర్చుకోని సుందరం, వాళ్లమ్మ పేరును ఇలా రాయడానికి ప్రయత్నిస్తాడు: 'అంమ'! అప్పుడు సీతమ్మ ఆనందంతో కొడుకు రెండు చెంపలూ ముద్దు పెట్టుకుంటుంది.

చేతివేళ్ల మధ్య బలపం అదే పనిగా పట్టుకోవడంతో పుట్టే నొప్పిని దాటుకుని, జీవితం చాలా సందర్భాల్లో కలిగించే నొప్పి వరకూ సుందరం చాలా దూరమే ప్రయాణిస్తాడు. తమ ఇంటికి చేట తెచ్చిన మేదరోళ్లబ్బాయీ, తన సహవిద్యార్థీ అయిన శివయ్యకు అమ్మ ఇచ్చిన అప్పడం కొద్దిగా మాడివుండటాన్ని చూసి నొచ్చుకుంటాడు. విదేశీ వస్త్రాల్ని కుప్పగా దహనం చేసే బదులు, వాటిని ఊళ్లోని బీదా బిక్కీకి దానం చేయకపోవడంలోని తార్కికతను అంగీకరించలేకపోతాడు. 'ఏడిచావు లేవోయ్! నువ్వు పోయి జైల్లో కూర్చుంటే బండి నడిచేదెట్లా? నా బోటిగాడికి ఎట్లాగూ తప్పదు' అనే, జాతీయోద్యమాన్ని కూడా ఒక లాంఛనం చేసిన శేషగిరి మామయ్యను చూసి విస్తుపోతాడు. అలాగని ఇవేవీ కూడా ముక్కుగుద్దినట్లుగా (కొడవటిగంటి) కుటుంబరావు చెప్పరు. చాలా సున్నితంగా, మంచినీళ్లంత మామూలుగా చెబుతారు. అదే ఆయన శైలిలోని అందం. వాక్యాలకు లేని గాంభీర్యతను అద్దకుండా, జీవితంలోని సత్యాన్ని అర్థం చేయించడం ద్వారా దృశ్యాన్ని రసవంతం చేస్తారు.


రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో, అంటే 1915 నుంచి 1935 మధ్య ఆంధ్రదేశంలో వచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను ఈ నవల చిత్రిస్తుంది. సామాజిక గౌరవానికి కారణమవుతుండటంతో ఇంగ్లిష్ మీద పెరుగుతున్న వ్యామోహమూ, ప్రతిగా జాతీయ కళాశాలల ఏర్పాటు ప్రయత్నమూ, ఆర్థిక ఇబ్బందుల వల్ల యువకులు చదువులు మానేయాల్సి రావడమూ, ఆదర్శాలు చితికిపోవడమూ కనబడుతుంది. ఈ మొత్తంలోనూ కూడా చదువు అనే మూడక్షరాల మీదే సుందరం తన ప్రపంచాన్ని నిర్మించుకుంటాడు. ప్రపంచాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. అందుకే ఈ నవలకు 'చదువు అన్న పేరు సరిగ్గా సరిపోయింది.

సుందరం భార్య లక్ష్మి, కొడుకుతో అక్షరాలు గుర్తుపట్టిస్తుంటే తన చిన్నతనం గుర్తొచ్చి, భార్యను సుందరం ముద్దుపెట్టుకోవడంతో నవల ముగుస్తుంది, పర్ఫెక్టుగా, ఒక చక్రభ్రమణంలా! దీన్ని కుటుంబరావు తన ఆత్మకథగా ఒప్పుకోకపోయినప్పటికీ ఆ ఛాయలు కనిపిస్తాయి. ఆయన నవలలన్నింటిలోకీ దీన్ని ఉత్తమమైనదిగా విమర్శకులు భావిస్తారు.

పుస్తక పరిచయం

సాహితీ దీపికలు

'మౌనం పరిణతి చెందిన జ్ఞానానికి సంకేతం' అంటారు అరుణావ్యాస్. అలాగని మాట్లాడాల్సిన సందర్భం వచ్చినప్పుడు మాట్లాడాలి! 'న్యాయమూ అన్యాయమూ నాణానికి రెండు వైపులు. న్యాయాన్ని రక్షించి, అన్యాయాన్ని అడ్డగించడం ప్రతివాళ్ల కర్తవ్యం' అని హితబోధ చేస్తారు. 'సంప్రదాయం పట్ల గౌరవం, అభ్యుదయకరమైన ఆధునికత పట్ల సమాదరణం' గల




రచన: డాక్టర్ కె.అరుణవ్యాస్
పేజీలు: 62; వెల: 40;
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, జి.ఎస్.ఐ. పోస్టు, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68.
ఫోన్: 24224453

అరుణావ్యాస్ 1986–87 నుంచి ఆకాశవాణి భావన కార్యక్రమంలో చేసిన 21 లఘుప్రసంగాలను 'నవచేతన' పుస్తకంగా తెచ్చింది. 'మానవ జాతి ఉనికిని కాపాడి, అవిచ్ఛిన్నంగా సాగిపోయేట్టు చేసే' స్త్రీ మీదా, మమతల కోవెల లాంటి 'చల్లటి, కమ్మటి కుటుంబ వ్యవస్థ' మీదా, 'సంగీతానుకూలత ఎక్కువ' అంటూ తెలుగు భాష మీదా, 'నియంత్రించుకోగలవానికి శత్రువంటూ ఉండడు' అంటూ కోపం మీదా చేసిన 'భావనా బలిమి' గల ప్రసంగాలివి.

కొత్త బంగారం

ఎమ్, ఆమె భర్త, వారి పిల్లలు




జెరీ పింటో

మహీమ్(ముంబయి)లో ఒక పడగ్గదీ, వంటిల్లూ, హాలూ ఉన్న అపార్టుమెంట్లో గోవా నుంచి వచ్చిన రోమన్ కాథలిక్కులయిన మెండాస్ కుటుంబం నివసిస్తుంది. ఎమెల్డా, ఆగస్టీన్ దంపతులూ, కూతురైన సూసన్, పేరులేని కథకుడైన కొడుకూ.

పిల్లలు ముద్దుగా పిలిచే ఎమ్ అన్న తల్లి ఎమెల్డా, కొడుకు పుట్టిన తరువాత, 'బైపోలార్' వ్యాధికి గురవడంతో నవల మొదలవుతుంది. తరచూ హాస్పిటల్ పాలవుతూ ఉంటుంది. బిగ్ హూమ్ అనబడే భర్త ఆగస్టీన్ ప్రభుత్వ ఉద్యోగి.

'ఎమ్ అండ్ ద బిగ్ హూమ్' నవల, ఆ చిన్న ఇంట్లో పెరిగి పెద్దవుతున్న కొడుకు గొంతుతో వినిపిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్యనున్న దుఃఖం, హాస్యం, ఒకరినొకరు పూర్తిగా అంగీకరించడం, ఎమ్ వల్ల ఆ కుటుంబమే తిరిగి ఛిన్నాభిన్నం అవడాన్నీ సహజంగా చిత్రీకరిస్తారు జెరీ పింటో. నిగ్రహవంతుడైన తండ్రి కుటుంబాన్ని కలిపి ఉంచి– వంటలూ, ఇంటి పనులూ చేస్తుంటాడు.

దంపతుల మధ్య కనపరిచే ప్రేమ మనసును తాకుతుంది. మానసిక రోగం గురించి రచయిత రాసిన మాటలు కవితాత్మకంగా ఉంటాయి. విషాదం కనిపించదు. ఎమ్– టీలు కాస్తూ, బీడీలు పీలుస్తూ, తన శృంగారపు జీవితం గురించి పిల్లలకి చెప్తూ, ఎవరూ అడక్కపోయినప్పటికీ తెలివైన సలహాలిస్తూ ఉంటుంది. తన పిచ్చితనపు దశలో ఉన్నప్పుడు ఆమె సంభాషణ విచిత్రంగా, అసభ్యంగా ఉంటుంది. ఆ సంభాషణలు గుండెని మెలిపెడతాయి. ఆత్మహత్యా ప్రయత్నాలూ చాలానే చేస్తుంది. పాదరసంలా మారే ఎమ్ మనఃస్థితిని అర్థం చేసుకునేటందుకు పూర్తి కుటుంబం నిస్వార్థంగా ప్రయత్నిస్తుంది.

మానసిక రోగానికి గురయ్యే ముందు, తండ్రి హూమ్ ప్రేమలో పడి, పెళ్ళి చేసుకుని– దుఃఖంలో, విషాదంలో తనకి ఊతగా నిలిచిన ఎమ్ అనే ఈ తన తల్లి ఎవరా? అని కొడుకు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తాడు. అతను తల్లి జీవితపు బాటని అనుసరిస్తున్నప్పుడు పాఠకులకి కూడా ఆమె గురించిన వైవిధ్యమైన, అస్పష్ట భావాలు కలుగుతాయి. నవల వర్తమానానికీ, గతానికీ మధ్య చాలా సులభంగా మారుతూ– మానసిక స్థితి సరిగ్గాలేని తల్లితో పాటు ఉండి, పెరిగిపెద్దవుతున్న ఒక కుర్రాడి స్వాభావిక నొప్పిని వర్ణిస్తుంది. ఆ నొప్పికింద సున్నితమైన హాస్యం ఉంది. ఎమ్‌కి ప్రతీదాన్నీ ఒక భిన్నమైన దృష్టికోణంతో, ఒక వ్యంగ్య ధోరణితో చూసే సామర్థ్యమూ ఉంది.

నవల– ఎమ్ మెదడులో ఉన్న చీకటి భాగాల ద్వారా ప్రయాణిస్తూ, ఇబ్బందికరమైన ప్రశ్నలని సంధిస్తుంది. వాటివల్ల మనం 'పిచ్చి' వాళ్ళనబడేవాళ్ళని కొత్త దృష్టికోణంతో చూడగలుగుతాం. పుస్తకం సామాజిక నిబంధనలని ప్రశ్నిస్తుంది. నాటకీయత తక్కువ మోతాదులో ఉన్నది.

నవలకున్న బలం దానిలో ఉన్న సూక్ష్మభేదానిది. కథ ఎమ్ వ్యాధి ప్రాధాన్యతను వక్కాణించి చెప్పదు. ఆమెకోసం పిల్లలు చేసే త్యాగాలనీ వర్ణించదు. కథనం సరళంగా, స్ఫుటంగా, హాస్యంగా ఉంటుంది. జర్నలిస్టూ, రచయితా అయిన పింటో రాసిన ఈ నవలకి సాహిత్య అకాడెమీ బహుమతి వచ్చింది. 2012లో అచ్చయిన ఈ పుస్తకానికి ఆయన విండెన్ కేంబెల్ బహుమతి కూడా పొందారు.

◆ క్రిష్ణవేణి

ఈవారం పుస్తకాలు

యుద్ధకాలంలో స్వప్నాలు



మూలం: గుగి వా థియాంగో; తెలుగు: ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా; పేజీలు: 264; వెల: 170; ప్రతులకు: మలుపు, 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్–44. ఫోన్: 9866559868

దేవరగట్టు (కథలు)




రచన: జి.వెంకటకృష్ణ; పేజీలు: 164; వెల: 150; ప్రతులకు: రచయిత, 87–1287–1, సోమిశెట్టి నగర్, కర్నూలు–518002. ఫోన్: 8985034894

నేను నా సాయి



రచన: డాక్టర్ బి.రామరాజు; పేజీలు: 262; వెల: 280; ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, 3–3–865, ఆర్యసమాజం ఎదురు వీధి, కాచిగూడ, హైదరాబాద్–27. ఫోన్: 040–24652387

చిలకలు వాలిన చిక్కుడు చెట్టు (మొరసునాడు పాటలు–2)



సేకరణ: కెం.మునిరాజు; పేజీలు: 104; వెల: 80; ప్రతులకు: కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2–1095, ఆవులపల్లి రోడ్డు, బస్తి, హోసూరు– 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు. సేకర్త ఫోన్: 8973918931

ఉత్తర ప్రపంచం

అయ్యా! మీ/మా పత్రికలో 103 రోజులుగా ప్రచురితమవుతున్న 'ఒక్కింతయూ' డైలీ సీరియల్‌లో రచయిత్రి బొగ్గుల జ్యోతి ఫొటోలో ఆవిడ కట్టుకున్న గరికపూల అంచు పింకు రంగు చీర పోచంపల్లి అని నేనూ, కాదు బెనారస్ అని మా చెల్లీ వాదించుకుంటున్నాం. ఈ లేఖ అందగానే మా సందేహం పత్రికా ముఖంగా నివృత్తి చేయగలరు.
ఇట్లు మీ పేపర్ కొనే ఒక పాఠకురాలు



పదం పలికింది - పాట నిలిచింది

ప్రాగ్దిశ వీణియ పైన...

సినిమా పాటను అత్యున్నత స్థాయిన నిలబెట్టగలిగిన అరుదైన గీత రచయిత, చేంబోలు సీతారామశాస్త్రి. సిరివెన్నెల చిత్రం ద్వారా తన ఇంటిపేరునూ, చెప్పాలంటే తన పేరునూ కూడా మార్చుకున్నారాయన. ఉత్తి సిరివెన్నెల అన్నా కూడా ఆయనే అనుకుంటాం కదా! సిరివెన్నెల చిత్రానికి ఆయన రాసినవన్నీ మేలిమి పాటలే అయినా, 'విధాత తలపున ప్రభవించినది అనాది జీవనవేదం'లోని–

ప్రాగ్దిశ వీణియపైన దినకర మయూఖ తంత్రుల పైన / జాగృత విహంగ తతులే వినీల గగనపు వేదిక పైన / పలికిన కిలకిల స్వనముల స్వరగతి జగతికి శ్రీకారము కాగా... అన్న పాదాల్లో కవి చేసిన దృశ్యమానం సూర్యోదయమంత తాజాగా ఉంటుంది. (తూర్పు దిక్కు అనే వీణ మీద, సూర్యకిరణాలనే తీగలు మీటుతూ



నిద్రలేచిన పక్షులు, నీలాకాశపు వేదిక మీద పలికిన కిలకిలల ధ్వనుల పాట, లోకానికి శ్రీకారం.) దీనికిగానూ ఉత్తమ గీత రచయితగా నంది అవార్డు కూడా ఆయన అందుకున్నారు. సినిమాను కళగా మలచగలిగిన అతి తక్కువ మంది తెలుగు దర్శకుల్లో ఒకరైన కె.విశ్వనాథ్ 1986లో సృష్టించిన ఈ కళాఖండానికి కె.వి.మహదేవన్ గొప్పగా సంగీతం సమకూర్చారు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి.సుశీల అంతే గొప్పగా పాడారు.

రారండోయ్

- జనవరి 1న విజయవాడలో ప్రారంభమైన '29వ విజయవాడ పుస్తక మహోత్సవ కార్యక్రమాలు' జనవరి 11 వరకు జరగనున్నాయి.
- ప్రపంచ గేయ కవితా సదస్సు జనవరి 10న సాయంత్రం 5:30కు సీరపాణి అధ్యక్షతన విశాఖ పౌర గ్రంథాలయంలో జరగనుంది.
- అలిశెట్టి ప్రభాకర్ స్మారక సాహిత్య పురస్కారాన్ని బూర్ల వేంకటేశ్వర్లుకు తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో జనవరి 12న ప్రదానం చేయనున్నారు.
- ఆలిండియా రేడియో జనవరి 16న ఇండోర్‌లో నిర్వహించనున్న అఖిల భారత కవి సమ్మేళనానికి తెలుగు తరఫున ప్రసాదమూర్తి కవిత 'పిచ్చినాన్న' ఎంపికైంది.
- చాసో పురస్కారాన్ని గౌరహరి దాస్‌కు జనవరి 17న సాయంత్రం 6 గంటలకు విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో ప్రదానం చేయనున్నారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం. తిథి బ.సప్తమి రా.9.04 వరకు, తదుపరి అష్టమి. నక్షత్రం ఉత్తర ఉ.6.41 వరకు, తదుపరి హస్త. వర్జ్యం ప.3.05 నుంచి 4.41 వరకు. దుర్ముహూర్తం ప.12.27 నుంచి 1.11 వరకు, తదుపరి ప.2.39 నుంచి 3.23 వరకు. అమృత ఘడియలు రా.12.42 నుంచి 2.18 వరకు.

సూర్యోదయం	: 6.36
సూర్యాస్తమయం	: 5.36
రాహుకాలం	: ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం	: ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.31
జొహర్	12.23
అసర్	4.21
మగ్రీబ్	5.57
ఇషా	7.14

Dwaraka



మేడారానికి పోటెత్తిన భక్తజనం

మేడారానికి భక్తులు పోటెత్తారు. జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీరసారె, గాజులు, ఒడి బియ్యం, కానుకలను సమర్పించి మొక్కులు చెల్లించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులూ భారీగా తరలివచ్చారు. సుమారు రెండు లక్షల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. –ఎస్ఎస్ తాడ్వాయి(ములుగు)



యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీనారసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సుమారు 15 వేల మంది స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా కొండపైకి వాహనాలను అనుమతించలేదు. స్వామి, అమ్మవార్లను శ్రీ పుష్పగిరి పీఠాధిపతి శ్రీ శారదానంద లక్ష్మీనారసింహ సరస్వతి స్వామీజీ దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవార్లకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నల్లం దీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. –యాదగిరికొండ



మంచిర్యాల అడవుల్లో తిరుగుతున్న పులి

పులి పిల్ల ఉచ్చు తొలగించరా?

ఏడాదిన్నర వయసున్న పులి పిల్ల ప్రాణాపాయ స్థితిలో మంచిర్యాల జిల్లా అడవుల్లో తిరుగుతోంది. 6 నెలల క్రితం వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చు నుంచి తప్పించుకున్న ఆ పులి దాని మెడ భాగంలో ఉచ్చు చిక్కుకోవడంతో అది జరిగి కటి ప్రాంతంలో బిగుసుపోయింది. పులి పెరిగే కొద్దీ ఉచ్చు ఇంకా బిగుసుకోవడంతో ఇబ్బందులు పడుతోంది. ఆ ఆడ పులిపిల్ల చెన్నూర్, కోట పల్లి కాగజ్‌నగర్ వరకు తిరుగుతోందని అటవీ అధికారులు చెపుతున్నారు. –సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ శ్రీలక్ష్మి

హైదరాబాద్: 18 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నారని, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం వారు బీసీ–ఏలో ఉండటం ఎంత వరకు సమంజసమని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి ప్రశ్నించారు. చాకలి కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, అందుకోసం అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. శ్రీలక్ష్మి నాయకత్వంలో జూలై 2న భద్రాచలంలో చేపట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమం 'చాకలి పోరు గర్జన' ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగింది. ఈ గర్జనకు బిహార్ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే శ్యామ్ రజక, అఖిల భారత దోభీ మహాసంఘం అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, హరియాణా ప్రతినిధి అమిత్ ఖత్రీ, రజక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య హాజరయ్యారు. బహిరంగ సభలో శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. ఒక దేశం, ఒకే వృత్తి, ఒకే రాజ్యాంగ పద్ధతిలో రజకులకు ఎస్సీ హోదా కల్పించాలని 70 ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోవటం లేదన్నారు. ఎస్సీ జాబితాలో ఉంటేనే రజకులకు విద్య, ఉద్యోగ, ఉపాధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది రజకులు ఉంటే ఒక్క ఎమ్మెల్యే కూడా లేరని, ఎస్సీ రిజర్వేషన్లు ఉంటేనే చట్టసభల్లో ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. మూడున్నరేళ్లు గడుస్తున్నా రజక సహకార సంఘం నియామకం ఊసే లేదని, నిరుద్యోగ యువతకు రజక సహకార సంఘం ద్వారా నేరుగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షల రుణాలు ఇవ్వాలని, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రజకుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకే..

రజకులకు ఎస్సీ హోదా కోసం 190 రోజుల పాటు 31 జిల్లాల్లో పాదయాత్ర చేశానని, విజయానికి దగ్గర్లో ఉన్నామని శ్రీలక్ష్మి పేర్కొన్నారు. తన పాదయాత్ర రాజకీయ లబ్ధి కోసం కాదని, రజకులను ఏకతాటిపైకి తీసుకురావటానికి.. వారిని చైతన్యపరచటానికే అని చెప్పారు. రజకుల సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం ఎస్సీ హోదానే అని తెలంగాణ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నామన్నారు. రజకుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం అవసరమన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు సేవలందిస్తున్నామని, ఈ గర్జనకు ఆహ్వానం పలికితే ఒక్క పార్టీ స్పందించలేదని, తమకు గెలిపించే దమ్ము లేకపోయినా.. ఓడించే సత్తా ఉందని హెచ్చరించారు. రజకుల హక్కుల సాధనకు ఉద్యమమే శరణ్యమని, నిరంతర పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.



ఆదివారం చాకలి పోరు గర్జన సభలో అభివాదం చేస్తున్న చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కొత్తకొండ శ్రీలక్ష్మి తదితరులు

గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ అవమానాలే..

గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ రజకులు అవమానాలు ఎదుర్కొంటున్నారని, రజకుల్లో ఐక్యత లేకపోవడమే దీనికి కారణమని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ఒక రాజకీయ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. రజకుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని, ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు రజకులను వెంటనే దళితులుగా గుర్తించి ఎస్సీ హోదా కల్పించాలని శ్యామ్ రజక డిమాండ్ చేశారు. రజకులకు న్యాయం జరగకపోతే 2019 ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు.

టీఆర్‌ఎస్‌కు దగ్గరవుతున్న టీడీపీ మాజీలు!

- మాజీ మంత్రి మండవ చేరికకు రంగం సిద్ధం
- ఆర్మూరుపై ఆశతో అన్నపూర్ణమ్మ ఎదురుచూపులు



మండవ



అన్నపూర్ణమ్మ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ టీడీపీ నేతలను చేర్చుకోవడంలో అధికార టీఆర్‌ఎస్ బిజీగా ఉంది. ఇప్పటికే పలువురు టీడీపీ నేతలు టీఆర్‌ఎస్ గూటికి చేరారు. కొందరు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు మాత్రం ఇంకా టీడీపీలోనే కొనసాగుతున్నారు. ఆ పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాల వల్ల కొందరు నేతలు క్రియాశీలకంగా వ్యవహరించలేక పోతున్నారు. టీటీడీపీ రాజకీయమంతా కేవలం ఇద్దరు ముగ్గురు నేతల చుట్టూ తిరుగుతుండటం, పార్టీ అధినేత చంద్రబాబు ఇక్కడి వ్యవహారాలను అంతగా పట్టించుకోకపోవడం, రానున్న ఎన్నికల్లో నామమాత్రపు పోటీ కూడా ఇవ్వలేమన్న అభిప్రాయం బలపడటంతో పలువురు సీనియర్లు బయటకు వచ్చే ప్రయత్నాలు షురూ చేశారని చెబుతున్నారు. ఇప్పటికే టీఆర్‌ఎస్‌లో ఉన్న మాజీ టీడీపీ నేతల సాయంతో తమ చేరికలకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

వాస్తవానికి రెండు, మూడు నెలలుగా టీఆర్‌ఎస్ గూటికి చేరే టీడీపీ నేతల సంఖ్య పెరిగింది. నియోజకవర్గ స్థాయి నేతలు టీఆర్‌ఎస్‌కు వరుసకట్టారు. అదే కోవలో మరికొందరి చేరికలకు కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. కొన్ని సామాజిక వర్గాల ఓట్ల కోసం ఆయా వర్గాల నేతలపై కన్నేసిన టీఆర్‌ఎస్ సంబంధిత నేతల రికార్డు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటోందని చెబుతున్నారు. దీనిలో భాగంగానే మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి చేరిక జరిగిందని ఉదహరిస్తున్నారు.

క్యూలో మాజీ మంత్రి మండవ?

పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం మేరకు మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు టీఆర్‌ఎస్‌లో చేరడం దాదాపు ఖాయమైందని సమాచారం. ఆయనను టీఆర్‌ఎస్‌కు తీసుకువచ్చే బాధ్యతను ఒక మంత్రి తీసుకున్నారని, చేరిక ముహూర్తమే ఖరారు కావాల్సి ఉందంటున్నారు. మండవ చేరిక ద్వారా పాత నిజామాబాద్ జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో పార్టీకి లాభిస్తుందని చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి నియోజకవర్గం కేటాయించాలా? లేక ఇతరత్రా అవకాశం కల్పించాలా అన్న విషయంపైనే చర్చ జరుగుతోందని సమాచారం. మండవ గతంలో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించగా, ఇప్పుడది నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. చాన్నాళ్లుగా టీడీపీ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన ప్రత్యక్ష ఎన్నికలకు సుముఖంగా లేరన్న ప్రచారం కూడా ఉంది. అదే సందర్భంలో నిజామాబాద్ జిల్లాలోనే ఆర్మూరు, బాల్కొండ నియోజకవర్గాల విషయంలో కూడా కొంత చర్చ జరుగుతోంది. గతంలో ఆర్మూరు ఎమ్మెల్యేగా పనిచేసిన ఏలేటి అన్నపూర్ణమ్మ కూడా టీడీపీ నుంచి బయటకు రావాలని నిర్ణయించుకున్నారని, టీఆర్‌ఎస్ నాయకత్వంతో చర్చలు కూడా జరిపారని సమాచారం. ఆమె బాల్కొండ నియోజకవర్గంలో అవకాశం కావాలని కోరారని, టీఆర్‌ఎస్ నాయకత్వం సానుకూలంగా స్పందించకపోవడంతో చేరిక ఆలస్యమవుతోందని చెబుతున్నారు. వరంగల్‌తో పాటు దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడా కొందరు టీడీపీ నేతలు టీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని సమాచారం.

ఫ్యాన్స్‌నే అదుపు చేయలేనివాడు.. రాష్ట్రాన్ని ఎలా కంట్రోల్ చేస్తాడు

- పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి కత్తి మహేశ్ వ్యాఖ్యలు
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వద్ద ఉద్రిక్తత..



హైదరాబాద్: 'పవన్‌కల్యాణ్ అభిమానులు నాపై సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దాడులు చేస్తున్నారు. దీనిపై పవన్ స్పందిస్తాడని అనుకున్నాను. అయితే ఆయన కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. తన అభిమానులనే అదుపు చేయలేని వ్యక్తి.. రేపు రాష్ట్రాన్ని ఎలా కంట్రోల్ చేస్తాడు?' అని సినీ విమర్శకుడు కత్తి మహేష్ ప్రశ్నించారు. పవన్ సిద్ధాంతాలకు సంబంధించి తాను పది ప్రశ్నలు వేశానని, వాటికి ఇంతవరకూ సమాధానం లేదని చెప్పారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కత్తి మహేష్ మాట్లాడుతూ.. పవన్ అభిమానులతో ముఖాముఖి కోసం తాను ఇక్కడికి వచ్చానని, తన ప్రశ్నలకు పవన్ జవాబు చెప్పాలని, పవన్ తాను చెబుతున్న అంశాలపై చర్చకు రావాలని చెప్పారు. ఇదే సమయంలో కత్తి మహేష్ ప్రశ్నలకు తాము సమాధానాలు చెబుతామంటూ తెలంగాణ జనసేన నాయకుడు పార్థిపూర్ నర్సింహతో పాటు పలువురు అభిమానులు నినాదాలు చేయడంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆవరణలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు పవన్ అభిమానులను అరెస్ట్ చేసి పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. ఆ తర్వాత విడిచిపెట్టారు. అనంతరం కత్తి మహేష్ మాట్లాడుతూ.. తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని, పవన్ అభిమానులే ఉన్మాదులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తన వెనక ఏ రాజకీయ పార్టీ, మీడియా లేదని, డబ్బు కోసం ఇదంతా చేస్తున్నాననే ఆరోపణలు అవాస్తవమన్నారు. నటి పూనమ్‌కౌర్ చేసిన వ్యాఖ్యలకు తాను ఆరు ప్రశ్నలు సంధిస్తున్నానన్నారు.

పూనమ్‌కౌర్‌కు కత్తి మహేష్ సంధించిన ప్రశ్నలివే..

1. చేనేత బ్రాండ్ అంబాసిడర్ హోదా పూనమ్‌కౌర్‌కు ఎలా లభించింది?
2. తిరుమలలో పవన్ గోత్రం పేరుతో పూజ చేసింది నిజం కాదా?
3. పవన్ మోసం చేశాడని ఆత్మహత్యాయత్నం చేసింది నిజం కాదా? ఆస్పత్రి బిల్లు ఎవరు కట్టారు?
4. పూనమ్ తల్లిని కలిసిన పవన్ చెవిలో ఏం చెప్పాడు? ఏం ప్రామిస్ చేశారు?
5. దర్శకుడు త్రివిక్రమ్ అంటే ఎందుకు కోపం?
6. క్షుద్ర మాంత్రికుడు నర్సింగ్‌తో క్షుద్ర పూజలు ఎందుకు చేశారు?

'మత్తు' మింగేసింది..

నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌కు మరో ప్రాణం బలి

హైదరాబాద్

డ్రంక్ అండ్ డ్రైవింగ్ మరో ఘోరానికి కారణమైంది. మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారులో దూసుకువచ్చిన ఓ వ్యక్తి.. ముందు వెళ్తున్న స్కూటీని బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువతుల్లో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు బ్రెయిన్‌డెడ్ కాగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

మోతాదుకు మించి మద్యం తాగి..

పోలీసుల కథనం ప్రకారం.. పంజగుట్ట ప్రాంతానికి చెందిన పాల విష్ణువర్ధన్(35) హిమాయత్‌నగర్‌లో బ్రైట్ స్పార్క్‌పేరుతో ప్లేస్కూల్ నడిపిస్తున్నాడు. ఇతని భార్య ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీలో వైద్యురాలిగా పనిచేస్తున్నారు. కొన్నాళ్లు దుబాయ్‌లో పనిచేసి వచ్చిన విష్ణు శనివారం రాత్రి మాదాపూర్‌లోని స్నేహితుడి ఇంట్లో జరిగిన విందుకు హాజరయ్యాడు. అర్ధరాత్రి వరకు అక్కడే ఉన్న విష్ణు, మోతాదుకు మించి మద్యం తాగి అదే స్థితిలో తన టాటా హెక్సా(టీఎస్09ఈవీ7707) కారు నడుపుకుంటూ ఇంటికి బయలుదేరాడు. మామూలుగా అయితే పంజగుట్ట రావడానికి విష్ణు జూబ్లీహిల్స్ 36/10 రోడ్డును వినియోగించాలి. కానీ అక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతున్నాయని ముందే తెలియడంతో విష్ణు గల్లీల మీదుగా.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోకి వెళ్లాడు.

200 మీటర్లు ఈడ్చుకెళ్లి..

ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో ఈ కారు జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని డైమండ్ హౌస్ దాటుకుని ముందుకు వెళ్లింది. మితిమీరిన వేగంతో ఉన్న కారు అదుపుతప్పి ముందు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న అనూషారెడ్డి అలియాస్ ప్రియారెడ్డి అలియాస్ వెంకటలక్ష్మి(30)తో పాటు మధ్యలో కూర్చున్న మస్తానీ(35), వెనక కూర్చున్న అనూష(19) రోడ్డుపై పడ్డారు. హెక్సా కారు బాటమ్ కాస్త ఎత్తుగా ఉండటంతో మస్తానీ కారు కింద ఇరుక్కుపోయింది. మద్యం మత్తులో ఈ విషయాన్ని గుర్తించని విష్ణు అలానే దాదాపు 200 మీటర్ల దూరం ఈడ్చుకుపోయాడు. దీంతో మస్తానీ అక్కడికక్కడే మృతిచెందింది. అనూషారెడ్డి తల పగలడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తీవ్ర గాయాలపాలైన అనూష నడిరోడ్డుపై విలవిల్లాడుతుండటంతో గుర్తించిన స్థానికులు '108'కి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన జూబ్లీహిల్స్ పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి, మస్తానీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదానికి కారణమైన కారు



అనూషారెడ్డి (ఫైల్)

మృతురాలు, క్షతగాత్రులు ఎవరు?

ప్రమాదంలో మృతిచెందిన మస్తానీ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి దేవభక్తుని సురేష్‌కుమార్‌కు రెండో భార్య అని తేలింది. రెండేళ్ల నుంచి శ్రీనగర్‌కాలనీలోని గణేష్ కాంప్లెక్స్ వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని స్నేహితులతో కలసి ఉంటోంది. జూనియర్ ఆర్టిస్టుగా, బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మస్తానీ ఫోన్‌లో ఉన్న నంబర్ ఆధారంగా భర్త సురేష్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన హైదరాబాద్ చేరుకున్నారు. కాగా, బ్రెయిన్‌డెడ్ అయిన అనూషారెడ్డికి సంబంధించిన వివరాలపై మిస్టరీ నెలకొంది. ప్రస్తుతం మస్తానీతోపాటే ఉంటున్న ఈమె కొన్నాళ్లు జూనియర్ ఆర్టిస్ట్‌గా చేసినట్లు స్థానికులు చెప్తున్నారు. ఇక తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన అనూష మూడు రోజుల క్రితమే సిటీకి వచ్చి కూకట్‌పల్లికి చెందిన నిహారిక అనే యువతి వద్ద ఉంటున్నట్లు తెలిసింది. మస్తానీ ప్రతి ఆదివారం కిట్టీ పార్టీలు నిర్వహిస్తుంటుంది. శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో స్కూటీపై కూకట్‌పల్లి వెళ్లిన మస్తానీ, అనూషారెడ్డి.. ఆదివారం తమ ఇంట్లో కిట్టీపార్టీ ఉందని రావాలని అనూషను కోరడంతో ముగ్గురూ కలసి స్కూటీపై బయలుదేరారు. అయితే వీరంతా ఆ సమయంలో ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తున్నారనే దానిపై స్పష్టత లేదు. ఈ ముగ్గురికీ పరిచయం ఏంటనేది తేలాల్సి ఉందని పోలీసులు చెప్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనూష

ప్రమాదం జరిగినా.. కారు ఆపలేదు..



నిందితుడు విష్ణు

తన కారు స్కూటీని ఢీకొన్నా.. విష్ణు కారు ఆపే ప్రయత్నం చేయలేదు. పైగా వేగాన్ని మరింత పెంచుతూ దాదాపు అర కిలోమీటర్ వెళ్లిపోయాడు. అక్కడి సదరన్ స్పైస్ రెస్టారెంట్ వద్ద వేగాన్ని నియంత్రించలేకపోవడంతో కారు డివైడర్‌ను ఢీ కొట్టింది. అక్కడకు చేరుకున్న పోలీసులు విష్ణును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడు మద్యం తాగిన ఆనవాళ్లు ఉండటంతో శ్వాసపరీక్ష యంత్రంతో పరీక్షించారు. దీంతో విష్ణు బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ 206గా నమోదైంది. విష్ణును అరెస్ట్ చేసిన పోలీసులు.. అతనిపై ఐపీసీలోని 304(పార్ట్–2), 337, ఎంవీ యాక్ట్‌లోని 185 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అధిక సీట్లు కేటాయించే పార్టీకే మద్దతు

ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ ప్రకటన

నాగార్జునసాగర్: వచ్చే ఎన్నికల్లో మాదిగలకు అధిక సీట్లు కేటాయించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. మాదిగలు ఓట్లేసే యంత్రాలుగా ఉండొద్దని.. రాజకీయ కుతంత్రాలను చీల్చిచెండాడే శక్తిగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ప్రతి మాదిగ ఓటు చైతన్యంతో రాజకీయ యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాదిగ పల్లెల్లో పూలే, అంబేడ్కర్, జంబూద్వీప జ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. పీడిత కులాలన్నీ రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలని ప్రజాగాయకుడు గద్దర్ పిలుపునిచ్చారు. సమాజానికి నాయకత్వం వహించే శక్తి మాదిగలకు ఉందని చెప్పారు. అంతకుముందు పూలే, అంబేడ్కర్, సావిత్రీబాయి పూలేలాంటి మహనీయుల జయంతి, వర్ధంతి తేదీలతో మాత్రమే రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

బస్సు బోల్తా.. పదిమందికి గాయాలు

చివ్వెంల: హైదరాబాద్‌కు వెళ్తున్న విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో పదిమందికి గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి ఆవాసం తెల్లబండకాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రమాదంలో కృష్ణా జిల్లా మున్ననూరుకు చెందిన చల్లా చిరంజీవి, పెద్దవీరగూడెంకు చెందిన కె.సాంబశివరావు, హైదరాబాద్‌లోని మోతీనగర్‌కు చెందిన వీవీకే.శ్రీనివాస్, విజయవాడకు చెందిన నేత భానుమూర్తి, బస్సు డ్రైవర్ బండారు రాములకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్న కేంద్రం

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



నిజామాబాద్ కల్చరల్ (నిజామాబాద్ అర్బన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరిస్తోందని హైదరాబాద్ ఎంపీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును దేశంలోని ముస్లింలంతా తిప్పి కొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఈద్గా వద్ద శనివారం అర్ధరాత్రి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ముస్లిం పర్సనల్ లాలో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నారని, అలాంటప్పుడు ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించేందుకు యత్నించడం సరికాదన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

మానవత్వం మరిచి..

మృతదేహాన్ని ఇంట్లోకి రానివ్వని యజమాని

కరీంనగర్ క్రైం: మానవత్వం మంటగలిసింది.. ఎన్నో ఏళ్లుగా ఆ ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా చనిపోతే ఆయన శవాన్ని తీసుకురావొద్దంటూ యజమాని హుకుం జారీ చేశాడు. కరీంనగర్‌లోని ముకరంపురానికి చెందిన రవీందర్ సింగ్ శ్రీగణేశ్ కలర్ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా ముకరంపురలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఆయన ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో చనిపోయాడు. దీంతో బంధువులు మృతదేహాన్ని తీసుకుని ఇంటికి రాగా రావొద్దని అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. చుట్టుపక్కల వారు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. ఆయన ససేమిరా అన్నాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు చేసేదేమిలేక నగరంలోని అలకాపురి శ్మశాన వాటికకు తరలించారు. అక్కడే బంధువుల కోసం సాయంత్రం వరకూ వేచిచూశారు.



ఇదేం శిక్ష?

విద్యార్థులు పోట్లాడుకున్నారని.. తలకిందులుగా నిలిపి శిక్షించిన వార్డెన్

జహీరాబాద్: చిన్న విషయమై ఇద్దరు విద్యార్థులు పోట్లాడుకోగా హాస్టల్ వార్డెన్ వారిని తలకిందులుగా నిలబడాలంటూ శిక్ష విధించాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎస్టీ హాస్టల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. శేఖాపూర్ తండాకు చెందిన పరమేశ్వర్, సీహెచ్ లక్ష్మణ్ హాస్టల్‌లో ఉంటూ ఏడో తరగతి చదువుతున్నారు. శనివారం వీరి చిన్న విషయమై వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వార్డెన్ యాదయ్య ఇద్దరినీ పిలిచి తలకిందులుగా నిలిపి శిక్షించాడు. వార్డెన్ నిర్వాకాన్ని వీడియో తీసిన కొంతమంది వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. ఇది వైరల్‌గా మారింది. ఈ విషయమై వార్డెన్ యాదయ్యను వివరణ కోరగా విద్యార్థులు హాస్టల్‌లోనే ఉంటూ సక్రమంగా బడికి వెళ్లడం లేదని, అందుకే 2 నిమిషాల పాటు శిక్షించానని తెలిపారు. ఇకపై వారు బడికి డుమ్మా కొట్టకుండా ఉండేందుకే భయపెట్టాను తప్ప శిక్షించాలన్నది తన ఉద్దేశం కాదన్నారు.



'రన్ ఫర్ గర్ల్ చైల్డ్'లో పాల్గొన్న ఐటీ ఉద్యోగులు, కిశోర్ వికాస్ విద్యార్థులు

బాలికా సాధికారతను సాధించాలి

- కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి మహేశ్ శర్మ
- గచ్చిబౌలి స్టేడియంలో 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' ప్రారంభం



హైదరాబాద్: దేశంలో బాలికా సాధికారతను సాధించాల్సిన అవసరముందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి మహేశ్ శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ గర్ల్ చైల్డ్' పేరిట నిర్వహించిన 21కె, 10కె, 5కె రన్‌ను ఆయన ప్రారంభించారు. అమ్మ అనే పదానికి ఎంతో విలువ ఉందని.. అందుకే భారత్ మాతా అని పిలుస్తామని అన్నారు. దేశంలో పురుషులు, మహిళల నిష్పత్తిలో తేడా ఉందని, అయితే ఈ పరిస్థితి తెలంగాణలో కొంత మెరుగ్గా ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో 2 వేలకు పైగా మురికివాడలు ఉన్నాయని, బాలికలను దత్తతకు తీసుకొని చదివించాల్సిన అవసరముందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. నగరంలోని 104 కిశోర్ వికాస్ కేంద్రాల్లో 2,500 మంది బాలికలు ఉన్నారని సేవా భారతి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి రఘునాథన్ వీరబెల్లి తెలిపారు. ఐటీ కంపెనీలు సీఎస్‌ఆర్‌లో భాగంగా సహాయం అందించేందుకు రన్ పేరిట అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు కిషన్‌రెడ్డి, సుమారు 7 వేల మంది ఐటీ ఉద్యోగులు, కిశోర్ వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం: మంత్రి ఈటల

'రన్ ఫర్ గర్ల్ చైల్డ్'ముగింపు కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రన్‌లో పాల్గొన్న కిశోర్ వికాస్ బాలికలకు షూ, పుస్తకాలు అందిస్తామని అన్నారు. అనంతరం 21కె, 10కె, 5కె రన్ విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు.

Dwaraka



తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల. చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి, సంఘ ప్రతినిధులు పద్మాచారి, రవీందర్ రెడ్డి తదితరులు

రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర అమోఘం

ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల పాత్ర అమోఘమైనదని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆ పోరాట స్ఫూర్తితోనే బంగారు తెలంగాణ కోసం కృషి చేయాలని సూచించారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన డైరీ ఆవిష్కరణ సభలో మంత్రి పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాలు వృథా కాకూడదని, వారి ఆశయాలు సాధించుకొనేందుకు కృషి చేయాలని ఈటల అన్నారు. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటనలకే పరిమితం అవుతుందా, భర్తీ మాట ఉండదా అని ప్రశ్నించారు. ఉద్యోగుల భర్తీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టే దిశలో అడుగులు వేస్తే బాగుంటుందన్నారు. ఏపీకి కేటాయించిన తెలంగాణ ఉద్యోగులను తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. సభలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సి.విఠల్, అడ్వొకేట్ జనరల్ జె.రామచందర్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు కె.రవీందర్ రెడ్డి, టీజీవోస్ అధ్యక్షురాలు వి.మమత తదితరులు పాల్గొన్నారు.

✦ సమ్మక్క-సారలమ్మ ఆత్మగౌరవానికి ప్రతీక

జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత



సమ్మక్క-సారలమ్మ చరిత్రను పాటల రూపంలో రూపొందించిన సీడీలను ఆవిష్కరిస్తున్న ఎంపీ కవిత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మట్టిపొరల్లోంచి మొలకెత్తిన వీరగాథ మేడారం సమ్మక్క-సారలమ్మల దివ్య చరిత్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత పేర్కొన్నారు. కోట్లాది భక్తుల కొంగు బంగారమై వెలసిన సమ్మక్క-సారలమ్మలు ఆత్మగౌరవానికి, పౌరుషానికి ప్రతీక అని కొనియాడారు. వారి పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దివ్య చరిత్రను తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం పాటల రూపంలో రూపొందించిన సీడీలను ఆదివారం ఆమె ఆవిష్కరించారు. కరువుతో అల్లాడుతున్న అడవి బిడ్డలను శిస్తు కట్టాలని పీడించడమే కాకుండా చిన్న రాజ్యమైన మేడారంపై చతురంగ దళాలతో దాడి చేసిన కాకతీయ సేనను సంప్రదాయ ఆయుధాలతో నిలువరించే ప్రయత్నం చేసిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, నాగులమ్మల త్యాగాలను స్మరించుకుందామని పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మల దివ్య చరిత్రను సమాజానికి తెలియజేసేందుకు కష్టపడ్డ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీనును ఆమె అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్ సాగర్, యూత్, స్టూడెంట్ విభాగాల కన్వీనర్లు కోరబోయిన విజయ్ కుమార్, పసుల చరణ్ పాల్గొన్నారు.

✦ ప్రజల కోసమే 'గులాబీ జెండా': ఎంపీ కవిత

సాక్షి, హైదరాబాద్: స్వరాష్ట్రాన్ని సాధించుకొని తెలంగాణ బిడ్డ కాలర్ ఎగరేసే విధంగా చేసింది విద్యుత్ కార్మికులు, ఉద్యోగులేనని నిజామాబాద్ ఎంపీ కవిత అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని, దేశమంతా తెలంగాణ గురించే చర్చించుకుంటోందని పేర్కొన్నారు. వివిధ కార్మిక సంఘాల నుంచి పలువురు టీఆర్ఎస్ కార్మిక విభాగానికి అనుబంధంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక విభాగం (టీఆర్‌వీకేఎస్)లో చేరారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన చేరికల కార్యక్రమంలో ఆమె కార్మిక నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గులాబీ జెండా ప్రజల కోసమే పనిచేస్తోందని చెప్పారు. 20 వేలకుపైగా కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులను సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేశారని, అది ఓర్వని విపక్షాలు కోర్టులకు వెళ్తున్నాయని విమర్శించారు. కార్మికులకు పీఆర్సీ, హెల్త్ కార్డుల అంశాలను పరిశీలిస్తామన్నారు.



రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి నాయిని

✦ రెడ్డి కులస్తులంతా ఏకం కావాలి

హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్: రెడ్డి కులస్తులంతా ఏకం కావాలని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఉప్పల్‌లోని మేకల జంగారెడ్డి గార్డెన్‌లో రెడ్డి సామాజిక సార్వజనిక సంక్షేమ సంఘం 3వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయిని మాట్లాడుతూ ఎవరికి వారు వేర్వేరు సంఘాలు పెడుతూ వాటిని రాష్ట్ర స్థాయి సంఘాలుగా చెప్పడం ప్రధాన సంఘాన్ని పలుచన చేయడమేనని అభిప్రాయపడ్డారు. ఐకమత్యం లేకుండా ఇలా వీధికో సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడంతో చులకనభావం ఏర్పడుతుందన్నారు. ఒకటే సంఘంగా ఏర్పాటై సమస్యలను పరిష్కరించుకునే మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. సంఘ ప్రతినిధుల వినతి మేరకు రెడ్డి సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అసెంబ్లీలో రైతు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి పంటకు, రైతుకు రూ. 4 వేల చొప్పున పెట్టుబడి ఇవ్వడం ప్రభుత్వ ఘనతేనని గుర్తు చేశారు. పేద రెడ్డి కులస్తులను ఆదుకుంటామని మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కంసాని సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్‌రెడ్డి, జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ మేకల అనలారెడ్డి, రెడ్డి హాస్టల్ అధ్యక్షుడు ఎర్ల రఘుపతిరెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✦ ఆ నిర్ణయం విరమించుకోవాలి

గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కల్లుగీత వృత్తిదారులను దొంగ దెబ్బ తీసే ప్రయత్నాలను ప్రభుత్వం మొదలుపెట్టిందని రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ విమర్శించారు. పెన్షన్‌దారులైన గీత కార్మికులు చెట్టుపై నుంచి పడి గాయపడినా, చనిపోయినా.. వారికి చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రద్దు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉందని ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వెయ్యి రూపాయల పెన్షన్‌తో గీత కార్మికులను వృత్తి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే ప్రభుత్వంపై పోరాడుతామని హెచ్చరించారు. గీత కార్మికుల పెన్షన్‌ను రూ.2 వేలకు పెంచాలని, గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.

✦ నేటి నుంచి ఉపవాస దీక్షలు: ఎమ్మార్పీఎస్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అరెస్టుకు నిరసనగా సోమవారం(8న) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉపవాస దీక్షలు చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ వెల్లడించింది. ఈ దీక్షలను స్వచ్ఛందంగా నిర్వహించాలని కోరింది. ప్రభుత్వం, పోలీసులు సహకరించకుంటే ఎవరి ఇంట్లో వాళ్లు దీక్ష నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలని సూచించింది. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని గొంతెత్తి చెప్పినందుకు మంద కృష్ణను అక్రమంగా అరెస్టు చేయడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు రాగటి సత్యం, మందకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంద కృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆ దిబ్బలో ఏముంది..?

జనగామకు చేరువలోని కొన్నె-రామచంద్రాపురం మధ్య అన్వేషణ

- త్వరలో కేంబ్రిడ్జి వర్సిటీతో కలసి హెచ్‌సీయూ బృహత్తర పరిశోధన
- గజగిరిగుట్ట చేరువలో వేల ఏళ్ల పాటు మానవ ఆవాసం
- నాటి జీవన విధానం, ఆహార పదార్థాలు, ఉపద్రవాలపై వెతుకులాట
- మట్టి దిబ్బల్లో చెట్ల పుప్పొడి, ధాన్యాల అవశేషాల సేకరణ
- యాక్సలేటర్ మాస్ స్పెక్ట్రోమిట్రీ విధానం వినియోగం



పరిశోధన జరిగే గజగిరిగుట్ట ప్రాంతం ఇదే

సాక్షి, హైదరాబాద్: వేల ఏళ్ల మానవ మనుగడ.. తొలి చారిత్రక యుగం, బృహత్‌శిలా యుగం, కొత్త రాతి యుగం.. ఇలా వివిధ కాలాల్లో మనిషి వర్ధిల్లాడు. ఇప్పుడు మిగిలింది 'బూడిద'. వేల ఏళ్ల మానవ ఆవాసం కొనసాగిందనేందుకు నిదర్శనంగా బూడిద కుప్ప తరహాలో దిబ్బ ఏర్పడింది. మరి వేల ఏళ్ల కాల ప్రవాహంలో అక్కడ మనిషి జాడ ఎందుకు కనుమరుగైంది..? ఇప్పుడు ఇక్కడి మర్మం కనుక్కునేందుకు బృహత్తర అన్వేషణకు తెర లేవబోతోంది. మానవ మనుగడలో కీలక భూమిక పోషించిన అంశాలు.. అక్కడ వినియోగించిన ధాన్యం.. మనిషితో పెనవేసుకున్న వృక్ష సంపద.. నాటి పర్యావరణం.. ఉపద్రవాలేమైనా సంభవించాయా.. అక్కడ మనిషి మనుగడ లేకుండా అదృశ్యమవటానికి కారణమైన అంశాలేంటి..? ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) నేతృత్వంలో ఈ అన్వేషణ కొనసాగనుంది. ఈ బృహత్తర కార్యక్రమానికి జనగామకు దగ్గర లోని కొన్నె-రామచంద్రాపురం ప్రాంతాల్లోని గజగిరిగుట్ట కేంద్రం కాబోతోంది.

ముందు జాగ్రత్తకు..

సాధారణంగా పురావస్తు అన్వేషణలు చరిత్రను కళ్ల ముందుంచుతాయి. గతించిన కాలానికి చెందిన వైభవాన్ని ప్రస్ఫుటిస్తాయి. తాజాగా జరగబోయే అన్వేషణ మాత్రం చరిత్రతో పాటు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సమాయత్తం చేసేందుకు దోహదపడనుండటం విశేషం. ప్రకృతి ఉపద్రవాలను ముందే ఊహించి వాటి నుంచి బయటపడేందుకు పద్ధతులను అన్వేషించటం, అసలు ఉపద్రవాలు ఎందుకొచ్చాయో తెలుసుకోవటం చాలా అవసరం. పర్యావరణానికి పెను ముప్పుగా మారుతున్న మానవ తప్పిదాలు భవిష్యత్తును ఆందోళనకరంగా మారుస్తున్నాయి. ఈ క్రమంలో గత అనుభవాలను స్పష్టంగా తెలుసుకుంటే భవిష్యత్తులో ఉపద్రవాల నుంచి బయటపడేందుకు మార్గం సుగమమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఇటీవల కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ విభాగం ప్రొఫెసర్ డోరియన్ ఫుల్లర్ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని సంప్రదించారు. ఈ పరిశోధనల్లో ఫుల్లర్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ కె.పుల్లారావు ముందుకొచ్చారు.

అత్యాధునిక పద్ధతిలో..

గతంలో కొన్ని ప్రాంతాల్లో ఈ తరహా పరిశోధన జరిగినా అది పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో సాగింది. తొలిసారి ఆధునిక పద్ధతిలో అధ్యయనానికి సిద్ధమవుతున్నారు. ఆ ప్రాంతంలో తవ్వకాలు జరిపి మానవ మనుగడ సాగిన కాలాన్ని కచ్చితంగా నిర్ధారిస్తారు. ప్రస్తుతం బూడిద మట్టి పేరుకుపోయిన ప్రాంతంలో కొన్ని మీటర్ల లోతు తవ్వి నాటి మనుషులు ఆహారంగా వినియోగించిన ధాన్యపు గింజలు, ఇతర పదార్థాల అవశేషాలను గుర్తిస్తారు. మట్టి పొరల్లో నిక్షిప్తమైన పుప్పొడి అవశేషాలనూ సేకరిస్తారు. దీనివల్ల నాటి ఆహార పదార్థాలు, సేకరణ తీరు, పుప్పొడి ఆధారంగా నాటి వృక్ష జాతి, పర్యావరణం తీరును కచ్చితంగా అంచనా వేస్తారు. ఇందుకు 'యాక్సలేటర్ మాస్ స్పెక్ట్రోమిట్రీ (ఏఎంఎస్)'అనే ఆధునిక విధానాన్ని అనుసరించనున్నారు. దీని ద్వారా సేకరించిన అతి సూక్ష్మ నమూనాలను అత్యాధునిక పరిశోధన శాలలున్న ఆక్స్‌ఫర్డ్, ఆరిజోనా యూనివర్సిటీ ల్యాబ్‌ల్లో పరిశోధిస్తారు.

జనగామ ప్రాంతమే ఎందుకు?

జనగామ సమీపంలోని కొన్నె-రామచంద్రాపురం ప్రాంతాల్లో వేల ఏళ్లనాటి మానవ నివాస జాడలున్నాయి. ఇక్కడి గజగిరిగుట్ట వద్ద పెద్ద ఆవాసం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ప్రొఫెసర్ పుల్లారావు ఆధ్వర్యంలో అధ్యయనం జరిగింది. అక్కడ తొలి చారిత్రక యుగం, బృహత్ శిలా యుగం, కొత్తరాతియుగం కాలాల్లో మానవులు నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఆధారాలు వెలుగు చూశాయి. ఆయా కాలాల్లో వినియోగించిన పనిముట్లు, ఆయుధాలు, పాత్రలు కనిపించాయి. అలాగే చుట్టుపక్కల ప్రాంతాల్లో మానవ సమాధులకు చిహ్నాలైన రాక్షస గుళ్లు కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని డోరియర్ ఫుల్లర్ దృష్టికి తేవటంతో ఆయన ఇక్కడికొచ్చి పరిశీలించారు. పరిశోధనలకు అనుమతి కావాలంటూ గతంలో హెచ్‌సీయూ కేంద్రాన్ని కోరింది. తాజాగా కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ అనుమతి మంజూరు చేసింది.



నాటి మానవ మనుగడ ఉన్న ప్రాంతంలో ఏర్పడిన బూడిద మట్టిగుట్ట





గతంలో వెలుగు చూసిన మానవులు వినియోగించిన పనిముట్లు, పాత్రల అవశేషాలు

ఈ పరిశోధన చాలా కీలకం: ప్రొఫెసర్ పుల్లారావు



'ఈ పరిశోధనల వల్ల ప్రకృతితో మానవుడి అనుబంధం, పర్యావరణ పరంగా వచ్చిన మార్పులు, మనిషి చెల్లాచెదురయ్యేందుకు కారణాలను కనుక్కొనే అవకాశముంది. ఇలాంటి పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా చాలాచోట్ల వచ్చాయి. అయితే కారణాలు కనుక్కుంటే భవిష్యత్తు ఉపద్రవాలను ఎదుర్కోవచ్చు. ఇదే దిశగా మా పరిశోధన ఉండనుంది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంది'.

మద్దతు ధరలపై అధ్యయనం: హరీశ్

- ఐదు రాష్ట్రాల్లో మార్కెటింగ్ అధికారుల పర్యటన
- 13 నాటికి నివేదిక ఇవ్వాలని అధికారులకు మంత్రి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మార్కెటింగ్ ఉన్నతాధికారుల బృందం మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, హరియాణా తదితర రాష్ట్రాలలో పర్యటించాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. ఆయా రాష్ట్రాలలో వివిధ వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలకు అక్కడి ప్రభుత్వాల నుంచి లభిస్తున్న కనీస మద్దతు ధరలపై అధ్యయనం చేయాలని సూచించారు. పంటల దిగుబడి, వాటి కొనుగోలు, విధివిధానాలు, అక్కడ అవలంబిస్తున్న పద్ధతులను పరిశీలించాలన్నారు. రాష్ట్ర రైతులకు మేలు జరిగేలా కొత్త విధానాలను ప్రవేశపెట్టేందుకు ఈ నెల 13 లోగా నివేదికలివ్వాలని ఆదేశించారు. ఆదివారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్రంలోని అన్ని మిల్లుల వివరాలు, వాటి మిల్లింగ్ సామర్థ్యం, ఆయా ప్రదేశాల్లో అంచనా వేసిన వివిధ పంటల ఉత్పత్తులు తదితర వివరాలను ఈ నెల 13 లోగా సంబంధిత జిల్లా మార్కెటింగ్ అధికారులు ప్రధాన కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. మన కూరగాయల విక్రయ కేంద్రాలను జీహెచ్‌ఎంసీ సమీకృత మార్కెట్లలో, అనువైన మెట్రో రైల్వేస్టేషన్లలో త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. మొత్తం 330 నాబార్డు గోదాముల్లో మిగిలిన 18 గోదాముల నిర్మాణం ఈ మార్చిలోగా పూర్తి చేయాలన్నారు.

నేడు 'తుమ్మిళ్ల'కు శంకుస్థాపన

రాజోలిబండ ఎత్తిపోతల పథకం (ఆర్డీఎస్) కింది ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగు జలాలు అందించనుంది. తుంగభద్ర జలాల వాటాను వినియోగంలోకి తెచ్చేలా తలపెట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి మంత్రి హరీశ్‌రావు సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

పార్టీ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం

టీజేఏసీ చైర్మన్ కోదండరాం

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ ఏర్పాటుకు సమయం ఆసన్నమైందని, సమష్టి ఆలోచనతో త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం వెల్లడించారు. ఆదివారం విలేకరులతో కోదండరాం మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాజకీయ పార్టీ స్థాపించడం అనివార్యమన్నారు. ఇది తాను ఒంటరిగా తీసుకునే నిర్ణయం కాదని, సమష్టిగా తీసుకోవాల్సినదన్నారు. అందుకు జేఏసీ ప్రతినిధులు, విద్యార్థి సంఘాలతో సంప్రదించాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలని టీవీయూవీ అధ్యక్షుడు నిజ్జెన రమేశ్ ముదిరాజ్ కోదండరాంను కోరారు. టీవీయూవీ ప్రతినిధులతో కలసి ఆయన కోదండరాంకు వినతి పత్రాన్ని అందజేశారు.

అనుమతుల్లో ఆలస్యం.. అందేనా లక్ష్యం!

మిషన్ కాకతీయ నాలుగో విడత పనుల అనుమతుల్లో తీవ్ర జాప్యం

5,220 చెరువులకు అంచనాలు పంపితే.. 2,550 చెరువులకే అనుమతి

సాక్షి, హైదరాబాద్: మిషన్ కాకతీయ నాలుగో విడత చెరువుల పునరుద్ధరణ పనులకు పరిపాలనా అనుమతుల ప్రక్రియలో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. ఈ సంవత్సరం జనవరి ఆరంభానికే చెరువుల పనులకు పరిపాలనా అనుమతులు రావాల్సి ఉన్నా ఇప్పటికీ నిర్ణీత లక్ష్యంలో సగాన్ని మాత్రమే నీటి పారుదల శాఖ చేరుకుంది. దీంతో గడువు మేరకు చెరువుల పనులన్నింటినీ పూర్తి చేయడం కష్టతరం కానుంది. నాలుగో విడత మిషన్ కాకతీయలో మొత్తంగా 5,703 చెరువుల పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయినప్పటికీ జిల్లాల నుంచి మొత్తంగా లక్ష్యానికి మించి 6,061 చెరువుల అంచనాలు తయారు చేసి రాష్ట్ర కార్యాలయానికి పంపారు. వీటిని పరిశీలించిన అనంతరం చిన్న నీటిపారుదల శాఖ 5,220 చెరువుల అంచనాలను ప్రభుత్వ అనుమతి కోసం పంపింది. అయితే ఇప్పటివరకు కేవలం 2,550 చెరువులకు మాత్రమే అనుమతులు వచ్చాయి. మరో 2,670 చెరువుల అనుమతులు రావాల్సి ఉంది.

జూలై నాటికి లక్ష్యం నెరవేరేనా?

అనుమతులకు సంబంధించి నీటి పారుదల శాఖ నుంచి ప్రభుత్వానికి వేగంగా ఫైళ్లు కదులుతున్నా ఉన్నత స్థాయిలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది జూన్, జూలై నాటికి చెరువుల పనులన్నీ పూర్తి చేయాలన్న లక్ష్యంపై ప్రభావం పడనుంది. మిషన్ కాకతీయ పనులు చూస్తున్న ఉన్నతాధికారికే పంచాయతీ రాజ్ శాఖ పనులూ కట్టబెట్టడంతో.. ఆయన ఆ పనులకే అధిక సమయం కేటాయించాల్సి వస్తోందని నీటిపారుదల శాఖ వర్గాలు వెల్లడించాయి. కొత్తగా ప్రభుత్వం తేనున్న పంచాయతీరాజ్ చట్టం తయారీలో ఆయన తలమునకలు కావడంతో అనుమతుల విషయమై మరింత జాప్యం జరుగుతున్నట్లుగా స్పష్టం చేస్తున్నాయి.

పంచాయతీరాజ్ బిల్లుపై కేబినెట్ సబ్ కమిటీ

జూపల్లి చైర్మన్‌గా ఏడుగురు మంత్రులకు బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: కొత్త పంచాయతీరాజ్ చట్టం రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమిస్తూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. సహకార సంఘాల ఎన్నికలపై అధ్యయనం చేసే బాధ్యతను సైతం ఈ కమిటీకి అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చైర్మన్‌గా ఏడుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. గతంలో పంచాయతీరాజ్ మంత్రులుగా పని చేసిన పోచారం శ్రీనివాసరెడ్డి, కె.తారకరామారావులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. వీరితో పాటు మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర రావు, టి.హరీశ్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి ఈ కమిటీలో ఉన్నారు. పంచాయతీరాజ్ ముసాయిదా బిల్లు ఇప్పటికే తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం నియామకం ఆసక్తి రేపుతోంది.

'సహకార' ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!

- వచ్చే నెల 3తో ముగియనున్న గడువు
- పర్సన్ ఇన్‌చార్జీలను నియమించేందుకు ఏర్పాట్లు
- 200 ఫిషరీస్ సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: సహకార సంఘాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే ఆలోచన ప్రభుత్వానికి లేనట్లు అర్థమవుతోంది. వచ్చే నెల 3 నాటికి ప్రాథమిక సహకార సంఘాలు (ప్యాక్స్), జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలు (డీసీఎంఎస్), రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్)ల పాలకవర్గ పదవీకాలం ముగియనుంది. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం వాటికి ఎన్నికలు నిర్వహించే విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకున్నా ఎన్నికల నిర్వహణకు కనీసం 2 నెలల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో వాటి పదవీ కాలం ముగిసే నాటికి ఎన్నికలు నిర్వహించడం అసాధ్యమని, నూతన పాలకవర్గం కొలువుదీరే పరిస్థితి లేదని సహకార శాఖ వర్గాలు 'సాక్షి'కి తెలిపాయి.

రైతులకు పెట్టుబడి సాయం తర్వాత..

రాష్ట్రంలో 906 ప్యాక్స్, 10 డీసీసీబీలు, 9 డీసీఎంఎస్‌లు, టెస్కాబ్‌లు ఉన్నాయి. ఈ సహకార సంఘాల ఎన్నికల్లో రైతులే ఓటర్లు. కాబట్టి ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళ్లడం శ్రేయస్కరం కాదనేది సర్కారు ఆలోచనగా చెబుతున్నారు. పైగా వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే వ్యతిరేకత కనిపిస్తే ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందనేది భావిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత గ్రామాల్లో పరిస్థితిని మెరుగుపరిచి ఆ తర్వాత ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పెట్టుబడి కింద ఎకరాలకు రూ.8 వేల ఇవ్వనుంది. ఈ పథకం కింద 1.42 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతారు. దీన్ని అమలు చేశాక సంఘం ఎన్నికలకు వెళితే ప్రయోజనం ఉంటుందని సర్కారు భావనగా కన్పిస్తోంది.

పాలకవర్గ అధ్యక్షులే పర్సన్ ఇన్‌చార్జీలా

సహకార సంఘాల పదవీకాలం ముగిసే నాటికి ఎన్నికలు నిర్వహించకపోతే వాటికి పర్సన్ ఇన్‌చార్జీలను నియమించాల్సి ఉంది. అందుకు సహకార శాఖ కసరత్తు చేస్తోంది. సాధారణంగా పర్సన్ ఇన్‌చార్జీలుగా అధికారులను నియమిస్తుంటారు. అధికారులను నియమిస్తే వ్యవస్థ మొత్తం ప్రభుత్వ నియంత్రణలోకి వస్తుంది. కానీ రాజకీయ అవసరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత పాలకవర్గ అధ్యక్షులను పర్సన్ ఇన్‌చార్జీలుగా కూడా నియమించుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని సహకార వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే ఇప్పుడు పాలవకర్గ అధ్యక్షులుగా ఉన్నవారు కొనసాగొచ్చు. 6 నెలల వరకే వారు కొనసాగుతారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే. కాగా, 200 ఫిషరీస్ సొసైటీలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకార శాఖ కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

కాంగ్రెస్ నేతలవి మొసలికన్నీళ్లు

టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉండగా ఏనాడూ రైతుల గురించి పట్టని కాంగ్రెస్ నేతలు ఇపుడు వారి గురించి మొసలికన్నీళ్లు కారుస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు స్వామినాథన్ కమిటీ సిఫారసులను చెత్తబుట్టలో వేసి, ఇప్పుడు వాటి గురించి సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా రైతుల బతుకులను ఛిన్నాభిన్నం చేసింది కాంగ్రెస్ నేతలేనని దుయ్యబట్టారు. ఆర్మూర్ డిక్లరేషన్ పేరిట ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. 2009 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చినా వాటిని పెండింగులో పెట్టారన్నారు.

'సిర్పూర్'పై మళ్లీ ఆశలు



▶ మొదటి పేజీ తరువాయి

ముందుకొచ్చాయి. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా ట్రిబ్యునల్ నియమించిన రిసల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్పీ) కె.రామ్ రతన్ ఈ కంపెనీ పునరుద్ధరణ కోసం గతేడాది డిసెంబర్ 11న ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)కు ఆహ్వానించగా జేకే పేపర్ మిల్స్, వెస్ట్‌కోస్ట్ పేపర్ మిల్స్ (కోల్‌కతా), రిద్ధి సిద్ధి పేపర్ మిల్స్ (అహ్మదాబాద్), పాప్సెల్ (జర్మనీ), సెంచురీ పేపర్, ఐటీసీ పేపర్ మిల్స్, కోహినూర్ గ్రూప్ తదితర 8 కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. అయితే డిసెంబర్ 22తో ముగిసిన ఆసక్తి వ్యక్తీకరణ గడువును ఈ నెల 5 వరకు పొడిగించారు. 180 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని గతేడాది నవంబర్ 20న ట్రిబ్యునల్ ఆదేశించగా మే నెలతో ఈ గడువు ముగియనుంది. ఆసక్తి వ్యక్తీకరణకు ముందుకొచ్చిన 8 కంపెనీల్లో నిబంధనల ప్రకారం అధిక అర్హతలుగల కంపెనీకి గడువులోగా సిర్పూర్ పేపర్ మిల్లును ట్రిబ్యునల్ అప్పగించనుంది. అన్నీ సవ్యంగా జరిగి మరో 6-8 నెలల్లో పునరుద్ధరణ ప్రక్రియ పూర్తయితే పరిశ్రమ ఉత్పత్తిని ప్రారంభించే అవకాశాలున్నాయి.

మిల్లును ముంచిన అప్పులు..

చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1936లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సిర్పూర్ పేపర్ మిల్లు దేశంలోనే అత్యంత పురాతన పేపర్ మిల్లుగా ఖ్యాతిగాంచింది. 1950లో బిర్లా కుటుంబం ఈ మిల్లును టేకోవర్ చేసుకోగా అనంతర కాలంలో ఇది పొద్దార్ గ్రూప్ చేతికి వెళ్లింది. అయితే మిల్లు అవసరాల కోసం యాజమాన్యం 2007లో వివిధ బ్యాంకుల నుంచి రూ. వందల కోట్ల రుణాలు తీసుకొని చెల్లించలేకపోయింది. 2014 నాటికి ఈ రుణాలు వడ్డీలతో కలుపుకుని రూ. 425 కోట్లకు పెరిగిపోయాయి. పరిశ్రమ నిర్వహణకు చేసిన మరో రూ. 150 కోట్ల అప్పులు దీనికి జత కావడంతో మొత్తం రుణాలు రూ.600 కోట్లకు ఎగబాకాయి. ఈ సమయంలో మరమ్మతుల పేరుతో యాజమాన్యం 2014 సెప్టెంబర్ 27 నుంచి రెండు నెలల కోసం మిల్లును షట్‌డౌన్ చేసింది. ఈ కాలంలో విధులకు హాజరైన కార్మికులకు జీతాలు చెల్లించలేకపోయింది. అలాగే మరమ్మతుల తర్వాత మిల్లును పునఃప్రారంభించకుండా చేతులెత్తేసింది. దీంతో 1,350 మంది రెగ్యులర్ కార్మికులు, 400 మంది ఉద్యోగులతో పాటు మరో 1,200 తాత్కాలిక కార్మికులు, వారి కుటుంబాలు వీధినపడ్డాయి.

ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు

సిర్పూర్ పేపర్ మిల్లు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. మిల్లు పునరుద్ధరణ అంశంపై చర్చలకు రావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 8 సార్లు పిలిచినా మిల్లు యజమాని ఆర్కే పొద్దార్ స్పందించలేదు. దీంతో ఐడీబీఐ బ్యాంకు నేతృత్వంలో ఏర్పడిన బ్యాంకుల కన్సార్షియం మిల్లును స్వాధీనం చేసుకొని వేలం నిర్వహించింది. మిల్లులోని యంత్రాలకు కాలం చెల్లడం, మిల్లు విలువతో పోల్చితే అప్పులే ఎక్కువగా ఉండటంతో వేలానికి స్పందన లభించలేదు. ఇదే కారణంతో తొలుత రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు సైతం పారిశ్రామిక వర్గాల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ క్రమంలో మిల్లును పునఃప్రారంభించేందుకు ముందుకొస్తే రాష్ట్ర నూతన పారిశ్రామిక విధానం టీఎస్-ఐపాస్ కింద అందించే అన్ని రకాల రాయితీలు, ప్రోత్సాహకాలతోపాటు మెగా పరిశ్రమలకు అందించే ప్రత్యేక రాయితీలను కూడా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే బ్యాంకులకు యాజమాన్యం బకాయిపడిన రుణాలపై మారటోరియం విధించడంతోపాటు విద్యుత బిల్లుల బకాయిల భారాన్ని భరిస్తామని హామీ ఇచ్చింది. కాగితపు వ్యాపారంలో ఉన్న ఐటీసీ, రిద్ధి సిద్ధి, పాప్సెల్ తదితర కంపెనీలతో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కె. తారకరామారావు స్వయంగా చర్చలు జరిపి ఒప్పించే ప్రయత్నాలు చేశారు. ఐటీసీ, పాప్సెల్ యాజమాన్యాలు సిర్పూర్ మిల్లును సందర్శించి పరిస్థితులను అంచనా వేశాయి. మరోవైపు పొద్దార్ గ్రూప్ విజ్ఞప్తి మేరకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఈ మిల్లుకు సంబంధించిన దివాలా వ్యాపార పరిష్కార ప్రక్రియను చేపట్టింది.

Dwaraka



ఫరీదాబాద్ పోలీస్ స్టేషన్ బయట చలిలో బాధితురాలు


ప్రతీకాత్మక చిత్రం

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం, 8-1-2018

జాగ్రత్త తల్లులూ!

పదిహేనేళ్ల అమ్మాయి పరుగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్‌కి వస్తే పోలీసులు ఏం చెయ్యాలి? సీఎం లైన్‌లో ఉన్నా సరే, ఫోన్ పక్కన పడేసి 'ఏంటి.. తల్లీ' అని అడగాలి. ఫరీదాబాద్ పోలీసులు ఏం చేశారో చూడండి. ఆ అమ్మాయిని గడ్డకట్టే చలిలో శుక్రవారం రాత్రంతా పోలీస్‌స్టేషన్ బయటే నిలబెట్టారు! ఆ అమ్మాయిది పశ్చిమబెంగాల్. ఆమె స్నేహితుడు ఒకడు (17) ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఢిల్లీ తీసుకొచ్చాడు. 'నేను వచ్చే వరకు ఇక్కడే ఉండు' అని చెప్పి బంధువుల ఇంట్లో వదిలి వెళ్లిపోయాడు. వాడికి బాబాయి వరసయ్యే అతను ఆమెను రేప్ చెయ్యబోతే తప్పించుకుని అపార్ట్‌మెంట్ బయటికి వచ్చింది. అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ గార్డ్ ఆమెను రిక్షాలో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లాడు. పోలీసులు కనీసం ఆమెను లోపలికి రానివ్వలేదు. కంప్లయింట్ తీసుకోలేదు. అపార్ట్‌మెంట్ దగ్గర బయల్దేరేముందు నుంచీ సెక్యూరిటీ గార్డు పోలీస్ హెల్ప్‌లైన్‌కి ఫోన్ చేస్తూనే ఉన్నాడు కానీ, అది పని చేయడం లేదు! అది పనిచేయనట్లే, స్టేషన్‌లో వీళ్లూ పని చేయలేదు. చివరికి 'శక్తివాహిని' వాళ్లు వస్తేనే కానీ పోలీసులంతా లైన్‌లోకి రాలేదు. ఎఫ్.ఐ.ఆర్. రాసుకున్నారు. విచారణ జరిపారు. పెళ్లి చేసుకుంటానని తీసుకొచ్చిన అబ్బాయికి ఆల్రెడీ పెళ్లయిపోయిందని విచారణలో తేలింది! ఈ కేసులో నమ్మించి మోసం చేసినవాడు, రేప్ చెయ్యబోయినవాడు పైకి కనిపిస్తున్న నిందితులు. పోలీసులు పైకి కనిపించని నిందితులు. మరి వాళ్ల మీద ఎవరు ఎఫ్.ఐ.ఆర్. ఫైల్ చెయ్యాలి? చిన్న పిల్ల ఆక్రందనలు పట్టించుకోనివాళ్లు ఎంత పెద్ద పదవులు వెలగబెడితే మాత్రం ఈ సమాజానికి ఏం ఒరుగుతుంది? 'లేచి రావడం ఆ పిల్ల తప్పు' అన్నాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్. అంత చలిలో ఆమెని నిలబెట్టడం తప్పు కాదా? తప్పే. అత్యాచారం చేసినంత తప్పు.


మోదీజీ.. మన మహిళలకు ఎప్పుడిస్తారు ఈక్వల్ పే?!

భువిలో మహిళల దీవి

ఐస్‌ల్యాండ్.. దీవిలా ఉండే దేశం. మహిళలకు అది 'దివి' భూమి! ఐరోపాలో ఉంది. ఉత్తర అట్లాంటిక్ సముద్రం మధ్యలో ఉంటుంది. 'గ్లోబల్ జెండర్ గ్యాప్' సంస్థ రిపోర్టు ప్రకారం.. స్త్రీలను భద్రంగా, గౌరవంగా చూసుకునే ప్రపంచ దేశాలలో తొమ్మిదేళ్లుగా ఐస్‌ల్యాండ్‌దే ఫస్ట్ ప్లేస్. ఇప్పుడక్కడ స్త్రీ పురుషులు మరింత ఈక్వల్ ఈక్వల్ అయ్యారు. ఎలాగంటే.. న్యూ ఇయర్ నుండి అక్కడ కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. ఇరవై అయిదు, అంతకు మించి ఉన్న సిబ్బంది ఉన్న ప్రతి సంస్థ.. గవర్నమెంట్, ప్రైవేట్.. ఏదైనా సరే, ఆడవాళ్ల కంటే మగవాళ్లకు ఎక్కువ జీవితం ఇవ్వడం చట్టవిరుద్ధం! సమాన పనికి సమానం వేతనం ఉండాల్సిందే. ఆడ, మగ తేడాలు చూపడానికి లేదు. చూపట్లేదు అని ఎలా తెలుస్తుంది? గవర్నమెంటు దగ్గర్నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలి. 'ఈ సంస్థ సమాన వేతనాలు ఇస్తోంది' అని! ఆ సర్టిఫికెట్ ఊరికే ఇవ్వదు కదా ప్రభుత్వం. స్కాన్ చేసి, స్ర్కీన్ చేసి ఇస్తుంది. సర్టిఫికెట్ ఉన్నవాళ్లకే రాయితీలు అవీ ఇస్తుంది. జీతాలు మిగుల్చుకుందామని చెప్పి, మహిళా ఉద్యోగులకు మగ ఉద్యోగులక న్నా తక్కువ జీతం ఇవ్వాలనే ఏ కంపెనీ అయినా కక్కుర్తి పడితే ఇదిగో ఈ రాయితీలు కట్ అవుతాయి. ఇలాంటి చట్టం తేవాలని లాస్ట్ ఇయర్ మహిళా దినోత్సవం రోజు ఐస్‌ల్యాండ్ గవర్నమెంట్ ఫిక్స్ అయింది. చక్కగా ప్లాన్ చేసి, ఈ జనవరి ఫస్ట్ నుంచి అమలు చేస్తోంది. ఐస్‌ల్యాండ్ పార్లమెంటులో సగం మందికి పైగా మహిళలు ఉన్నారు. ప్రధాని కూడా మహిళే! అందుకే 'ఈక్వల్ పే' చట్టం సాధ్యమైందా? ఏమైనా స్త్రీకి స్త్రీయే స్నేహితురాలు. అన్నట్టు ప్రపంచంలో ఇలాంటి చట్టం చేసిన మొట్ట మొదటి దేశం ఐస్‌ల్యాండే.

చెట్టు నీడ

దక్షిణ ధ్రువానికి దక్షిణాన ఏముంటుంది?

● మాధవ్ శింగరాజు

ఈ ప్రశ్న '.. మీనింగ్‌లెస్' అంటారు స్టీఫెన్ హాకింగ్. భూ మండలానికి ఆవల చిట్టచివర్న ఉన్నది దక్షిణ ధ్రువమే అయినప్పుడు, దానికి మళ్లీ దక్షిణం వైపు ఏమిటీ అని ఆయన చికాకు, లేదా చిరునవ్వు. సాధారణంగా స్టీఫెన్ ఎప్పుడూ చికాగ్గా కనిపించరు. పోప్‌లా ప్రశాంతంగా ఉంటారు! ఎప్పుడైనా ఆ చిరునవ్వుకు చికాకు కూడా తోడయిందంటే 'లాజిక్'కి అందని అమాయకత్వం ఏదో ఆయన్ని ఎదురుగా వచ్చి ప్రశ్నించిందనే మనం అర్థం చేసుకోవాలి!

స్టీఫెన్ బ్రిటిష్ ఖగోళశాస్త్రవేత్త. ఇప్పుడున్న శాస్త్రవేత్తలలో మోస్ట్ రెస్పెక్టబుల్. ఇవాళ ఆయన పుట్టిన రోజు. 76వ బర్త్‌డే. విశ్వాంతరాళాల్లో ఏముందో చెప్పగలరు స్టీఫెన్ హాకింగ్. అంతేకాదు, ఏం లేదో కూడా చెప్పగలరు! ఎంతటి శాస్త్రవేత్త అయినా ఉన్నదానిని శోధించి చెప్పగలడు కానీ, ఏం లేదో ఎలా చెప్పగలడు? కానీ స్టీఫెన్ చెప్పారు. 'దేవుడు లేడు' అని చెప్పాడు. ఆయన నాస్తికుడు. అందుకని దేవుడు లేడు అని చెప్పలేదు. ఆయన లాజిక్‌కి దేవుడు అందలేదు. అందుకని చెప్పారు. ఎవరు దేనిని నమ్మితే దాని నుంచే కదా ప్రపంచాన్ని చూస్తారు. స్టీఫెన్ లాజిక్‌ని నమ్మారు. లాజిక్‌లోంచి ఈ విశ్వాన్ని చూశారు. అందులో దేవుడు కనిపించలేదు. అదే మాట చెప్పారు. అయితే 'నాకు కనిపించలేదు' అని చెప్పలేదు. 'నేను నాస్తికుడిని' అన్నారు. 'నమ్మను' అని ఆ మాటకు అర్థం. 'ఒకవేళ దేవుడు నిజంగా కనిపించినా నేను నమ్మను' అనేది అంతరార్థం. స్టీఫెన్ వంటి నిక్కచ్చి పరిశోధకులకు దేవుడు కనిపించినంత మాత్రాన సరిపోదు. తమ పరిశోధనల్లో దేవుడికి కనీసం పాస్ మార్కులైనా రావాలి. దేవుడికి అంటే.. దేవుడి ఉనికికి.


● విజాతి విశ్వధ్రువాలు : పోప్ ఫ్రాన్సిస్, స్టీఫెన్ హాకింగ్ (ఆనాటి ఫొటో)

రెండేళ్ల క్రితం నవంబర్‌లో ఈ భూగోళంపై ఒక అపూర్వమైన ఘటన సంభవించింది. రెండు భిన్న ధ్రువాలు ఒకదానికొకటి బాగా సమీపానికి వచ్చాయి. ఒక ధ్రువం పోప్ ఫ్రాన్సిస్. ఇంకో ధ్రువం స్టీఫెన్ హాకింగ్. వాటికన్ సిటీలో సైన్స్ కాన్ఫరెన్స్ జరుగుతుంటే అక్కడికి ప్రత్యేక అతిథిగా వచ్చారు స్టీఫెన్. ఆయన్ని ప్రత్యేకంగా పలకరించడానికి వచ్చారు పోప్ ఫ్రాన్సిస్. పోప్ రావడానికి సాధారణ కారణం కూడా ఒకటి ఉంది. కాన్ఫరెన్స్‌ని నిర్వహిస్తున్న 'పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్'.. పోప్ పరిధిలోనిదే. 1935లో అప్పటి పోప్ పాయెస్ ఆ అకాడమీని నెలకొల్పారు! మేథమేటిక్స్‌లో, ఫిజిక్స్‌లో, నేచురల్ సైన్సెస్‌లో అక్కడ నిరంతరం పరిశోధనలు జరుగుతుంటాయి. చాలా చిత్రంగా ఉంటుంది ఆలోచిస్తే. దేవుణ్ణి అంగీకరించని సైన్స్‌ని.. దేవుణ్ణి నమ్మేవారు అభివృద్ధి పరచడం!!

ఆ రోజు కాన్ఫరెన్స్‌లో 'బిగ్ బ్యాంగ్' థియరీపై మాట్లాడారు స్టీఫెన్. మహా విస్ఫోటనం (బిగ్ బ్యాంగ్) జరిగి ఈ సృష్టి ఏర్పడిందన్నది కదా... థియరీ, దానిని సమర్థిస్తూ మాట్లాడారు స్టీఫెన్. ఎవరో అడిగారు.. 'బిగ్ బ్యాంగ్‌కి ముందు ఏముండేది ఈ విశ్వంలో మిస్టర్ స్టీఫెన్?' అని. అప్పుడే ఆయన అన్నారు.. ''సౌత్ పోల్‌కి సౌత్‌లో ఏముంటుందీ?'' అని.


'దేవుడు లేడు' అని నిరూపించడానికి స్టీఫెన్ శాస్త్రవేత్త కాలేదు. 'దేవుడు ఉన్నాడు' అని చెప్పడానికే పోప్ ఫ్రాన్సిస్ ఈ భూమిపై జన్మించారేమో.. అదీ చెప్పలేం. 'ఉంటే చూపించు' అని అడగడం లాజిక్. 'చూడు ఉంటాడు' అని చెప్పడం విశ్వాసం. భూ మండలానికి ఆవల ఉన్నట్లే మానవులలోని రెండు వ్యతిరేక ధ్రువాలు.. తర్కం, విశ్వాసం. రెండిటినీ కలిపే మాట ఒకటి చెప్పారు పోప్ ఫ్రాన్సిస్. 'బిగ్ బ్యాంగ్ ఈజ్ ఏన్ యాక్ట్ ఆఫ్ గాడ్స్ లవ్' అని. పైకి వేర్వేరుగా ఉన్నా, లోపల ఎక్కడో ఒకచోట కనెక్ట్ అయి ఉండటమే మానవ జీవితంలోని సౌందర్యం, సంపూర్ణత్వం. ఈ రెండూ కలిసి ఉన్నదే దైవత్వం.

ఇంద్రజాలంతో ఎందరో మోసగాళ్లు అమాయకులను మోసం చేస్తుంటారు.
అదే ఇంద్రజాలంతో మోసాన్ని మాయం చేస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు...

మూఢనమ్మకాలు హాంఫట్!

చేతుల్లో వస్తువులు మాయం చేసి మస్కా కొడుతూ తాను భగవత్ స్వరూపునిగా అభివర్ణించుకుంటుంటారు కొందరు. నిమ్మకాయ కోసి రక్తం చూపి తమను తాము దైవాంశ సంభూతులమనుకొమ్మంటారు మరికొందరు. చేతబడులకు తిరుగుబడి చేస్తే జ్వరాలు తగ్గుతాయంటూ కోళ్లు, కానుకలు దండుకుంటుంటారు ఇంకొందరు. ముఖ్యంగా గిరిజనుల అమాయకత్వం, నిరక్షరాస్యత అడ్డం పెట్టుకుని కొందరు స్వాములు పబ్బం గడుపుకుంటున్నారు. ఇలాంటి వారి నుంచి ప్రజలను కాపాడేందుకు ఇంద్రజాలాన్ని అస్త్రంగా వాడుతున్నారా ముగ్గురు. వారే మ్యాజిక్ సిస్టర్స్ అయిన మౌనిక, సుస్మిత. వారి తండ్రి జవ్వాది వరాహలక్ష్మీ నరసింహాచారి (చారి). మ్యాజిక్ సహోదరీమణుల ఆ ద్వయం... తమ తండ్రితో కలిసి త్రయంగా ఏర్పడి... మూఢనమ్మకాలు తొలగించాలని పడుతున్న తాపత్రయం వారిది. వాళ్ల జీవిత'ఆదర్శం' ఆ అక్కాచెల్లెళ్ల మాటల్లోనే...


● ఇంద్రజాలికులు సుష్మిత, మౌనిక


● ఇంద్రజాలికులు చారి, అతని పిల్లలు మౌనిక, సుష్మిత

మా నాన్న పేరు జవ్వాది వరాహలక్ష్మీ నరసింహాచారి (చారి). విజయనగరం పట్టణంలోని గంటస్థంభం దగ్గర కానుకుర్తివారివీధిలో నివాసం. నాన్న న్యాయస్థానంలో జూనియర్ అసిస్టెంట్. బీవీ పట్టాభిరామ్ వంటి ప్రముఖుల షోలు చూసి తానూ మ్యాజిక్ నేర్చుకొని ప్రదర్శనలివ్వడం మొదలుపెట్టారు నాన్న. తన పదహారేళ్ల వయసులో తొలి ప్రదర్శనను తాను ఇంటర్మీడియెట్ చదువుతున్న ఎమ్మార్ కళాశాలలో ఇచ్చారు. అప్పటి నుంచి గత 32 ఏళ్లుగా ఆయన దాదాపు 10 వేల ప్రదర్శనలిచ్చారు. మా అమ్మ పేరు రమణి. పెళ్లి తర్వాత ఆమె సహకారంతో తన ప్రవృత్తికి మరింత పదును పెట్టి మూఢనమ్మకాలపై కత్తి దూశారు. కొరడా ఝుళిపించారు. మేమింకా మ్యాజిక్ యవనికపైకి అడుగుపెట్టకముందే ఒక ఇంద్రజాలికునిగా పది వేలకు పైగా ప్రదర్శనలిచ్చి జాతీయ అవార్డు అందుకున్నారు మా తండ్రి.

మాది సమాజం హర్షించే మాయ

అవును... మేమూ మాయ చేస్తున్నాం. కాకపోతే మాది సమాజం హర్షించే మాయ. నిజం చెప్పాలంటే మా మాయతో మేము మూఢనమ్మకాలను మాయం చేస్తున్నాం. అంధ విశ్వాసాలను అంతం చేస్తున్నాం. మాయలతో మోసపుచ్చే మాయగాళ్ల గారడీ చేతబడికి తిరుగుబడి చేస్తున్నాం. ఇందుకు తగిన కారణమూ, నేపథ్యమూ ఉంది. మా జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమూ, అక్కడ అమాయక గిరిజనులు ఎక్కువ. అప్పట్లో క్యాన్సర్, గుండె జబ్బు వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో ఎవరైనా మరణిస్తే ప్రజలకు వాటి గురించి పెద్దగా తెలియకపోవడం వల్ల చేతబడి, చిల్లంగి, బాణామతి వంటి క్షుద్ర ప్రయోగం వల్ల చనిపోయి ఉంటారని అపోహ పడేవారు. అవన్నీ కేవలం మూఢనమ్మకాలంటూ మేము మ్యాజిక్ సాయంతో నిరూపిస్తున్నాం. విజయనగరం జిల్లాలోని సాలూరు, పి కోనవలస, నీలకంఠాపురం, మొండెంకల్లు, చినమేరంగి, కురుపాం, మక్కువ, కూనేరు, పార్వతీపురం, పెదబొండపల్లి, పాచిపెంట, మామిడిపల్లి, గుమ్మలక్ష్మీపురం, ఇంగిలాపల్లి, బొద్దాం, అలమండ, కొత్తవలస, కొట్యాడ, ఎస్‌కోట ప్రాంతాల్లో మూఢనమ్మకాలపై చైతన్యం తీసుకొచ్చేందుకు అనేక ప్రదర్శనలిచ్చాం.

మాయను మాయతోనే ఎలా ఛేదిస్తామంటే...

మా ప్రాంతంలోని మాయలోళ్లు అమాయకులను బుట్టలో వేసుకోడానికి రకరకాల ప్రదర్శలను ఇస్తుంటారు. వాటి సాయంతో తమకు మహిమలున్నాయని చెప్పుకుంటుంటారు. మహిమల పేరు చెప్పి వారు చేసేవన్నీ మేమూ చేస్తాం. నిమ్మకాయ నుంచి రక్తం రావడం, కొబ్బరి కాయలో నుంచి పువ్వులు, రక్తం రావడం, నాలుకపై త్రిశూలం గుచ్చుకోవడం, నోట్లో బ్లేడులు వేసుకుని నమిలి, మింగిన తర్వాత తోరణంగా వాటిని బయటకు తీయడం, విభూది సృష్టించడం, మెడలో కత్తి గుచ్చుకోవడం, తాడుమీద కొబ్బరికాయను అటూ ఇటూ నడిపించడం, దయ్యాలు, భూతాలపై భయాన్ని పోగొట్టేందుకు మనిషిని హిప్నటైజ్ చేసి తలపై మంటపెట్టి పాలు, నీరు మరిగించడం వంటి విద్యలను ప్రదర్శిస్తాం. అవి కేవలం సైంటిఫిక్‌గా ప్రదర్శించే విద్యలే తప్ప మహిమలు కాదని చాటి చెబుతాం. ఊరూరా కేవలం ఈ ప్రదర్శనలే కాకుండా కళ్లకు గంతలు కట్టుకుని రోడ్లపై మోటార్ సైకిల్ నడిపి ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలే ప్రయత్నాలూ మా ప్రదర్శనలో భాగంగా ఉంటాయి.

మాది సఫల ప్రయత్నం.. అందుకు ఇదీ ఉదాహరణ!

మా ప్రదర్శనలు ఎంతో విజ్ఞానవంతమైనవి. మరింత చైతన్యపరిచేవి. మా ప్రయత్నం ఎంత సఫలమో చెప్పేందుకు ఉదాహరణ ఒకటుంది. మా నాన్నగారు మ్యాజిక్ చేస్తుండగా విజయనగరం జిల్లాలోని జియమ్మవలస మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మా నాన్న దగ్గరికి వచ్చాడు. తాను చిల్లంగి చేస్తున్నాననే నెపంతో కొందరు తన భార్యను పొట్టనబెట్టుకున్నారట. తననూ చంపేస్తామంటున్నారంటూ బోరున విలపించాడు. ఇవే ప్రదర్శనలు తమ గ్రామంలో ఇచ్చి తన ప్రాణాలు నిలపమంటూ నాన్నను ప్రాధేయపడ్డాడు. నాన్న కారణంగా తన ప్రాణం దక్కుతుందంటూ కన్నీళ్లతో నమస్కరించాడు. ఇలా మా ప్రదర్శనలతో ప్రజలు చైతన్యవంతం కావడమే కాదు... చాలామంది ప్రాణాలూ నిలిచాయి. కొన్ని జీవితాల్లో మార్పులూ వచ్చాయి.

వినోదంతో పాటు సామాజిక బాధ్యత

మా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో శిశుమరణాలు ఎక్కువ. గర్భిణీ ఆరోగ్యం విషయంలో వారికి అనేక ఇబ్బందులు ఎదురవుతుంటాయి. సరైన మందులు, వైద్యం కూడా అందదు. ఇక పుట్టిన పిల్లలకు పౌష్టికాహారం కూడా ఉండదు. ఈ కారణంగా బిడ్డలు పౌష్టికాహార లోపంతో చిన్న వయసులోనే మృత్యువాత పడుతుంటారు. కనీసం వారికి తల్లిపాలైనా సరిగ్గా ఇస్తే కొంతమందినైనా బతికించుకోవచ్చు. ఈ నేపథ్యంలో తల్లిపాల విశిష్టత, శిశువులకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. గిరిజనులు తమ పిల్లలను బడికి పంపకుండా, కూలీ పనులకు పంపిస్తుంటారు. అలా చేయడం వల్ల వారి జీవితాల్లో వెలుగులు ఎన్నటికీ రావంటూ, విద్య ఆవశ్యకతపైనా ప్రదర్శనలిస్తుంటాం. ఆడపిల్లను చంపుకుంటే ఇంటి లక్ష్మిని చంపుకున్నట్టేనంటూ మా ఇద్దరినీ ఉదాహరణగా చూపిస్తూ.. భ్రూణహత్యలు, స్త్రీ శిశు హత్యలకు వ్యతిరేకంగా చైతన్యం తెస్తుంటారు నాన్న.

చిన్నారి పొన్నారి చిరు వయసు నుంచే...

మా ఇద్దరిలో మూడున్నర ఏళ్ల వయసప్పుడు నాచేత ప్రదర్శన ఇప్పించారు నాన్న. నన్ను చూసి చెల్లెలు రెండున్నర ఏళ్లున్నప్పుడే వేదిక ఎక్కడానికి ఉత్సాహం చూపింది. తాను అంత చిన్న వయసు నుంచే మ్యాజిక్ మొదలుపెట్టింది. అలా నాన్నతో పాటు మేమిద్దరమూ 28కి పైగా జాతీయ, రాష్ట్రీయ అవార్డులు ఎన్నో పురస్కారాలు గెలుచుకున్నాం. మాది ఒక్కటే కోరిక. సమాజంలోని మూఢనమ్మకాలు అంతమైపోవాలి. అందుకు మా మ్యాజిక్ ఉపయోగపడి... అది మూఢనమ్మకాలను మాయం చేసేస్తే మాకు అంతకంటే ఏం కావాలి?

– బోణం గణేష్, సాక్షి, విజయనగరం
ఫొటోలు: డి. సత్యనారాయణమూర్తి

జాతీయ స్థాయి గుర్తింపు

ఇంద్రజాల ప్రదర్శనలో ప్రతిభకు వచ్చిన జాతీయ అవార్డు అందుకోవడానికి 2006లో మా అక్కాచెల్లెళ్లమిద్దరమూ ఢిల్లీకి వెళ్లాం. అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ నుంచి అవార్డు తీసుకుంటుండగా మా విజిటింగ్ కార్డును ప్రధానికి ఇచ్చి 'హమారా ఐడెంటిటీ కార్డ్' అన్నాం. వెంటనే స్పందించిన మన్మోహన్‌సింగ్ 'తుమ్‌హారా ఐడెంటిటీకార్డ్!' అంటూ ఆశ్చర్యంగా అడుగుతున్నట్లు ముఖం పెట్టి ఆయన ఫక్కున నవ్వేశారు. విజిటింగ్ కార్డుకి ఐడెంటిటీ కార్డుకీ తేడా తెలియని వయసులో ఇంద్రజాలంలో జాతీయ అవార్డు అందుకున్నాం మేం. బహుశా ఇలా అక్కాచెల్లెళ్లిద్దరూ ఇంద్రజాలం ప్రదర్శించే మ్యాజిక్ సిస్టర్స్ మేమే కాబోలు.



లాయర్‌ని అవుతా

నాన్న కోర్టులో జూనియర్ అసిస్టెంట్ కావడంతో తరచుగా అక్కడికి తీసుకువెళ్లేవారు. దాంతో న్యాయవాద వృత్తిని చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాను. మరి కొద్ది నెలల్లో ఎల్‌ఎల్‌బి పట్టా అందుకోబోతున్నాను. ఆటబొమ్మల బదులు మ్యాజిక్ వస్తువులు ఇచ్చి నాన్న ఆడుకోమనేవారు. ఆలా ఇంద్రజాలాన్ని ఉగ్గుపాలతోనే అలవాటు చేశారు. చెల్లి కూడా నాతో జతకలిసిన తర్వాత ఏ ప్రదర్శన చేసినా ఇద్దరం కలిసే చేస్తున్నాం.

– మౌనిక, ఇంద్రజాలికురాలు, విజయనగరం



షార్ట్ ఫిల్మ్స్‌కు ఎడిటర్‌గా చేస్తున్నా

మానవ వనరులను సబ్జెక్ట్‌గా తీసుకుని డిగ్రీ చదువుతున్నాను. యానిమేషన్‌పై ఇష్టంతో అదీ నేర్చుకుని ఫ్రెండ్స్ ఫిల్మ్స్ అనే యూ ట్యూబ్ చానెల్ ద్వారా స్నేహితులతో కలిసి తీస్తున్న షార్ట్ ఫిల్మ్స్‌కి ఎడిటర్‌గా కూడా చేస్తున్నాను. చిన్నప్పుడు అక్క మ్యాజిక్ చేస్తుంటే అందరూ చప్పట్లు కొట్టడం చూసి నాకూ మ్యాజిక్ చేయాలనిపించింది. నాన్న అక్కకూ, నాకూ దానిలో మెళకువలు నేర్పించారు. ఒకప్పుడు మేం చేస్తుంటే విమర్శించిన వారు ఇప్పుడు మమ్మల్ని ప్రత్యేకంగా చూస్తున్నారు.

– సుష్మిత, ఇంద్రజాలికురాలు, విజయనగరం



చాలా విమర్శలు ఎదుర్కొన్నా

ఆడపిల్లల ముఖానికి రంగేసి తిప్పుతున్నానని, పెళ్లి చేయకుండా ఈ గారడీ ప్రదర్శనలేంటని బంధువర్గంలో సూటిపోటి మాటలు బాధించేవి. మ్యాజిక్‌ను చాలా చులకనగా చూసేవారు. ఒకానొక దశలో క్షుద్ర విద్యలు నేర్పుతున్నాననేవారు. ఇది క్షుద్రవిద్య కాదని, ఇంద్రజాలం అనేది ఓ కళ అని నమ్మిన నేను ఎవరు ఎన్ని మాటలన్నా, ఎంతగా నిరుత్సాహ పరిచినా వెనుదిరిగి చూడలేదు. వాళ్లన్న క్షుద్ర విద్యలు, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా ప్రదర్శనలిస్తున్నాం.


– జవ్వాది వరాహలక్ష్మీ నరసింహాచారి, తండ్రి, ఇంద్రజాలికుడు, విజయనగరం


● మ్యాజిక్ చారి కుటుంబం..


● మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకుని విజిటింగ్ కార్డు ఇచ్చిన క్షణం

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం
8-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా... మీ సమాధానాలన్నీ చదువుతుంటాను. కొన్ని బాగా అనిపిస్తాయి కానీ, కొన్ని అస్సలు నచ్చవు. ఎందుకంటే అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకున్న తరువాత... అమ్మాయి వాళ్ల ఇంట్లో ఒప్పుకోక అబ్బాయిని వదిలేస్తే... పేరెంట్స్ పైన ప్రేమ అంటారు. అదే కారణంతో అబ్బాయి, అమ్మాయిని వదిలేస్తే.. మోసగాడు అంటున్నారు. ఇదేం న్యాయం అన్నయ్యా? నేను ఒక అమ్మాయిని ప్రేమించాను. తను కూడా నన్ను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించింది. ఇద్దరింట్లోనూ ఒప్పుకోరు. తను నా కోసం 'అందరినీ వదిలి వస్తాను' అంటోంది. కానీ, తనను వాళ్ల ఫ్యామిలీ నుంచి దూరం చెయ్యడం ఇష్టం లేదు. అలా అని తను లేకుండా బతకాలేను. ఏం చెయ్యాలి అన్నయ్యా?

- తేజ

నువ్వు మనిషివి కాదు.....

'సార్... ఎంత మాట అన్నారు సార్..! ఒకర్ని పట్టుకుని మనిషివి కావు అంటే.. ఎంత ఫీల్ అయిపోతాడు సార్..!? మీరు అసలు లవ్ డాక్టర్ బోర్డ్ తీసేసి.. భౌ డాక్టర్ అని పెట్టుకుంటే బెటర్ సార్..! ఇలా అబ్బాయిల మీద కొరకడానికి పరిగెడితే.. ఎలా సార్..????'

నువ్వు మనిషివి కాదు తేజా...

'అదిగో మళ్లీ అదే ధోరణి.. ఏంటి సార్ మీరు... మారరా సార్??'

నువ్వు మనిషివి కాదు తేజా... నువ్వు...

'సార్!!!!!!'

నన్ను చెప్పనియ్యి నీలాంబరీ....! తేజా నువ్వు మనిషివి కాదు.. మనిషి రూపంలో ఉన్న మహానుభావుడివి. శభాష్.. అమ్మాయి కోసం, అమ్మాయి మమ్మీడాడీ కోసం.. లవ్‌ని త్యాగం చేసే నిన్ను... ''లవర్స్ ఆఫ్ ఇండియా'' లిస్ట్‌లో టాప్‌లో ఉంచాలి!!

'సార్.. తేజాను మెచ్చుకుని అమ్మాయికి దూరం చేసే మీ ప్లాన్ వర్కౌట్ కాదు. మీ కుట్ర తేజాకు అర్థమైపోతుంది. తేజా మీ ట్రాప్‌లో పడడు సార్..!'

మంచివాడు అని చెబుతున్నా. దాన్ని ట్రాప్ అనుకుంటే ఎలా...? ఎంత మంచి మనస్సు ఉంటే అమ్మాయి గురించి ఆలోచిస్తాడు. అయినా పేరెంట్స్‌ని పోగొట్టుకుని.. తేజ దొరికినా... అమ్మాయి హ్యాపీగా ఉండగలదా..??? అందుకే పేరెంట్స్‌ని కన్విన్స్ చేసి.. మంచి ఉద్యోగాలు సంపాదించుకుని.. ఆ తరువాత సెటిల్ అయితే అందరూ సంతోషంగా ఉంటారు.

'ఏంటో సార్ మీ మాటలు వింటుంటే.. నేను కూడా కన్విన్స్ అయిపోతున్నాను. ఇంద అరటి పండు!'

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

సంచలనం

ఒక మంచి ఐఏఎస్ ఆఫీసర్ స్ట్రిక్ట్‌గా పనిచేస్తే వ్యవస్థలో చలనం వస్తుందో లేదో తెలియదు కానీ ఆమె పదవిలో చలనం వచ్చే అవకాశం ఎక్కువ. సంచలనం కోసం కాకుండా సత్యం కోసం యుద్ధం చేస్తే మంచి చలనం ఉంటుంది. సంచలనం. షి ఈజ్ యాన్ ఆఫీసర్ ఫర్ గుడ్ ఛేంజ్.



అలప్పుళ జిల్లా సంచలనం... టీవీ అనుపమ ఐఏఎస్!

2017, కేరళలోని అలప్పుళ జిల్లా.

మార్తండమ్ చెరువును పరిశీలిస్తున్నారు కలెక్టర్. ఓ కట్టడం కోసం ఆ చెరువు సగం లెవెల్ చేసి ఉంది. నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయి. ఆ చెరువును ఆనుకునే ఇంకోవైపు వరిపొలాలున్నాయి. వాటిలో సగం కూడా లెవెల్ చేసి ఉన్నాయి.

'ఇక్కడేం కడ్తున్నారు?' అడిగారు సబార్డినేట్స్‌ను.

'పార్కింగ్ లాట్ మేమ్' చెప్పారు.

'ఊ' అంటూ దీర్ఘంగా నిట్టూర్చారు కలెక్టర్ వెనక్కి తిరుగుతూ.

ఆమె కారులో కూర్చొని అక్కడి నుంచి కదిలాక చెప్పడం మొదలుపెట్టాడు సంబంధింత సబార్డినేట్. 'మేమ్.. ఇందులో మంత్రిగారి హస్తముంది. ప్రతిపక్షాల నుంచి చాలా కంప్లయింట్స్ వచ్చినా మేనేజ్ చేసుకున్నారు. పైగా నిరూపిస్తే మినిస్టర్‌గిరే కాదు ఎమ్మెల్యేగిరీకీ రాజీనామా చేస్తాను అని సవాల్ కూడా చేశారు' చెప్పాడు.

ఆ చెరువు కబ్జా ఫైల్‌లోనే తల పెట్టిన కలెక్టర్ పేజీ తిప్పుతూ 'ఈ కట్టడం లేనప్పటి చెరువు ఫొటోలు ఏమైనా మనకు దొరకొచ్చా?' అడిగారు.

'ప్రయత్నించొచ్చు మేమ్' తెలిపాడు.

'అయితే ప్రయత్నం మొదలుపెట్టండి' ఫైల్ మూసేస్తూ చెప్పారు కలెక్టర్.

ఆ ప్రయత్నం ఫలించింది. చెరువుకు చెందిన శాటిలైట్ ఫొటోలు వచ్చాయి. అంతకుముందు చెరువు ఎలా ఉందో ప్రస్తుతం ఎలా ఉందో స్పష్టంగా తెలుస్తోంది వాటి ద్వారా. వాటిని పెట్టి పూర్తి వివరాలతో నివేదిక తయారు చేసి రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి సమర్పించారు కలెక్టర్. దీని మీద సంబంధిత వ్యక్తి కోర్టుకు కూడా వెళ్లాడు. అతని పిటీషన్‌ను కొట్టిపారేసింది కోర్టు. కేరళ ప్రభుత్వ 'ప్యాడీ అండ్ వెట్‌ల్యాండ్ యాక్ట్' కింద నేరం రుజువైంది. అతను చెప్పినట్టు రాజీనామా చేయలేదు. కాని ఆ జిల్లా కలెక్టర్ ధైర్యసాహసాలు, నిబద్ధత దేశమంతా మారుమోగాయి.

ఆమె.. టీవీ అనుపమ. అతను.. కేరళ రవాణాశాఖ మంత్రి థామస్ చాందీ!

అనుపమ ఈ యాక్షన్‌తో కేరళ కేబినేట్ వణికిపోయింది. ఆమెను అలప్పుళ జిల్లా కలెక్టర్‌గా ఏరికోరి నియమించింది స్వయానా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌నే అయినా నియమనిబంధనలను అతిక్రమిస్తే మంత్రిని కూడా ఉపేక్షించేది లేదని నిరూపించారు ఆమె.

స్వప్నం సాకారమైన వేళ

కేరళలోని మలప్పురం జిల్లా 'పొన్నని 'అనుపమ సొంతూరు. తండ్రి కేకే సుబ్రహ్మణ్యన్. సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ 2002లో మరణించాడు. తల్లి టీవీ రమణి ఎండోమెంట్ శాఖ ఉద్యోగి. అనుపమే పెద్ద కూతురు. చిన్నప్పటి నుంచి చదువులో చురుకే. నైన్త్‌క్లాస్ లోనే నిర్ణయించుకుంది ఐఏఎస్ కావాలని. తండ్రి చనిపోయేనాటికి అనుపమ టెన్త్‌లో ఉంది. నాన్న పోయిన పుట్టెడు దుఃఖాన్ని కడుపులో దాచుకొని పబ్లిక్ పరీక్షలు రాసింది. స్టేట్‌లో పదమూడవ ర్యాంక్ సంపాదించింది. ఇంటర్‌లో మూడో ర్యాంక్! బిట్స్ పిలానీ గోవా క్యాంపస్‌లో బీటెక్ చేసింది. ఓవైపు ఇంజనీరింగ్ చదువుతూనే సివిల్స్‌కి ప్రిపేరవసాగింది. ఫస్ట్ అటెంప్ట్‌లోనే (2010) ఆల్ ఇండియా నాల్గవ ర్యాంక్‌తో సివిల్స్‌లో విజయం పొందింది.

ఆహారం భద్రం

2015లో ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌గా చార్జ్ తీసుకున్నారు అనుపమ. ఏ పనిచేసినా అందులోని లొసుగుల్ని సవరించందే నిద్రపోరు. వృత్తి అంటే అంత అంకితభావం. ఐఏఎస్‌గా నియామకం పొందిన క్షణాన్నే ప్రమాణం చేశారు కర్తవ్యనిర్వహణే ప్రాణం అని. ఆ నైజాన్నే ఫుడ్‌సేఫ్టీ కమిషనర్‌గా ఉన్నప్పుడూ చూపించారు. పేరున్న చాలా ఫుడ్ బ్రాండ్స్ కల్తీలు, మితిమీరిన శాతంలో క్రిమిసంహారక మందులను వాడి ఆహారపదార్థాలను మార్కెట్‌లో అమ్ముతున్నాయి. ఈ విషయం ఆమె దృష్టికి వచ్చింది. శాంపిల్స్ తెప్పించారు. పరీక్షకు పంపించారు. నిజమని తేలింది. ప్రతి వస్తువు కల్తీనే. పరిమితికి మించి 300 శాతం పెస్టిసైడ్స్. హతాశురాలయ్యారు. వెంటనే గోడౌన్స్ మీద దాడులు చేశారు. కేస్ కోర్ట్‌దాకా వెళ్లింది. రుజువులుగా కూరగాయలు, పండ్ల శాంపిల్స్‌ను కోర్టు ముందుంచారు. పెద్ద పెద్ద బ్రాండ్ల మోసాలను కోర్టు ప్రత్యక్షంగా తెలుసుకుంది. డీలర్ల అరెస్ట్‌కు ఆర్డర్ వేసింది. అనుపమ తీసుకున్న స్టెప్ ఇంతటితో ఆగలేదు. పౌరులకు ఒక విజ్ఞాపన చేశారు. ఎవరిళ్లల్లో (వాకిలి, డాబా, బాల్కనీ ఇలా) వాళ్లు, చేలల్లో, చెలకల్లో సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు పండించమనీ, విత్తనాలను తాము అందిస్తామని. అప్పటిదాకా కల్తీ నిండిన కడుపులను ప్రక్షాళన చేయడానికి ఇది మంచి ఆఫర్ అని కేరళ రాష్ట్ర ప్రజలూ ఒకొక్కరే నెమ్మదిగా ఇళ్లల్లో ఎంత జాగా ఉంటే అంతలో కూరగాయల పంట వేసుకోవడం మొదలుపెట్టారు. ప్రజల స్పందన రాష్ట్రప్రభుత్వాన్నీ ఆలోచనలో పడేసింది. వాళ్లకు ఏదైనా సహాయం అందించాలనుకుంది. దాంతో ఉచితంగా డ్రిప్‌ఇరిగేషన్, బయోగ్యాస్ ప్లాంట్ సౌకర్యాలను కల్పించింది. సబ్సిడీలు అందించింది. ఇది ఎంత ప్రభావం చూపిందంటే అప్పటిదాకా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి చేసుకుంటున్న కూరగాయల దిగుమతులను గణనీయంగా తగ్గించుకునేంతగా. దటీజ్ అనుపమ ఐఏఎస్!





విధి నిర్వహణలో టీవీ అనుపమ...

'ఇదంతా నా ఘనతగా మీడియా ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారాలు, ఆర్భాటాలు నాకిష్టం ఉండదు. పైగా ఇందులో నేను చేసిందీ ఏమీ లేదు. కల్తీ జరుగుతోందని, పెస్టిసైడ్స్ వాడకం ప్రాణాంతకంగా మారిందని ప్రజలకు తెలిసింది. సొంతంగా సేంద్రీయ వ్యాపారం చేసుకుంటే ప్రభుత్వ పరంగా నేను ఈ సహాయం చేయగలనని చెప్పాను. ప్రజలు అర్థం చేసుకున్నారు. ప్రభుత్వమూ ముందుకు వచ్చింది. కొనసాగుతోంది. అంతే' అంటూ సింపుల్‌గా సెలవిస్తారు ఆమె.

వచ్చిన కొత్తలోనే...


సంచలనం కోసం కాదు సత్యం కోసం పోరాడాలి అనేది అనుపమ తత్వం. అన్యాయాన్ని మనం సహించకపోతే న్యాయం తానంతట తానే బతుకుంది అనేది ఆమె నమ్మిన నిజం. అందుకే వ్యక్తిగత జీవితంలోనూ పాటిస్తారు నిక్కచ్చిగా. 2014లో జరిగిన ఓ సంఘటనే ఇందుకు ఉదాహరణ. కుటుంబంతో కలిసి ఇంకో ఇంట్లోకి మారాల్సి వచ్చింది ఆమె. ఇచ్చిన గడువులో సామాన్లను తీసుకోలేకపోయారు అనుపమ. దాంతో కేవలం ఆమెను వేధించే ఉద్దేశంతోనే 'నొక్కుకూలీ' (సామాన్లను కాపాలా కాసినందుకు, ప్రైవేట్ లేబర్‌తో ఆ సామాన్లను లోడ్ లేదా అన్‌లోడ్ చేయించినందుకు యూనియ్‌హెడ్‌లోడ్ వర్కర్స్‌కు అదనంగా చెల్లించే డబ్బు)ఇవ్వాలని సీఐటీయూ కన్వీనర్ బి.మురళి డిమాండ్ చేశారు. ఇది అన్యాయమని వాదించారు అనుపమ. వాషింగ్‌మెషీన్‌ను అలాగే ఉంచేసుకొని అదనపు కూలీ ఇస్తేనే దాన్ని ఇస్తామని చెప్పి వాళ్లింటి ముందున్న గోడమీద తన ఫోన్ నంబర్ రాసి డబ్బులు ఎప్పుడిస్తారో ఆ నంబర్‌కి కాల్ చేయమని చెప్పి మరీ వెళ్లాడు మురళి. అక్కడితో ఆగకుండా ఆ కుటుంబాన్ని వేధించడం మొదలుపెట్టాడు. పోలీస్‌కంప్లయింట్ ఇచ్చి మురళిని అరెస్ట్ చేయించారు అనుపమ. పక్షం రోజులు రిమాండ్‌లో ఉన్నాడు మురళి. తనను నియమించిన చీఫ్‌మినిస్టర్‌కైనా .. మురళి లాంటి వాళ్లకైనా.. తానెవరికీ భయపడననీ నిరూపించారామె. దటీజ్ అనుపమ.

అందుకే ఆమె ప్రమేయం లేకుండానే ఆమె ఓ సంచలనం అయింది. నచ్చకపోయినా ఆమె పని తీరు ప్రాచుర్యం పొందుతోంది. ఇలాంటప్పుడే అనిపిస్తుంది పబ్లిసిటీ మంచిదే... ఇతరులకు ఇన్‌స్పైరింగ్‌గా!

- శరాది

ఈ వారం YouTube హిట్స్

టచ్ చేసి చూడు



'రాజా ది గ్రేట్' హిట్ తర్వాత రవితేజా హుషారుగా ఉన్నాడు. అతడి రాబోయే సినిమా 'టచ్ చేసి చూడు' టీజర్ కూడా ఇంకా హుషారు కలిగిస్తోంది. ఈ టీజర్ పోస్టయిన రెండ్రోజుల్లోనే దాదాపు 25 లక్షల హిట్స్‌ను నమోదు చేసింది. ఏదో అల్లర్లు జరుగుతున్న చోట, గుర్రాల మీద ఉన్న పోలీసులు వారిని అదుపు చేయడంలో విఫలమవుతూ ఉండగా రవితేజా ఒక మనిషిని గాల్లోకి ఎగురవేసి అల్లర్లు చేస్తున్న దుండగులపై విసిరేయడం ఈ టీజర్‌లో కనిపిస్తుంది. ఆగ్రహంగా సాహసంగా లెక్కలేనట్టుగా కనిపిస్తున్న రవితేజ లుక్స్ కూడా బాగున్నాయి. నల్లమోతు శ్రీనివాస్, వల్లభనేని వంశీ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు విక్రమ్ సిరికొండ దర్శకుడు. రాశీ ఖన్నా, సీరత్ కపూర్ తమ అందచందాలతో ఆకట్టుకోనున్నారు.

నిడివి : 31 సె.,
హిట్స్ : 25,35,578

ఇంటర్ కేస్ట్ మేరేజ్



భారతదేశంలో కులాల మధ్య పెళ్లిళ్ల విషయంలో వచ్చే అభ్యంతరాలను సబ్జెక్ట్స్‌కు అప్లై చేసి వినోదాత్మకంగా చెప్పిన షార్ట్ ఫిల్మ్ 'ఇంటర్ కేస్ట్ మేరేజ్'. పోస్ట్ అయిన రెండు రోజుల్లోనే దాదాపు రెండున్నర లక్షల హిట్స్‌కు చేరుకుంది. ఇందులో అబ్బాయి పేరు ఫిజిక్స్. అమ్మాయి పేరు బయాలజీ. అబ్బాయి తండ్రి పేరు మేథ్స్. తల్లి పేరు తెలుగు. ప్రేమించుకున్న అబ్బాయి, అమ్మాయి పెళ్లి చేసుకోవడానికి అబ్బాయి తండ్రి దగ్గరకు వెళతారు. ఫిజిక్స్‌కు, బయాలజీకి ఎప్పుడూ లంకె కుదరవనీ రెండూ వేరు వేరు క్యాస్ట్స్ అని అభ్యంతరం చెబుతాడు తండ్రి. పైగా 'గ్రావిటీకి వ్యతిరేకం ఏమిటి?' అని అమ్మాయిని ప్రశ్నిస్తాడు. 'బోయపాటి' అని సమాధానం చెబుతుంది అమ్మాయి. అలాంటి అమ్మాయిని నిరాకరించాల్సిందే అంటాడు తండ్రి. కాని ఏ మనిషి జీవితంలో అయినా 'బయాలజీ' ఉంటుందని స్నేహితుడు సర్దిచెప్పేసరికి తుట్టతుదకు అంగీకరిస్తాడు. సైన్స్ జార్గాన్‌ను వాడి హాస్యం తెప్పించడానికి ప్రయత్నించిన ఈ షార్ట్ ఫిల్మ్‌కు డైరెక్టర్ మసాలా సందీప్. సరదాగా చూడదగ్గ షార్ట్‌ఫిల్మ్ ఇది. 'చాయ్ బిస్కెట్' సమర్పణ.

నిడివి : 11 ని. 14 సె.,
హిట్స్ : 2,74,576

పాశుర ప్రభాతం

24వ పాశురం

అన్ఱు ఇవ్వులగు మళన్దాయ్! అడిపోత్తి,
శెన్ఱంగు తెన్నిలంగై శెత్తాయ్! తిఱల్‌పోత్తి,
పొన్ఱ చ్చగడ ముతైత్తాయ్! పుకళ్ పోత్తి,
కన్ఱు కుణిలా వెఱిన్దాయ్! కళల్ పోత్తి,
కున్ఱు కుడైయా వెడుత్తాయ్! గుణంపోత్తి,
వెన్ఱు పగై కెడుక్కుమ్ నిన్‌కైయిల్ వేల్ పోత్తి,
ఎన్ఱెన్ఱున్ శేవగమే యేత్తి ప్పఱై కొళ్‌వాన్,
ఇన్ఱు యామ్ వన్దోం ఇరంగేలో రెమ్బావాయ్.



భావం

ఆనాడు బలిచక్రవర్తి దేవతలను పీడించి వారి రాజ్యమును ఆక్రమించగా, బలిచక్రవర్తినుండి మూడడుగుల భూమిని దానంగా గ్రహించి లోకమునంతను పాదములతో కొలిచిన మీ పాదములకు మంగళము. సీతాదేవిని ఎత్తుకొనిపోయిన రావణుని రాజధానియైన లంకకు చేరి అతని భవనాలను, కోటలను ధ్వంసం చేసి, ఆ తరువాత రాక్షసులను చెండాడిన మీ బాహుబలమునకు మంగళము. బాలకృష్ణుని రక్షణ కొరకు ఏర్పరచిన బండిలో ఆవేశించిన రాక్షసుని వధించుటకై కాలు చాచి బండిని తన్నినట్టి మీ అసమానమైన కీర్తికి మంగళము. ఓ కృష్ణా నీకు చెడు చేయుటకై దూడపై ఆవహించిన రాక్షసుని (వత్సాసురుని), వెలగచెట్టుపై ఆవహించిన రాక్షసుని (కపిత్థాసురుని) చంపుటకై ఒడిసెలను విసిరినట్లుగా వత్సాసురుని, కపిత్థాసురుని విసురునపుడు ముందు వెనుకలకు వంచి ఉంచిన నీ రెండు దివ్య పాదములకు మంగళము. తనకు యాగము లేకుండా చేసిన కారణాన్ని మనసులో ఉంచుకొని ఇంద్రుడు రాళ్లవాన కురిపించుచుండగా, గోవులను, గోపాలకులను కాపాడుటకై గోవర్ధన పర్వతమును గొడుగుగా ఎత్తి పట్టుకున్నట్టి ఓ కృష్ణా! నీ వాత్సల్యానికి మంగళము. శత్రువులను సమూలంగా అణచివేసి, విజయమును సాధించి పెట్టే నీ చేతిలోని వేలాయుధమునకు మంగళము. ఈ విధముగా నీ వీర చరితములను నోరారా కీర్తించి, మా నోమునకు కావలసిన పర అనే సాధనమును పొందుటకు వచ్చినాము, మమ్ములను అనుగ్రహింపుము.

- ఎస్. శ్రీప్రియ

కాసుకో సుడోకు

			6		2			7
			5	1		2	3	6
				9	8			4
					5	6	9	
9	8	5				3	7	1
	6	7	3					
2			9	6				
8	3	9		2	1			
4			8		3			

నిన్నటి జవాబు

1	4	2	5	3	7	8	6	9
8	6	9	1	2	4	7	5	3
7	5	3	8	6	9	1	2	4
9	3	8	4	5	2	6	1	7
6	7	1	9	8	3	5	4	2
5	2	4	6	7	1	3	9	8
3	8	5	2	4	6	9	7	1
2	1	7	3	9	5	4	8	6
4	9	6	7	1	8	2	3	5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

కిడ్నీ కౌన్సెలింగ్

పెయిన్‌కిల్లర్స్‌తో కిడ్నీకి ప్రమాదమా?



నా వయసు 62 ఏళ్లు. విపరీతమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాను. తట్టుకోలేక చాలాకాలం నుంచి నొప్పి నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్) వాడుతున్నాను. దీనివల్ల కిడ్నీలు దెబ్బతినే అవకాశం ఉందా?

- కృష్ణారావు, విజయవాడ

పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా వాడినట్లయితే కిడ్నీ దెబ్బతినే అవకాశం లేకపోలేదు. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా నేరుగా మెడికల్ షాప్ నుంచి పెయిన్ కిల్లర్స్ తీసుకొని వాడడం మంచిది కాదు. కొన్ని పెయిన్ కిల్లర్స్‌లో రెండు లేదా మూడు రకాల మందులు కలిపి ఉంటాయి. ఇవి కిడ్నీకి చాలా హాని చేస్తాయి. పెయిన్ కిల్లర్స్ కాకుండా ఫిజియోథెరపీ వంటి ఇతర పద్ధతులతో నొప్పి తగ్గించుకోడానికి ప్రయత్నించండి. రోజూ నీళ్లు ఎక్కువగా తాగండి. మీ భుజం నొప్పి తగ్గడం కోసం ఒకసారి మీకు దగ్గర్లోని డాక్టర్‌ను సంప్రదించండి. మీ అంతట మీరే మందులు వాడకండి.

ఫ్యామిలీ డాక్టర్

బీపీ చాలా ఎక్కువగా ఉంది... కిడ్నీ సమస్య వస్తుందా?

నా వయసు 32 ఏళ్లు. నాకు ఏ విధమైన ఇబ్బందులూ లేవు. కానీ జ్వరం వచ్చినప్పుడు ఒకసారి డాక్టర్‌కు చూపించుకుంటే బీపీ 170 / 120 అని చెప్పి, మందులు వాడాలన్నారు. మందులు వాడకపోతే భవిష్యత్తులో కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉందా?

- నవీన్‌కుమార్, మహబూబాబాద్

ఈ వయసులో ఏ కారణం లేకుండా బీపీ రావడం చాలా అరుదు. ముప్ఫై ఏళ్లలోపు బీపీ ఇంత ఎక్కువగా ఉన్నప్పుడు కిడ్నీ సమస్య ఏమైనా ఉందేమోనని చూడాలి. మీరు ముందుగా యూరిన్ టెస్ట్ అల్ట్రా సౌండ్ అబ్డామిన్, క్రియాటినిన్‌తో పాటు కొన్ని ఇతర పరీక్షలు చేయించుకోండి. ఏ లక్షణాలూ లేనప్పటికీ బీపీ నియంత్రణలో ఉండటానికి మందులు వాడాలి. లేకపోతే భవిష్యత్తులో కిడ్నీ దెబ్బతినే అవకాశం ఉంది. మందులు వాడటమే కాకుండా, ఆహారంలో ఉప్పు చాలా తగ్గించడం వంటి జీవనశైలికి సంబంధించిన జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. రోజూ క్రమం తప్పకుండా ఒక గంటకు తగ్గకుండా వాకింగ్ చేయాలి. బరువు ఎక్కువగా ఉన్నట్లయితే, మీ ఎత్తుకు తగినట్లుగా దాన్ని నియంత్రించుకోవాలి. పొగతాగే అలవాటు ఉంటే తప్పనిసరిగా మానేయాలి.



ఇంట్లోనూ డయాలసిస్ చేసుకోవచ్చు...



నా వయసు 68 ఏళ్లు. షుగర్‌వల్ల రెండు కిడ్నీలూ పనిచేయడం లేదు. రెండేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. మూడు సార్లు ఫిస్టులా ఆపరేషన్ అయ్యింది. డయాలసిస్ చేయించుకుంటున్న సమయంలో చలి, వణుకు వస్తున్నాయి. డయాలసిస్ కాకుండా ఇంకేమైనా పద్ధతులున్నాయా?

- శ్యాంప్రసాద్, హైదరాబాద్

ఇప్పుడు వాడుతున్న క్యాథెటర్ వల్ల ఇన్ఫెక్షన్ వచ్చి ఉంటుంది. మొదట ఈ ఇన్ఫెక్షన్ తగ్గడానికి తగ్గడానికి మందులు వాడాల్సి ఉంటుంది. ఆ తర్వాత పర్మ్ క్యాథ్ ద్వారా డయాలసిస్ చేయించుకోవడం మంచిది. ఇలా ఫిస్టులా సమస్య ఉన్నప్పుడు హోమ్ డయాలసిస్ (కంటిన్యువస్ ఆంబుల్యేటరీ పెరిటోనియల్ డయాలసిస్–సీఏపీడీ) చేయించుకోవడం మేలు. సీఏపీడీ వల్ల ఇబ్బందులు తక్కువగా ఉంటాయి. ఇంట్లోనే ఉండి, ఈ డయాలసిస్ చేసుకోవచ్చు. దీనివల్ల మీ వృత్తినిర్వహణకూ ఇలాంటి ఇబ్బందీ ఉండదు. క్వాలిటీ ఆఫ్ లైఫ్ బాగుంటుంది. హోమ్ డయాలసిస్‌కు అయ్యే ఖర్చు హాస్పిటల్స్ డయాలసిస్ కంటే తక్కువ. కాబట్టి ఒకసారి మీ నెఫ్రాలజిస్ట్‌ను సంప్రదించి ఈ వివరాలు తెలుసుకోండి.



డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
సోమవారం, 8-1-2018

పరి పరిశోధన

సర్వర్ రోబోలు వచ్చేస్తున్నాయి!

రోబోలతో ఉద్యోగాలు పోతాయి అంటే ఏమో అనుకున్నాం. కానీ వరస చూస్తూ ఇది నిజమే అనిపిస్తోంది. ఫొటోల్లో కనిపిస్తున్న రోబలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. కొరియా కంపెనీ ఎల్‌జీ తయారు చేసింది వీటిని. మొత్తం మూడు రకాలున్నాయి. ఒకటి ఎయిర్‌పోర్టులో ప్రయాణీకులకు సాయపడేదైతే... ఇంకోటి హోటళ్లలను మన ఆర్డర్లకు తగ్గట్టుగా ఆహారాన్ని టేబుళ్లపైకి తీసుకొచ్చేది. ముచ్చటగా మూడోది షాపింగ్ మాల్స్‌లో సరుకులు మోసుకొచ్చేందుకు పనికొస్తుందని చెబు



తోంది ఎల్‌జీ. దీని పేరు 'క్లో –ఈ'. హోటళ్లు సిబ్బందిని తగ్గించుకునేందుకు... ఎయిర్‌పోర్టుల్లో సెక్యూరిటీ సమస్యలను తక్కువ చేసేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని కంపెనీ చెబుతోంది. హోటళ్లలో సర్వర్లకు బదులుగా క్లో –ఈ లను వాడితే అలుపన్నది లేకుండా 24 గంటలూ పనిచేస్తాయి. అలాగే ఎయిర్‌పోర్టుల్లో పని చేసే వాళ్లపై నిత్యం సెర్చ్ చేయాల్సిన అవసరమూ తగ్గుతుందని.. రోబోలైతే ఎంచక్కా లోపలే అన్ని పనులూ చక్కబెట్టగలవని సంస్థ వివరిస్తోంది. చాలా హోటళ్లలో ఆర్డర్లు కూడా కంప్యూటర్ల ఆధారంగా జరిగిపోతూండటం వల్ల క్లో –ఈ వంట గది నుంచి ఆహారాన్ని నేరుగా వినియోగదారుడి టేబుల్‌పైకి చేర్చేస్తుంది. ఇక షాపింగ్ మాల్స్‌లో మనం ఎంత వేగంగా షాపింగ్ ముగించినా.. బిల్లింగ్ దగ్గర విపరీతమైన జాప్యం జరుగుతూంటుంది. అదే క్లో–ఈ దగ్గరుంటే.. మనం సెలెక్ట్ చేసుకునే ప్రతి వస్తువును అక్కడికక్కడే బార్‌కోడ్ స్కానర్ సాయంతో లెక్కలు వేసేసి ఉంచుతుంది. ఫలితంగా కౌంటర్ వద్ద నేరుగా బిల్లు కట్టేస్తే సరి అన్న మాట!

కేన్సర్ చికిత్సకు వైరస్ అస్త్రం..


కేన్సర్‌కు మెరుగైన చికిత్సకు పరిశోధనలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. తాజాగా యునైటెడ్ కింగ్‌డమ్ శాస్త్రవేత్తలు కొందరు మెదడులోని కేన్సర్ కణితులపై దాడి చేసేందుకు వైరస్‌ను అస్త్రంగా చేసుకున్నారు. అంతటితో ఆగకుండా ఈ వైరస్ కేన్సర్ కణాలపై పోరాడేలా రోగ నిరోధక వ్యసవ్థను చైతన్యవంతం చేస్తాయి కూడా. ఊహూ.. వైరస్‌ను వాడినంతమాత్రాన దీనివల్ల మనకేదో హాని జరుగుతుందని మాత్రం అనుకోనక్కరలేదు. ఎందుకంటే రియో వైరస్ అని పిలుస్తున్న ఈ వైరస్ సహజమైంది. పైగా నిరపాయకరమైందని ఇప్పటికే రుజువైంది. కేన్సర్ కణాల్లోకి ఇది సులువుగా చొచ్చుకుపోతుందని ఇప్పటికే తెలుసు. ఈ నేపథ్యంలో యూకే శాస్త్రవేత్తలు మెదడు కేన్సర్‌తో బాధ



పడుతున్న కొంతమందికి ఈ రియోవైరస్‌ను ఎక్కించారు. శస్త్రచికిత్స ద్వారా వారి కణితులను తొలగించేందుకు ముందే ఈ పనిచేయడం వల్ల.. శాస్త్రవేత్తలకు ఈ కణితులను పరిశీలించే అవకాశమేర్పడింది. అన్ని కణాల్లోనూ ఈ వైరస్ ఉన్నట్లు స్పష్టం కావడంతో వైరస్‌ల ద్వారా మెదడు కణితుల్లోకి కూడా మందులు చేర్చవచ్చునని అంచనా. అంతేకాకుండా ఈ వైరస్ కేన్సర్ కణాల్లోకి మాత్రమే చేరగలదు కాబట్టి రోగ నిరోధక వ్యవస్థ వాటిని గుర్తించి నాశనం చేస్తాయని.. సాధారణ పరిస్థితుల్లో ఇది సాధ్యం కాదని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. కేన్సర్‌కు ప్రస్తుతం అందిస్తున్న కీమో, రేడియో థెరపీలకు అనుబంధంగా ఈ రియోవైరస్‌ను ఎక్కించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని.. శరీరంలో మిగిలి ఉన్న ఒకటిఅరా కేన్సర్ కణాలను కూడా మట్టుబెట్టవచ్చునని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

కొత్త బ్యాటరీతో బోలెడంత శక్తి...

ఈ కాలంలో బ్యాటరీల్లో ఛార్జింగ్ ఉండటం ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాకపోతే స్మార్ట్‌ఫోన్లతోపాటు విద్యుత్తుతో నడిచే కార్లలో ఎక్కువమంది వాడే లిథియం అయాన్ బ్యాటరీల సామర్థ్యం అంతంత మాత్రమే. ప్రత్యామ్నాయం ఏదీ లేని కారణంగా ఇప్పటికీ వాటినే వాడుతున్నాం. అయితే అమెరికాలోని ఆర్గాన్ నేషనల్



లేబొరేటరీ శాస్త్రవేత్తల మాటలే నిజమైతే త్వరలోనే ఈ పరిస్థితి మారిపోనుంది. లిథియం అయాన్ స్థానంలో లిథియం ఐరన్ ఆక్సైడ్లను వాడటం ద్వారా ఎక్కువ మోతాదుతోపాటు ఎక్కువ సమయం విద్యుత్తును నిల్వ చేసుకోగల బ్యాటరీలను తయారు చేయవచ్చునని వీరు నిరూపించారు. నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో కలిసి చేసిన పరిశోధనల్లో వీరు నేరుగా నమూనా బ్యాటరీలను తయారు చేయలేదు. కంప్యూటర్ సాయంతో లిథియం, ఐరన్ అక్సైడ్‌ల నిష్పత్తిపై సిములేషన్లు నడిపించారు. బ్యాటరీల్లో ఐరన్ వాడేందుకు ఇప్పటివరకూ జరిగిన అనేక ప్రయోగాలు విఫలమవడం దీనికి కారణం. మొత్తమ్మీద తగిన నిష్పత్తితో లిథియం ఐరన్ ఆక్సైడ్ బ్యాటరీలను సిద్ధం చేయగలిగారు. ఇనుము చాలా చౌకగా లభిస్తుందని కాబట్టి... బ్యాటరీల తయారీ కూడా పెద్ద ఖర్చుకాదని అంచనా. ఈ కొత్త బ్యాటరీలు సాధారణ స్మార్ట్‌ఫోన్ల బ్యాటరీల కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ కాలం విద్యుత్తును సరఫరా చేయగలవంటే పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమైపోతుంది. ఇక వీటిని ఎలక్ట్రిక్ కార్లలో వాడటం ద్వారా వాహనాల మైలేజీ బోలెడంత పెరుగుతుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త వోల్వెర్‌టర్ తెలిపారు.

డాక్టర్‌కి డాన్‌తో లింక్ ఏంటి?



● నాగార్జున



● నాని

ఒకరు హిట్‌లిస్ట్ ప్రిపేర్ చేస్తారు. మరొకరు మెడిసిన్ లిస్ట్ రాస్తారు. ఒకరు గన్‌తో వర్క్ చేస్తారు. మరొకరు స్టెతస్కోప్ లేనిదే వర్క్ స్టార్ట్ చేయరు. ఎందుకంటే... ఒకరు డాన్. మరొకరు డాక్టర్. డాన్ ఏమో నాగార్జున. డాక్టర్ ఎవరంటే నాని. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నాగార్జున, నాని ఓ మల్టీస్టారర్ సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే. ఇందులో డాన్ పాత్రలో నాగ్ కనిపిస్తే.. డాక్టర్ పాత్రలో నాని కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి.. ఈ డాన్‌కి, డాక్టర్‌కి లింక్ ఏంటీ? అంటే.. అది మాత్రం సస్పెన్స్. ఈ సినిమాను వచ్చే నెలలో సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయట.

పద్మావత్ ఎఫెక్ట్ ఎవరిపై?



● అయ్యారీ పోస్టర్



● అక్షయ్ కుమార్



● అనుష్కా శర్మ



● దీపిక పదుకోన్

పద్మావతి... కాదు.. కాదు.. ఇప్పుడు 'పద్మావత్'. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో దీపికా పదుకోన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ నటించిన చిత్రం 'పద్మావత్'. సెన్సార్ కంప్లీట్ అయిన ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రజెంట్ బాలీవుడ్‌లో హాట్ టాపిక్. ఈ నెల 25 లేదా 26న రిలీజ్ అవుతుందని కొందరు, ఫిబ్రవరి 9న రిలీజ్ అవుతుందని మరికొందరి వాదన. ఒకవేళ 'పద్మావత్' ఈ నెల 25 లేదా 26న అని చిత్రబృందం రిలీజ్ డేట్ ఎనౌన్స్ చేస్తే.. ఆల్రెడీ ఈ డేట్స్‌ను బుక్ చేసుకున్న 'ప్యాడ్‌మ్యాన్', 'అయ్యారీ' వాయిదా పడతాయా? అనే చర్చ జరుగుతోంది. ఆర్. బాల్కీ దర్శకత్వంలో అక్షయ్‌కుమార్, రాధికా ఆప్టే, సోనమ్‌కపూర్ నటించిన చిత్రం 'ప్యాడ్‌మ్యాన్'. నీరజ్ పాండే దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అయ్యారీ'. ఒకవేళ 'పద్మావత్'ని 25 లేక 26న కాకుండా వార్తల్లో ఉన్నట్లు ఫిబ్రవరి 9న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తే ఆల్రెడీ అదే తేదీన రిలీజ్ కానున్న అనుష్కా శర్మ 'పరీ' రిలీజ్ డేట్ భవితవ్యం ఏంటి? అనే చర్చ కూడా జరుగుతోంది. 'ప్యాడ్‌మ్యాన్', 'అయ్యారీ', 'పరీ'.. ఈ మూడు చిత్రాల విడుదల విషయంలో క్లారిటీ రావాలంటే 'పద్మావత్' బృందం అధికారికంగా రిలీజ్ డేట్‌ను ఎనౌన్స్ చేయాల్సిందే. ఇంతకు ముందు 'పద్మావత్' సినిమాను గతేడాది డిసెంబర్ 1న రిలీజ్ చేయాలనుకున్నప్పుడు '102 నాటౌట్, తుమ్హారీ సులు, తేరా ఇంతిజార్, ఫిరంగీ, ఫక్రీ రిటర్న్స్' చిత్రాల రిలీజ్ డేట్స్ విషయంలో మార్పులు జరిగాయి. మరి.. ఈసారి 'పద్మావత్' ఎఫెక్ట్ ఏయే సినిమాల మీద పడుతుందో చూడాలి.

నా నమ్మకం నిజమైంది

- అల్లు శిరీష్



● అల్లు శిరీష్, ఆనంద్, సీరత్ కపూర్

''నా కెరీర్‌లో 2017కి చాలా ప్రత్యేకత ఉంది. మలయాళ సినిమా '1971 బియాండ్ బోర్డర్'లో మోహన్‌లాల్‌గారితో నటించా. నా పాత్రకి మంచి స్పందన వచ్చింది. డిసెంబర్ 28న విడుదలైన 'ఒక్కక్షణం' నాకు మరచిపోలేని సినిమాగా నిలిచింది'' అని హీరో అల్లు శిరీష్ అన్నారు. అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, సీరత్ కపూర్ ముఖ్య తారలుగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో చక్రి చిగురుపాటి నిర్మించిన 'ఒక్కక్షణం' ఇటీవల విడుదలైంది. ఈ సందర్భంగా థ్యాంక్స్ మీట్ నిర్వహించారు. అల్లు శిరీష్ మాట్లాడుతూ– ''నా తొలి సినిమా 'గౌరవం' సరైన విజయం అందుకోలేదు. దాంతో కొత్తగా చేద్దామనే ఆలోచన తగ్గిపోయింది. 'కొత్తజంట, శ్రీరస్తు శుభమస్తు' వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ చేశాక మళ్లీ ధైర్యం తెచ్చుకుని, ఏదైనా కొత్తగా చేస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో 'ఒక్కక్షణం' చేశా. ఈ రోజు నా నమ్మకం నిజమైంది. సినిమా చూసినవారందరూ అభినందిస్తున్నారు. భవిష్యత్‌లోనూ మంచి సినిమాలు చేయాలనే కాన్ఫిడెన్స్ ఇచ్చిన అందరికీ థ్యాంక్స్'' అన్నారు. ''మాకు ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులు సహా అందరికీ థ్యాంక్స్. రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించిన నిర్మాతలకు, సహకారం అందించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు'' అన్నారు వీఐ ఆనంద్. ''ఒక్కక్షణం' సక్సెస్‌తో 2018కి మేం సంతోషంగా స్వాగతం పలికేలా చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు సీరత్ కపూర్. నిర్మాత చక్రి చిగురుపాటి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచంలో జరిగే తప్పులన్నింటికీ

డబ్బే కారణం



● విష్ణు

'ఖండాంతరాలు దాటితే శాస్త్రాలు పలకవురా పిచ్చి వెధవా.. నేను రానుగాక రాను' అని బ్రహ్మానందం అంటే.. 'మన సంభావనలో చాలా మార్పులుంటాయి గురువుగారు. ఇక్కడ రూపాయికి రూపాయే. కానీ అక్కడ రూపాయికి 66 రూపాయలు. మన జీవితాలన్నీ కళకళలాడిపోతాయి గురువుగారు' అంటూ విష్ణు చెప్పే డైలాగులతో ప్రారంభమయ్యే 'ఆచారి అమెరికా యాత్ర' టీజర్ ఆకట్టుకుంటోంది. 'లాస్ ఏంజెల్స్‌లో వెంకటేశ్వరస్వామి గుడిలో నేను పెద్ద పూజారి, వీడు చిన్న పూజారి, వాడు ట్రస్టీ అని చెప్పావు కదరా' అని బ్రహ్మీ అనగానే 'మీరు నన్ను ట్రస్ట్ చేయాలనే అలా చెప్పాను గురువుగారు' అంటూ అమాయకంగా విష్ణు మొహం పెట్టడం.. 'మరి అమెరికాలో బతికి చచ్చేది ఎలా రా' అంటూ బ్రహ్మానందం కోప్పడటం.. 'ధనం మూలం ఇదం జగత్.. ప్రపంచంలో జరిగే తప్పులన్నింటికీ డబ్బే కారణం' అంటూ విష్ణు చెప్పే మరో డైలాగ్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. విష్ణు, ప్రగ్యా జైశ్వాల్ జంటగా బ్రహ్మానందం కీలక పాత్రలో జి. నాగేశ్వరరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. పద్మజా పిక్చర్స్ పతాకంపై కీర్తీ చౌదరి, కిట్టు నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని ఆదివారం విడుదల చేశారు. ఈ చిత్రంలో వినోదంతో పాటు యాక్షన్ కూడా ఉందని టీజర్‌లో చూపించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. ఈ నెల 26న ఈ సినిమాను విడుదల చేయాలన్నది చిత్రబృందం ఆలోచన.

"నా స్కూల్, కాలేజ్ డేస్‌లో తమ్ముడు (కార్తీ), నేను బస్‌లోనే ప్రయాణం చేసేవాళ్లం. అమ్మానాన్న మమ్మల్ని సింపుల్‌గా పెంచారు. అందుకే మాకు విలువలు తెలుసు. 'గ్యాంగ్' చేస్తున్నప్పుడు నా చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి" అన్నారు సూర్య. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో సూర్య, కీర్తీ సురేష్ జంటగా తెరకెక్కిన చిత్రం 'తానా సేంద కూట్టమ్'. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్ పై వంశీ, ప్రమోద్ తెలుగులో 'గ్యాంగ్'గా ఈ నెల 12న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హీరో సూర్య విలేకరులతో పలు విశేషాలు పంచుకున్నారు.

ఆ ఇద్దరూ యువతరానికి మంచి ఉదాహరణ



● సూర్య

● 'గ్యాంగ్' ఒప్పుకోవటానికి ప్రధాన కారణం దర్శకుడు విఘ్నేష్. అతను కేవలం డైరెక్టర్ మాత్రమే కాదు లిరిసిస్ట్, డ్రమ్మర్. సీన్లు రాయటం, యాక్టర్స్ నుంచి ఫెర్ఫామెన్స్ రాబట్టుకోవడంలో కూడా అతని స్టైల్ చాలా కొత్తగా ఉంటుంది. కెరీర్ బిగినింగ్ డేస్‌లో చేశాను ఇలాంటి పాత్రలను. నా డైలాగ్ డెలివరీ దగ్గరి నుంచి నా క్యారెక్టర్ వరకు అంతా ఫ్రెష్‌గా ఉంటుంది.

● ఇది 'స్పెషల్ 26' సినిమాకు రీమేక్ అయినా కూడా విఘ్నేష్ శివన్ ఎమోషన్స్, క్యారెక్టర్స్ అన్నిటికీ తనదైన టచ్ ఇచ్చారు. రెండు, మూడు సీక్వెన్స్‌లు కామన్‌గా ఉండొచ్చు. అంతే.. పూర్తి స్థాయిలో మార్పులు చేశారు. ఈ సినిమాను ఓ కొత్త చిత్రంగా మలిచారు. అనిరుధ్ మంచి మ్యూజిక్ అందించాడు.

● 'మీరు రోడ్ సైడ్ టీ షాప్‌లో టీ తాగి ఎన్ని రోజులు అయింది?... ఈ సినిమాలో ఇలాంటి క్యారెక్టర్‌నే మీరు చేయబోతున్నారు' అని చెప్పాడు విఘ్నేష్. ఈ సినిమా చేస్తున్నప్పుడు చదువు అయిపోయి నెక్ట్స్ ఏం ఉద్యోగం చేయాలి? అనే రోజులు మళ్లీ గుర్తొచ్చాయి. నా ఫస్ట్ సాలరీ 726 రూపాయిలు. నా రూట్స్‌ని నేను ఎప్పుడూ మరచిపోలేదు.

● ఈ మధ్య వరుసగా దేశాలను, రాష్ట్రాలను కాపాడే పాత్రలను చేశాను, ఈ సినిమా కొంచెం రియలిస్టిక్ అప్రోచ్‌తో ఉంటుంది. ఈ సినిమా చాలా లైట్ హార్టెడ్‌గా ఉంటుంది. ఫుల్ టూ ఎంటర్‌టైన్‌మెంట్.

● ఫస్ట్ టైమ్ నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. చాలా ఎంజాయ్ చేశాను. నేను చదువుకున్న తమిళ లిటరేచర్‌లో 'సుందర తెలుంగు' అన్నారు. ఇండియాలో స్వీటెస్ట్ లాంగ్వేజ్ తెలుగు అని అర్థం. తమిళ డబ్బింగ్‌కు ఎనిమిది రోజులు తీసుకుంటే తెలుగు డబ్బింగ్ కేవలం ఆరు రోజుల్లో పూర్తి చేసేశాను. థాంక్స్ టు శశాంక్ వెన్నెలకంటి.

● ముందు టీజర్‌కు డబ్బింగ్ చెప్పాను. చాలా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. ఆ కాన్ఫిడెన్స్‌తో సినిమాకు డబ్బింగ్ చెప్పాను.


● ప్రయోగాలు చేయటం ఎప్పుడూ ఆపను. అలాంటి కొత్త కాన్సెప్ట్‌లు రావాలంటే టైమ్ పడుతుంది. ఆ స్క్రిప్ట్‌లు అంత సులువుగా రావు. ఏదైనా ఎక్స్‌పెరిమెంట్ మూవీ చేశాక వెంటనే మంచి కమర్షియల్ చేయడం కరెక్ట్. '7 సెన్స్' సినిమా అప్పుడు మా దగ్గర బడ్జెట్ లేదు. కానీ 'సింగం' విడుదలై మంచి విజయం సాధించింది. అప్పుడు ప్రొడ్యూసర్స్ దొరికారు. అలా కమర్షియల్ సినిమా చేస్తూ నా మార్కెట్ కాపాడుకుంటూనే ప్రయోగాలు చేయాలనుకుంటున్నాను.

● సెల్వ రాఘవన్‌తో ఒక సినిమా స్టార్ట్ చేశాం. సాయి పల్లవి, రకుల్ ప్రీత్ హీరోయిన్లు. ఆ తర్వాత కేవీ ఆనంద్‌తో ఒక సినిమా చేయాలి.


● నేను, కార్తీ కలిసి ఓ సినిమా చేద్దాం అనుకున్నాం.. కుదర్లేదు. నేనో స్ట్రెయిట్ తెలుగు సినిమా చేయాలనుకుంటున్నాను కానీ ఎందుకో కుదరడం లేదు. త్వరలో నెరవేరుతుందనుకుంటున్నాను.

● తమిళనాడు పాలిటిక్స్‌లో మంచి చేంజ్ రాబోతుంది అనుకుంటున్నాను. రజనీకాంత్, కమల్‌హాసన్ సార్‌లది డిఫరెంట్ ఐడియాలజీ. వాళ్ల ఒపీనియన్ వేరైనా మొన్న మలేసియాలో జరిగిన స్టార్ క్రికెట్ మ్యాచ్‌లో అలా స్నేహంగా ఒకరి భుజం మీద ఒకళ్లు చేతులు వేసుకొని నిలబడి, మన యంగర్ జనరేషన్స్‌కు మంచి ఎగ్జాంపుల్ సెట్ చేశారు. సినిమాలు హిట్ అవుతున్నాయి మనకి జనం ఓటు వేస్తారనుకుంటే పొరబాటే. అది వాళ్లకీ తెలుసు. మార్పు తీసుకొస్తారని నమ్ముతున్నాను. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన నాకు లేదు. మనల్ని మార్చగలిగేది ఎడ్యుకేషన్ అని నా నమ్మకం. అందుకే 'అగరం ఫౌండేషన్' స్థాపించాను. దీని ద్వారా 2000 మందిని విద్యావంతుల్ని చేస్తున్నాను.

ముగ్గు-ముచ్చట



చందన జయసుష్మ, విజయవాడ
25 చుక్కలు
13 వరకు
మధ్య చుక్కలు



కొండ్రాతి రాధిక
నర్సంపేట,
వరంగల్ జిల్లా
15 చుక్కలు
5 వరుసలు
సరిచుక్క
5 వచ్చేవరకు



కాసపురం శ్యామల వెంకటి, బోధన్, నిజామాబాద్ జిల్లా
21 చుక్కలు
11 వరకు
సందు చుక్క

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com; మరిన్ని ముగ్గులకు ... sakshi.com చూడండి.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
సోమవారం
8-1-2018

హాలీవుడ్ మాస్ బొమ్మ @ 2018

హాలీవుడ్ స్పైస్

జురాసిక్ వరల్డ్ ఫాలెన్ కింగ్‌డమ్



'జురాసిక్ పార్క్' అభిమానులు ఈ సినిమా కోసం ఎంతలా ఎదురు చూస్తున్నారో చెప్పక్కర్లేదు. డైనోసర్లు ఈసారి మరింత విజృంభించినట్లు ట్రైలర్ చూస్తే స్పష్ట మైపోతోంది. 2015లో వచ్చిన 'జురాసిక్ వరల్డ్'.. అభిమానుల్లో ఈ సిరీస్‌కు ఉన్న క్రేజ్ ఏంటో తెలియజేసింది. ఇక ఇప్పుడొస్తున్న కొత్త సినిమా బాక్సాఫీస్ వద్ద డైనోసర్ మోత మోగిస్తుందన్న టాక్ అప్పుడే వినిపిస్తోంది. నిజంగా మాస్ ఆడియన్స్‌కు పండగ అంటే ఈ సినిమా అనే చెప్పుకోవాలి. జూన్ 22న జురాసిక్ వరల్డ్ విడుదల కానుంది.

JURASSIC WORLD FALLEN KINGDOM

బ్లాక్‌ప్యాంథర్

మార్వెల్ స్టూడియోస్ సృష్టించిన బ్లాక్‌ప్యాంథర్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. సూపర్ హీరో క్యారెక్టర్లో ఇదొక డిఫరెంట్ స్టైల్. 2016లో వచ్చిన 'కెప్టెన్ అమెరికా : సివిల్ వార్' (2016)లో బ్లాక్‌పాంథర్ క్యారెక్టర్‌కు రెట్టింపు ఎనర్జీతో ఇప్పుడు కొత్తగా వస్తోన్న క్యారెక్టర్ ఉంటుందట. ఫిబ్రవరి 16న వస్తోన్న ఈ సినిమా విజువల్ ట్రీట్‌తో అద్భుతమైన సినిమాటిక్ ఫీల్ ఇస్తుందని హాలీవుడ్ టాక్.



మిషన్ ఇంపాజిబుల్ 6

యాక్షన్ సినిమా అభిమానుల ఫేవరెట్స్‌లో 'మిషన్ ఇంపాజిబుల్' తప్పక ఉంటుంది. ఈసారి ఆ యాక్షన్ ఇంకెక్కువే ఉంటుందట. ఒక్కో సీక్వెల్‌కు స్టైల్‌ను, యాక్షన్‌ను పెంచుతూ పోతోన్న ఈ సిరీస్, ఈసారి కమర్షియల్ సినిమా అభిమానిని అలా కూర్చొబెట్టి కట్టిపడేస్తుందట. జూలై 27కు విడుదలవుతుంది ఈ సినిమా.



స్పైడర్‌మేన్ ఇన్‌టు ది స్పైడర్ వర్స్

చిన్నా పెద్దా తేడా లేకుండా అందరినీ కట్టిపడేసే సూపర్‌హీరో స్పైడర్‌మేన్ కూడా ఈ ఏడాది చివర్లో సందడి చేయడానికి వస్తున్నాడు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 14న విడుదల కానుందీ సినిమా. విడుదలకు ఇంకా చాలా టైమ్ ఉండడంతో పక్కా కమర్షియల్, సూపర్‌హిట్ అవుట్‌పుట్‌నే బయటకు తీసుకొస్తున్నారట.



అవెంజర్స్ ఇన్ఫినిటీ వార్

ఈ ఏడాది అన్నింటికంటే ఎక్కువ హైప్ ఈ సినిమాకే ఉందని చెప్పాలి. అవెంజర్స్‌కి ఉన్న క్రేజ్ అనుకోవచ్చు, ట్రైలర్‌తో అదరగొట్టడం కావొచ్చు.. అవెంజర్స్ కోసం అభిమానులంతా పిచ్చి పిచ్చిగా ఎదురుచూస్తున్నారు. యాక్షన్ సినిమా అభిమానులకు ట్రీట్‌లా ఉంటుందట ఈ సినిమా. కమర్షియల్ సినిమా అభిమానులూ.. సమ్మర్‌లో.. ఏప్రిల్ 27న వస్తోందీ సినిమా!!



ఇవే కాకుండా 'ఎక్స్-మెన్ డార్క్ ఫియొనిక్స్', 'అక్వామేన్', 'ఫెంటాస్టిక్ బీస్ట్స్', 'ది ప్రిడేటర్', 'యాంట్‌మేన్' లాంటి సూపర్ డూపర్ కమర్షియల్ సినిమాలు కూడా ఈ ఏడాదే సందడి చేయనున్నాయి. హాలీవుడ్ మాస్ సినిమాలను ఇష్టపడేవారికి ఈ ఏడాది కావాల్సినన్ని సినిమాలున్నాయి మరి, చూడడానికి!!

ఎక్కణ్నుంచో ఏదో వెంట పడుతున్నట్లు ఉంటుంది. అందరూ పరిగెడుతూ ఉంటారు. అడవి. ఎటుపోవాలో తెలీదు. తప్పించుకోవాలి. పోరాటాలు చేస్తూనే ఉంటారు. హీరోలు వాళ్లు. భయపెట్టే జంతువులు అవి. ఎన్నేళ్లుగా చూస్తున్నాం ఈ కథలు, ఆ జంతువులకు డైనోసర్ అన్న పేరు పెట్టుకొని. సగటు ఇండియన్ సినిమా అభిమానికి హాలీవుడ్ అంటే ఇదీ! విజిల్స్ వేయించే మాస్ బొమ్మ. అలాంటి 'జురాసిక్ పార్క్' వింతలు కావాలి మనకు. 'స్పైడర్‌మేన్' సాహసాలు కావాలి. ఎప్పుడు ఏ కారు గాల్లోకి ఎగురుతుందో తెలియని యాక్షన్ కావాలి. నోరెళ్లబెట్టి కూర్చునేలా చేసే బొమ్మ కావాలి. హాలీవుడ్‌లో ఎన్నెన్ని సినిమాలు వచ్చినా, ఇలాంటి పక్కా బాక్సాఫీస్‌నే టార్గెట్ చేసుకొని వచ్చే మాస్ బొమ్మలకు ఉండే క్రేజ్ వేరు. ఈ ఏడాది కూడా బాక్సాఫీస్ దగ్గర సందడి చేసేందుకు అన్ని హంగులతో కొన్ని మాస్ సినిమాలు వస్తున్నాయి. ఈ వారం ఆ సినిమాలేంటో చూసొద్దాం..

వాళ్ల రాతల్లో నేనూ చనిపోయే ఉంటా!



● స్టాన్లీ

"నాకిప్పుడు 95 ఏళ్లు. నాకేమనిపిస్తోందంటే, రేపు పొద్దున నేను చనిపోతే, వెంటనే పేపర్లలో న్యూస్ వేసుకోవాలి కాబట్టి ఇప్పటికే చాలామంది నేను చనిపోయినట్టు రాసి పెట్టుకొని ఉండొచ్చు. అయితే ఆ రోజు తొందరగా రావొద్దని కోరుకుంటా'' అని గట్టిగా నవ్వారు స్టాన్లీ. చావు మీద స్టాన్లీ వేసిన జోక్ ఇది. డార్క్ జోక్. స్పైడర్‌మేన్, ఐరన్‌మేన్, ఎక్స్‌మేన్.. ఇలా సూపర్‌హిట్ మార్వెల్ కామిక్స్ క్యారెక్టర్స్‌ను సృష్టించిన వారిలో ఒకరైన స్టాన్లీ.. మార్వెల్ కామిక్స్ సక్సెస్‌లో కీలక పాత్ర పోషించారు. మొన్న డిసెంబర్ 28న తన 95వ పుట్టినరోజు జరుపుకున్న స్టాన్లీ, ఆ సందర్భంగానే పై జోక్ పేల్చారు. ఈ జోక్ వెనక ఒక విచిత్రమైన కథ ఉంది. కెరీర్ మొదట్లో స్టాన్లీ ఓ ప్రముఖ పత్రికలో పనిచేసేవారట. ఎవరైనా పేరున్న వ్యక్తి చనిపోతే, గంటలోపే మూడు పేజీల మ్యాటర్ రెడీ అయి బయటకొచ్చేదట. ఎలా? అని అడిగితే, పోతారనుకున్న వాళ్ల లిస్ట్ రెడీ చేస్కోవడం వల్లే అంటారు స్టాన్లీ. ''ఇది ఇప్పటికీ జరుగుతుందని అనుకుంటున్నా. నా గురించి కూడా రాసి పెట్టుకొనే ఉంటారు. సంతోషించదగ్గ విషయం ఏంటంటే, నేను ఈ స్థాయికి రావడం'' అన్నారు స్టాన్లీ.. తత్వాన్ని, చమత్కారాన్ని ఒకే మాటలో కలిపేస్తూ!



● లిండ్సే లోహన్

పాముకాటు.. మంచిదే!

హాలీవుడ్ స్టార్ లిండ్సే లోహన్‌కు ట్రావెలింగ్ అంటే పిచ్చి. టైమ్ దొరికితే చాలు దేశాలు తిరిగేస్తుంది. తాజాగా ఆమె హాలీడేపై థాయ్‌లాండ్ వెళ్లింది. చల్లని సాయంత్రం. ఎంచక్కా స్విమ్మింగ్ పూల్‌లో కూర్చొని సేదతీరుతోంది. ఎక్కణ్నుంచి వచ్చిందో తెలీదు, ఓ పాము వచ్చి, ఆమె ఎడమ కాలిపై కాటు వేసింది. వెంటనే తేరుకొని, తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకున్న లిండ్సే, ప్రాణాపాయం లేకుండా సేఫ్‌గా బయటపడింది. అయితే ఇదేమీ ఇలా చెప్పుకొని వదిలేసేంత చిన్న విషయం కాదు. కొంచెం అటూ ఇటైనా ప్రాణానికే ప్రమాదం జరిగి ఉండేది. ఇదిలా ఉంటే 'పాముకాటు ఓ రకంగా మంచికే జరిగిందిలే!' అంటూ లిండ్సే కామెంట్ చేయడాన్ని విశేషంగా చెప్పుకోవాలి. ''థాయ్‌లాండ్ ట్రిప్ బాగా జరిగింది. ఒక్క పాముకాటెయ్యడం తప్పితే! అయినా అదీ ఒక రకంగా మంచికేనేమో! పాముకాటేస్తే అదృష్టం కలిసివస్తుందని, పాజిటివ్ ఎనర్జీ వస్తుందని అంటారు.'' అంటూ ఈ విషయాన్ని చాలా సింపుల్‌గా తేల్చిపడేసింది లిండ్సే లోహన్. గతంలో ఇలాగే హాలీడేలో ఆమె చేతి వేలు సగం తెగింది. ఇంతా జరిగినా ట్రావెలింగ్ అంటే నాకున్న పిచ్చి ఎప్పటికీ తగ్గదు అంటోంది లిండ్సే లోహన్.

ఫైనల్ గేమ్ 2019లోనే!

2011లో మొదలైన ఒక సంచలనం ఏడేళ్లుగా అభిమానులను ఉర్రూతలూగిస్తూనే ఉంది. ఆ సంచలనం పేరే 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'. 2011లో మొదలైందీ టీవీ సిరీస్. ఒక్కో ఏడాది ఒక్కో సీజన్‌తో ఇప్పటికి ఏడు సీజన్స్ పూర్తి చేసుకుంది. గేమ్ ఆఫ్ థ్రోన్స్‌ని అభిమానులు ముద్దుగా 'జీఓటీ' అని పిలుచుకుంటారు. కోట్లల్లో ఉన్న అభిమానులు, సినిమాలకు మించి ఉన్న క్రేజ్, అదిరిపోయే విజువల్ ఎఫెక్ట్స్, కట్టిపడేసే కథ.. ఇవన్నీ కలిపి జీఓటీకి తిరుగులేని ఫ్యాన్ ఫాలోయింగ్ తెచ్చిపెట్టాయి. గతేడాది వచ్చిన సీజన్ 7 అయితే అభిమానులకు ఒక పండగలానే వచ్చి వెళ్లింది. సీజన్ 7 అయిపోవడమే అభిమానులంతా సీజన్ 8 కోసం ఎదురు చూడడం మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇండియన్ సినిమా అభిమానులకు కూడా గేమ్ ఆఫ్ థ్రోన్స్ పిచ్చి పట్టిందంటే, అది గత రెండేళ్లుగానే!

సీజన్ 8కు ఉన్న క్రేజ్‌కు మరో కారణం అంటే అది చివరి సీజన్ కావడం కూడా! సీజన్ 8తో 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సిరీస్ అయిపోతుంది. దీంతో ఇప్పటివరకూ చూసిన అన్ని సీజన్స్‌లోకి ది బెస్ట్ అనిపించేలా ఇప్పుడొచ్చే సీజన్ ఉండాలని ప్లాన్ చేస్తోంది టీమ్. ఈ క్రమంలోనే 2018లోనే సీజన్ 8ను ప్లాన్ చేసినా ఇప్పుడది 2019కి షిఫ్ట్ అయింది. ఇప్పటివరకూ 2011 నుంచి ఏడేళ్లుగా ప్రతి ఏడాదీ ఒక సీజన్ వచ్చింది. ఇప్పుడు సీజన్ 8.. 2019కి వెళ్లిపోవడంతో ఫస్ట్‌టైమ్ బ్రేక్ వచ్చినట్టు. అయితే ఆ బ్రేక్ తీస్కోవడానికి కూడా కారణం ఉందట. ఫైనల్ గేమ్ మేకింగ్‌కు మరి ఆ మాత్రం టైమ్ పడుతుంది. ఎంత లేటైనా ఎండింగ్ అదిరిపోవాలి అని!!



● ఎమీలా క్లార్క్

...అండ్ ది అవార్డ్ గోస్ టు...





హాలీవుడ్ సినీ అభిమానులకు డిసెంబర్ నుంచి ఖాళీ అన్నదే ఉండదు. క్రిస్మస్ సినిమాలు చూడాలి. ఆ వెంటనే న్యూ ఇయర్ సినిమాలు. సంవత్సరం అయిపోతుంది కాబట్టి అవార్డుల నామినేషన్స్. నామినేషన్స్ దక్కించుకున్న సినిమాలు ఏమైనా చూడకుంటే అవి చూసెయ్యాలి. ఇవి ఫినిష్ చేసేలోపు గోల్డెన్ గ్లోబ్ అవార్డులు ఇచ్చేస్తారు. వెంటనే ఆస్కార్ నామినేషన్స్. ఆ తర్వాత వాటి రిజల్ట్. వరుసగా సినిమాలే సినిమాలు. ఈ హడావిడి అంతా ఉంటుంది కాబట్టే ఏడాది ప్రారంభంలో హాలీవుడ్ కళకళలాడిపోతుంది. ఈ ఏడాది అప్పుడే అవార్డుల పండగ వాతావరణం మొదలైంది. మార్చి నెలలో ఆస్కార్ అవార్డుల ప్రదానం ఉంటుంది. నామినేషన్స్ ఈ నెలఖార్లో ప్రకటిస్తారు. అంతకుముందే, అంటే ఇవాళ్టినుంచే గోల్డెన్ గ్లోబ్ రూపంలో అవార్డుల సందడి మొదలవుతోంది. ఈ ఉదయం 7 గంటల 30 నిమిషాలకు కలర్స్ ఇన్ఫినిటీ చానెల్లో గోల్డెన్ గ్లోబ్ అవార్డు ఫంక్షన్ లైవ్ ఉంటుంది. ఇదే రికార్డెడ్ ప్రోగ్రామ్ రాత్రి 9 గంటలకు కూడా ఉంటుంది. ఈ ఏడాది 'ది పోస్ట్', 'డంకర్క్', 'షేప్ ఆఫ్ వాటర్' లాంటి మహామహా సినిమాలు పోటీ పడుతుండడంతో గోల్డెన్ గ్లోబ్ ఏ సినిమాకు దక్కుతుందని, ఏ సినిమా ఎక్కువ అవార్డులు కొట్టేస్తుందని అంతా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ అవార్డుల ప్రదానం జరిగిందంటే, ఆస్కార్ ఏ సినిమాలకు వస్తుందన్న దానికి కూడా సగం సమాధానం దొరికేసినట్టే!! ఎందుకంటే గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కినవారికి ఆస్కార్ దక్కే ఆస్కారం ఎక్కువ.

మహావీర్ కర్ణ



● విక్రమ్



● విమల్

కురుక్షేత్ర రణరంగంలో కర్ణుడు కౌరవుల వైపు ఉండి పాండవులను ఓడించడానికి యుద్ధం చేసి ఉండవచ్చు. కర్ణుడి మరణానికి అనేక పరిస్థితులు కారణం కావచ్చు. కానీ.. కర్ణుడి దానగుణం గొప్పది. ఆయన శౌర్య పరాక్రమం అందరికీ అబ్బనిది. కర్ణుడి గొప్పతనాన్ని చెప్పేలా వెండితెరపై చాలా సినిమాలు వచ్చాయి. లేటెస్ట్‌గా హిందీలో 'మహావీర్ కర్ణ' అనే టైటిల్‌తో మరో చిత్రం తెరకెక్కనుంది. విక్రమ్ హీరోగా యునైటెడ్ ఫిల్మ్ కింగ్‌డమ్ పతాకంపై మలయాళంలో 'యన్ను నిన్టే మోయిదీన్' ఫేమ్ ఆర్.యస్. విమల్ దర్శకత్వంలో 'మహావీర్ కర్ణ' చిత్రం రూపొందనుంది. ''హిందీలో తెరకెక్కించి మిగతా భాషల్లోకి డబ్ చేయాలనుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా పేరున్న టెక్నీషియన్స్‌ను తీసుకోవాలనుకుంటున్నాం. 300 కోట్ల బడ్జెట్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్లి, వచ్చే ఏడాది డిసెంబర్‌లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఈ సినిమాను తొలుత పృథ్వీరాజ్‌తో తీయాలని దర్శకుడు విమల్ భావించినా ఏవో కారణాల వల్ల విక్రమ్ ఫైనలైజ్ అయ్యారని మాలీవుడ్ వర్గాల కథనం.

సూపర్ హ్యాపీ



● యామీ గౌతమ్

ఆయనో లాయర్. అందరి కేసులను వాదించి ఓ పరిష్కారం చూపిస్తూ ఉంటాడు. పవర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు, వాళ్లు విధించే బిల్లుల మీద పోరాటం చేసే కామన్ మేన్‌కి ఈ లాయర్ ఏ విధంగా సహకరించాడనే కథాంశంతో రూపొందుతున్న సినిమా 'బట్టి గుల్ మీటర్ చలే'. 'టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ' ఫేమ్ శ్రీ నారాయణ్ సింగ్ దర్శకుడు. ఈ సినిమాలో షాహిద్ కపూర్ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో కథానాయికగా శ్రద్ధా కపూర్‌ని తీసుకున్న విషయం తెలిసిందే. ఇంకో హీరోయిన్‌గా యామీ గౌతమ్‌ని సెలెక్ట్ చేసుకున్నారు చిత్రబృందం. ''ఈ సినిమాలో భాగం కావటం సూపర్ హ్యాపీగా ఉంది. షూటింగ్ కోసం చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నాను'' అని పేర్కొన్నారు యామీ గౌతమ్. అందరి సమస్యలు పరిష్కరించే లాయర్‌గారు ఈ ఇద్దరి భామల మధ్య ఎలాంటి సమస్యగా మారాడు? ఇద్దరికీ ఎలాంటి సమాధానం ఇచ్చాడు? అంటే ఆగస్ట్ వరకూ ఆగాల్సిందే అంటున్నారు చిత్రబృందం. ఈ నెలాఖరున సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమా ఆగస్ట్ 31న విడుదల కానుంది.



జాబ్ ఫైరింగ్... మా డ్యూటీ!

నొప్పించకుండా, నచ్చజెప్పి ఉద్యోగులను తొలగించే సంస్థలు తెరపైకి ● న్యాయపరమైన చిక్కులు రాకుండా ముందుగానే జాగ్రత్తలు

ప్రస్తుతం కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగులను అర్థాంతరంగా తొలగిస్తున్నాయి. ఉద్వాసనకు గురికానున్న ఉద్యోగులను పిలిచి వారికి అర్థమయ్యేలా చెప్పి, ఏ మాత్రం నొప్పించకుండా వారిని పంపించేయడం సవాలుతో కూడుకున్న పనే. వారి తప్పేమీ లేకుండానే రాజీనామా చేయమంటే ఎవ్వరూ ఒప్పుకోరు. కొన్ని సందర్భాల్లో స్వల్ప వాదులాటలూ జరుగుతుంటాయి. ఉద్యోగులను భయపెట్టేందుకు కంపెనీలు బౌన్సర్లను కూడా నియమించుకుంటున్నాయని ఇటీవలే తెలిసొచ్చింది. ఆ తర్వాత నష్టపోయిన ఉద్యోగులు చట్టాలను ఆసరాగా చేసుకుని కంపెనీలపై కేసులు పెడుతుండటమూ చూస్తున్నాం. కానీ కంపెనీలకు ఇంత కష్టం కలిగించకుండా, న్యాయపర చిక్కులూ రాకుండానే అనవసరం అనుకున్న ఉద్యోగులను పంపించేసే మార్గాలు ఉన్నాయని మీకు తెలుసా? ఈ విధానంలో ఓ వైపు కొందరికి ఉద్యోగాలు పోతుంటే మరి కొందరికి మాత్రం దీని ద్వారా పని దొరుకుతుండటం విశేషం. ఇంతకీ వీరి పనేమిటంటే కంపెనీలు ఏ ఉద్యోగిని చూపిస్తే ఆ ఉద్యోగితో మాట్లాడి, వారిని ఒప్పించి, ఏ గొడవా లేకుండా ఉద్యోగాలు మాన్పించి పంపించేయడమే. ఈ పనులు చేసిపెట్టడానికి ప్రత్యేకంగా ఔట్ సోర్సింగ్ విధానంలో కొన్ని కంపెనీలు విదేశాల్లో ఎప్పటినుంచో ఉన్నాయి. భారత్‌లోనూ వాటి సంఖ్య, అక్కడ పనిచేసే వారికి డిమాండ్ ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. వీటిని ఔట్‌సోర్సింగ్ కన్సల్టెంట్, ఔట్‌సోర్స్ టర్మినేటర్, ఫైరింగ్ కన్సల్టెంట్ తదితర పేర్లతో పిలుస్తుంటారు.

హెచ్‌ఆర్‌తో పనిలేకుండానే...


సాధారణంగా ఏ కంపెనీలో అయినా మానవ వనరుల (హెచ్‌ఆర్) విభాగం కీలకమైనది. సంస్థ అవసరాలకు అనుగుణంగా కొత్త ఉద్యోగులను నియమించుకోవడం, పనితీరును, సామర్థ్యాన్ని మదింపు చేసి బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఏటా వేతనాలు పెంచడంతోపాటు, అనుకున్న విధంగా రాణించలేని వారిని తొలగించడం కూడా వీరి పనే. కానీ కొత్త విధానంలో మాత్రం ఉద్యోగుల తొలగింపులో హెచ్‌ఆర్ విభాగం పాత్ర చాలా పరిమితం. ఎవరిని ఉద్యోగాల నుంచి తొలగించాలో కంపెనీ నిర్ణయించాక, వారి జాబితాను ఫైరింగ్ కన్సల్టెంట్ కంపెనీలకు ఇస్తే చాలు. ఆ కంపెనీ ఉద్యోగులు వచ్చి, ఉద్వాసనకు గురికానున్న ఉద్యోగులతో మాట్లాడతారు. వారికి పూర్తిగా పరిస్థితిని వివరించి, నచ్చజెప్పి, భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు రాకుండా అన్ని డాక్యుమెంట్లను సిద్ధం చేసుకుని వాటిపై ఉద్యోగి సంతకాలు తీసుకుని రాజీనామా చేయిస్తారు. ఘర్షణాత్మక వైఖరికి అవకాశం లేకుండా సులువైన పద్ధతులను అనుసరిస్తారు. ఇలాంటి విషయాల్లో హెచ్‌ఆర్ మేనేజర్లకు శిక్షణ కూడా ఇస్తారు.

భారత్‌లోనూ పెరుగుతున్న డిమాండ్

మరొకరి ఉద్యోగాన్ని ఊడగొట్టే ఈ ఉద్యోగాలకు ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ దేశాలతోపాటు మన దగ్గరా డిమాండ్ పెరుగుతోంది. ఇప్పుడు ఈ రంగం కొత్త వృత్తిగా అవతరిస్తోంది. ఈ తరహా సేవల కోసం గతేడాది ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలు 88.7 బిలియన్ డాలర్లు ఖర్చుచేసినట్లు అమెరికాలోని మసాచుసెట్స్‌లో ఉన్న ఐడీసీ(ఎన్‌వైఎస్‌ఈ–ఐడీసీ) పరిశోధక సంస్థ వెల్లడించింది. పెద్ద కంపెనీలతో పోల్చితే చిన్న కంపెనీలకు ఉద్యోగుల రిక్రూట్‌మెంట్, పనితీరు సమీక్ష, ఉద్వాసనలు వంటి ముఖ్యమైన విధుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు లేనందువల్ల ఇటువంటి కన్సల్టెన్సీలపై ఆధారపడుతున్నాయంది. ఈ తరహా సేవలందించే ట్రైనెట్ అనే అమెరికన్ కంపెనీ వ్యవస్థాపకుడు మార్టిన్ బాబినెట్ మాట్లాడుతూ 2002తో పోల్చితే తమ ఆదాయం ఇప్పుడు ఎన్నోరెట్లు పెరిగిందన్నారు. కొన్ని కంపెనీలు ఉద్యోగులను ఇంటికి పంపించడంలో అనుభవం, నైపుణ్యం ఉన్న వారిని హెచ్‌ఆర్ విభాగంలో నియమించుకుంటున్నాయి. 2009లో విడుదలైన, ప్రముఖ నటుడు జార్జి క్లూనీ నటించిన హాలీవుడ్ సినిమా 'అప్ ఇన్ ది ఎయిర్' ఈ తరహా కథాంశంతో వచ్చిందే. ఈ సినిమా అప్పట్లోనే వివిధ దేశాల్లో కలిపి 44 మిలియన్ డాలర్ల వసూళ్లు సాధించింది. మన దేశంలో ఉన్న రైట్ మేనేజ్‌మెంట్, ఆప్టిమమ్, హ్యూమన్ డైనమిక్, హ్యూసిస్ కన్సల్టింగ్, షిల్పుటీస్ వంటి కన్సల్టెన్సీ సంస్థలు ఈ కోవకు చెందినవే. 'మా కంపెనీ సేవలను పొందేందుకు ఒక్కో ఉద్యోగికి రూ.2 లక్షల వరకు ఆయా సంస్థలు వెచ్చిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం వరకు మా సేవలను ఎక్కువగా గ్లోబల్ కంపెనీలే ఎక్కువగా ఉపయోగించుకునేవి. రానురాను మా సేవలు కోరుతున్న భారతీయ కంపెనీల సంఖ్య కూడా పెరుగుతోంది' అని రైట్ మేనేజ్‌మెంట్ సంస్థకు ఇండియా మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ పాండే తెలిపారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

అతి పెద్ద ప్రధాన సంఖ్య!



వాషింగ్టన్: ప్రపంచంలోనే ఇప్పటి వరకు తెలిసిన అతిపెద్ద ప్రధాన సంఖ్యను ఔత్సాహిక శాస్త్రవేత్త కనుగొన్నారు. గతేడాది డిసెంబర్ 26న అమెరికాకు చెందిన జొనాథన్ పేస్ అనే 51 ఏళ్ల ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఈ ఘనత సాధించారు. 2ను 7,72,32,917 సార్లు గుణించి, ఆ తర్వాత అందులో నుంచి '1' ని తీసివేశారు. ఆ వచ్చిన సంఖ్యలో 2,32,49,425 అంకెలున్నాయి. ఇప్పటివరకు తెలిసిన ప్రధాన సంఖ్య కన్నా ఎం77232917 అని పిలుస్తున్న ఈ కొత్త ప్రధాన సంఖ్యలో దాదాపు 10 లక్షల అంకెలు ఎక్కువగా ఉన్నాయి. అత్యంత అరుదుగా ఉండే ఈ ప్రధాన సంఖ్యలను మెర్సెన్నె ప్రధాన సంఖ్యలు అంటారు. 350 ఏళ్ల కిందటే ఈ ప్రధాన సంఖ్యల గురించి అధ్యయనం చేసిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త మారిన్ మెర్సెన్నె పేరు వీటికి పెట్టారు. ఈ కొత్త ప్రధాన సంఖ్యను ఆరు రోజుల పాటు ఆగకుండా లెక్కించారు. ఎం77232917 ఇప్పటి వరకు కనుగొన్న 50వ మెర్సెన్నె ప్రధాన సంఖ్య. గ్రేట్ ఇంటర్నెట్ మెర్సెన్నె ప్రైమ్ సెర్చ్ (జీఐఎంపీఎస్) అనే సాఫ్ట్‌వేర్ సాయంతో ప్రధాన సంఖ్యలు కనుగొనేందుకు వేల మంది వలంటీర్లు నిత్యం ప్రయతిస్తుంటారు. ఈ ప్రధాన సంఖ్యను కనుగొన్న వారికి రూ.50 వేలను పారితోషికంగా అందిస్తారు. జొనాథన్ పేస్ గత 14 ఏళ్లుగా ప్రధాన సంఖ్యను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

రజనీ 'బాబా ముద్ర'.. మా లోగో ఒక్కటే



న్యూఢిల్లీ: సూపర్‌స్టార్ రజనీకాంత్ 'బాబా ముద్ర' ఓ స్టార్టప్ కంపెనీకి లోగోగా ఉండటం ఆ కంపెనీకి సమస్యగా మారింది. కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని రజనీకాంత్ ఇటీవల ప్రకటించడం, పార్టీ చిహ్నంగా బాబా ముద్ర ఉంటుందనే ప్రచారం కూడా జరుగుతుండటం తెలిసిందే. సోషల్ మీడియా యాప్ అయిన వోక్స్‌వెబ్ అనే స్టార్టప్ కంపెనీకి కూడా దాదాపుగా ఇలాంటి లోగోనే ఉంది. దీంతో వోక్స్‌వెబ్ రజనీకాంత్ పార్టీకి అనుకూలంగా ఉంటుందా అని కొందరు తమను అడుగుతున్నారనీ, రజనీతోగానీ ఆయన స్థాపించే పార్టీతోగానీ తమకు ఏ సంబంధం లేదని వోక్స్‌వెబ్ వ్యవస్థాపకుడు యశ్ మిశ్రా చెప్పారు. రజనీ వర్గంలోని సంబంధిత వర్గాలకు తాము ఓ లేఖ కూడా రాసినప్పటికీ ఇంకా తమకు వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని మిశ్రా వెల్లడించారు. బాబా ముద్రను పార్టీ చిహ్నంగా వాడకుండా ఉండేలా, లేదా కొన్ని మార్పులు చేసుకుని వాడేలా రజనీని కోరతామని ఆయన చెప్పారు.

నిన్న హజ్ బిల్డింగ్.. నేడు పోలీస్ స్టేషన్

కాషాయీకరణలో యోగి సర్కార్

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లోని యోగి సర్కార్ రాష్ట్రాన్ని కాషాయమయం చేస్తోంది. యూపీలో యోగి ఆదిత్యానాథ్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన నాటినుంచి ఇప్పటివరకూ బుక్‌లెట్స్, స్కూల్ బ్యాగ్‌లు, టవళ్లు, కుర్చీలు, బస్సులకే పరిమితమైన కాషాయీకరణ పోలీసు స్టేషన్లకు, హజ్ కార్యాలయాలకు చేరింది. తాజాగా లక్నోలో సుమారు 80 ఏళ్ల చరిత్ర కలిగిన ఓ పోలీసు స్టేషన్‌కు ఉన్న భవనం రంగును యోగి ప్రభుత్వం మార్చివేసింది. సాధారణంగా పోలీసు స్టేషన్లకు పసుపు, ఎరుపు రంగులు ఉంటాయి. కానీ, యోగి ప్రభుత్వం లేత కాషాయరంగును లక్నో పోలీసు స్టేషన్‌కు వేయించింది. గత ఏడాది సీఎం కార్యాలయం లాల్ బహదూర్ శాస్త్రి భవన్‌కు, నిన్న లక్నోలోని హజ్ కార్యాలయం సరిహద్దు గోడకు యోగి ప్రభుత్వం కాషాయ రంగు వేయించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ముస్లిం సంఘాలు తీవ్రంగా విరుచుకు పడ్డాయి.

వ్యోమగామి జాన్ యంగ్ కన్నుమూత



వాషింగ్టన్: అత్యధిక పర్యాయాలు అంతరిక్షయానం చేయటంతోపాటు, చంద్రునిపై నడిచిన ప్రముఖ అమెరికా వ్యోమగామి జాన్ వాట్స్ యంగ్(87) కన్నుమూశారు. కొంతకాలంగా న్యుమోనియాతో బాధపడుతున్న ఆయన హ్యూస్టన్‌లో తన నివాసంలో శుక్రవారం మృతి చెందారని నాసా తెలిపింది. అంతరిక్షయానంలో లెజెండ్‌గా అందరూ పిలిచే జాన్ యంగ్ నేవీ ఆఫీసర్, టెస్ట్ పైలెట్, ఏరోనాటికల్ ఇంజినీర్ కూడా. ఆయన పేరిట అనేక రికార్డులున్నాయి. జెమిని, అపోలోతోపాటు పలు అంతరిక్ష యాత్రల్లో కీలకంగా వ్యవహరించారు. 1965లో నాసా ప్రయోగించిన మొట్టమొదటి మానవ సహిత జెమిని మిషన్‌లో ఆయన కూడా సభ్యుడే. అంతరిక్షంలోకి ఆరుసార్లు వెళ్లి వచ్చిన ఏకైక వ్యోమగామిగా జాన్ రికార్డు నెలకొల్పారు.

పెరోల్ కోరనున్న లాలూ!

పట్నా: బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ అక్క గంగోత్రీదేవి ఆదివారం కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలకు హాజరయ్యేందుకు లాలూ పెరోల్ కోరే అవకాశముందని ఆర్జేడీ వర్గాలు తెలిపాయి. గంగోత్రీదేవి మృతిచెందిన విషయాన్ని లాలూకు జైలు అధికారుల ద్వారా చేరవేసినట్లు ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ తెలిపారు. న్యాయపరమైన ప్రక్రియలతో పాటు ఆదివారం కావడంతో అంత్యక్రియల సమయానికి పెరోల్ లభించకపోవచ్చని భావిస్తున్నామన్నారు. దాణా కుంభకోణంపై తీర్పు సమయంలో రోజంతా గంగోత్రీదేవి ప్రార్థిస్తూనే ఉన్నారనీ, తమ్ముడికి తీర్పు వ్యతిరేకంగా వచ్చినట్లు తెలియగానే ఆమె తీవ్రంగా కలత చెందారని లాలూ భార్య రబ్రీదేవి వెల్లడించారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి



గ్వాలియర్‌లో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్

- డీజీపీ, ఐజీపీలతో మోదీ భేటీ
- కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని సూచన

టెకాన్‌పూర్: దేశ అంతర్గత భద్రతపై సమీక్షతోపాటుగా భవిష్యత్తులో భద్రతను మరింత పటిష్టపరచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై.. దేశంలోని పోలీసు ఉన్నతాధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతంగా చర్చించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ సమీపంలోని బీఎస్‌ఎఫ్ అకాడమీలో జరుగుతున్న డీజీపీలు, ఐజీల వార్షిక సదస్సు లో మోదీ పాల్గొన్నారు. ఆదివారం దినమంతా మోదీ అధికారులతో విస్తృతమైన చర్చలు జరిపారు. 'పోలీసింగ్, భద్రత అంశాలపై పోలీసు అధికారులతో చర్చించాను. ఈ సమావేశం ఫలప్రదంగా జరిగింది. మూడేళ్లుగా తీసుకున్న నిర్ణయాల అమలుతీరుపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు' అని మోదీ ట్వీట్ చేశారు. సోమవారం కూడా పోలీసు ఉన్నతాధికారులతో మోదీ సమావేశం కొనసాగనుంది. సదస్సు వివరాలు పూర్తిగా వెల్లడికానప్పటికీ.. దేశవ్యాప్తంగా భద్రతను పటిష్టం చేయటంతోపాటుగా జమ్మూకశ్మీర్, ఈశాన్యరాష్ట్రాలు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వ్యూహాలతో ముందుకెళ్లాలని మోదీ అధికారులకు సూచించినట్లు తెలిసింది. దాదాపు 250 మంది రాష్ట్రాల పోలీసు బాస్‌లు, కేంద్రీయ పోలీసు బలగాల సంస్థల అధిపతులు మూడ్రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. శనివారం కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభోపన్యాసం చేస్తూ.. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రస్థావరాలు ఇంకా దేశంలో అక్కడక్కడ బయటపడుతున్నాయన్నారు. కశ్మీర్‌లో యువతను రెచ్చగొట్టేందుకు పాకిస్తాన్ ప్రతిక్షణం ప్రయత్నిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రాలను అపవిత్రం చేసే ప్రయత్నాలు, అక్కడ అల్లర్లకు ప్రయత్నించే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాజ్‌నాథ్ ఆదేశించారు.

గతేడాది హైదరాబాద్.. ఈసారి గ్వాలియర్

ప్రతి ఏడాదీ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, కేంద్రీయ బలగాల ఉన్నతాధికారులు సమావేశమై దేశవ్యాప్తంగా ఉన్న భద్రతాపరమైన అంశాలపై చర్చిస్తారు. మామూలుగా ఈ సమావేశం ఢిల్లీలో జరుగుతుంది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక. ఢిల్లీ బయట వేర్వేరు కేంద్రాల్లో ఈ సమావేశం ఏర్పాటుచేస్తోంది. 2014లో గువాహటిలో, 2015లో రణ్ ఆఫ్ కచ్, 2016లో హైదరాబాద్‌లో ఈ సదస్సు జరిగింది. గతేడాది హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో సీమాంతర ఉగ్రవాదం, ఉగ్రవాద ప్రేరేపిత అంశాలపై విస్తృత చర్చ జరిగింది.

'ఆధార్' రిపోర్టర్‌పై ఎఫ్‌ఐఆర్

- రూ. 500కే 'ఆధార్ డేటా' వార్తను రిపోర్ట్ చేసిన రచనా ఖైరా
- తక్షణం ఎఫ్‌ఐఆర్ ఉపసంహరించుకోండి: ఎడిటర్స్ గిల్డ్



న్యూఢిల్లీ: ఆధార్ వివరాలు సురక్షితం కాదంటూ 'ద ట్రిబ్యూన్' పత్రికలో వచ్చిన కథనంపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆధార్ నియంత్రణ సంస్థ యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఫిర్యాదు మేరకు.. ఆ కథనాన్ని రాసిన జర్నలిస్టు రచనా ఖైరా పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. కేవలం రూ. 500లతో 10 నిమిషాల వ్యవధిలో ఒక ఏజెంట్ ద్వారా యూఐడీఏఐ వద్ద ఉన్న ప్రతి ఒక్కరి ఆధార్ వివరాలు పొందేందుకు అనుమతి సంపాదించామని ట్రిబ్యూన్ పత్రిక తన కథనంలో పేర్కొంది. వ్యక్తుల పేర్లు, చిరునామా, పోస్టల్ కోడ్, ఫొటో, ఫోన్ నెంబర్, ఈమెయిల్ వివరాలు చాలా సులువుగా అందాయని తెలిపింది.

యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ బీఎం పట్నాయక్ ఫిర్యాదు మేరకు ఐపీసీలోని పలు సెక్షన్లతో పాటు ఐటీ, ఆధార్ చట్టాల కింద 'ద ట్రిబ్యూన్' జర్నలిస్టు రచనా ఖైరాపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. 'ఎవరి ఆధార్ వివరాలైనా పొందేందుకు డబ్బులిచ్చి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వాట్సప్ ద్వారా అనుమతి సంపాదించినట్లు మాకు సమాచారం వచ్చింది' అని యూఐడీఏఐ ఫిర్యాదులో పేర్కొంది. జనవరి 5న ఫిర్యాదు అందగా.. అదే రోజున ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు.

ఎఫ్‌ఐఆర్ సంపాదించా: రచనా ఖైరా


ఈ వ్యవహారంపై రిపోర్టర్ రచనా ఖైరా స్పందిస్తూ.. 'చివరకు నా కథనంపై యూఐడీఏఐ ఏదొకచర్య తీసుకున్నందుకు ఆనందంగా ఉన్నా.. నేను ఎఫ్‌ఐఆర్‌ను సంపాదించుకున్నా' అని పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌తో తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో యూఐడీఏఐ స్పందించింది. పత్రికా స్వేచ్ఛతో పాటు భావ ప్రకటనా స్వేచ్ఛను తాము గౌరవిస్తామంది. అనధికారికంగా అనుమతి సంపాదించడం వల్లే ఫిర్యాదు చేశామంటూ తన చర్యను సమర్థించుకుంది.

ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన: ఎఫ్‌ఐఆర్ నమోదుపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. ఎఫ్‌ఐఆర్‌ను ఉపసంహరించుకునేలా కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేసింది. అక్రమాలపై విచారణ చేపట్టకుండా.. వాటిని వెలికి తీసిన వారిని శిక్షిస్తున్నారని కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది

పెళ్లి చేసుకో.. లేదంటే కిడ్నాప్ చేస్తా!

- సచిన్ కుమార్తెకు బెదిరింపులు
- ఆకతాయిని అరెస్ట్ చేసిన పోలీసులు





న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారాను వేధిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్ట్‌చేశారు. నిందితుడిని పశ్చిమబెంగాల్‌కు చెందిన దేవ్ కుమార్(32)గా గుర్తించారు. సచిన్ ఇంటి ల్యాండ్ లైన్ నంబర్‌ను ఎలాగో సంపాదించిన దుండగుడు.. గత కొద్ది రోజులుగా ఫోన్ చేసి సారాను వేధిస్తున్నాడని పోలీసులు చెప్పారు. ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు తనను పెళ్లి చేసుకోకుంటే కిడ్నాప్ చేస్తానని సారాను బెదిరించాడన్నారు. ఈ విషయమై ముంబైలోని బాంద్రా పోలీస్‌స్టేషన్‌లో సచిన్ కుటుంబం ఫిర్యాదు చేయడంతో కోల్‌కతా పోలీసుల సాయంతో ఫోన్ ట్రేస్ చేసి కుమార్‌ను పట్టుకున్నామన్నారు. 'ఓ మ్యాచ్‌లో పెవిలియన్‌లో కూర్చుని ఉన్న ఆమె(సారా)ను టీవీలో చూడగానే ఆమెతో ప్రేమలో పడిపోయా. నేను ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. ఆమెతో మాట్లాడేందుకు వాళ్లింటికి 20 సార్లు ఫోన్ చేసుంటా' అని కుమార్ పోలీసులకు తెలిపాడు. కుమార్‌కు మతిస్థిమితం లేదని అతని కుటుంబ సభ్యులు చెప్పారు.

అమెరికా మిత్ర దేశం కాదు!

- పాక్ విదేశాంగ మంత్రి ఖ్వాజా అసిఫ్ సంచలన వ్యాఖ్య
- ఉగ్రస్థావరాల నిర్మూలనకు పాక్‌ను చైనా ఒప్పించాలి: అమెరికా





వాషింగ్టన్: అమెరికా ఇక తమకు ఎంత మాత్రం మిత్రదేశం కాదని పాకిస్తాన్ తేల్చిచెప్పింది. మిత్రదేశంగా వ్యవహరించాల్సిన తీరు ఇది కాదంటూ అగ్రరాజ్యాన్ని ఘాటుగా విమర్శించింది. ఉగ్ర స్థావరాల నిర్మూలనలో విఫలమైందంటూ పాక్‌కు అమెరికా సైనిక సాయం నిలిపివేసిన నేపథ్యంలో పాక్ స్పందించింది. ప్రముఖ దినపత్రిక 'వాల్ స్ట్రీట్ జర్నల్'తో పాక్ విదేశాంగ మంత్రి ఖ్వాజా అసిఫ్ మాట్లాడుతూ.. అమెరికాతో మైత్రి ముగింపు దశకు చేరుకుందన్నారు. 'మా మధ్య ఎలాంటి సత్సంబంధాలు లేవు. మిత్ర దేశాలు ప్రవర్తించాల్సిన తీరు ఇది కాదు' అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి వ్యాఖ్యలకు విరుద్ధంగా... అమెరికాతో స్నేహ సంబంధాలు కొనసాగుతాయని పాక్ విదేశాంగ కార్యదర్శి తెహ్మినా జంజువా పేర్కొనడం గమనార్హం. దక్షిణాసియాపై తీవ్ర ప్రభావం చూపగల అగ్రదేశం కావడంతో అమెరికాతో వీలైనంత వరకూ సత్సంబంధాలు కొనసాగించాలన్నదే పాకిస్తాన్ అభిమతమన్నారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాల్ని నిర్మూలించేలా.. ఆ దేశాన్ని మిత్ర దేశమైన చైనా ఒప్పించగలదని అమెరికా ఆశాభావం వ్యక్తం చేసింది. ఉగ్ర సంస్థలపై ఉక్కుపాదం మోపడం చైనా జాతీయ విధానమైందున.. ఆ దేశం స్పందించాలని వైట్‌హౌస్ అధికారి సూచించారు. పాక్ లో ఉగ్ర స్థావరాల ధ్వంసంతో దక్షిణాసియాలో సుస్థిరత సాధ్యమవుతుందన్నారు.

తూర్పు చైనా సముద్రంలో నౌకల ఢీ

32 మంది గల్లంతు




చైనా సముద్రంలో మంటల్లో చిక్కుకున్న ఆయిల్ ట్యాంకర్

బీజింగ్: తూర్పు చైనా సముద్రంలో ఆయిల్ ట్యాంకర్ నౌక, సరకు రవాణా నౌక ఢీకొన్న ప్రమాదంలో ట్యాంకర్‌కు చెందిన మొత్తం 32 మంది సిబ్బంది గల్లంతయ్యారు. వీరిలో 30 మంది ఇరాన్ దేశస్తులు కాగా ఇద్దరు బంగ్లాదేశీయులు. ఇరాన్ నుంచి 1.36 లక్షల టన్నుల ముడి చమురుతో వెళ్తున్న సాంచీ అనే రవాణా నౌక శనివారం సాయంత్రం షాంఘైకి 160 నాటికల్ మైళ్ల దూరంలో చైనాకు చెందిన, 64 వేల టన్నుల ధాన్యంతో అమెరికా నుంచి వస్తున్న సీఎఫ్ క్రిస్టల్ అనే మరో సరకు రవాణా నౌకను ఢీకొట్టింది. ముడిచమురు కావడంతో వెంటనే మంటలు ఎగిసిపడ్డాయి. ట్యాంకర్‌కు చెందిన 32 మంది సిబ్బంది గల్లంతవ్వగా, క్రిస్టల్ నౌకలోని మొత్తం 21 మందిని సహాయక బృందాలు రక్షించాయి. ముడి చమురు వ్యాపించడంతో సముద్ర జలాలు కలుషితమయ్యాయని చైనా రవాణా మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆదివారం ఉదయానికి కూడా సాంచి ఇంకా నీటిపై తేలుతూ, మండుతూనే ఉందనీ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పింది. గల్లంతైన వారిని వెతికేందుకు చైనా సముద్రతీర విభాగం అధికారులు 8 ఓడలను పంపించారు. దక్షిణ కొరియా కూడా ఓ విమానాన్ని, తీర ప్రాంత రక్షణ దళానికి చెందిన ఓ నౌకను పంపించి గాలింపు చర్యలు చేపడుతోంది.

14 వేల బంకర్లు

పాక్ సరిహద్దు వెంట నిర్మాణానికి కేంద్రం ఆమోదం ● రూ.415 కోట్ల విడుదల



జమ్మూ: పాకిస్తాన్‌తో అంతర్జాతీయ, పాక్ ఆక్రమిత కశ్మీర్ సరిహద్దుల వద్ద 14,460 బంకర్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాకిస్తాన్ తరచూ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ మోర్టార్లతో దాడులు చేస్తున్నందున సరిహద్దు గ్రామాల ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ బంకర్లను నిర్మించనున్నారు. కాగా, ఈ బంకర్ల నిర్మాణానికి కేంద్రం రూ.415.73 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. ఈ భూగర్భ బంకర్లలో ఎల్‌వోసీ వెంట పూంఛ్, రాజౌరీ జిల్లాల్లో 7,298, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్మూ, కథువా, సాంబా జిల్లాల్లో 7,162 బంకర్లను నిర్మించనున్నారు. ఇందులో 13,029 వ్యక్తిగతమైనవి కాగా, 1,431 సామాజిక బంకర్లున్నాయి. వ్యక్తిగత భూగర్భ బంకర్లు 160 చదరపు అడుగులు (ఎనిమిది మంది ఉండేందు కు వీలుగా), సామాజిక బంకర్లు 800 చదరపు అడుగులు (40 మంది ఉండేందుకు వీలుగా) ఉంటాయి. గతేడాది పాకిస్తాన్ కవ్వింపు చర్యల కారణంగా 35 మంది (23 మంది సైనికులు, 12 మంది పౌరులు) మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం బంకర్ల నిర్మాణానికి చొరవతీసుకుందని ఆర్మీ అధికారులు వెల్లడించారు.

చైనా చదువుకు జై..!


మక్కువ చూపుతున్న భారతీయ విద్యార్థులు

- మెడిసిన్‌తోపాటు వివిధ కోర్సులకు డిమాండ్
- తక్కువ ఖర్చు, మెరుగైన ప్రయోగశాలల కారణంగానే
- అక్కడి సర్కారు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడమూ ఓ కారణం

న్యూఢిల్లీ: చైనాలో ఉన్నతవిద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఉన్నతవిద్యావకాశాల కోసం ఇప్పుడు బ్రిటన్ కన్నా చైనా వైపే భారతీయ విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా, 2010–11 విద్యాసంవత్సరం నుంచి వైద్యవిద్యను అభ్యసించేందుకు చైనా వైపు మొగ్గు చూపుతున్నారు. భారత్‌లో రెండేళ్లుగా జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ద్వారా వైద్యవిద్య సీట్లను భర్తీ చేస్తున్నారు. దీంతో తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ సమయంలో విదేశీ వైద్య చదువులకు డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలోనే పొరుగునే ఉన్న చైనాలో ఎంబీబీఎస్ చేయాలనుకునే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వైద్యకోర్సులకు తక్కువ ఖర్చుతో పాటు, ఆంగ్లంలో బోధన, మెరుగైన ప్రయోగశాల (లేబొరేటరీ) సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు ఈ దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి. దీనికితోడు చైనా వైద్య పట్టాకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) గుర్తింపు ఇస్తుండటం మరో సానుకూల అంశంగా మారింది. ప్రస్తుతం ఎంసీఐ గుర్తింపు ఉన్న జాబితాలో చైనాలోని 45 ప్రభుత్వ వైద్యవిద్యాసంస్థలున్నాయి. ఈ కాలేజీల్లో విదేశీ విద్యార్థుల కోసం 3,470 సీట్లు అందుబాటులో ఉన్నాయి. చైనాలో ఉన్నతవిద్య కోసం వెళ్లే భారతీయుల సంఖ్య పదేళ్ల క్రితం వందల్లోనే ఉండేది. కానీ.. 2015లో 13,500 మంది, 2016లో 18,171 మంది ఆ దేశంలో వివిధ కోర్సులు నేర్చుకునేందుకు చైనా వెళ్లారు. ఇతర కోర్సుల విషయంలోనూ అమెరికా, యూకే తర్వాత చైనానే విదేశీవిద్యార్థులు తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారని తాజా సర్వేలు వెల్లడిస్తున్నాయి.

తక్కువ ఖర్చూ ఓ కారణమే!

'పశ్చిమదేశాలతో పోల్చితే చైనాలో ఖర్చు తక్కువ, ఉద్యోగాలు కూడా కల్పిస్తారు. నాణ్యమైన విద్యతోపాటు ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలూ చైనాపై ఆసక్తి పెంచుకునేందుకు ఓ కారణం' అని కెరీర్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ కరణ్ గుప్తా పేర్కొన్నారు. మెడిసిన్, ఇంజనీరింగ్‌లతో పాటు హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు కూడా చైనా ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం మరో ఆకర్షణగా నిలుస్తోంది. చైనా అధికారిక లెక్కల ప్రకారం... 2016లో అత్యధికంగా దక్షిణ కొరియా (70,540 మంది విద్యార్థులు), అమెరికా (23,838), థాయ్‌లాండ్ (23,044), పాకిస్తాన్ (18,626), భారత్ (18,171), రష్యా (17,971), ఇండోనేషియా (14,714)ల విదేశీ విద్యార్థులున్నారు. 2020 కల్లా చైనాలో విదేశీ విద్యార్థుల సంఖ్య 5 లక్షలకు చేరుతుందని నిపుణుల అంచనా.





టూరిజం హబ్‌గా సూళ్లూరుపేట

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తయారుచేసేందుకు కృషి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాలు కేంద్రంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఆదివారం మంత్రి నారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రులు ఫ్లెమింగో బెలూన్లను ఎగురవేశారు. –సూళ్లూరుపేట

పాత ప్రాజెక్టులను పూర్తి చేసే
అదృష్టం నాకు దక్కింది: సీఎం



సాక్షి ప్రతినిధి, కర్నూలు: గతంలో చేపట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసే అదృష్టం తనకు దక్కిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని 27 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఇంటింటా నీటి వినియోగంపై ఆడిట్ జరగాల్సిన అవసరముందన్నారు. కర్నూలు జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. డెల్టాకు ఇవ్వాల్సిన శ్రీశైలం నీటిని హంద్రీ–నీవాతో పాటు సిద్ధాపురానికి ఇస్తున్నామని చెప్పారు. ఈ నెలలో సూర్యారాధన అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు సీఎం తెలిపారు. ఇదిలాఉండగా, సమయం దాటిన తర్వాత అనధికార వ్యక్తులు దుర్గమ్మ గుడిలోకి వెళ్లినట్టు రుజువయ్యిందని సీఎం చెప్పారు. అధికారుల నిర్లక్ష్యాన్ని గుర్తించి, వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. అయితే తాంత్రిక పూజలపై మాత్రం నోరుమెదపలేదు.

ఫొటోల కోసం నిలదీయడం అలవాటైంది..: శనగపంటకు గిట్టుబాటు ధర కల్పించి.. కొనుగోలు చేయాలని సభకు హాజరైన రైతులు డిమాండ్ చేశారు. దీంతో సీఎం చంద్రబాబు వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఫొటోల కోసం నిలదీయడం అలవాటైందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి'పై సీఎం తన అక్కసు వెళ్లగక్కారు. ఎవరైనా ప్రశ్నించగానే.. ఫొటోలు తీసి వేస్తోందంటూ నోరుపారేసుకున్నారు.

✦ చంద్రబాబుది వ్యాపార ధోరణి: శరద్‌యాదవ్



సాక్షి, విశాఖపట్నం: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారని జనతాదళ్ (యూ) మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ శరద్‌యాదవ్ విమర్శించారు. కేంద్ర మాజీమంత్రి పి.శివశంకర్ స్మారక కమిటీ ఆదివారం విశాఖ వుడా బాలల థియేటర్‌లో 'రాజ్యాంగాన్ని రక్షించండి– ప్రజాస్వామ్యాన్ని రక్షించండి 'అనే అంశంపై నిర్వహించిన స్మారకోపన్యాసంలో శరద్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు అమరావతిని పచ్చదనం స్థానంలో కాంక్రీట్ జంగిల్‌గా మార్చేశారని విమర్శించారు. 2019 ఎన్నికల్లో మంచి ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు.

✦ బాబు తోక ఆడిస్తే జైలే: నారాయణ



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తోక ఆడిస్తే ప్రధాని నరేంద్రమోదీ వెంటనే జైల్లో పెట్టిస్తారని సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.నారాయణ వ్యాఖ్యానించారు. ఓటుకు కోట్లు కేసును గుప్పెట్లో పెట్టుకుని మోదీ చంద్రబాబును ఓ ఆట ఆడిస్తున్నారన్నారు. అందువల్లే రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించుకోలేకున్నారని ఆదివారం విజయవాడలో మీడియాతో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. చంద్రబాబుది ప్రస్తుతం బానిస బతుకైందని ఎద్దేవా చేశారు. పోలవరం నిర్మాణంపై సీపీఐ బృందం నేరుగా ప్రధానిని కలిసిందని, ఆ పని టీడీపీ చేయలేకపోయిందన్నారు. బీజేపీ దిగజారుడు రాజకీయాలపై సోమవారం నుంచి జరిగే పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో చర్చించి ముసాయిదాను ఖరారు చేస్తామన్నారు.

✦ ఫాతిమా విద్యార్థులకు కామినేని షాక్

సాక్షి, అమరావతి: ఫాతిమా వైద్యకళాశాల బాధిత విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మరో షాక్ ఇచ్చారు. ఇన్నాళ్లూ సీట్లు ఇస్తామని, అందరికీ న్యాయం చేస్తామని, ఆర్డినెన్స్ తెస్తామని, యాజమాన్యం నుంచి డబ్బులు ఇప్పిస్తామని చెప్పిన కామినేని శ్రీనివాస్ ఆదివారం ఉదయం తనను కలిసిన బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఆర్డినెన్స్ గురించి ప్రస్తావించిన విద్యార్థులతో.. నేను ఆర్డినెన్స్ తెస్తాను ఆ తర్వాత మీరు ఆర్‌ఎంపీ డాక్టర్లవుతారు అంటూ చెప్పేసరికే విద్యార్థులందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇన్నాళ్లూ ఆర్డినెన్స్ తెస్తాం, న్యాయం చేస్తానన్న మంత్రి ఇదేంటి ఇలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన అనంతరం బాధిత విద్యార్థులు 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. గత పదిహేను రోజులుగా ప్రభుత్వం ఫాతిమా విద్యార్థులకు న్యాయం చేయడానికి కేరళ తరహాలోనే ఆర్డినెన్స్ తీసుకొస్తున్నామని చెప్పింది. దీని సంగతి అడగడానికి విజయవాడలోని మంత్రి ఇంటికి బాధిత విద్యార్థులు, కొంతమంది తల్లిదండ్రులు వెళ్లి కలిశారు. ఇక్కడ మంత్రి తమను తీవ్రంగా ఆవేదన చెందేలా మాట్లాడారని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా విమర్శిస్తారని తమపై అసహనం వ్యక్తం చేశారని వాపోయారు.

దామలచెరువు వద్ద రచ్చబండకు హాజరైన అశేష జనవాహినినుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ జగన్



సొంతూరును పట్టించుకోని చంద్రబాబు
సింగపూర్ కడతారట!

అవసరమైతే కాళ్లు పట్టుకుని.. ఆ తర్వాత వెన్నుపోట్లు ● ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎద్దేవా

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి :

'సొంత గడ్డ.. సొంత ఊరు.. తను చదివిన స్కూలు పరిస్థితులు అధ్వానంగా ఉంటే ఏ మాత్రం పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. సింగపూర్ కడతారట..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తనను ఒక సారి ఓట్లేసి ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రి కావడానికి దోహదం చేసిన చంద్రగిరి శాసనసభా నియోజకవర్గంలో ప్రజలకు చంద్రబాబు ఒక దఫా తొమ్మిదేళ్లు, ఇపుడు నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చేసింది శూన్యమని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 55వ రోజు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో (ప్రాతినిథ్యం వహిస్తోంది కుప్పం)ని దామలచెరువులో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన 'రచ్చబండ' కార్యక్రమంలో పాల్గొన్నారు. చంద్రగిరి ప్రజలు ఇప్పటికీ తాగు, సాగు నీటి కష్టాలు ఎదుర్కొంటుండటం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఆదరించి కూతురునిచ్చిన మామకే వెన్నుపోటు..

''చంద్రబాబు సింగపూర్‌కు వెళితే రాష్ట్రాన్ని సింగపూర్ మాదిరిగా చేస్తానంటారు.. జపాన్‌కు పోతే.. జపాన్‌లా మార్చేస్తానంటారు.. ఇలా ఏ దేశానికి వెళితే ఆ దేశం లాగా చేస్తానంటారు. ఇంకా నయం.. చిత్తూరుకు సముద్రం తీసుకు వస్తానని అనలేదు. అందుకు సంతోషించాలి. 1978లో చంద్రబాబు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 2500 ఓట్ల ఆధిక్యంతో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత మా నాన్న గారి పుణ్యాన కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర మంత్రి అయ్యారు. ఐదేళ్ల తర్వాత మంత్రి హోదాలో చంద్రగిరి నుంచి చంద్రబాబు మళ్లీ పోటీ చేసి 17,429 ఓట్ల తేడాతో ఓడిపోయారంటే ఆయన గారు చంద్రగిరిని అంత గొప్పగా అభివృద్ధి పథంలో నడిపించారన్న మాట. ఆ తర్వాత.. మంత్రి పదవి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని వదలేసి, సొంత మామ ఎన్టీ రామారావు పార్టీలో చేరారు. ఆయన కోసం నిజాయితీగా పని చేశారా.. అంటే అదీ లేదు. ఓడిపోయి చచ్చిన పాములాగా ఉండిన చంద్రబాబును ఎన్టీఆర్ ఆదరించి, ఆశీర్వదించి మంత్రిని కూడా చేశారు. అన్ని విధాలా ఆదరించి.. కూతురునిచ్చి పెళ్లి చేసిన ఎన్టీఆర్‌ను కూడా చంద్రబాబు వదలకుండా అధికారం కోసం, రాజకీయాల కోసం వెన్ను పోటు పొడిచాడు. సొంత మామనే వెన్నుపోటు పొడిచిన వ్యక్తికి ఇక రాష్ట్ర ప్రజలు ఒక లెక్కా? అవసరమైతే చంద్రబాబు ఎవరి కాళ్లయినా పట్టుకుంటాడు. అవసరం తీరిన తర్వాత ఎవరికైనా వెన్నుపోటు పొడుస్తారు. ఈ క్రమంలో ఆయన ప్రజలను కూడా వదిలి పెట్టరు. ఇదీ చంద్రబాబు చరిత్ర.

పుట్టిన ఊరు మీదే మమకారం లేదు

ఇక్కడే శేషాపురం (నారా వారి పల్లె పక్కనే)లో ఉన్న స్కూలులోనే చంద్రబాబు చదివారట. ఆ స్కూలు ఇప్పుడు శిథిలావస్థలో ఉందని చెప్పారు. ఆ స్కూలుకు ఇప్పటికీ పిల్లలు వెళుతున్నారు. చంద్రబాబుకు పుట్టిన ఊరి మీద, చిన్నప్పుడు చదువుకున్న స్కూలు మీద ఏ మాత్రం ప్రేమ లేదు. సొంత స్కూలుపై ప్రేమలేని ఒక ముఖ్యమంత్రి పాలనలో ఇక రాష్ట్రంలోని మిగిలిన స్కూళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాల్సిందిగా కోరుతున్నా. చంద్రగిరి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి కావాలని ఇక్కడి వారు కోరినపుడు, మా నాన్న వైఎస్ రాజశేఖరరెడ్డి మంజూరు చేస్తూ.. జీవో ఇచ్చారు. అంతలోనే ఆయన మరణించారు. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న చంద్రబాబుకు తన నియోజకవర్గం మీద ఉన్న ప్రేమ ఎలాంటిదనేది దీన్ని బట్టి అర్థం అవుతోంది. చంద్రబాబు ఎవరినైనా వెన్నుపోటు పొడిచేస్తారు. అది సొంత మామనైనా సరే.. మరొకరినైనా సరే.. పుట్టిన గడ్డయినా సరే.. సొంత తమ్ముడైనా సరే. ఇక్కడి పేదలు ఇవాళ్టికి కూడా.. తమకు ఇళ్లు కావాలని జన్మభూమి ద్వారా మొర పెట్టుకుంటూనే ఉన్నారు. ఇప్పటికి నాలుగు సార్లు జన్మభూమిలో అర్జీలిచ్చినా వారి సమస్య పరిష్కారం కాలేదు.

అంతటా అవినీతే..

దామలచెరువులో ఉన్న మామిడి పండ్ల మార్కెట్‌లో ప్రతి ఏటా రూ.వంద కోట్ల మేరకు లావాదేవీలు జరగడమే కాక, సెస్సు రూపంలో ఏడాదికి రూ. కోటి రైతుల నుంచి ముక్కు పిండి ప్రభుత్వం రాబడుతోంది. కానీ ఆ మార్కెట్‌కు పోయే దారి అధ్వానంగా ఉంది. ఈ పెద్ద మనిషి మైక్ చేత పట్టుకుని రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానంటారు. నాలుగేళ్లుగా ఆయన ఎవరినీ వదిలి పెట్టలేదు. బొగ్గు, మద్యం, కరెంటు కొనుగోళ్లు అన్నింటా అవినీతే. కాంట్రాక్టర్ల వ్యవహారాల్లో కూడా అవినీతే. ఇవాళ పింఛన్లు, రేషన్, మరుగుదొడ్లు ఏం కావాలన్నా జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చే విధంగా పరిపాలనను తయారు చేశారు. ఎన్నికలకు ముందు తమను ఎస్టీల జాబితాలో చేరుస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని అడిగినందుకు మత్స్యకార సోదరులను చంద్రబాబు తాట తీస్తా.. తోలు తీస్తా.. ఖబడ్దార్ అని బెదిరించారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా బెదిరించడం చూస్తే ఆయన కళ్లు ఉండాల్సిన చోట కాకుండా పైకెక్కాయి అని అర్థం అవుతోంది. ఇంకా ఇలాంటి సీఎం మనకు అవసరమా? ఆలోచించుకోవాలని అందరినీ కోరుతున్నా.''

తాంత్రిక పూజల్లో పెద్దల హస్తం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర



అనంతపురం సప్తగిరి సర్కిల్ : విజయవాడ దుర్గగుడిలో జరిగిన తాంత్రిక పూజల వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ యాత్రలో భాగంగా అనంతపురం వచ్చిన ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేవలం కొందరి లబ్ధి కోసం ప్రజలకు, రాష్ట్రానికి ఏర్పడే నష్టం గురించి తెలుసుకోకుండా ఇష్టమొచ్చిన రీతిలో తాంత్రిక పూజలు నిర్వహించడం దారుణమన్నారు. పవిత్రమైన దేవాలయంలో అపచారం జరిగితే దానివల్ల జరిగే అనర్థాలను నివారించేందుకు పీఠాధిపతులతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని.. లేకపోతే దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని స్వామీజీ హెచ్చరించారు. ఈ ఘటనపై పెద్దలను వదిలి అర్చకులను దోషులను చేయడం బాధాకరమన్నారు. తాంత్రిక పూజలు నిర్వహించిన వారిని వదిలిపెట్టి బ్రాహ్మణులు, అర్చకులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. నేడు బ్రాహ్మణుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. వారి స్థలాలను అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు లాగేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాంత్రిక పూజల మలినాన్ని కడిగి సంప్రోక్షణ చేయాలని స్వామీజీ సూచించారు.

ఎవరి కోసం ఈ తంత్రం?

దుర్గగుడి తాంత్రిక పూజల దోషులను దాచే యత్నం ● విచారణ పేరుతో అంతులేని సాగదీత

సాక్షి, అమరావతి / అమరావతిబ్యూరో: విజయవాడ కనకదుర్గ ఆలయంలో నియమ నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి పూట తాంత్రిక పూజలు జరిగి 12 రోజులైంది. హైందవ సాంప్రదాయాలకు విరుద్ధంగా జరిగిన ఈ అపచారంపై ఇప్పటికీ గోప్యత కొనసాగుతోంది. తాంత్రిక పూజలు ఎందుకు జరిగాయి? ఎవరి కోసం జరిగాయన్న అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. స్పష్టమైన ఆధారాలున్నప్పటికీ విచారణను సాగదీసేందుకు యత్నిస్తున్నారు.



అన్నీ జవాబులేని ప్రశ్నలే..

➠ పవిత్రమైన కనకదుర్గ గర్భగుడి చుట్టూ ప్రత్యేక భద్రతా వలయం ఉంటుంది. 24 గంటలూ సుశిక్షితులైన పోలీసు సిబ్బంది కాపలాగా ఉంటారు. అయినా ఏం జరిగిందో ,ఎవరు చేశారో తెలుసుకోవడానికి ఇన్ని రోజులు పడుతుందా?

➠ ఆలయమంతటా 24 గంటలూ సీసీ కెమెరాల నిఘా ఉంది. గర్భగుడి చుట్టూ కూడా సీసీ కెమెరాలున్నాయి. ఆ పుటేజిలను పరిశీలిస్తే దోషులెవరో తేలిపోతుంది కదా. అందులో ముఖ్యమైన క్లిప్పింగులు ఎందుకు బైటపెట్టడం లేదు.

➠ అర్ధరాత్రి పూట గర్భగుడిని తెరవాలంటే కొన్ని సాంప్రదాయాలు పాటించాలి. నియమనిబంధనలను అనుసరించాలి అవేవీ ఎందుకు పాటించలేదు.

➠ అర్ధరాత్రి తాంత్రిక పూజలు జరిగాయని అంగీకరిస్తూ ఈవోను బదిలీ చేశారు. కేవలం బదిలీతోనే ఎందుకు సరిపెడుతున్నారు? ఈ వ్యవహారంలో కేసు ఎందుకు నమోదు చేసి విచారణ ఎందుకు ప్రారంభించలేదు?

➠ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్నవారి కోసమే ఈ తాంత్రిక పూజలు జరిగినట్లు అనేక ఆరోపణలున్నాయి. దానికి బలం చేకూర్చే విధంగానే ఈ పరిణామాలన్నీ ఉండడం నిజం కాదా?

➠ మహిషాసురమర్ధిని అలంకరణలో ఉన్న అమ్మవారిని అర్చకులు ఫొటో కూడా తీసి ఈవోకు పంపించారు. కానీ ఆమె ఆ ఫొటోను ఎవరికి పంపించారు?

➠ ముఖ్యమంత్రి తనయుడు, మంత్రి లోకేష్ కోసమే తాము దుర్గగుడిలో తాంత్రికపూజలు చేశామని సన్నిహితుల వద్ద చెప్పాడంటున్న అర్చకుడు సృజన్ ఇంతకీ ఎక్కడ ఉన్నారు? ఆయన ఎవరికీ అందుబాటులో లేకుండా ఎందుకు పోయారు?

చంద్రబాబు కోసం గతేడాది ప్రత్యేక పూజలు

చంద్రబాబు క్షేమాన్ని కోరుతూ సరిగ్గా ఏడాది క్రితం రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీకి అనుకూలంగా ఉండే కొందరు అర్చక ప్రతినిధుల పిలుపు మేరకు ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ఆల యాల్లో బాబు కుటుంబం ప్రయోజ నాలను ఉద్దేశించి పూజలు జరిగాయి. ఈ ఏడాది కూడా అలా ప్రత్యే క పూజలు జరిపాలని కార్యాచరణ రూపొందించారన్న ప్రచారం సాగుతోంది.

తాంత్రిక పూజలపై అనేక ఆధారాలు..

తాంత్రిక పూజల అంశాన్ని ప్రభుత్వం మొదట్లో తీవ్రంగా బుకాయించింది. తాంత్రిక పూజలు జరిగాయన్న ఆలయ పాలకమండలి సభ్యులపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. పాలకమండలిని రద్దు చేస్తానని హెచ్చరించారు. తాంత్రిక పూజలు జరిగాయని తేలడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. స్మార్థ ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా అమ్మవారి కవచం తొలగించి మరీ పూజలు చేశారని నిర్ధారణైంది. దీంతో ప్రభుత్వం అంగీకరించక తప్పలేదు.

కమిషనర్‌కే ఈవో బాధ్యతలు

విజయవాడ దుర్గగుడి ఈవో సూర్యకుమారిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన విభాగం(జీఏడీ)లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధనే దుర్గ గుడి ఈవోగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతల్లో నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

'పెద్దల' ఆదేశాలతోనేనా..?

విచారణ పేరుతో దుర్గగుడి తాం త్రిక పూజల అంశాన్ని కొంతకా లం సాగదీసి.. ఆ పూజలు ఎవరి కోసం జరిగాయన్న అంశాన్ని మరుగు పరచాలన్నదే ప్రభుత్వ 'పెద్దల' ఉద్దేశమని వినిపిస్తోంది. ఈవో సూర్యకుమారిని దుర్గ గు డి బాధ్యతల నుంచి తప్పిస్తే ఇక ఆ విషయం మరుగున పడిపోతుందని సర్కారు పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలయ మూసివేయాల్సిన సమయం తర్వాత కూడా తెరిచి ఉంచితే ఆలయ భద్రతలో విధుల్లో ఉన్న ఎస్పీ ఎఫ్ సిబ్బంది నిబంధనల ప్రకారం వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలి. అలాంటిది డిసెంబర్ 26న అర్ధరాత్రి బయట వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించినా ఎస్పీఎఫ్ పోలీసులతో సహా అధికారులు, అర్చకులు మౌనం వహిస్తున్నారు.

కేసు ఎందుకు నమోదు చేయలేదంటే..!?

తాంత్రిక పూజల ఉదంతంలో ఇంతవరకు పోలీసు కేసు నమోదు చేయనే లేదు. దీన్ని శాఖాపరమైన వైఫల్యంగానే చూపిస్తూ కప్పిపుచ్చాలన్నది లక్ష్యంగా కనిపిస్తోంది. 'ప్రాథమిక విచారణ చేయాలని మాత్రమే మాకు చెప్పారు. అంతటితో తమ పని పూర్తయ్యింది'అని ఓ అధికారి 'సాక్షి'కి చెప్పడం గమనార్హం. అంటే తాంత్రిక పూజలు చేయడంపై కేసు నమోదు చేసి దోషులను శిక్షించాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలుస్తోంది. అలా చేస్తే విషయం న్యాయస్థానం పరిధికి వెళ్తుంది. దాంతో అసలు తాంత్రిక పూజలు ఎవరి కోసం చేశారన్నది వెల్లడించాలి. అందుకే కేసు నమోదు చేయించడం ప్రభుత్వానికి ఏమాత్రం ఇష్టం లేదన్నది స్పష్టమవుతోంది.

✦ సెల్‌టవర్ ఎక్కి ఆదివాసీల నిరసన



చర్ల (భద్రాద్రి కొత్తగూడెం): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు ఆదివారం సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. చర్ల మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఉన్న సెల్ టవర్‌ను ఏవీఎస్పీ నాయకులు ఎక్కారు. మేడారం ట్రస్టు బోర్డు కమిటీ నుంచి లంబాడీలను, గిరిజనేతరులను, భద్రాచలం ఎంపీటీసీ ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న లంబాడీలను తొలగించాలని, ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

✦ అప్పుల బాధతో పత్తి రైతు ఆత్మహత్య

సుల్తానాబాద్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్‌కు చెందిన పెండ్యాల ప్రభాకర్‌రెడ్డి (55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయానికి, కుటుంబ అవసరాల కోసం దాదాపు రూ.16 లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం కనిపించక శనివారం తన పత్తి చేనులోనే పురుగుల మందు తాగాడు. గమనించిన రైతులు, కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో...

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన న్యాలమడుగు శ్రీను (40) ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పత్తి చేనుకు నీరు పారిచ్చేందుకు పొలానికి వెళ్లిన శ్రీను మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ డబ్బాను తెరవడంతో విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయాడు.

✦ 'సీపీఎస్ రద్దు కోసం ఆమరణ దీక్ష'

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీసీపీఎస్ఈఏ) అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్ ప్రకటించారు. సెప్టెంబర్ 1వ తేదీనే తాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ

నాసిరకం విత్తు ఇకపై చిత్తు!

కట్టుదిట్టంగా పత్తి విత్తన జన్యు స్వచ్ఛత పరీక్షలు

- దేశంలోనే తొలిసారిగా మార్గదర్శకాలు రూపొందించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ
- నాసిరకం విత్తనాలు మార్కెట్లోకి రాకుండా కఠిన నిబంధనలు
- స్వచ్ఛత 90 శాతం ఉండాల్సిందే.. అంతకన్నా తక్కువుంటే నాసిరకమే
- నకిలీ విత్తు మార్కెట్‌లోకి రాకుండా పకడ్బందీ చర్యలు
- మార్గదర్శకాలు అమలు చేయాలంటూ కలెక్టర్లకు లేఖ
- దేశవ్యాప్తంగా వీటినే అనుసరించాలని కేంద్రానికి విన్నవించిన రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్: పత్తి విత్తనంలో జన్యు స్వచ్ఛతకు నిర్వహించే గ్రో ఔట్ టెస్ట్ (జీవోటీ)లపై ఆంక్షలు విధించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ నిర్ణయించింది. జీవోటీ పరీక్షల్లో నాసిరకం విత్తనాలని తేలుతున్నా మార్కెట్లో అవి విచ్చలవిడిగా లభిస్తున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జీవోటీ పరీక్షలు, నాసిరకపు విత్తనాలను కట్టడి చేసేందుకు దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఇవే మార్గదర్శకాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించింది. ఈ మార్గదర్శకాలను అమలు చేయాలంటూ వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారథి కలెక్టర్లకు లేఖ రాశారు. ప్రస్తుత నెలలో (జనవరి) పత్తి విత్తన జన్యు స్వచ్ఛత పరీక్షలు నిర్వహించి మార్చి, ఏప్రిల్ నెలల్లో వాటి ఫలితాలు విడుదల చేస్తారు. అందువల్ల ఈ సమయంలోనే మార్గదర్శకాలను అమలు చేయాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో 2 కోట్ల ప్యాకెట్ల విత్తనం!

రాష్ట్రంలో పత్తి విత్తన తయారీ అధికంగా జరుగుతోంది. 10–12 ప్రముఖ కంపెనీలు దాదాపు 30 వేలకు పైగా ఎకరాల్లో రైతులతో పంటను పండిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధికంగా, ఇతర ప్రాంతాల్లో మోస్తరు స్థాయిలో బీటీ పత్తి విత్తనోత్పత్తి జరుగుతోంది. దాదాపు రెండు కోట్ల ప్యాకెట్ల విత్తనం రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతుందని అంచనా. దేశానికి అవసరమయ్యే విత్తనంలో దాదాపు పావు వంతు ఇక్కడ్నుంచే వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా విత్తనోత్పత్తిపై ఎలాంటి నియంత్రణ లేదు. విత్తనం ఉత్పత్తి అయ్యాక దాన్ని విక్రయించే సమయంలో సమస్యలు తలెత్తితే విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకునే వెసులుబాటుంది. కానీ విత్తనోత్పత్తి సమయంలో జరిగే అవకతవకల నియంత్రణకు ఎలాంటి నిబంధనల్లేవు. ఈ నేపథ్యంలోనే మార్గదర్శకాలు తయారు చేసినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. గతేడాది బీటీ–2లో నాసిరకం విత్తనాలతోపాటు బీటీ–3 విత్తనాలు కూడా ఇక్కడే తయారయ్యాయి. వీటిలో బీటీ–3 విత్తనాలకు ఎలాంటి అనుమతి లేదు. విత్తనోత్పత్తిలో ఇంత విచ్చలవిడిగా అవకతవకలు జరుగుతున్నా ప్రభుత్వానికి ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది.

మార్కెట్‌లోకి వస్తున్నాయిలా..

పత్తి విత్తన కేలండర్ ప్రకారం మే ఒకటో తేదీ నుంచి జూలై 15 వరకు విత్తన సాగు చేస్తారు. సెప్టెంబర్ చివరి నుంచి నవంబర్ మధ్య కాలంలో పత్తి తీత ఉంటుంది. నవంబర్ తొలి వారం నుంచి జనవరి చివరి వరకు జిన్నింగ్ చేస్తారు. జనవరిలోనే నమూనాలు సేకరించి జీవోటీ పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి, ఏప్రిల్ మధ్య జీవోటీ ఫలితాలు ప్రకటిస్తారు. జీవోటీ పరీక్షల్లో విత్తన సామర్థ్యాన్ని గుర్తించి అది నాసిరకమా కాదా అని తేలుస్తారు. నాసిరకం అని తేలినా వాటిని మార్కెట్లోకి ప్రవేశపెట్టడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే ఈ మార్గదర్శకాలు ఖరారు చేశారు.



మార్గదర్శకాలివీ..

➠ విత్తన ధ్రువీకరణ ప్రమాణాల ప్రకారం హైబ్రీడ్ పత్తి విత్తన జన్యు స్వచ్ఛత 90 శాతం ఉండాలి. అంతకంటే తక్కువ ఉంటే వాటిని నాసిరకపు విత్తనంగా పరిగణిస్తారు. అలాంటి విత్తనాలను మార్కెట్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశపెట్టకూడదు.

➠ జీవోటీ పరీక్షల్లో విఫలమైన విత్తనాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలి. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ వేయాలి. అవసరమైతే జిల్లా స్థాయిలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేయాలి. నాసిరకపు విత్తనాలని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలి.

➠ జీవోటీ పరీక్షలు సరిగా జరగలేదని భావిస్తే మరోసారి నిర్వహించాలని కోరే హక్కు విత్తనోత్పత్తిదారులకు కల్పించారు. అందుకు తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధ్రువీకరణ సంస్థ ఏర్పాట్లు చేస్తుంది.

➠ జీవోటీ పరీక్షల్లో నాసిరకం అని తేలినా మార్కెట్లోకి వస్తే దాన్ని ధ్వంసం చేయాలి. ఆ విత్తనాలను 50 డిగ్రీల సెల్సియస్ వద్ద అరగంట పాటు కాల్చి వేయాలి. అప్పుడే అది మొలకెత్తే లక్షణాన్ని కోల్పోతుంది.

➠ విత్తనోత్పత్తిదారులకు, వ్యాపారులకు మధ్య ఒప్పందం ఉండాలి. దీని ప్రకారం ఎవరు అక్రమాలకు పాల్పడినా అందుకు సంబంధిత వ్యక్తులే బాధ్యత వహించాలి.

➠ విత్తనోత్పత్తి స్వచ్ఛందంగా ఉండాలి. ఎవరిపైనా ఒత్తిడి చేసి విత్తనోత్పత్తిలో పాల్గొనేలా చేయకూడదు.

➠ దళారుల ప్రమేయం లేకుండా కంపెనీలే రైతులతో విత్తనోత్పత్తి చేయించాలి.

➠ పత్తి విత్తనాన్ని జిన్నింగ్ చేసే సమయంలో విచక్షణారహితంగా రసాయనాలు కలుపుతున్నారు. ఇది పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి హానికరంగా మారుతోంది. దీన్ని నిరోధించేందుకు జిన్నింగ్ మిల్లులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి.

దరఖాస్తు చేశారా?

- ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలో 24 ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులకు చివరి తేదీ: జనవరి 10
- యూపీఎస్సీ.. అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్, అసోసియేట్ ప్రొఫెసర్ తదితర 9 పోస్టులకు చివరి తేదీ: జనవరి 11
- కేంద్రీయ విద్యాలయ సంగఠన్‌లో యూడీసీ, స్టెనో, లైబ్రేరియన్ తదితర 1,017 పోస్టులకు చివరి తేదీ: జనవరి 11



బయాలజీ (తె.మీ.)

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత 13
సోమవారం 8-1-2018
స్పర్ధయా వర్ధతే విద్య

బులెటిన్ బోర్డ్

ఉద్యోగాలు

కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో 10 ఖాళీలు

న్యూఢిల్లీలోని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీవోఎన్‌సీవోఆర్).. 10 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎంటీ).
- **విభాగం:** అకౌంట్స్.
- **వేతనశ్రేణి:** రూ.50,000-రూ.1,60,000.
- **అర్హతలు:** సీఏ ఉత్తీర్ణత.
- **వయసు:** 1989, డిసెంబర్ 31-30, డిసెంబర్, 1999 మధ్య జన్మించి ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్/జీడీ/ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 22, 2018.
- **వెబ్‌సైట్:** www.concorindia.co.in

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో 8 ఖాళీలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్: బెల్).. 8 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టు-ఖాళీలు:** డిప్యూటీ మేనేజర్ (డీఎం)-2; సీనియర్ ఇంజనీర్ (ఎస్ఈ)-4; డిప్యూటీ ఇంజనీర్ (డీఈ)-2.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ ఎంఎస్/పీహెచ్‌డీ. అలాగే ఉద్యోగానుభవం.
- **వయసు:** 2017, డిసెంబర్ 1 నాటికి డీఎంకు 36 ఏళ్లు, ఎస్ఈకి 32 ఏళ్లు, డీఈకి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.500(జనరల్/ఓబీసీ).
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 20, 2018.

వెబ్‌సైట్: www.bel-india.com

ప్రవేశాలు

జేఎన్‌టీయూ అనంతపురంలో పీహెచ్‌డీ, ఎంఫిల్, ఎంఎస్ (రీసెర్చ్)

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూఏ).. 2017-18కి గాను పీహెచ్‌డీ, ఎంఫిల్, ఎంఎస్ (రీసెర్చ్)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
- **కోర్సులు:** పీహెచ్‌డీ (ఎక్స్‌టర్నల్/ ఫుల్‌టైమ్), ఎంఫిల్, ఎంఎస్ (రీసెర్చ్).
- **సీట్లు:** పీహెచ్‌డీ-349 (ఎక్స్‌టర్నల్- 265+ ఫుల్ టైమ్-84); ఎంఫిల్-20; ఎంఎస్-30.
- **విభాగాలు:** సివిల్, ఈఈఈ, ఎంఈ, ఈసీఈ, సీఎస్ఈ, కెమికల్, ఫార్మసీ, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలు, కోర్సులను అనుసరించి డిగ్రీ/పీజీ.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.1,000; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 1, 2018.
- **రూ.1,000 ఆలస్య రుసుముతో చివరి తేదీ:** ఫిబ్రవరి 9, 2018.
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఫెలోషిప్స్

ఎన్‌సీఆర్ఐ డాక్టోరల్ ఫెలోషిప్స్

హైదరాబాద్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ).. రూరల్ స్టడీస్‌లో పరిశోధనలు చేసే అభ్యర్థుల నుంచి 2018-19కి గాను డాక్టోరల్ ఫెలోషిప్స్‌కు దరఖాస్తులు కోరుతోంది.
- **కాల వ్యవధి:** మూడేళ్లు.
- **ఫెలోషిప్:** రూ.16,000. అలాగే కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.15,000 అదనంగా ఇస్తారు.
- **పరిశోధన విభాగాలు:** రూరల్ కమ్యూనికేషన్, రూరల్ మేనేజ్‌మెంట్, రూరల్ సోషల్ వర్క్, రూరల్ సోషియాలజీ, రూరల్ టూరిజం, రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రూరల్ ఎడ్యుకేషన్ తదితర రూరల్ స్టడీస్ అంశాలు.
- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో పరిశోధనలకు ఏదైనా విద్యాసంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలి. అలాగే సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో పీజీ/తత్సమాన విద్య, నెట్/స్లెట్/ ఎంఫిల్.
- **వయసు:** దరఖాస్తు సమర్పణ గడువు నాటికి 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/ దివ్యాంగ/ఓబీసీ/మహిళ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'మెంబర్ సెక్రెటరీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్‌సీఆర్ఐ), సాకార్ భవన్, ఫతేమైదాన్ రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్-500004' చిరునామాకు గడువులోగా పంపాలి. లేదా fellowship.ncri@gmail.com మెయిల్ ఐడీకి మెయిల్ చేయాలి.
- **దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ:** జనవరి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.ncri.in

లైసెన్సియేట్ ఎగ్జామ్‌తో ఇబ్బందే!

గెస్ట్ కాలమ్

నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లు .. దేశంలో వైద్య విద్యలో సమూల మార్పుల దిశగా ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన బిల్లు. ఇప్పుడు ఈ బిల్లుపై మెడికల్ విద్యార్థులు, ఈ రంగంలోని నిపుణుల్లో ప్రతికూల అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా లైసెన్సియేట్ ఎగ్జామినేషన్, ప్రైవేటు విద్యా సంస్థలకు ఫీజుల పరంగా స్వయం ప్రతిపత్తి తదితర అంశాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజా బిల్లుపై ఐఎంఏ జాతీయ అధ్యక్షులు, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిటీ సభ్యులు డాక్టర్ కె.కె.అగర్వాల్ గెస్ట్ కాలమ్..


డాక్టర్ కె.కె.అగర్వాల్, నేషనల్ ప్రెసిడెంట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ).

ఉద్దేశం నెరవేరుతుందా?

మెడికల్ అడ్వయిజరీ కౌన్సిల్ (ఎంఏసీ), నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ), మరో నాలుగు బోర్డులను ఏర్పాటు చేయాలని.. వాటికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని నిర్ణయించినట్లు బిల్లులో పేర్కొన్నారు. అయితే అందులో సభ్యులందరూ కేంద్ర ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులే ఉంటారని చెబుతున్నారు. అంతేకాకుండా నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్‌లో మెడికల్ రంగంలోని నిపుణులే కాకుండా.. మేనేజ్‌మెంట్, లా, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకనామిక్స్ తదితర రంగాలకు చెందిన నిపుణులు కూడా ఉంటారని పేర్కొన్నారు. దీనివల్ల అసలు ఉద్దేశం నెరవేరుతుందా? అనే సందేహం తలెత్తుతోంది. అదే విధంగా ఛైర్‌పర్సన్, సెక్రటరీ వంటి పోస్టులను కూడా నామినేటెడ్ విధానంలో భర్తీచేయాలనే ప్రతిపాదన కారణంగా.. పదవీ విరమణ పొందిన బ్యూరోక్రాట్స్ తెరవెనక ప్రయత్నాలతో ఈ పోస్టులను దక్కించుకునే అవకాశముంది. ఈ విషయంలో కేవలం మెడికల్ రంగానికి చెందిన నిపుణులే అని పేర్కొని ఉంటే బాగుండేది. స్వయం ప్రతిపత్తితో కూడిన బోర్డులు పర్యవేక్షిస్తాయని పేర్కొన్నప్పటికీ.. బిల్లులోని ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ అటానమస్ బోర్డులు వాస్తవానికి ప్రభుత్వ దిశానిర్దేశాల మేరకు నడుచుకోవాల్సిందే. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే పేరుకే స్వయం ప్రతిపత్తి అనే భావన కలుగుతోంది.

పారదర్శకత అనుమానమే..

ప్రస్తుత స్వరూపంలోనే బిల్లును అమల్లోకి తెస్తే.. వైద్య విద్యలో పారదర్శకత అనే మాట వాస్తవ దూరంగానే నిలిచిపోతుందనిపిస్తోంది. ఉదాహరణకు బిల్లులో ప్రతిపాదించిన నేషనల్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్ విధానాన్ని పరిగణనలోకి తీసుకుంటే... చట్టం రూపొందిన మూడేళ్లలోపు లైసెన్సియేట్ ఎగ్జామ్ అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే విదేశాల్లో వైద్యవిద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎలాంటి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకుండానే శాశ్వత రిజిస్ట్రేషన్ పొంది.. మన దేశంలో ప్రాక్టీస్ లేదా ఉన్నతవిద్య చేసే అవకాశం కలుగుతుంది. ఇది బ్యాక్‌డోర్ ఎంట్రీకి అవకాశం కల్పిస్తుంది. లైసెన్సియేట్ ఎగ్జామినేషన్ నిర్వహణ పరంగా కచ్చితంగా కాల పరిమితి విధానం అవలంబించాలి. లేదంటే ఏటా లక్ష మంది వరకు విదేశాల్లో వైద్యవిద్య పూర్తి చేసుకుంటున్న భారత విద్యార్థులు... బ్యాక్ డోర్ ఎంట్రీ విధానంలో వైద్య రంగంలో అడుగుపెట్టే ఆస్కారం ఉంటుంది.



గ్రామీణ విద్యార్థులపై భారం

మనదేశంలో ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు కూడా లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధన చాలా ఇబ్బందికర అంశమే. ఇది వారు నేషనల్ మెడికల్ రిజిస్ట్రీలో తమ పేరు నమోదు చేసుకోవడానికి, లేదా ఉన్నత విద్య అభ్యసించడానికి అడ్డంకి అనేది నా అభిప్రాయం. మొత్తంమీద మన దేశంలో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకు లైసెన్సియేట్ ఎగ్జామినేషన్ విధానం వల్ల కెరీర్ పరంగా హాని చేస్తుంది. లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో క్లిష్టత ఎంతో ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో దీన్ని తప్పనిసరి చేయడం వల్ల ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారు.

మనదేశంలో ఎంబీబీఎస్ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు కూడా లైసెన్సియేట్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి అనే నిబంధన చాలా ఇబ్బందికర అంశమే. ఇది వారు నేషనల్ మెడికల్ రిజిస్ట్రీలో తమ పేరు నమోదు చేసుకోవడానికి, లేదా ఉన్నత విద్య అభ్యసించడానికి అడ్డంకి అనేది నా అభిప్రాయం.

'ఫీజు' స్వేచ్ఛ సరికాదు

ప్రైవేటు మెడికల్ కళాశాలల్లోని ఫీజుల పరంగా 40 శాతం సీట్లకు సంబంధించిన ఫీజులను ఎన్ఎంసీ నిర్ణయిస్తుందనే ప్రతిపాదన కూడా అర్థం కాని విషయంగా మారింది. 40 శాతం సీట్ల సంఖ్యను ఏ ప్రాతిపదికన తీసుకున్నారు? అదే విధంగా ఫీజులు ఏ మేరకు ఉంటాయో? చెప్పకపోవడం సరికాదు. ఇక 60 శాతం సీట్ల విషయంలో యాజమాన్యాలకు స్వేచ్ఛ ఇవ్వడం కూడా ఆక్షేపణీయం. నిబంధనలు అతిక్రమించిన మెడికల్ కళాశాలలపై జరిమానాలు విధిస్తామని బిల్లులో పేర్కొన్నారు. దీనివల్ల కళాశాలల నైతిక ప్రవర్తన మెరుగుపడుతుందని అనుకోవడం కూడా పొరపాటే!

ఇలా అయితేనే నాణ్యత

వైద్య విద్యలో నాణ్యత ప్రమాణల పెంపు కోసం అడుగులు వేయడం హర్షణీయమే. వైద్య విద్య ప్రమాణాల పెంపు దిశగా.. ముందుగా ప్రస్తుత విధానంలో ఉన్న చట్టాన్ని సవరించాలి. ఎంసీఐ, ఐఎంఏ ఇచ్చిన సలహాలను అమలు చేయాలి. పరీక్ష విధానాన్ని సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా తీర్చిదిద్దాలి. అప్పుడే వైద్య విద్యలో నాణ్యత అనే లక్ష్యం సాకారమవుతుంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకునే.. పార్లమెంటు స్థాయీ సంఘం మా వాదనలు కూడా వినాలని, బిల్లులోని ప్రతి అంశంపై మా అభిప్రాయాలు తీసుకోవాలని కోరుతున్నాం.



విద్యార్థులకు ఇచ్చే సలహా

వైద్య విద్య ఔత్సాహికులు, విద్యార్థులకు ఇచ్చే సలహా.. విధానాల్లో మార్పులు వచ్చినా మీలో వృత్తిపై నిబద్ధతలో మార్పు రాకూడదు. నిరంతరం వృత్తి పట్ల అంకిత భావం, కెరీర్ పరంగా పారదర్శకంగా వ్యవహరించాలి. అంతేకాకుండా వైద్యవృత్తికి ఉన్న ఘనతను కాపాడేలా వృత్తిని కొనసాగించాలి. అప్పుడే విధానాల పరంగా మార్పులు జరిగినా వ్యక్తిగతంగా గుర్తింపు, కెరీర్ పరంగా ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చు!

'సెట్' అవ్వండిలా..

హయ్యర్ ఎడ్యుకేషన్



ఎంసెట్, ఐసెట్, లాసెట్, ఈసెట్, ఎడ్‌సెట్.. ఈ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సెట్)లన్నీ ఉన్నతవిద్య అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మార్గాలు. రెండు తెలుగు రాష్ట్రాల్లో సెట్‌ల సందడి మొదలైంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో సెట్‌ల తేదీలు విడుదల కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే పరీక్షల తేదీలు ఖరారు కానున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఎంతో కీలకమైన వివిధ సెట్స్, అర్హతలు, పరీక్ష విధానం తదితరాలపై ఫోకస్..

ఎంసెట్

ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎంసెట్)లో మంచి ర్యాంకుతో బీటెక్, అగ్రికల్చర్, ఫార్మసీ, ఫార్మా-డి కోర్సుల్లో అడుగు పెట్టొచ్చు. గతేడాది వరకు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు కూడా ఎంసెట్‌లో ర్యాంకులనే పరిగణనలోకి తీసుకునేవారు. కానీ, నీట్-యూజీ ప్రవేశంతో ప్రస్తుతం ఎంసెట్.. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, ఫార్మా-డిలకే అర్హత ప్రమాణంగా నిలుస్తోంది.

ఇంజనీరింగ్ స్ట్రీమ్: బీటెక్ ఔత్సాహిక విద్యార్థులు దీనికి హాజరవుతారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణత అర్హతతో నిర్వహించే ఈ స్ట్రీమ్ ఎంట్రన్స్ ఈసారి రెండు రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. పరీక్షలో మ్యాథమెటిక్స్ నుంచి 80, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు ఉంటాయి. మూడు గంటల సమయం అందుబాటులో ఉంటుంది. ర్యాంకుల ఆధారంగా బీటెక్, బీటెక్ (డెయిరీ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశించొచ్చు. ఎంసెట్ తుది ర్యాంకుల రూపకల్పనలో ఎంసెట్ స్కోర్‌కు 75 శాతం వెయిటేజీ, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఉంటుంది. 2017-18 గణాంకాల ప్రకారం ఇంజనీరింగ్ కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 47 వేలు, తెలంగాణలో 41 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అగ్రికల్చర్, మెడికల్ స్ట్రీమ్: అగ్రికల్చర్ బీఎస్సీ, బీఎస్సీ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, బీఫార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఈ విభాగం ర్యాంకులు ప్రామాణికంగా నిలుస్తున్నాయి. బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అర్హతతో దీనికి హాజరుకావొచ్చు. పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 చొప్పున ప్రశ్నలు; బయాలజీ (బోటనీ, జువాలజీ) నుంచి 80 ప్రశ్నలు ఉంటాయి.

పీజీఈసెట్

- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీజీఈసెట్) ర్యాంకు ఆధారంగా రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీల్లో ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మసీ తదితర పీజీ స్థాయి ప్రోగ్రామ్‌లలో ప్రవేశించొచ్చు.
  అర్హత: సంబంధిత బ్రాంచ్‌లో 50 శాతం మార్కులతో బీటెక్/బీఈ/ బీఫార్మసీ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణత.
- పీజీఈసెట్‌ను 120 మార్కులకు నిర్వహిస్తారు. అందుబాటులో ఉండే సమయం రెండు గంటలు. బీటెక్ ఉత్తీర్ణులు.. ఎంటెక్‌లో తమకు ఆసక్తి ఉన్న స్పెషలైజేషన్‌కు అనుగుణంగా పీజీఈసెట్‌లో నిర్దేశ సబ్జెక్టు పేపర్‌కు హాజరుకావాలి. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్, బయో టెక్నాలజీ, సీఎస్ అండ్ ఐటీ, ఎలక్ట్రికల్, ఈసీఈ, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్, మెటలర్జీ, నానో టెక్నాలజీ, ఫార్మసీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ స్పెషలైజేషన్లలో పరీక్ష నిర్వహిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు 18 వేల చొప్పున ఎంటెక్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- పీజీఈసెట్ కౌన్సెలింగ్ సమయంలో జాతీయ స్థాయిలో నిర్వహించే గేట్ విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. మిగిలిన సీట్లను పీజీఈసెట్ ఉత్తీర్ణులతో భర్తీ చేస్తారు.




తెలంగాణలో సెట్ తేదీలు

సెట్	పరీక్ష తేదీలు
ఎంసెట్	మే 2 నుంచి 5 వరకు
ఈసెట్	మే 9, 2018
పీజీఈసెట్	మే 27 నుంచి
ఐసెట్	మే 17, 2018
లాసెట్	మే 25, 2018
ఎడ్‌సెట్	మే 31, 2018
పీఈసెట్	మే 20 నుంచి

గమనిక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 'సెట్' తేదీలు కొద్ది రోజుల్లో ఖరారు కానున్నాయి.

ఈసెట్

- బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో అడుగు పెట్టేందుకు మరో మార్గం.. ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్). పాలిటెక్నిక్/బీఎస్సీ (మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన అభ్యర్థులు దీనికి అర్హులు. ఇందులో ర్యాంకు ద్వారా లేటరల్ ఎంట్రీ విధానంలో నేరుగా బీటెక్/బీఈ/ బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశించొచ్చు.
- 200 మార్కులకు ఈసెట్ నిర్వహిస్తారు. డిప్లొమా ఉత్తీర్ణులకు మ్యాథమెటిక్స్ (50 ప్రశ్నలు), ఫిజిక్స్ (25 ప్రశ్నలు), కెమిస్ట్రీ (25 ప్రశ్నలు), ఇంజనీరింగ్ సబ్జెక్టు (100 ప్రశ్నలు)లు ఉంటాయి. ఫార్మసీ ఉత్తీర్ణులకు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మకోగ్నసీ, ఫార్మకాలజీ విభాగాల నుంచి 50 చొప్పున ప్రశ్నలు ఉంటాయి.
- బీఎస్సీ మ్యాథమెటిక్స్ ఉత్తీర్ణులకు మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు; అనలిటికల్ ఎబిలిటీ, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ నుంచి 50 చొప్పున ప్రశ్నలుంటాయి. ఈ పరీక్షకు లభించే సమయం మూడు గంటలు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో 20 వేలకు పైగా సీట్ల చొప్పున ఈసెట్ ద్వారా అందుబాటులో ఉన్నాయి.



ఐసెట్

- ఎంసెట్ తర్వాత అత్యంత క్రేజ్ ఉన్న ఎంట్రన్స్.. ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐసెట్)! ఇందులోని ర్యాంకు ద్వారా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరొచ్చు.
- **అర్హత:** ఎంబీఏ కోర్సు ఔత్సాహికులకు 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఎంసీఏ కోర్సు ఔత్సాహికులకు 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌ను ఒక సబ్జెక్టుగా చదివుండాలి. ఐసెట్‌లో అనలిటికల్ ఎబిలిటీ నుంచి 75, మ్యాథమెటికల్ ఎబిలిటీ నుంచి 75 ప్రశ్నలు ఉంటాయి. కమ్యూనికేషన్ ఎబిలిటీ నుంచి 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇలా మొత్తం 200 ప్రశ్నల (200 మార్కులు)తో నిర్వహించే ఐసెట్‌కు లభించే సమయం మూడు గంటలు. ఐసెట్ ద్వారా ఎంబీఏ కోర్సుకు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో 20 వేలకు పైగా సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయి.

ఎడ్‌సెట్

- ఉపాధ్యాయ వృత్తికి అవసరమైన అర్హతలను అందించే ప్రవేశ పరీక్ష.. ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎడ్‌సెట్). ఈ పరీక్షతో రెండేళ్ల వ్యవధి కలిగిన బీఈడీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు.
- **అర్హత:** బీఏ/బీఎస్సీ/బీఎస్సీ (హోంసైన్స్)/ బీకాం/బీసీఏ/ బీబీఎం కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. అదేవిధంగా నిబంధనల మేరకు బీఈ/బీటెక్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఎడ్‌సెట్‌కు హాజరుకావొచ్చు.



పరీక్ష స్వరూపం: ఎడ్‌సెట్‌ను రెండు గంటల వ్యవధిలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో పార్ట్-ఎ; పార్ట్-బి; పార్ట్-సి విభాగాలు ఉంటాయి. వీటిలో మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. **పార్ట్-ఎ:** జనరల్ ఇంగ్లిష్ - 25 ప్రశ్నలు; **పార్ట్-బి:** ఇందులో రెండు ఉప విభాగాలు ఉంటాయి. అవి.. 1) జనరల్ నాలెడ్జ్-15 ప్రశ్నలు; 2) టీచింగ్ ఆప్టిట్యూడ్-10 ప్రశ్నలు. **పార్ట్-సి:** ఎంపిక చేసుకున్న సబ్జెక్టు (మ్యాథమెటిక్స్/ఫిజికల్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/సోషల్ స్టడీస్/ఇంగ్లిష్) నుంచి 100 ప్రశ్నలుంటాయి.

లా సెట్

న్యాయవాద వృత్తిలో స్థిరపడాలకునే వారికి అవసరమైన ప్రవేశ పరీక్ష.. లా సెట్. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. అదేవిధంగా ఇంటర్ అర్హతతో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ కోర్సుల్లో అడుగుపెట్టొచ్చు.

పరీక్ష స్వరూపం: లా సెట్‌ను పార్ట్-ఎ (జీకే అండ్ మెంటల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు); పార్ట్-బి (కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు); పార్ట్-సి (ఆప్టిట్యూడ్ ఫర్ ది స్టడీ ఆఫ్ లా-60 ప్రశ్నలు) విభాగాల్లో మొత్తం 120 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష కాలవ్యవధి 90 నిమిషాలు.

Dwaraka

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం 8-1-2018

స్టాక్ మార్కెట్లు
శుక్రవారం ముగింపు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
184 ▲	54 ▲
34,154	10,559

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,137	▲ 59
డోజోన్స్	25,296	▲ 221
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,724	▲ 28
డాక్స్	13,320	▲ 152
షాంఘై	3,392	▲ 7
నికాయ్	23,715	▲ 208

అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు
రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.10	64.23
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.34	87.51
€	యూరో	ఎస్‌బీఐ	77.72	77.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.05	57.17
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.64	50.74
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.47	48.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.32	18.17
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.69	18.34
¥	చైనా యువాన్	థామస్‌కుక్	[illegible]	11.22



పసిడి రన్... నాల్గవవారం!

- వారంలో 15 డాలర్ల పెరుగుదల
- దేశీయంగా 'రూపాయి' బ్రేక్

డాలర్ ఇండెక్స్ పతనం... అమెరికా–ఉత్తరకొరియా పరస్పర 'అణు బటన్' హెచ్చరికల నేపథ్యంలో అంతర్జాతీయంగా పసిడి వరుసగా నాల్గవ వారమూ దూసుకుపోయింది. న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర వారంలో 15 డాలర్లు బలపడి 1,320 డాలర్లకు చేరింది. నాలుగు వారాల్లో కనిష్ట స్థాయి నుంచి దాదాపు 80 డాలర్లు పైకి ఎగసింది. దీనికి తక్షణ మద్దతు 1,305 డాలర్లయితే, దాన్ని కోల్పోతే 1,270, 1,240 డాలర్లు. అంతకు మించి తగ్గకపోవచ్చన్నది నిపుణుల మాట. ఇక పెరిగితే 1350 డాలర్ల వద్ద తక్షణ నిరోధం ఉందని, అదీ దాటితే 1375 డాలర్ల వద్ద నిరోధం ఎదురు కావచ్చనేది వారి విశ్లేషణ. ఇక డాలర్ ఇండెక్స్ వారంలో మరో 0.25 సెంట్లు పడిపోయి 91.75కు క్షీణించింది. గడచిన నాలుగువారాల్లో పతనం 2.25 డాలర్లు.

దేశీయంగా స్వల్ప పెరుగుదల

అంతర్జాతీయంగా పసిడి 15 డాలర్లు పెరిగినప్పటికీ, దేశీయంగా రూపాయి బాగా బలపడి డాలర్‌తో మారిస్తే రూ.63.27కు చేరటంతో ఆ ప్రభావం ఇక్కడి ఫ్యూచర్స్ మార్కెట్‌లో కనపడలేదు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్–ఎంసీఎక్స్‌లో వారంలో కేవలం రూ.51 పెరిగి రూ.29,216 కు చేరింది. ఇక ముంబై స్పాట్ మార్కెట్లో వారం వారీగా 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.185 పెరిగి రూ.29,575 వద్ద ముగియగా, వెండి ధర కేజీకి రూ.300 లాభపడి రూ.38,725 వద్ద ముగిసింది. ప్రపంచవ్యాప్తంగా సానుకూల ఆర్థిక పరిణామాలు, మెరుగుపడుతున్న వృద్ధి తదితర అంశాలు కొత్త సంవత్సరంలో పసిడికి తోడ్పాటునిచ్చే అవకాశాలున్నట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేసింది.

కొత్త ఏడాదైనా కాస్త మారదాం..!



మరో సంవత్సరంలోకి అడుగుపెట్టేశాం. మరి ఆర్థికాంశాలకు సంబంధించి ఎప్పుడూ ఏవేవో సాకులు చెప్పుకుంటూ వాయిదాలు వేస్తూ వస్తున్న వారు ఇప్పటికైనా సరైన ప్రణాళిక వేసుకున్నారా? లేదనుకోండి... ఇకనైనా ఆలస్యం చెయ్యకండి. ఎందుకంటే గమ్యంపై స్పష్టత ఉంటేనే ప్రయాణం వేగంగా, సాఫీగా సాగుతుంది. ఈ కొత్త సంవత్సరంలో అనుసరించదగ్గ ఆర్థిక తీర్మానాల గురించి నిపుణులు, ఆర్థిక సలహాదారులు ఏం చెబుతున్నారో ఒకసారి చూద్దాం...

- వీలైనంత ముందు నుంచే పెట్టుబడులు
- క్రెడిట్ కార్డు బకాయిలకు దూరమే బెటర్
- రాబడుల కోసం ఈక్విటీలు మెరుగు
- బీమా తప్పనిసరి; అదుపులో ఉండాలి ఖర్చు

ఆలస్యం విషమే!

కొత్తవారైతే ముందు 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెక్షన్ 80సీ ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే పెట్టుబడులకింకా మూడు నెలల వ్యవధి మాత్రమే ఉంది. మార్చిలోపు పన్ను ఆదా పథకాల్లో ఇన్వెస్ట్ చేయాలి. చివరి నిమిషం వరకు వాయిదా వేస్తే ఆఖర్లో ఏదో ఒక సాధనంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తుంది. అదే ముందుగా ఆరంభిస్తే వయసు, అవసరాలు, రిస్క్ తీసుకోగల స్థాయి, రాబడులు, అవసరంలో నగదు చేసుకోగల వెసులుబాటు వంటివన్నీ పరిశీలించి తగిన సాధనాలను ఎంపిక చేసుకోవచ్చు. ఏప్రిల్ నుంచి ఆర్థిక సంవత్సరం ఆరంభం అవుతుంది కనక కనీసం జూన్ నుంచయినా పన్ను ఆదా పెట్టుబడులను ఆరంభించి ఏడాది పాటు కొనసాగించాలి. ముందుగా ఆరంభించడం వల్ల కాంపౌండింగ్ ప్రయోజనంతో అధిక రాబడులకు అవకాశం ఉంటుంది.

సకాలంలో రిటర్నులు వేయండి...

మనలో కొందరు పన్ను రిటర్నులను సకాలంలో దాఖలు చేయరు. ఇది సరైన విధానం కాదు. ఎందుకంటే ఆలస్యమైతే వడ్డీతో పాటు పెనాల్టీ కూడా భరించాలి. గడువులోపు రిటర్నులు వేయకపోతే ఆలస్య రుసుం గతంలో రూ.1,000గా ఉండగా అదిప్పుడు రూ.10,000గా మారింది. అందుకే గడువులోపు రిటర్నులు ఫైల్ చేయాలి. గడువులోపు బీమా పాలసీల ప్రీమియం చెల్లించడం కూడా అవసరమే. లేదంటే బీమా రక్షణ కోల్పోవాల్సి వస్తుంది. ఇంకా రుణాలకు సకాలంలో చెల్లింపులు చేయడం కూడా తప్పనిసరి. ఎందుకంటే ఆలస్యమైతే అనవసర వడ్డీ భారంతో పాటు క్రెడిట్‌స్కోరు కూడా తగ్గిపోతుంది.

క్రెడిట్ కార్డు బిల్లు మొత్తం కట్టేస్తే బెటర్!

చాలా మందికి క్రెడిట్ కార్డుపై భారీ మొత్తం వాడటం, నెలయ్యేసరికి ఎంతో కొంత కనీస బిల్లు చెల్లించటం అలవాటు. కానీ అలా చేయటం వల్ల వారి మొత్తం రుణం ఎప్పటికీ తీరదనేది గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బ్యాలెన్స్ మొత్తంపై దాదాపు నెలకు 2.5 నుంచి 3 శాతం వడ్డీ అంటే ఏడాదికి 30–36 శాతం చెల్లించాల్సి వస్తుంది. దీనికి ఆలస్యపు చెల్లింపుల ఫీజు కూడా తోడైతే ఇక చెప్పనక్కర్లేదు. అందుకే కార్డుపై వీలైనంత తక్కువ వాడటం... ఏ నెలకు ఆ నెల మొత్తం బిల్లు చెల్లించేయటం చేస్తుండాలి. రుణ సమస్యల్లో ఉన్న వారు ముందుగా తీర్చేయాల్సింది క్రెడిట్ కార్డు బకాయిలే. రివాల్వింగ్ క్రెడిట్‌కు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి.

జీవితానికీ కవరేజీ తప్పనిసరి..

లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ చాలా అవసరం. ఎందుకంటే జీవితం, ఆరోగ్యం అన్నవి ఇలానే ఉంటాయని ఊహించలేం. అనారోగ్యం పాలైతే అయ్యే వ్యయాలు బడ్జెట్‌ను గుల్ల చేసేస్తాయి. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి దూరమైతే ఆ కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టు ముడతాయి. అందుకే తమ వార్షిక ఆదాయానికి కనీసం పది రెట్ల మేర బీమా పాలసీ తీసుకోవడం మరవద్దు. ఏవైనా రుణాలు తీసుకుని ఉంటే వాటికి సరిపడా బీమా కవరేజీ పెంచుకోవాలి. జీవిత బీమాకు టర్మ్ పాలసీలు ఉత్తమం. తక్కువ ప్రీమియానికే గణనీయమైన కవరేజీనిస్తాయి. అలాగే రూ.4–5 లక్షల కవరేజీతో ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్‌పాలసీ కూడా తీసుకోవాలి.

ఖర్చుల్లో స్మార్ట్‌గా...

ఆరు నెలల అవసరాలను తీర్చే స్థాయిలో ఓ అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం అవసరం. అనుకోని, అనూహ్య, అత్యవసరాలు ఏర్పడితే ఆదుకుంటుంది. ఈ నిధుల్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లలో లేదా తక్కువ రిస్క్ ఉండే లిక్విడ్ డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అవసరంలో వేగంగా వీటిని వెనక్కి తీసుకునే సౌలభ్యం ఉంటుంది. అయితే, సంక్షోభం ఏర్పడితే తప్ప ఈ నిధుల్ని కదలించకూడదు. మీ బడ్జెట్ పరిమితుల్లో స్మార్ట్‌గా ఖర్చు చేయడాన్ని కూడా తెలుసుకోవాలి. ఈ ఖర్చులు చేయి దాటిపోకుండా వాటిని నిరంతరం పరిశీలిస్తూ ఉండాలి. ఈ విషయంలో సాయం చేయడానికి ఆన్‌లైన్ మనీ మేనేజ్‌మెంట్ టూల్స్ చాలానే ఉన్నాయి. అవసరం లేని వాటిని రుణం తీసుకుని కొనే చర్యలకు దూరంగా ఉండాలి.

ఈక్విటీల్లో సిప్ చేయండి..

ఏడాదికి 4– 6 శాతం వడ్డీనిచ్చే సేవింగ్స్ ఖాతాలో నిధులను నిల్వ చేసుకోవడం సరికాదు. పైగా సేవింగ్స్ రాబడులు ఏడాదిలో రూ.10,000 దాటితే పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అందుకే అధిక రాబడులను ఇచ్చే వాటిలో ఇన్వెస్ట్ చేసే అవకాశాలపై దృష్టి సారించడం మంచిది. స్థిరమైన ఆదాయం కోసం డెట్ సాధనాలు అవసరమే కానీ, వీటిలో చాలా వరకు దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులను ఇవ్వలేవు. ఈక్విటీలకు మాత్రం ద్రవ్యోల్బణాన్ని మించి రాబడులనిచ్చే సత్తా ఉంది. అందుకే, ఏ సాధనానికి ఎంత కేటాయించాలన్నది ముందుగానే నిర్ణయించుకోవాలి. మీ వయసు, అవసరాలు, రిస్క్‌కు అనుగుణంగా ఈక్విటీ, డెట్ తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీల్లో ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి అందరికీ నప్పే ఓ ఆచరణీయ సూత్రం ఉంది. 100 నుంచి మీ ప్రస్తుత వయసు తీసివేయగా, ఎంత వస్తే అంత మేర ఈక్విటీలకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. ఉదాహరణకు మీ వయసు 35 అనుకోండి. అప్పుడు 65 వస్తుంది. అంటే ఈక్విటీలకు మీ పెట్టుబడుల్లో 65 శాతం కేటాయించుకోవచ్చని అర్థం. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే అందుకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకోవడం కొంత వరకు రక్షణాత్మకం. స్వల్పకాలంలో అస్థిరతలు ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో మాత్రం మంచి ఫండ్స్ రెండంకెల స్థాయిలో లాభాలను ఇస్తున్నాయి. పైపెచ్చు ఈక్విటీ ఫండ్స్‌లో ఏకమొత్తంలో కంటే నెలవారీ సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయటమే మంచిది. ముఖ్యంగా మార్కెట్లు బాగా పెరిగి ఉన్న ప్రస్తుత స్థితిలో స్టాక్స్ విలువలు చాలా గణనీయమైన స్థాయిలో ఉన్నాయి. ఒకవేళ మార్కెట్లు కరెక్షన్‌కు లోనవుతున్నా గానీ సిప్ రూపంలో పెట్టుబడులు ఆపకూడదు. మార్కెట్లు తగ్గుతున్నప్పుడు ఫండ్స్ యూనిట్ల విలువ కూడా తగ్గుతుంది. కనుక సిప్ రూపంలో ఎక్కువ యూనిట్లు లభిస్తాయి. స్వల్పకాలంలో ఆటుపోట్లు కనిపించినా దీర్ఘకాలంలో సిప్ చాలా చక్కని రాబడులకు బాట వేస్తుంది.

ఎన్‌పీఎస్ ఎందుకు వద్దట?

జాతీయ స్థాయి సర్వేలో ఇన్వెస్టర్ల అభిప్రాయాలివీ

- 60 వచ్చే వరకూ లాకిన్ ఇష్టం లేదని పలువురి మాట
- చివర్లో వచ్చే నిధిపై పన్నేయడం నచ్చని వారు ఎందరో
- యాన్యుటీలో పెట్టాలనడం మరో ప్రతిబంధకం
- రాబడులకు హామీ లేకపోవడం కూడా నిరుత్సాహకరం
- ప్రతి నిబంధన వెనుక రాబడులే పరమార్థమన్న నిపుణులు

పన్ను పరంగా ఆదాకు అవకాశమివ్వటం... రిటైరయిన తరవాత పింఛన్ ఉండని వారికి భరోసా కల్పించటం.. ఈ రెండే ప్రధాన లక్ష్యాలుగా దేశంలో జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) ప్రారంభమయింది. ఉద్యోగుల్లో చాలా మందికి పింఛన్ లేదు కనక... వారిని దృష్టిలో పెట్టుకుని ఆరంభించిన పథకమిది. నిజానికి దేశంలో అత్యధికులు పింఛన్ అవకాశం లేనివారే!! కానీ వారిలో చాలా మంది ఎన్‌పీఎస్ వైపు చూడటం లేదు. ఎందుకని? దీన్లో ఉన్న లోపాలేంటి? సరిదిద్దాల్సిన అంశాలేంటి? ఇదే విషయమై ఈ మధ్య జాతీయ స్థాయిలో ఓ సర్వే జరిగింది. దాన్లో పలు ఆసక్తికరమైన విషయాలు బయటపడ్డాయి. ఆ వివరాల సమాహారమే ఈ కథనం...



జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) పన్ను ఆదాకు వీలు కల్పించినా 60వ ఏట వరకు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవటానికి అవకాశం లేదు. ఈ లాకిన్ వ్యవధి చాలా మందికి నచ్చటం లేదు. ఇక పథకం కాల వ్యవధి ముగిసిన తర్వాత... అంటే 60వ ఏట చేతికొచ్చే నిధిలో 60 శాతంపై పన్ను విధిస్తున్నారు. ఇది మరికొందరికి నచ్చటం లేదు. కాల వ్యవధి తీరిన తర్వాత వచ్చే మొత్తంపై పన్ను విధిస్తున్నారు కాబట్టి... పెట్టుబడి పెట్టేటపుడు పన్ను మినహాయింపు ఇస్తున్నా అది ఇవ్వనట్టేనని కొందరి భావన. ఈ తరహా కారణాలే వారిని ఎన్‌పీఎస్‌కు దూరంగా ఉండేలా చేస్తున్నాయంటూ ఈ సర్వేలో వెల్లడైంది. వాటిపై నిపుణుల అభిప్రాయాలు కూడా ఇన్వెస్టర్ల మనోభావాలకు తగ్గట్టే ఉన్నాయి.

ఎన్‌పీఎస్ కార్పస్‌పై పన్ను భారమే!!

ఈపీఎఫ్, పీపీఎఫ్ మాదిరిగా కాకుండా ఒక్క ఎన్‌పీఎస్‌లో మాత్రం గడువు ముగింపునాటికి చేతికొచ్చే నిధిలో 40 శాతమే పన్ను రహితం. మిగతా 60 శాతంపై మాత్రం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్నే ఎన్‌పీఎస్‌కు పెద్ద విఘాతం. పైపెచ్చు పన్ను రహితంగా తీసుకున్న 40 శాతం నిధులను తప్పనిసరిగా యాన్యుటీ ప్లాన్‌లో పెట్టాల్సి ఉంటుంది. దీంతో ఇది కూడా పన్ను పరిధిలోకి వచ్చినట్టేనని, యాన్యుటీ ప్లాన్ నుంచి ప్రతి నెలా వచ్చే పెన్షన్ ఆదాయం పన్ను పరిధిలోకి రావడమే కారణమని అవుట్‌లుక్ ఏషియా క్యాపిటల్ సీఈవో మనోజ్ నాగ్‌పాల్ అభిప్రాయపడ్డారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) చైర్మన్ హేమంత్ సైతం ఎన్‌పీఎస్‌పై పన్ను సమంజసం కాదని అంగీకరించారు. అయితే, పన్ను తగ్గించుకోవడానికి మార్గాలున్నాయన్నది ఆయన అభిప్రాయం. ''40 శాతం కార్పస్‌పై పన్ను లేదు. మరో 40 శాతాన్ని యాన్యుటీలో పెట్టడం ద్వారా దానిపై కూడా పన్ను లేకుండా తప్పించుకోవచ్చు. మిగిలిన 20 శాతంపై కూడా పన్ను వద్దనుకున్నారనుకోండి. దాన్ని కూడా యాన్యుటీ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు'' అని హేమంత్ సూచించారు. ''రిటైర్మెంట్ తర్వాత కూడా ఇన్వెస్ట్ చేసుకునేందుకు ఎన్‌పీఎస్ అనుమతిస్తోంది. 70వ సంవత్సరం వచ్చే వరకు వాయిదాల రూపంలో వెనక్కి తీసుకోవచ్చు. సరైన ఉపసంహరణ ప్రణాళికతో పన్నును సున్నాకు తగ్గించుకునే అవకాశం ఉంది'' అనేది ఆయన అభిప్రాయం. కాకపోతే యాన్యుటీ ప్లాన్‌పై నెలనెలా వచ్చే పెన్షన్.. పన్ను పరిధిలోనే ఉంటుందనేది గమనార్హం.

మ్యూచువల్ ఫండ్స్‌లో మాదిరి ఎన్‌పీఎస్‌లో పన్ను ప్రయోజనాలు లేవనేది మనోజ్ నాగ్‌పాల్ అభిప్రాయం. ''స్టాక్స్, ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. డెట్ పథకాల రాబడులపై మాత్రం మూడేళ్ల తర్వాత తక్కువ పన్ను రేటుకు తోడు ద్రవ్యోల్బణం తీసివేత ప్రయోజనం ఉంది'' అన్నారాయన. వాస్తవానికి మన దేశంలో పన్ను ప్రయోజనాలే ఎక్కువ మందిని ఆకర్షిస్తున్న మాట వాస్తవం. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారిలోనూ అధికులు పన్ను ఆదా ఉద్దేశంతో పెడుతున్నవారేనని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. ఈపీఎఫ్ కంటే ఎన్‌పీఎస్ మెరుగైన రాబడులిస్తున్నప్పటికీ... వీటిపై పన్ను ప్రయోజనం లేకపోవడం ప్రతికూలం. ఈపీఎఫ్ మాదిరిగా ఎన్‌పీఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలుంటేనే... దాన్నుంచి ఎన్‌పీఎస్‌కు మారతారన్న అంచనాలున్నాయి.

ఈక్విటీలకు పరిమితి ఇబ్బందే!

సాధారణంగా యువ ఇన్వెస్టర్లు స్టాక్స్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలనుకుంటారు. రిస్క్ తీసుకునే సామర్థ్యమే వారి ఆసక్తికి కారణం. కానీ ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలకు గరిష్ట పరిమితి 50 శాతమే. లైఫ్ సైకిల్ ఫండ్ ఆప్షన్‌లో ఈక్విటీలకు 75 శాతం వరకూ కేటాయింపులకు అవకాశం ఉన్నప్పటికీ వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీ వాటా తగ్గుతుంది. ఈ పరిమితి వల్ల ఈక్విటీల నుంచి గణనీయమైన రాబడులు రాకుండా పోతాయనేది ఫైనాన్షియల్ ప్లానర్ల అభిప్రాయం. అవగాహన కలిగిన ఇన్వెస్టర్లయితే వేటికి ఎంత మేర పెట్టుబడులు వెళ్లాలని నిర్ణయించుకునే స్వేచ్ఛ కలిగి ఉంటారనేది మనీ హన్స్ వ్యవస్థాపకురాలు హన్సి మెహరోత్రా అభిప్రాయం. ''రిటైర్మెంట్ అనేది సుదీర్ఘ కాల లక్ష్యం. కాబట్టి తక్కువ ఫీజులతో గణనీయమైన రాబడులందించే పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఎక్కువ మార్పులకు అవకాశం ఉండకూడదు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలకు ఉన్న పరిమితిని తొలగించి 100 శాతం పెట్టుబడులకు అనుమతించినట్టయితే పదవీ విరమణకు ఇది సరైన సాధనం అవుతుందనేది నా అభిప్రాయం'' అన్నారామె. అయితే, ఇదే విషయమై సుశీల్ ఫైనాన్స్ వెల్త్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెండ్ ముకేశ్‌షా స్పందిస్తూ... ''ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ కోసం ఉద్దేశించింది. ఈక్విటీలకు 50 శాతం పరిమితితో మార్కెట్లలో తీవ్రమైన హెచ్చు, తగ్గుల నుంచి రక్షణ ఉంటుంది. అదే సమయంలో స్థిరాదాయ పథకాల కంటే అధిక రాబడులకు వీలు కల్పిస్తుంది'' అని పేర్కొన్నారు. 50 శాతం పరిమితి తొలగించి 100 శాతం ఈక్విటీలకు అనుమతిస్తే స్వల్ప కాలం నుంచి మధ్య కాలంలో ప్రతికూల రాబడులకు దారితీయవచ్చని, మార్కెట్లు డౌన్‌సైడ్‌లో ఉంటే రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న వారి పెట్టుబడుల విలువ తరిగిపోతుందని చెప్పారాయన.

రాబడులకు హామీ లేదు!

రాబడులపై ఎటువంటి హామీ లేకపోవడమే కార్మిక సంఘాలు ఎన్‌పీఎస్‌ను వ్యతిరేకించడానికి కారణం. దీన్ని పెన్షన్ పథకం అని పిలవకూడదని, ఎందుకంటే పెన్షన్ ఎంత వస్తుందనేది నిర్వచించకపోవడమేనని వాదన. ఎన్‌పీఎస్ అన్నది మార్కెట్లు బాగా పెరిగినందున ప్రస్తుతానికి బాగానే కనిపిస్తుందని, డౌన్‌ట్రెండ్‌లో దీనికి భిన్నమైన పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకవేళ మార్కెట్లు పతనమైన సంవత్సరంలో పదవీ విరమణకు వచ్చిన వారి పరిస్థితి ఏంటి? మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ 5–10 ఏళ్ల పాటు కొనసాగితే రిటైర్మెంట్ ప్రణాళిక తల్లకిందులవుతుంది కదా? అనేవి వారి ప్రశ్నలు. అయితే, ఎన్‌పీఎస్‌లో ఈక్విటీలే కాకుండా పూర్తిగా గిల్ట్ ఫండ్స్, బాండ్లలో పెట్టుబడులు పెట్టే ఆప్షన్లను ఎంచుకునే అవకాశమూ ఉంది. రిస్క్ భరించలేని వారు వీటిని ఎంచుకోవచ్చంటున్నారు నిపుణులు. ఎన్‌పీఎస్‌లో గత ఏడాది కాలంలో గిల్ట్‌ఫండ్స్ ఈక్విటీ ఫండ్స్‌తో పోలిస్తే కేవలం 2 శాతమే తక్కువ రాబడులనిచ్చాయి. దీంతో ఇవి రిస్క్ తీసుకోలేని వారికి ఉత్తమ ఆప్షన్‌గా పేర్కొంటున్నారు.

యాన్యుటీలో తప్పనిసరి ఇన్వెస్ట్‌మెంట్?

ఎన్‌పీఎస్ నిధిలో 40 శాతాన్ని తప్పనిసరిగా పెన్షన్ యాన్యుటీ పథకంలో ఇన్వెస్ట్ చేయాలి. యాన్యుటీ ప్లాన్‌లో రాబడులు చాలా తక్కువ. దీంతో గడువు ముగిశాక చేతికందే నిధులను తమ స్వేచ్ఛ కొద్దీ ఎక్కువ రాబడులొచ్చే చోట పెట్టే హక్కు ఇన్వెస్టర్లకు లేదు. ఇది కూడా ఎన్‌పీఎస్ వైపు చాలా మంది చూడకపోవడానికి ఉన్న కారణాల్లో ఒకటి. 40 శాతం కార్పస్‌తో యాన్యుటీ ప్లాన్‌ను కొనుగోలు చేయడం అన్నది పదవీ విరమణ తర్వాత ద్రవ్యోల్బణంతో పోరాడే సామర్థ్యాన్ని అడ్డుకోవడమేనని ఆర్థిక నిపుణుడు, ఐఐటీ ప్రొఫెసర్ కూడా అయిన ఎం.పట్టాభిరామ్ అభిప్రాయపడ్డారు. 6 శాతం ద్రవ్యోల్బణం ఐదేళ్ల కాలంలో కొనుగోలు శక్తిని 25 శాతం మేర హరిస్తుందని, 12 ఏళ్లలో 50 శాతాన్ని తగ్గిస్తుందని చెప్పారు. ఇక పన్ను ఆదా కోసమని 60 శాతం కార్పస్‌ను యాన్యుటీలో ఇన్వెస్ట్ చేసే వారు మరింత నష్టపోవాల్సి వస్తుందన్నారు. అయితే... తప్పనిసరిగా యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలన్న నిబంధనతో రిటైర్ అయిన వ్యక్తి జీవిత కాలం పాటు పెన్షన్ అందుకోవచ్చనేది హేమంత్ నాగ్‌పాల్ అభిప్రాయం. ఈ వాదనను కోటక్ పెన్షన్ ఫండ్ సీఈవో సందీప్ శ్రీఖండే కూడా సమర్థించారు. ''సామాన్యుల చేతికి ఏక మొత్తంలో డబ్బులందితే ఆ మొత్తాన్ని వెంటనే ఖర్చు చేసే ధోరణి పెద్ద ప్రతికూలత. వీరు రిటైర్మెంట్ నిధులను పిల్లల విద్య లేదా వివాహాలు లేదా ఇంటి అవసరాలకు ఖర్చు చేస్తుండడం సాధారణంగా జరుగుతుంటుంది. దీంతో పెన్షన్ నిధికి మిగిలేది తక్కువే'' అని శ్రీఖండే వివరించారు. యాన్యుటీ రేట్లు ఆకర్షణీయంగా లేకపోవడం మరో ప్రధానమైన అంశం. రూ.50 లక్షలు యాన్యుటీ ప్లాన్‌లో పెడితే, ప్రతీ నెలా వచ్చే పెన్షన్ రూ.30,000 స్థాయిలోనే ఉంటుంది. మరో సమస్య యాన్యుటీ నుంచి అందుకునే పెన్షన్ మొత్తంపై పన్ను అమలవడం. యాన్యుటీల నుంచి అందుకునే పెన్షన్‌పై పన్ను ప్రయోజనాలు కల్పిస్తే ఎన్‌పీఎస్ మరింత ప్రాచుర్యంలోకి వస్తుందనేది నిపుణుల మాట. అలాగే, ఎన్‌పీఎస్ కార్పస్‌ను ఇతర పెన్షన్ సాధనాలైన సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్, ప్రధానమంత్రి వయ వందన యోజన వంటి వాటిలో ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం కల్పిస్తే బావుంటుందన్నారు. కనీసం ఎన్‌పీఎస్ ఇన్వెస్టర్లకు ప్రత్యేక వడ్డీ రేటును ఆఫర్ చేయాలని వారు కోరారు.

60 ఏళ్ల లాకిన్ కాస్త ఇబ్బందే...

ఎన్‌పీఎస్ చందాదారులు 60 ఏళ్లు వచ్చేలోపు పెట్టుబడులను పూర్తిగా వెనక్కి తీసుకునే అవకాశం లేదు. ఈ నిబంధన నచ్చని వారి సంఖ్య గణనీయంగానే ఉంది. ఆర్థిక సలహాదారులు సైతం పెట్టుబడులను ముందుగా తీసుకునే స్వేచ్ఛ ఉండాలంటున్నారు. అయితే, 60వ ఏడు రాకముందే పెట్టుబడులను వెనక్కి తీసుకోవటానికున్న ఒకే మార్గం... 80 శాతం నిధులన్ని యాన్యుటీలో పెట్టి చేయటం. అపుడు 20 శాతం నిధులే ఇన్వెస్టర్‌కు మిగులుతాయి. ఈ పథకంలో మొత్తం మూడు సార్లు పాక్షిక ఉపసంహరణలకూ అవకాశం ఉన్నా ప్రత్యేక అవసరాలకు పరిమితం చేశారు. రెండు ఉపసంహరణల మధ్య విరామ సమయం ఐదేళ్లుగా ఉంది. కానీ ఈ విధమైన నియంత్రణల వల్ల విద్య, వివాహం అవసరాల్లో పెట్టుబడులను వెనక్కి తీసుకునే అవకాశం లేకపోవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, ఈ నియంత్రణలను ఎత్తివేస్తే రిటైర్మెంట్ ప్రణాళిక దెబ్బతింటుందని వాదించే వారూ ఉన్నారు. ''దీర్ఘకాల సాధనాల్లో పెట్టుబడులను కొనసాగించడం ద్వారా అధిక రాబడులను ఆర్జించొచ్చు. విశ్రాంత జీవనం కోసం చేస్తున్న పెట్టుబడుల్ని వెనక్కి తీసుకునే ముందు గుర్తుంచుకోవాల్సింది ఇదే. కేవలం డబ్బుల్ని వెనక్కి తీసుకోవటం మాత్రమే కాదు. దీనివల్ల దీర్ఘకాలంలో రెట్టింపయ్యే ప్రతిఫలాన్ని కోల్పోయినట్టవుతుంది'' అని విలిస్ టవర్స్ వాట్సన్ దక్షిణాసియా విభాగం హెడ్ కులిన్ పటేల్ తెలిపారు. ''ఉపసంహరణలపై ఎన్‌పీఎస్ నిబంధనలు సమంజసంగానే ఉన్నాయి. పెట్టుబడుల్ని వెంటనే వెనక్కి తీసుకోకుండా నిరుత్సాహపరచడం వల్ల రిటైర్మెంట్‌కు భారీ మొత్తంలో నిధి సమకూరే అవకాశం ఉంటుంది. నిజమైన వైద్య అవసరాలకు పెట్టుబడులను పాక్షికంగా వెనక్కి తీసుకునే వెసులుబాటు ఎటూ ఉంది'' అన్నారాయన.

ఏ అంశాన్ని ఎందరు ఇబ్బందిగా భావిస్తున్నారు...?

ఎన్‌పీఎస్ నిధిపై పన్ను వేయడం	35 %
ఈక్విటీలపై పరిమితి	12 %
యాన్యుటీ తప్పనిసరి చేయడం	31 %
60 ఏళ్లలోపు వెనక్కి తీసుకోలేకపోవడం	44 %
మార్కెట్ ఆధారిత రాబడులు	7 %





“మనం నిన్న ఏం చేశామనే దానికన్నా
రేపు ఏం చేయబోతున్నామనేదే చాలా ముఖ్యం.”
– పంకజ్ పటేల్, క్యాడిల్లా హెల్త్‌కేర్ చైర్మన్.

పొదుపు-మదుపు



ఫేస్ కాదు.. ఫేస్‌బుక్ చూసి అప్పిస్తారు!

దరఖాస్తుదారుల అర్హతను లేల్చేందుకు
తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు
సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌లను చూస్తున్నాయి
ఎస్‌ఎంఎస్‌ల్లో సమాచారాన్ని రాబడుతున్నాయి

మీకు సిబిల్ స్కోరు 750కి పైనే ఉందా? రుణం కచ్చితంగా వస్తుందని బల్లగుద్ది మరీ చెబుతున్నారా...? కానీ, మీరు అనుకున్నదే జరగాలనేమీ లేదు. ఎందుకంటే బ్యాంకులు రుణాల విషయంలో గతానికి భిన్నంగా మరింత తెలివైన విధానాలను ఆచరణలో పెడుతున్నాయి. ఓ వ్యక్తికి రుణం ఇచ్చేముందు తిరిగి చెల్లించే శక్తి ఉందా, లేదా అని మాత్రమే చూడటం లేదిపుడు. సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు, దరఖాస్తుదారుడి ఫోన్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లు, వాటికి తను స్పందించే తీరు... ఇలా భిన్న రూపాల్లో సమాచారాన్ని రాబడుతున్నాయి. అణువణువూ పూర్తిగా విశ్లేషించుకున్నాకే రుణ అర్హతను తేలుస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ఆరంభించిన ఈ కొత్త తరహా విధానం ఇపుడు అన్ని బ్యాంకులనూ ఇదే కోవలోకి తీసుకొస్తోంది. ఆ వివరాల సమాహారమే ఈ ప్రత్యేక కథనం...



రుణ అర్హతను తేల్చడానికి కొత్త విధానాలు ● ఇతరత్రా బిల్లుల చెల్లింపులపైనా విశ్లేషణ
ఎస్‌ఎంఎస్‌లు కూడా పరిగణనలోకి... ● ఇంట్లో, ఆఫీసులో ఉన్న సమయం సైతం
ఏఐ సాయంతో దేశీ బ్యాంకుల నయా పోకడ ● ఏఐ, డేటా అనలిటిక్స్‌పై భారీగా ఇన్వెస్ట్‌మెంట్లు

కోటక్ మహీంద్రా బ్యాంకులో ఇటీవల ఏదైనా రుణానికి దరఖాస్తు చేసుకున్నారా? ఈ బ్యాంకు అధికారులు రుణ దరఖాస్తును ఆమోదించే ముందు దరఖాస్తుదారుల ఫేస్‌బుక్ పోస్టులు, ఎస్ఎంఎస్‌లను చదువుతున్నారు. మొబైల్‌లో ఉన్న చెల్లింపుల డేటాను పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత రుణం జారీ చేయాలా? వద్దా అన్నది తేలుస్తున్నారు. అంతేకానీ, గతంలో మాదిరిగా తిరిగి చెల్లించగలరా, లేదా అన్న సమాచారంపై మాత్రమే ఆధారపడడం లేదు. ఇవిపుడు అంతర్గత రిస్క్ మదింపు విధానాలను మరింత ఆధునీకరిస్తున్నాయి. అనలిటిక్స్, సమాచార సేకరణపై ఎక్కువగా వెచ్చిస్తున్నాయి. సంప్రదాయ విధానాలైన క్రెడిట్ బ్యూరో నుంచి స్కోరు తెలుసుకోవడం కంటే సామాజిక మాధ్యమాలను ఎక్కువగా వినియోగించుకుంటున్నాయి.

అన్ని ప్రముఖ బ్యాంకులదీ ఇదే బాట

ఈ ధోరణి ఒక్క కోటక్ బ్యాంకుకే పరిమితం కాలేదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్, ప్రభుత్వ రంగంలోని ఎస్‌బీఐ సహా పలు ఇతర బ్యాంకులూ సామాజిక మాధ్యమాల్లో సదరు వ్యక్తుల ప్రవర్తనను గమనిస్తున్నాయి. కేవలం రుణాల జారీ కోసమే కాకుండా తమ ఉత్పత్తుల విక్రయానికీ ఈ సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నాయి. గూగుల్ మ్యాప్స్‌లో డేటాను ట్రాక్ చేయడం, ఉబెర్ క్యాబ్స్‌కు చేసిన చెల్లింపులు, ఎలక్ట్రిసిటీ బిల్లుల చెల్లింపులనూ పరిశీలిస్తున్నాయి. ‘‘యాప్ డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో మీ ఎస్ఎంఎస్, జీపీఎస్ అనుమతులు తీసుకోవడం జరుగుతుంది. దాంతో మీరు ఆలస్యం చేసిన చెల్లింపులు, బిల్లుల చెల్లింపులు, ఎప్పుడు, ఎంత మేర చెల్లించారు, ఏ బ్యాంకు నోటీసులు మీకు వచ్చాయి, ఎన్నింటికి మీరు స్పందించారన్నది తెలుసుకుంటాం. జీపీఎస్ సాయంతో మీ నివాసం ఎక్కడ, పనిచేసే చోటు ఏది, ఇంట్లో ఎంత సమయం ఉన్నారు, కార్యాలయంలో ఎంత సమయం ఉన్నారు, ఎంత సమయం పాటు ప్రయాణిస్తున్నారు, అన్నీ కూడా 30 సెకండ్లలో తెలుసుకుని రుణం ఇవ్వాలా? వద్దా అన్నది నిర్ణయించుకోగలం’’ అని కోటక్ మహీంద్రా బ్యాంకు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్‌గుప్తా తెలియజేశారు.

2007 నుంచీ ఆరంభం

బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సమాచారం అందించేందుకు 2007లో క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (సిబిల్) రిస్క్ స్కోర్ విధానాన్ని దేశంలో ప్రారంభించింది. దేశీ బ్యాంకింగ్‌లో దీన్నో చరిత్రాత్మక ఘట్టంగా చెబుతారు. బ్యాంకులు ఇప్పటికీ రుణ గ్రహీతల సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ సమాచారంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఆర్థిక రంగం అభివృద్ధి చెందుతుండడంతో క్రెడిట్ కార్డులు, గృహ రుణాలు రూపేణా బ్యాంకులకు కొత్త కస్టమర్లు పెరిగారు. ఇదే సమయంలో సరైన రుణ సమాచారం లేకపోతే బ్యాంకుల చేతులు కాలుతాయి. అందుకే వీటి అవసరం ఏర్పడింది.

బ్యూరోల సమాచారం అవసరమే...

కోటక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా ధోరణులు, మొబైల్ డేటా ఆధారంగా కొత్త తరహా విశ్లేషణపై ఎక్కువగా నిధులు వెచ్చిస్తున్నాయి. అయితే, ప్రతి వ్యక్తి మొబైల్‌లోని డేటా పొందడం సాధ్యం కాదు. అనుమతులు ఇవ్వకుండా గోప్యత పాటించే వారూ ఉన్నారు. ఇది సమాచార సేకరణలో బ్యాంకుల ముందున్న సవాలు. అందుకే ఈ విధానాల ద్వారా ప్రయోజనాలన్నవి ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాయి. అలాగని బ్యాంకులు క్రెడిట్ బ్యూరోల సమాచారానికి పూర్తిగా దూరంగా ఉండే పరిస్థితి కూడా ఇప్పటికైతే లేదు. గత పదేళ్లలో క్రెడిట్ బ్యూరోల వద్దనున్న సమాచారం రెట్టింపయింది. రుణ గ్రహీతల సమాచారాన్ని బ్యాంకులు ఎప్పటికప్పుడు ఈ బ్యూరోలకు తెలియజేస్తున్నాయి. కొత్తగా వచ్చిన బ్యూరోలకూ సమాచారాన్ని అందించాలని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు 2013లో ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో బ్యూరోలు సమాచారం విషయంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి.

సిబిల్ వద్ద 70 కోట్ల రికార్డులు

క్రెడిట్ బ్యూరోల్లో ఇప్పటికీ లీడర్ సిబిల్ అనే చెప్పాలి. ‘‘ప్రతీ త్రైమాసికంలో 60 లక్షల మంది రుణ గ్రహీతల సమాచారం డేటాబేస్‌లోకి వస్తోంది. సిబిల్‌లో ప్రస్తుతం 70 కోట్ల వినియోగదారుల క్రెడిట్ రికార్డులున్నాయి. ఇందులో 3.5 కోట్లు వాణిజ్య క్రెడిట్ రికార్డులు కాగా, 26 కోట్లు మైక్రో ఫైనాన్స్‌కు చెందినవి’’ అని సిబిల్ సీవోవో హర్షలా చందోర్కర్ తెలిపారు. ఇప్పటికీ వ్యక్తి రుణ చరిత్ర, రుణాన్ని తిరిగి చెల్లించగలరా, లేదా? అనేది తెలుసుకునేందుకు క్రెడిట్ సమాచారమే పనికొస్తోందని ఆమె చెప్పారు. ఓ వ్యక్తికి నాలుగు క్రెడిట్ కార్డులుంటే ఎక్కడైనా చెల్లించడంలో విఫలమైతే రుణ చరిత్ర తెలియజేస్తుంది. సోషల్ మీడియా, ఇతర సమాచారంతో కేవలం ఓ వ్యక్తి ఏ రెస్టారెంట్‌లో తింటున్నారు, చెల్లింపుల తీరు, చెల్లింపుల సామర్థ్యం తెలుస్తాయంతే’’ అని హర్షలా వివరించారు.

తొలిసారి రుణం తీసుకునేవారికే...

అయితే, క్రెడిట్ బ్యూరోలు కాకుండా ఇతరత్రా మార్గాల్లో సేకరించే సమాచారం అంతా అప్పటి వరకు ఎటువంటి స్కోరు లేని, తొలిసారి రుణం తీసుకుంటున్న వారి కోసమేనని క్రెడిట్ బ్యూరోలు చెబుతున్నాయి. అవి కూడా సోషల్ మీడియా డేటాపై దృష్టి పెట్టక తప్పని పరిస్థితి ఉంది. ‘‘మాకు 900 కోట్ల డేటా పాయింట్లున్నాయి. 35 కోట్ల కస్టమర్లున్నారు. సంప్రదాయ క్రెడిట్ బ్యూరో విశ్లేషణతోపాటు ప్రత్యామ్నాయ సమాచార సేకరణను కూడా చేస్తున్నాం. ఇందుకోసం వేర్వేరు విభాగాలున్నాయి. రుణాలు తీసుకునేవారిలో 50 శాతం కొత్తవారే కావటంతో భారత్‌లో సంప్రదాయ విశ్లేషణకు, డేటాకు అవకాశాలున్నాయని భావిస్తున్నాం’’ అని ఎక్స్‌పీరియన్ ఎండీ వైశాలి కస్తూరే చెప్పారు.

క్రెడిట్ బ్యూరోల విశేషాలు

- ➤ దేశంలో క్రెడిట్ సమాచార బ్యూరో 2004లో ఆరంభమైంది. రిస్క్ స్కోరు విధానంతో 2007లో అందుబాటులోకి వచ్చింది.
- ➤ ట్రాన్స్ యూనియన్‌కు చెందిన సిబిల్‌తోపాటు ఎక్స్‌పీరియన్, ఈక్విఫాక్స్, హైమార్క్‌లు గత పదేళ్ల కాలంలో డేటాబేస్‌ను రూపొందించుకున్నవే.
- ➤ వీటిలో అతిపెద్దది సిబిల్. దీనిదగ్గర 70.09 కోట్ల కస్టమర్ల రికార్డులున్నాయి. 26 కోట్లకు పైగా మైక్రోఫైనాన్స్ రికార్డులు సైతం ఉన్నాయి. ఎక్స్‌పీరియన్ డేటా బేస్‌లో 32 కోట్ల కస్టమర్ల రికార్డులున్నాయి.
- ➤ బ్రిటన్‌కు చెందిన ఎక్స్‌పీరియన్, అమెరికాకు చెందిన ట్రాన్స్‌యూనియన్, ఈక్విఫాక్స్ అన్నవి అంతర్జాతీయంగా పెద్ద క్రెడిట్ బ్యూరో సంస్థలు.


● యాప్‌కీ కహానీ...

ఉమాంగ్



ప్రభుత్వపు ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు కేంద్రం ‘ఉమాంగ్’ యాప్‌ను తీసుకువచ్చింది. కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు అందించే వివిధ రకాల సేవలన్నింటినీ ఈ యాప్ ద్వారా పొందొచ్చు. కాగా ఉమాంగ్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు



- ➤ ఇది యూనిఫైడ్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేస్తుంది. ప్రభుత్వ విభాగాలు, వాటి సేవలన్నింటినీ ఈ మొబైల్ యాప్ ద్వారా పొందొచ్చు.
- ➤ ఇందులో ఆధార్, డిజిలాకర్, పేగౌ వంటి పలు డిజిటల్ ఇండియా సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- ➤ ప్రభుత్వ సేవలను ప్రజలు సులభంగా వినియోగించుకోవాలనేదే ఈ యాప్ లక్ష్యం.
- ➤ యాప్ డేటా భద్రతకు ఢోకాలేదని ప్రభుత్వం పేర్కొంది.
- ➤ హెల్త్‌కేర్, ఫైనాన్స్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఎనర్జీ, అగ్రికల్చర్, ట్రాన్స్‌పోర్ట్, యుటిలిటీ, ఎంప్లాయిమెంట్ వంటి పలు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి.
- ➤ ఈ యాప్‌ను తెలుగు భాషలోనూ ఉపయోగించవచ్చు.

స్టాక్స్ వ్యూ

అజంతా ఫార్మా — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్
ప్రస్తుత ధర: రూ.1,524
టార్గెట్ ధర: రూ.1,792

ఎందుకంటే: వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పరిస్థితులు మెరుగుపడతాయని కంపెనీ భావిస్తోంది. దేశీయ ఫార్ములేషన్ వ్యాపారంలో జీఎస్‌టీ సంబంధిత సమస్యలు ఇప్పుడిప్పుడే సమసిపోతున్నాయి. గువాహటిలో ఈ కంపెనీ ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫలితంగా అవుట్ సోర్సింగ్ తగ్గి, నిర్వహణ సామర్థ్యం పెరగడమే కాకుండా, పన్ను ప్రయోజనాలు కూడా లభించనున్నాయి. దేశీయ ఫార్ములేషన్స్ విభాగంలో 13 ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలానికి ఐదు అండా(అబ్రివియేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్)లనే అమెరికా ఎఫ్‌డీఏకు సమర్పించినప్పటికీ, మిగిలిన ఆరు నెలల్లో 10–15 అండాలు దాఖలు చేయాలని కంపెనీ యోచిస్తోంది. ఈ క్యూ2లో అమెరికా మార్కెట్లో అమ్మకాలు ఒకింత తగ్గాయి. ఇటీవలే 22 ఔషధాలకు అమెరికా ఎఫ్‌డీఏ నుంచి తుది ఆమోదాలు పొందింది. దీంతో రానున్న క్వార్టర్లలో అమ్మకాలు పుంజుకోగలవని కంపెనీ అంచనా వేస్తోంది. మలేరియా చికిత్సలో ఉపయోగపడే ఔషధాలను సరఫరా చేయడానికి గ్లోబల్ ఫండ్ ఎంపిక చేసిన కంపెనీల్లో ఇది కూడా ఒకటి. ఈ ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాల ధరలు గత 10 నెలల కాలంలో నిలకడగా ఉండటంతో ఈ కేటగిరీ లాభదాయకతపై పెద్దగా రిస్క్ ఉండదు. ఇటీవలే ఆసియా, ఆఫ్రికా మార్కెట్లలో కొన్ని బ్రాండెడ్ జనరిక్స్ ఔషధాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుతం రూ.175 కోట్ల మూలధన పెట్టుబడులు పెట్టింది. ఇంకా రూ.125 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే రేంజ్‌లో (రూ.300 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నది. 2016–18 మధ్య కాలానికి అమ్మకాలు 9 శాతం, నికర లాభం 6 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగా, రానున్న రెండేళ్లలో అమ్మకాలు 14 శాతం, నికర లాభం 11 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి సాధించగలవని అంచనా. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో వ్యాపార పరిస్థితులు మెరుగుపడడమే దీనికి ప్రధాన కారణం.

ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ — కొనొచ్చు

బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.1,274
టార్గెట్ ధర: రూ.1,700

ఎందుకంటే: ఆర్‌పీ–సంజీవ్ గోయెంకా గ్రూప్(సీఈఎస్‌సీ ప్రమోటర్ గ్రూప్ ఇదే)కు చెందిన ఈ కంపెనీ టైర్ల తయారీలో ఉపయోగపడే కార్బన్ బ్లాక్‌ను తయారు చేస్తోంది. ఈ సెగ్మెంట్లో 40 శాతం మార్కెట్ వాటాతో ఉన్న అతి పెద్ద కంపెనీ ఇదే. విజయవంతంగా టర్న్ అరౌండ్ బాట పట్టిన ఈ కంపెనీ 16 శాతం ఇబిటా మార్జిన్‌ను సాధిస్తోంది. వాహన రంగం నుంచి డిమాండ్ పెరుగుతుండడం, చైనాలో ఉత్పత్తి తగ్గి సరఫరాలు తగ్గుతుండడం.. కార్బన్ బ్లాక్ తయారు చేసే ఈ కంపెనీకి ప్రయోజనం కలిగించనున్నది. ముడి పదార్థాలైన కమోడిటీ, ముడి చమురు ధరల్లో తీవ్రమైన ఒడిదుడుకుల కారణంగా గతంలో ఈ కంపెనీ లాభాలపై ఒత్తిడి తీవ్రంగానే వుండేది. ఈ చర వ్యయాలను బట్టే ధరల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు కీలకమైన కస్టమర్లతో ఈ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. అందుకని ముడి చమురు ధరల ఒడిదుడుకుల ప్రభావం గతంలో లాగా కంపెనీ లాభదాయకతపై ప్రభావం చూపించే అవకాశాల్లేవు. డిమాండ్ పుంజుకోవడం, నిర్వహణ సామర్థ్యం మెరుగుదల కారణంగా లాభదాయకత పెరిగి కంపెనీ నికర రుణ భారం తగ్గింది. మొత్తం మీద రెండేళ్లలో అమ్మకాలు 6 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందుతాయని భావిస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో రూ.73 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ..210 కోట్లకు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.241 కోట్లకు, 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.335 కోట్లకు పెరగవచ్చని అంచనా. కార్బన్ బ్లాక్ తయారు చేసే రెండు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు–ఓరియన్ కార్బన్, కార్బొట్ కార్ప్‌లు.. కార్బన్ బ్లాక్ పరిశ్రమకు మంచి రోజుల చాలా కాలం కొనసాగనున్నాయని వెల్లడించడం సానుకూలాంశం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

భారీ నిక్షేపాలు కనుగొన్న ఓఎన్‌జీసీ



ఓఎన్‌జీసీ అరేబియా సముద్రంలో భారీ ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను కనుగొంది. అరేబియా సముద్రంలోని ముంబై హై చమురు క్షేత్రాల్లో ఓఎన్‌జీసీ ఈ నిక్షేపాలను కనుగొన్నట్లు చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఈ ఆవిష్కరణల్లో 29.74 మిలియన్ టన్నుల ఆయిల్, ఆయిల్ సమానమైన గ్యాస్ నిక్షేపాలున్నట్లు అంచనా వేస్తున్నారు.

ఐటీలో 2 లక్షల ఉద్యోగాలు!!




ప్రస్తుత ఏడాది ఐటీ రంగం ఉద్యోగాలతో కళకళలాడనుంది. ఈ పరిశ్రమలో దాదాపు 2 లక్షల మందికి ఉపాధి లభించనుందని అంచనాలున్నాయి. ‘ఫైనాన్షియల్ సర్వీసెస్, డిజిటల్ బిజినెస్‌లలో మెరుగుదల.. ప్రత్యేకించి డిజిటైజేషన్, ఆటోమేషన్‌లలో ఇన్వెస్ట్‌మెంట్ల పెరుగుదల.. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం వంటి అంశాలు వ్యాపార వృద్ధికి దోహదపడతాయి’ అని టీమ్‌లీజ్ వివరించింది.

ఎస్‌బీఐ రుణ రేట్లు తగ్గాయ్..

ఖాతాదారులకు కొత్త సంవత్సర కానుకగా ఎస్‌బీఐ.. బేస్ రేటు బీపీఎల్ఆర్‌ను 0.3 శాతం మేర తగ్గించింది. దీంతో పాత వడ్డీ రేట్ల విధానంలో రుణాలు తీసుకున్న 80 లక్షల మంది ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుత కస్టమర్లకు బేస్ రేటును 8.95 శాతం నుంచి 8.65 శాతానికి తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ ప్రకటించింది. అలాగే బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటును (బీపీఎల్‌ఆర్) 13.70 శాతం నుంచి 13.40 శాతానికి తగ్గించింది.

ఎస్‌బీఐ కనీస నిల్వ వడ్డింపులు 1,772 కోట్లు



బ్యాంక్ ఖాతాల్లో నెలవారీ కనీస మొత్తం నిల్వ నిబంధనను పాటించని ఖాతాదారుల నుంచి జరిమానాల రూపంలో ఎస్‌బీఐ భారీగానే సొమ్ములు రాబడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో ఈ జరిమానాలు రూ.1,772 కోట్లకు పెరిగాయి. ఈ బ్యాంక్ సాధించిన రెండో క్వార్టర్ నికర లాభం (రూ.1,582 కోట్లు) కన్నా ఈ మొత్తం అధికం కావడం విశేషం.

ఇన్ఫీ సీఈవోగా పరేఖ్ బాధ్యతల స్వీకరణ

దేశీ రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ‘ఇన్ఫోసిస్’ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా సలీల్ పరేఖ్ బాధ్యతలు చేపట్టారు. ఈయన వార్షికంగా రూ.18.6 కోట్ల మేర జీతభత్యాలు అందుకోబోతున్నారు. సంస్థ ప్రతిపాదన ప్రకారం.. ఇందులో స్థిరమైన వార్షిక వేతనం రూ.6.5 కోట్లు కాగా, మిగతాది పనితీరు ఆధారితంగా (వేరియబుల్) ఉండనుంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ నుంచి ఈ ప్యాకేజీ అమలవుతుంది.



బొమ్మ-బొరుసు

> ఎవరో ఎప్పుడో నాటిన చెట్టు ఇప్పుడు మనకి నీడనిస్తోంది.
> – వారెన్ బఫెట్



ఫలితాలు, గణాంకాలపై దృష్టి



టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ దిగ్గజాల ఫలితాల ప్రభావం ఈ వారం స్టాక్ మార్కెట్‌పై ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలతో పాటు పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా స్టాక్ సూచీల గమనాన్ని నిర్దేశిస్తాయని వారంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల గమనం, డాలర్‌తో రూపాయి మారకం, ప్రపంచ మార్కెట్ల పోకడ, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల సరళి కూడా తగిన ప్రభావం చూపుతాయి. ఈ నెల 11న(గురువారం) టీసీఎస్, 12(శుక్రవారం)న ఇన్ఫోసిస్ క్యూ3 ఫలితాలు వెల్లడవుతాయి. ఈ నెల 12న నవంబర్ నెలకు సంబంధించిన పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వస్తాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో 4.1 శాతంగా ఉన్న ఐఐపీ గత ఏడాది అక్టోబర్‌లో 2.2 శాతానికి తగ్గింది. ఈ నెల 12న డిసెంబర్ నెలకు సంబంధించిన రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడవుతాయి. గత ఏడాది అక్టోబర్‌లో 3.58 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం గత ఏడాది నవంబర్‌లో 13 నెలల గరిష్ట స్థాయి, 4.88 శాతానికి పెరిగింది.

ప్రీమియమ్ వ్యాల్యూయేషన్...

స్టాక్ మార్కెట్లోకి పెట్టుబడులు భారీగా వస్తుండడం, కంపెనీల క్యూ3 ఫలితాలు బాగా ఉంటాయనే అంచనాలు, సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో మార్కెట్ ప్రీమియమ్ వ్యాల్యూయేషన్‌తో ట్రేడవుతోందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. బడ్జెట్ సంబంధిత సంకేతాలు, క్యూ3 ఫలితాలను బట్టే సమీప భవిష్యత్తులో మార్కెట్ గమనం ఉంటుందని ఆయన అంచనా వేస్తున్నారు. ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభమైనందున అందరి కళ్లు టీసీఎస్, ఇన్ఫోసిస్‌ల ఫలితాలు, గైడెన్స్‌లపైనే ఉంటుందని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ చెప్పారు.

మార్కెట్ ప్రభావిత అంశాలు

తేదీ	విషయం
11	టీసీఎస్ క్యూ3 ఫలితాలు
12	ఇన్ఫోసిస్ క్యూ3 ఫలితాలు
	నవంబర్ ఐఐపీ గణాంకాలు
	డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం

డెట్ మార్కెట్లోకి రూ.1.49 లక్షల కోట్లు

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు గత ఏడాది డెట్ మార్కెట్లో రూ.1.49 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టారు. 2016లో కేవలం 43,645 కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. బాండ్ల రాబడులు బాగా ఉండడం, కరెన్సీ నిలకడగా ఉండడంతో డెట్‌మార్కెట్లో గత ఏడాది భారీగా విదేశీ పెట్టుబడులు వచ్చాయని నిపుణులు పేర్కొన్నారు. అయితే గత ఏడాది స్థాయిలో ఈ ఏడాది డెట్ మార్కెట్లోకి పెట్టుబడులు రాకపోవచ్చని వారంటున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రేట్లు పెరుగుతుండడం, లిక్విడిటీ ఉపసంహరణ దీనికి కారణాలని వివరించారు. ఇక ఈక్విటీ మార్కెట్లో గత ఏడాది ఎఫ్‌పీఐల పెట్టుబడులు రూ.51,000 కోట్లుగా ఉన్నాయి.

బడా ఐటీ కంపెనీల ఆదాయం అంతంతే!



పుంజుకోని బీఎఫ్ఎస్ విభాగం

- మధ్య స్థాయి కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉంటాయ్
- వీసాల రూపంలో కొత్త సవాళ్లు ● బ్యాంకులకు బలహీనమే
- ఎన్‌పీఏలకు అధిక కేటాయింపుల ప్రభావం
- ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీల్లో ఆశాజనక వృద్ధి
- అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంపై అంచనాలు

న్యూఢిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్) ఫలితాల సీజన్ ప్రారంభం అవుతుండగా, కీలకమైన ఐటీ, బ్యాంకింగ్ రంగంలోని కంపెనీల నుంచి పెద్దగా ఆశించేదేమీ లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్యాంకులు అధిక మొండి బకాయిలకు చేసే కేటాయింపులతో బలహీనమైన ఫలితాలను ప్రకటించనున్నాయని అంచనా. అదే సమయంలో తక్కువ పనిదినాలు, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సేవల (బీఎఫ్ఎస్) విభాగం ఆదాయాలు చల్లబడినందున ఐటీ కంపెనీల ఫలితాలు గతం కంటే మెరుగ్గా ఉండకపోవచ్చని భావిస్తున్నారు.

టీసీఎస్ డైరెక్షన్!

టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల యాజమాన్యాలు డిమాండ్ గురించి ఏం వ్యాఖ్యానించనున్నాయనే అంశంపై ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. అమెరికాలో పన్ను సంస్కరణలకు తోడు, వీసా నిబంధనల్లో ట్రంప్ సర్కారు చేయదలిచిన మార్పులు ఆందోళన కలిగించేవిగా విశ్లేషకులు భావిస్తున్నారు. మూడో క్వార్టర్ ఫలితాలను టీసీఎస్ ఈ నెల 11న విడుదల చేయనుంది. ఆ తర్వాత రోజు తర్వాత ఇన్ఫోసిస్, 19న విప్రో ఫలితాలను ప్రకటిస్తాయి. ''టైర్–1 భారత ఐటీ కంపెనీల కరెన్సీ ఆదాయ అంచనా 1–1.8 శాతం మధ్య ఉంటుందని మా అంచనా. సంవత్సరాంతం సెలవులు, బీఎఫ్ఎస్ విభాగం నుంచి వచ్చే ఆదాయం పుంజుకోకపోవడం వంటి అంశాలతో ఆదాయాల్లో వృద్ధి ఉండకపోచ్చు'' అని కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో పేర్కొంది. మధ్య స్థాయి కంపెనీలు మాత్రం అధిక వృద్ధిని నమోదు చేస్తాయని పేర్కొంది. 2018 బడ్జెట్‌లో ఐటీ రంగంపై చేసే ప్రకటనలు, వీసా ఆధారిత సవాళ్లను ఎదుర్కోవడంపై సన్నద్ధత, బీఎఫ్ఎస్ విభాగం తీరు అన్నవి ఇన్వెస్టర్లు పరిశీలించాల్సిన కీలకమైన అంశాలుగా మోతీలాల్ ఓస్వాల్ తెలిపింది. మరోవైపు ఇన్ఫోసిస్ కొత్త సీఈవో సలిల్ పారిఖ్ కంపెనీ అభివృద్ధికి సంబంధించి ఏ విధానాన్ని ప్రకటించనున్నారనే అంశంపైనా ఆసక్తి నెలకొంది. అమెరికా కంపెనీలు విదేశాల్లోని తమ అనుబంధ కంపెనీలకు చేసే చెల్లింపులపై బేస్ ఎరోజన్ అండ్ యాంటీ అబ్యూజ్ ట్యాక్స్(బీట్)ను అమలు చేయడం వల్ల కొన్ని భారత కంపెనీలపై ప్రభావం ఉంటుందని కోటక్ పేర్కొంది.

బ్యాంకింగ్ నిరాశాజనకం

దేశ బ్యాంకింగ్ రంగం డిసెంబర్ క్వార్టర్లో బలహీన ఫలితాలను ప్రకటించొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీ నివేదిక ప్రకారం... ట్రెజరీల నుంచి వచ్చే ఆదాయం తగ్గడం, ఎన్‌పీఏలకు కేటాయింపులతో ఈ రంగం పనితీరు బలహీనంగా ఉంటుంది. అదే సమయంలో డిమాండ్ ఆశాజనకంగా ఉండడంతో ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు మాత్రం బలమైన ఫలితాలు ప్రకటించొచ్చని కోటక్ అంచనా వేసింది. ఎన్‌బీఎఫ్‌సీల ఫలితాలు 30–50 శాతం స్థాయిలో వృద్ధి నమోదు చేయవచ్చని పేర్కొంది. పండుగల డిమాండ్ పుంజుకోవడం, రెరా/జీఎస్టీ అమలుతో ఇళ్లకు రుణాల జారీ స్వల్పంగా మెరుగుపడడం, రుణాల వ్యయాలు తగ్గడం నిర్వహణ పరంగా ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలు బలమైన ఫలితాలు వెల్లడించడానికి తోడ్పడతాయని అంచనా వేసింది. బ్యాంకింగ్ రంగంలో రుణాల వృద్ధి 2016–17లో ఉన్న 4–5 శాతం నుంచి 7 శాతానికి మెరుగుపడినప్పటికీ, ఇంకా డీమోనిటైజేషన్ ముందు నాటి వృద్ధి రేటు 9–10 కంటే దిగువనే ఉందని పేర్కొంది. కార్పొరేట్ రంగానికి రుణాల మంజూరు గణనీయంగా తగ్గిపోవడం, తాజా పెట్టుబడుల్లో మందగమనం అనేవి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మారకపోవచ్చని కోటక్ పేర్కొంది. కార్పొరేట్ రంగానికి 50 శాతానికి పైగా రుణాలిచ్చిన ప్రభుత్వరంగ బ్యాంకులను ఇది నిరాశపరిచేదేనని అభిప్రాయపడింది.

రుణాల వృద్ధి 10.65 శాతానికి

ముంబై: చాలా కాలం తర్వాత డిసెంబర్‌లో రుణాల వృద్ధి మెరుగైన స్థాయికి చేరుకుంది. డిసెంబర్ 22తో ముగిసిన 15 రోజుల కాలానికి ఇది 10.65 శాతం, రూ.80,96,727 కోట్లుగా నమోదైంది. బేస్ ప్రభావమే దీనికి కారణమని ఆర్‌బీఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. బేస్ ప్రభావమే రుణాల వృద్ధికి కారణమని, గతేడాది డీమోనిటైజేషన్ వల్ల బేస్ గణాంకాలను సవరించడం జరిగిందని, అందుకే వృద్ధి ఈ స్థాయిలో కనిపిస్తోందని ఎస్‌బీఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ హెడ్ పేకే గుప్తా వివరించారు. రిటైల్ రుణాలకు డిమాండ్ పుంజుకోగా, కార్పొరేట్ రంగ రుణాల్లో మాత్రం ఎలాంటి పురోగతి లేదని గుప్తా స్పష్టం చేశారు. డిసెంబర్‌లో రిటైల్, ఆటో రుణాల జారీ పరంగా తాము అధిక గణాంకాలను నమోదు చేసినట్టు చెప్పారు.

విశాఖలో పెల్లెట్ ప్లాంట్

కుద్రేముఖ్, విశాఖ ఉక్కు మధ్య కుదిరిన ఒప్పందం

ఉక్కునగరం(గాజువాక): విశాఖ స్టీల్‌ప్లాంట్, కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్‌లు సంయుక్తంగా పెల్లెట్ ప్లాంట్‌ను విశాఖ స్టీల్ ప్లాంట్ పక్కనున్న స్థలంలో ఏర్పాటు చేయనున్నాయి. ఈ మేరకు శనివారం మంగళూరులో ఇరు సంస్థల ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా, కర్ణాటకలోని బళ్లారి గనుల్లోని ఐరన్ ఓర్ ఫైన్‌ను వినియోగించి పెల్లెట్‌లను తయారుచేస్తారు. అక్కడ తయారయ్యే పెల్లెట్‌ను స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌లో వినియోగిస్తారు. మొదటి దశలో 1.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మించి తదుపరి అవసరాల బట్టి ప్లాంట్‌ను విస్తరిస్తారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి చౌదరి బీరేంద్ర సింగ్ సమక్షంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ పి.మధుసూదన్, కుద్రేముఖ్ ఐరన్ ఓర్ లిమిటెడ్ సీఎండీ ఎం.వి. సుబ్బారావులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు.



కేంద్ర ఉక్కుమంత్రి సమక్షంలో ఒప్పందపత్రాలపై సంతకాలు చేస్తున్న ఇరు సంస్థల సీఎండీలు

ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించొద్దు

కేంద్రానికి పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణకు ఇది సరైన తరుణం కాదని పార్లమెంటరీ ప్యానల్ అభిప్రాయపడింది. ఎయిర్‌లైన్స్ పునరుద్ధరణకు, రుణాల మాఫీకి కనీసం ఐదు సంవత్సరాల గడువు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించడం లేదా వాటాలు విక్రయించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునః సమీక్షించాలని రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. పునరుద్ధరణ ప్రణాళిక కింద జాతీయ విమానయాన సంస్థకు అందించిన ఈక్విటీ నిధులు నామమాత్రం కావడంతో, చేసేది లేక అధిక వడ్డీకి బయటి నుంచి రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని ప్యానల్ నిర్ధారణకు వచ్చింది. ''ఎయిర్ ఇండియా పునరుద్ధరణ ప్రణాళికకు పదేళ్ల పాటు 2022 వరకు సమయం ఉండగా, చాలా అంశాల్లో సంస్థ మెరుగుపడుతోందని, నష్టాల నుంచి బయటపడుతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయని నివేదికలో పేర్కొంది. కనుక పునరుద్ధరణ ప్రణాళిక ముగిసే సమయం వరకు వేచి ఉండి, అప్పుడు ఎయిర్ ఇండియా పనితీరును మదింపు వేసి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

గత వారం హీరోలు

స్టాక్స్	5 ముగింపు	29 ముగింపు	మార్పు(%)
ఎన్ఎండీసీ	158	138	15
బీహెచ్ఈఎల్	102	93	11
ఐడీఎఫ్‌సీ బ్యాంక్	58	54	7
ఐడియా	116	108	7
అశోక్ లేలాండ్	127	119	7
టైటాన్	909	856	6
టాటా పవర్	100	94	6
కమ్మిన్స్ ఇండియా	957	903	6
కోల్ ఇండియా	279	263	6
జేఎస్‌డబ్ల్యు స్టీల్	285	270	6

ఎందుకు పెరిగాయంటే..,

ఉత్పత్తుల ధరలను టన్నుకు రూ.500 వరకూ పెంచడంతో ఎన్ఎమ్‌డీసీ షేర్ 15 శాతం దూసుకుపోయింది. రూ.6,750 కోట్ల మేర నిధుల సమీకరణ, అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సీఎల్ఎస్ఏ రేటింగ్‌ను అమ్మొచ్చు నుంచి కొనచ్చుకు అప్‌గ్రేడ్ చేయడంతో ఐడియా షేర్ 7 శాతం లాభపడింది. గత ఏడాది డిసెంబర్లో అమ్మకాలు 79 శాతం పెరగడంతో అశోక్ లేలాండ్ షేర్ 7 శాతం ఎగసింది. ఈ క్యూ3లో అమ్మకాలు బాగా ఉంటాయనే వార్తల కారణంగా టైటాన్ షేర్ 6 శాతం పెరిగింది.

గత వారం జీరోలు

స్టాక్స్	5 ముగింపు	29 ముగింపు	మార్పు(%)
బీపీసీఎల్	487	519	-6
వక్రంజీ	406	421	-3
ఐషర్ మోటార్స్	29,251	30,291	-3
మారుతీ సుజుకీ	9,434	9,731	-3
ఇన్ఫోసిస్	1,012	1,039	-3
అరబిందో ఫార్మా	671	688	-2
బజాజ్ ఫిన్‌సర్వ్	5,127	5,238	-2
బాష్	19,680	20,103	-2
బజాజ్ హోల్డింగ్స్	2,827	2,883	-2
బ్రిటానియా	4,643	4,716	-2

ఎందుకు తగ్గాయంటే..,

బ్రెంట్ చమురు ధర రెండున్నరేళ్ల గరిష్ట స్థాయికి పెరగడంతో బీపీసీఎల్ షేర్ 6 శాతం క్షీణించింది. డిసెంబర్ అమ్మకాలు అంచనాలను చేరకపోవడంతో ఐషర్ మోటార్స్, మారుతీ షేర్లు చెరో 3 శాతం నష్టపోయాయి. రూపాయి మారకం బలపడడంతో ఇన్ఫోసిస్ 3 శాతం పతనమైంది. గతంలో బాగా పెరిగిన వక్రంగీ, బజాజ్ ఫిన్ సర్వ్, బజాజ్ హోల్డింగ్స్, బ్రిటానియా షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఈ షేర్లు 3–2 శాతం రేంజ్‌లో తగ్గాయి.

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 8-1-2018

విశాఖ	400–00
చిత్తూరు	398–00
వరంగల్	402–00
ముంబై	440–00
చెన్నై	405–00
విజయవాడ	398–00
గోదావరి	398–00
07–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	400–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	400–00
నమక్కల్	395–00
ఢిల్లీ	443–00
కోల్‌కతా	433–00

త్వరలో తిరుపతి విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ సర్వీసులు

ఇండిగో సర్వీసులు ప్రారంభించిన కేంద్రమంత్రి అశోకగజపతిరాజు

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయం నుంచి విదేశాలకు త్వరలోనే కనెక్టివిటీ విమాన సర్వీసులను నడిపేదిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర విమానయాన శాఖామంత్రి అశోకగజపతిరాజు అన్నారు. రేణిగుంటలోని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన ఇండిగో విమాన సర్వీసులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన బోర్డింగ్ కౌంటర్ వద్ద మొదటి ప్రయాణికునిగా ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్యఘోష్ నుంచి టికెట్టు పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తిరుపతి నుంచి అంతర్జాతీయ విమానాలను నడిపేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను అధిగమిస్తామని తెలిపారు. ఇండిగో ప్రెసిడెంట్ ఆదిత్యఘోష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మరో వారంలో రాజమండ్రి, మార్చి నాటికి విజయవాడ నుంచి తమ సర్వీసులను ప్రారంభిస్తామన్నారు.



విమానసర్వీసుల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి అశోకగజపతి

పీఎమ్ఎస్ చిన్న ఇన్వెస్టర్లకు సరైనదేనా ?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నేను మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. మంచి రాబడులనిచ్చే కొన్ని ఫండ్స్‌ను ఎంపిక చేశాను. కానీ, వాటి ఏయూఎమ్(అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్–నిర్వహణ ఆస్తులు) తక్కువ స్థాయిలో ఉన్నాయి. రాబడి బాగా ఉన్నప్పటికీ, ఏయూఎమ్ తక్కువగా ఉన్న మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా ?

– రామకృష్ణ, విజయవాడ

ఏయూఎమ్ తక్కువగా ఉన్నప్పటికీ, గతంలో మంచి రాబడులు సాధించిన మ్యూచువల్ ఫండ్స్‌లో నిరభ్యంతరంగా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఒక్కోసారి భారీగా ఏయూఎమ్‌లు ఉన్న మ్యూచువల్ ఫండ్స్ కంటే కూడా తక్కువగా ఏయూఎమ్ ఉన్న మ్యూచువల్ ఫండ్స్ మంచి రాబడులనిచ్చే అవకాశాలుంటాయి. ఒక ఫండ్ మంచి పనితీరు కనబరుస్తోందని, ఇన్వెస్టర్లు ఆ ఫండ్‌లోనే అధికంగా ఇన్వెస్ట్ చేస్తే, ఆ ఫండ్ ఏయూఎమ్ బాగా పెరుగుతుంది. ఒక్కోసారి ఈ అధిక ఏయూఎమ్ ఆ ఫండ్ వృద్ధికి అవరోధం కూడా కాగలదు. అలాగని తక్కువ ఏయూఎమ్ ఉన్న ఫండ్స్ భవిష్యత్తులో మంచి రాబడులు ఇస్తాయన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. అయితే మీరు ఎంపిక చేసిన మ్యూచువల్ ఫండ్స్‌లో మంచి రాబడులు ఇచ్చిన ఫండ్స్.. వాటి ఏయూఎమ్ తక్కువగా ఉన్నా సరే వాటిల్లో ఎలాంటి శషభిషలు లేకుండా ఇన్వెస్ట్ చేయండి. దీర్ఘకాలంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే మీరు మంచి రాబడులు పొందవచ్చు. పైగా పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్(పీఎమ్ఎస్) ద్వారా ఇన్వెస్ట్ చేయమని కొందరు మిత్రులు సలహా ఇస్తున్నారు. వీటిపై నియంత్రణ ఏ సంస్థ చూస్తుంది. ఈ సర్వీస్‌కు సంబంధించి పారదర్శకత ఎలా ఉంటుంది ?

– ఆంటోని, హైదరాబాద్

పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసులు(పీఎమ్ఎస్) అందించే సంస్థల్లో మంచివీ ఉన్నాయి. చెడ్డవీ ఉన్నాయి. పీఎమ్ఎస్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తే అధిక ప్రయోజనాలు వచ్చే అవకాశాలు తక్కువే. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే, ఏడాది తర్వాత వాటిని విక్రయిస్తే, వచ్చే రాబడులపై ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన పని లేదు. ఇది పీఎమ్ఎస్‌కు వర్తించదు. పీఎమ్ఎస్ విషయంలో ఫండ్ మేనేజర్ మీకు బదులుగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటారు. పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా ఆ అధికారం ఆ వ్యక్తికి దక్కుతుంది. పీఎమ్ఎస్ రాబడులు సాధారణంగా స్వల్పకాలిక మూలధన లాభాలై ఉంటాయి. ఈ స్వల్పకాలిక మూలధన లాభాలపై స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పీఎమ్ఎస్‌పై నియంత్రణ సెబీ(సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)కు ఉంటుంది. పీఎమ్ఎస్‌కు కనీస పెట్టుబడి రూ.25 లక్షలు. ఇది చిన్న ఇన్వెస్టర్లకు పనికి రాదు. నియంత్రణ, పారదర్శకత తదితర అంశాల్లో పీఎమ్ఎస్ కంటే మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమంగా ఉంటాయి.

మా నాన్నగారు సీనియర్ సిటిజన్. పిల్లలందరినీ బాగా చదివించారు. అందరూ మంచి ఉద్యోగాల్లో సెటిల్ అయ్యారు. తన దగ్గర ఉన్న సొమ్ములను ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారు. షేర్లంటే అయనకు పెద్దగా ఆసక్తి లేదు. కనీసం పదేళ్ల పాటు ఇన్వెస్ట్ చేసి, వచ్చిన సొమ్ములను తన మనవళ్లకు బహుమతిగా ఇవ్వాలనేది ఆయన ఆలోచన. ప్రజా భవిష్య నిధి(పీపీఎఫ్–పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్) లేదా అల్ట్రా షార్ట్ టర్మ్, షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చా ?

– రవి కిరణ్, వైజాగ్


పన్ను ప్రయోజనాలతో పాటు గ్యారంటీ రాబడులు కావాలంటే డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో కంటే కూడా పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేయడమే ఉత్తమం. పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసినప్పుడు, అలాగే వచ్చే రాబడులపై ఎలాంటి పన్ను భారం ఉండదు. అయితే పీపీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు 15 సంవత్సరాల లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది. అంటే మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను పదిహేనేళ్ల దాకా మీరు వెనక్కి తీసుకునే వెసులుబాటు మీకు ఉండదు. అయితే రాబడులు తక్కువగా వస్తాయి. ప్రభుత్వ సెక్యూరిటీలపై వచ్చే రాబడులే వస్తాయి. దీర్ఘకాలం పాటు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే ఇంతకంటే మంచి రాబడులే పొందవచ్చు. పీపీఎఫ్ కంటే కొంచెం అధిక రాబడులు, ఎప్పుడైనా డబ్బులు తీసుకునే వెసులుబాటు(లిక్విడిటీ) కావాలనుకుంటే మాత్రం డెట్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. అయితే వీటిపై పన్ను భారం ఉంటుంది. మూడేళ్లలోపే డెట్ ఫండ్స్ యూనిట్లను విక్రయిస్తే, స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తి మొత్తం ఆదాయానికి ఈ రాబడిని కలిపి, వర్తించే ఆదాయపు పన్ను స్లాబ్‌ననుసరించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల తర్వాత డెట్ ఫండ్స్ యూనిట్లను విక్రయిస్తే, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇది 20 శాతం(ఇండేక్సేషన్ ప్రయోజనంతో)గా ఉంటుంది. స్టాక్ మార్కెట్ లాగానే డెట్ మార్కెట్లో కూడా వివిధ బాండ్ల ధరలు పెరుగుతూ, తగ్గుతూ, ఒడిదుడుకులకు గురవుతూ ఉంటాయి. అందుకని డెట్ ఫండ్స్ రాబడులు ఏడాదికి ఏడాదికి మారుతూనే ఉంటాయి. స్వల్పకాలిక రాబడుల్లో కూడా తీవ్రమైన వ్యత్యాసమే ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను మంచి అనుభవం ఉన్న ఫండ్ మేనేజర్లు నిర్వహిస్తారు. కాబట్టి షేర్లలో ఇన్వెస్ట్ చేయడం రిస్క్ అనుకంటే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే అంశాన్నీ పరిశీలించవచ్చు. మీ నాన్నగారి ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఎలాంటి రిస్క్ వద్దనుకుంటే మాత్రం పీపీఎఫ్‌ను ఎంచుకోండి.

తొలి అవరోధ శ్రేణి 34,300-34,350

మార్కెట్ పంచాంగం


భారత్‌తో సహా ప్రపంచ స్టాక్ సూచీలన్నీ 2017వ సంవత్సరంలో అతిపెద్ద ర్యాలీ జరిపాయి. 2018 తొలి వారంలో కూడా ఈ ర్యాలీ కొనసాగుతున్నది. కానీ భారీ ర్యాలీ జరిగిన తర్వాతి ఏడాది (2018) జనవరి–ఫిబ్రవరి నెలలు సాంకేతికంగా బాగా కీలకం. ఎందుకంటే 1999లో జరిగిన గొప్పర్యాలీ తర్వాత 2000 ఫిబ్రవరి మూడోవారం నుంచి ప్రపంచ మార్కెట్లన్నీ భారీ పతనాన్ని చవిచూసాయి. అలాగే 2007లో జరిగిన పెద్ద అప్‌ట్రెండ్ తర్వాత 2008 జనవరి రెండోవారం నుంచి భారత్‌తో సహా ప్రపంచ మార్కెట్లన్నీ కుప్పకూలాయి. 2000 పతనం డాట్‌కామ్ బుడగ పేలిపోవడంతోనూ, 2008 పతనం అమెరికా డెట్ బుడగ విచ్ఛిన్నమవడంతోనూ జరిగాయి. కారణలేవైనా...సూక్ష్మంగా చూస్తే, ఆ రెండు సందర్భాల్లోనూ పతన ప్రారంభం ముందు షేర్లు విలువలు ఆకాశాన్నంటాయి. కొత్త ఏడాది ఇటువంటి పతనం వస్తుందన్న సంకేతాలేవీ ప్రస్తుతం కన్పించనప్పటికీ, స్టాక్ విలువలు బాగా పెరిగిన ప్రస్తుత తరుణంలో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇక మన సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే,,.

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



జనవరి 5తో ముగిసిన వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 34,703 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన తర్వాత 34,189 పాయింట్ల కొత్త రికార్డుస్థాయికి ర్యాలీ జరిపింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 97 పాయింట్ల లాభంతో 34,154 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ పెరిగిన ప్రభావంతో ఈ సోమవారం మార్కెట్ పెరిగితే తొలుత 34,300–34,350 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ శ్రేణిని ఛేదిస్తే క్రమేపీ 34,550–34,600 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. తొలి శ్రేణిని దాటలేకపోతే, 34,020 పాయింట్ల వద్ద సెన్సెక్స్‌కు తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే తిరిగి 33,700 పాయింట్లస్థాయికి తగ్గవచ్చు. ఈ స్థాయి దిగువన ముగిస్తే క్రమేపీ 33,400 పాయింట్లస్థాయివరకూ క్షీణించవచ్చు.

నిఫ్టీ తొలి అవరోధ శ్రేణి 10,600-10,620



ఎన్ఎస్ఈ నిఫ్టీ గత వారం 10,404 పాయింట్ల కనిష్ట స్థాయికి తగ్గిన తర్వాత క్రమేపీ పెరిగి 10,566 పాయింట్ల వద్ద కొత్త రికార్డును నెలకొల్పింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 28 పాయింట్ల స్వల్పలాభంతో 10,559 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సోమవారం మార్కెట్ గ్యాప్‌అప్‌తో మొదలైతే 10,600–10,620 పాయింట్ల నిరోధశ్రేణిని చేరవచ్చు. ఈ తొలి నిరోధశ్రేణిని దాటితే క్రమేపీ 10,690–10,710 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం తొలి అవరోధాన్ని దాటలేకపోతే, 10,520 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే 10,440 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 10,370 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 8-1-2018



స్టెయిన్ 'గన్ డౌన్'

భారత్‌తో జరుగుతున్న కేప్‌టౌన్ టెస్టులో 17.3 ఓవర్లు వేసిన తర్వాత... ఈ మ్యాచ్‌కు ముందు తాను ఆడిన ఆఖరి టెస్టులో ఆస్ట్రేలియాపై పెర్త్‌లోనూ తొలి ఇన్నింగ్స్‌లో 12.4 ఓవర్ల తర్వాత... అంతకు కొన్నాళ్ల క్రితం డర్బన్‌లో ఇంగ్లండ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో 3.5 ఓవర్ల తర్వాత... దానికంటే ముందు మొహాలీలో భారత్‌తో జరిగిన తొలి టెస్టులో 11 ఓవర్లకే! దిగ్గజ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ మ్యాచ్ మధ్యలోనే తప్పుకోవడం ఇది కొత్త కాదు. తాను బరిలోకి దిగిన గత ఆరు టెస్టుల్లో గాయం కారణంగా నాలుగు మ్యాచ్‌ల్లో ఆట మధ్యలోనే మైదానం నుంచి నిష్క్రమించాడు. ఇప్పుడు కూడా అతను తొలి టెస్టుతో పాటు సిరీస్‌కు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. తాజా పరిణామాలు చూస్తుంటే అతను మళ్లీ కోలుకొని జట్టులోకి రావడం, గత స్థాయిలో ప్రదర్శన ఇవ్వడం చాలా కష్టం కావచ్చు. పదమూడేళ్లుగా అంతర్జాతీయ క్రికెట్‌పై తనదైన ముద్ర వేసి ఎందరో బ్యాట్స్‌మెన్‌ను భయపెట్టిన స్టెయిన్ కెరీర్ ప్రమాదంలో పడింది.

-సాక్షి క్రీడా విభాగం

419

86 టెస్టుల్లో స్టెయిన్ పడగొట్టిన వికెట్ల సంఖ్య. ఓవరాల్‌గా పదో స్థానంలో ఉన్న అతను... మరో మూడు వికెట్లు తీస్తే అత్యధిక వికెట్లు తీసిన దక్షిణాఫ్రికా బౌలర్‌గా షాన్ పొలాక్ (421)ను అధిగమిస్తాడు.

“60 ఏళ్ల వయసులో కూడా 90 కిలోమీటర్ల మారథాన్ పరుగెత్తే కొందరు మిత్రులే నాకు ఆదర్శం. ఫిట్‌నెస్ గురించి నాకు బెంగ లేదు. ప్రస్తుతం మా జట్టులోని చాలా మంది యువ ఆటగాళ్లకంటే నా ఫిట్‌నెస్ చాలా బాగుంది. కనీసం ఈ ఏడాది మొత్తం ఆడిన తర్వాతే కెరీర్‌పై పునరాలోచిస్తా. ప్రస్తుతం 35 ఏళ్ల వయసులో నాకు క్రికెట్ గురించే తప్ప రిటైర్మెంట్, ఇతర వ్యాపకాల గురించి ఆలోచన లేదు. సాధ్యమైనంత ఎక్కువ కాలం క్రికెట్ ఆడాలని భావిస్తున్న నాకు వయసు సమస్యే కాదు.”

-కేప్‌టౌన్ టెస్టుకు ముందు స్టెయిన్ వ్యాఖ్య

గాయాలతో స్టార్ పేసర్ సతమతం ● మరోసారి మ్యాచ్ మధ్యలోనే విరమణ ● పునరాగమనం ఇక కష్టమేనా!

తొలి టెస్టుకు ముందు దక్షిణాఫ్రికా కోచ్ ఒటిస్ గిబ్సన్ మీడియాతో మాట్లాడుతూ స్టెయిన్‌కు తుది జట్టులో దాదాపుగా అవకాశం లేదని తేల్చేశాడు. జట్టు కూర్పు ఒక సమస్య కాగా, గాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న అతను, ఏదైనా జరిగి మ్యాచ్ మధ్యలో తప్పుకుంటే సమస్యగా మారుతుందని స్పష్టంగా చెప్పాడు. నిజంగా ఆయన భయపడినట్లే జరిగింది. న్యూలాండ్స్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని సఫారీ జట్టు నలుగురు పేసర్లతో బరిలోకి దిగడంతో స్టెయిన్‌కు చాన్స్ లభించినా... అతను మళ్లీ గాయంతో వెనుదిరగడం ఆ టీమ్‌ను ముగ్గురు పేసర్లకే పరిమితం చేసింది. ఇది చివరకు జట్టు విజయావకాశాలపై ప్రభావం చూపించవచ్చు కూడా. భుజం గాయం నుంచి కోలుకొని ఏడాది తర్వాత పునరాగమనం చేశాక ఇప్పుడు మరో కొత్త తరహా గాయం (మడమ)తో అతను మధ్యలోనే వెళ్లిపోవడం ఏమాత్రం మేలు చేసేది కాదు. భారత్‌తో సిరీస్ తర్వాత మార్చిలో కీలకమైన ఆస్ట్రేలియా సిరీస్ కూడా ఉంది. అతను అప్పటిలోగా కోలుకోగలడా?

ప్రదర్శన బాగున్నా...

భుజం గాయం నుంచి కోలుకున్న తర్వాత స్టెయిన్ ముందుగా దేశవాళీ టి20ల్లో ఐదు మ్యాచ్‌లు ఆడి తన ఫిట్‌నెస్ పరీక్షించుకున్నాడు. ఆ తర్వాత జింబాబ్వేతో ప్రాక్టీస్ మ్యాచ్‌లో కూడా 12 ఓవర్లు వేశాడు. అయితే అనారోగ్యంతో జింబాబ్వేతో టెస్టు ఆడలేకపోయాడు. భారత్‌తో మ్యాచ్‌లో అతని బౌలింగ్‌లో ఎప్పటిలాగే పదును కనిపించడం విశేషం. షార్ట్ బంతులు, అవుట్ స్వింగర్లు వేయడంలో ఎక్కడా తీవ్రత తగ్గకపోగా, బౌలింగ్ రనప్, యాక్షన్‌లో ఎక్కడా పాత గాయం సమస్య కనిపించలేదు. ధావన్‌ను వెనక్కి పంపిన బంతిగానీ, ఆ వెంటనే కోహ్లిని దాదాపుగా అవుట్ చేసినట్లుగా అనిపించిన బంతిగానీ పాత స్టెయిన్‌ను చూపించాయి. చాలా సార్లు స్టెయిన్ బంతులు గంటకు 140 కిలోమీటర్ల వేగాన్ని కూడా దాటాయి. ఆ తర్వాత సాహా వికెట్, పాండ్యా క్యాచ్ డ్రాప్ అయిన బంతి కూడా అతని గొప్పతనాన్ని చాటాయి. అయితే దురదృష్టవశాత్తూ గాయం అతని జోరుకు బ్రేక్ వేసింది. నిజానికి దక్షిణాఫ్రికా టీమ్ మేనేజ్‌మెంట్ లెక్కల ప్రకారం పేస్‌కు బాగా అనుకూలించే తర్వాతి రెండు టెస్టుల వేదికలు సెంచూరియన్, జొహన్నెస్‌బర్గ్‌లలో అతను తప్పనిసరిగా జట్టులో ఉండేవాడు. కానీ ఇప్పుడు ఆ అవకాశం కనిపించడంలేదు. గత రెండేళ్ల కాలంలో అతను తుంటి, రెండు సార్లు భుజం, మడమ గాయాలకు గురయ్యాడు. భుజానికి సర్జరీ కూడా జరగడంతో అతను ఏడాది పాటు ఆటకు దూరం కావాల్సి వచ్చింది.

అద్భుతమైన రికార్డు...

సమకాలీన క్రికెట్‌లోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో స్టెయిన్ ఒకడు అనడంలో సందేహం లేదు. గత కొన్నేళ్ళలో జీవం లేని పిచ్‌లు, చిన్న మైదానాలు, పెద్ద బ్యాట్‌లు రాజ్యమేలుతున్న సమయంలో కూడా అతను తన ముద్ర చూపించాడు. గాయాలు ఇబ్బంది పెడుతున్నా అతని బౌలింగ్ ఇంకా భీకరమే. గాయంతో పెర్త్ టెస్టు నుంచి తప్పుకోవడానికి ముందు తొలి ఇన్నింగ్స్‌లో అతని అద్భుత బౌలింగ్ పునాదితోనే దక్షిణాఫ్రికా మ్యాచ్ గెలవగలిగింది. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో స్టెయిన్ టాప్–10లో ఉన్నాడు. వారిలో కేవలం ఇద్దరు పేసర్లకు (మెక్‌గ్రాత్, హ్యాడ్లీ)లకు మాత్రమే స్టెయిన్ (22.32) కంటే మెరుగైన సగటు ఉంది. ఎంతో మంది పేసర్లు తమ సొంతగడ్డపై, అనుకూల పిచ్‌లపై చెలరేగినా... ఉపఖండానికి వచ్చేసరికి మాత్రం తేలిపోయారు. అయితే ఈతరంలో తనతో పోటీ పడిన బ్రెట్ లీ, మిచెల్ జాన్సన్, అండర్సన్, బ్రాడ్ తదితరులతో పోలిస్తే భారత్‌లాంటి చోట అతని ప్రదర్శన స్టెయిన్‌ను అందరికంటే ప్రత్యేకంగా నిలబెడుతుంది. భారత గడ్డపై 6 టెస్టుల్లో కేవలం 21.38 సగటుతో 26 వికెట్లు పడగొట్టడం, పాకిస్తాన్‌లో 24.66, శ్రీలంకలో 24.71 సగటు అతనేమిటో చెబుతాయి. దక్షిణాఫ్రికా తరఫున 44 టెస్టు విజయాల్లో భాగమైన స్టెయిన్... వాటిలో నమ్మశక్యం కాని రీతిలో 16.03 సగటుతో 291 వికెట్లు పడగొట్టడం అతని విలువేమిటో చూపిస్తోంది. ఇలాంటి గొప్ప ఆటగాడి కెరీర్ అర్ధాంతరంగా ముగియాలని ఏ జట్టూ కోరుకోదు. డాక్టర్ల సహకారంతో వీలైనంత త్వరగా అతను కోలుకునేలా ప్రయత్నిస్తామని జట్టు మేనేజర్ మూసాజీ చెప్పడం తమ స్టార్ ఆటగాడిపై వారికి ఉన్న నమ్మకమే కారణం. వారు ఆశించినట్లుగా స్టెయిన్ మళ్లీ తిరిగొచ్చి తన సత్తా చూపించాలని క్రికెట్ ప్రపంచం కూడా కోరుకుంటోంది.

కేప్‌టౌన్‌కు వానొచ్చింది

● మూడో రోజు ఆట పూర్తిగా రద్దు
● భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు



కేప్‌టౌన్: అనూహ్య మలుపులు తిరుగుతూ ఆసక్తికరంగా మారిన భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌కు ఆకస్మిక విరామం... రెండు రోజుల పాటు క్రికెట్ అభిమానులను అలరించిన టెస్టుకు మూడో రోజు వాన అడ్డంకిగా మారింది. భారీ వర్షం కారణంగా ఆదివారం ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. రోజంతా ఒక్క బంతి వేయడం కూడా సాధ్యం కాలేదు. శనివారం రాత్రి నుంచే నగరంలో కురుస్తున్న వర్షం ఆదివారం ఉదయం జోరందుకుంది. మధ్యలో కొన్ని సార్లు తెరిపినిచ్చినా, గ్రౌండ్‌ను సిద్ధం చేసేందుకు అది సరిపోలేదు. అంపైర్లు కనీసం న్యూలాండ్స్ మైదానాన్ని పరిశీలించాల్సిన అవసరం కూడా లేకుండా ఆటను రద్దు చేశారు. మ్యాచ్ నిర్దేశిత ఆరంభ సమయంనుంచి సరిగ్గా ఐదు గంటల తర్వాత అంపైర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 65 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓవరాల్‌గా 142 పరుగులు ముందంజలో ఉంది. మిగిలిన రెండు రోజుల ఆట ఎలాంటి మలుపులు తీసుకుంటుందో, ఎలాంటి తుది ఫలితం వస్తుందో చూడాలి. సోమ, మంగళవారాల్లో రోజుకు 98 ఓవర్ల చొప్పున ఆట సాగనుంది.

మరోవైపు ఈ భారీ వర్షం స్థానికంగా క్రికెట్ వీరాభిమానులను కూడా ఏమాత్రం నిరాశపర్చలేదు. ఈ వాన వారిలో అమితానందాన్ని నింపింది. వర్షాలే లేకపోవడంతో గత వందేళ్లలో ఎన్నడూ లేనంత తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న కేప్‌టౌన్‌కు ఇదో వరంగా వారు భావిస్తున్నారు. వాతావరణ శాఖ సూచన ప్రకారం సోమవారం మాత్రం వర్షసూచన లేదు.

గెలుపు బాటలో ఆసీస్

'మార్ష్' సోదరులు షాన్, మిచెల్ సెంచరీలు ● ఆస్ట్రేలియా 649/7 డిక్లేర్డ్
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 93/4 ● యాషెస్ చివరి టెస్టు



సిడ్నీ: మార్ష్ సోదరులు షాన్, మిచెల్ అద్భుత సెంచరీలు చేయడంతో... యాషెస్ సిరీస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా విజయం ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌ను 649/7 వద్ద డిక్లేర్ చేసిన ఆస్ట్రేలియాకు 303 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ప్రస్తుతం జో రూట్ (42 బ్యాటింగ్), బెయిర్‌స్టో (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ మరో 210 పరుగులు వెనుకబడి ఉంది. ఈ మ్యాచ్ కాపాడుకోవాలంటే ఇంగ్లండ్ చివరి రోజు పూర్తిగా బ్యాటింగ్ చేయాల్సి ఉండగా... ఆసీస్ మరో ఆరు వికెట్లు తీస్తే నాలుగో విజయాన్ని ఖాయం చేసుకుంటుంది. ఓవర్‌నైట్‌స్కోరు 479/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా ఆటలో మార్ష్ సోదరుల బ్యాటింగే హైలైట్. అన్నదమ్ములిద్దరూ ఒకరిని మించి ఒకరు దూకుడుగా ఆడటంతో.. ఇంగ్లండ్ బౌలర్లు ప్రేక్షక పాత్ర వహించారు. ఈ క్రమంలో ముందు షాన్ మార్ష్ (291 బంతుల్లో 156; 18 ఫోర్లు)... ఆ తర్వాత మిచెల్ మార్ష్ (145 బంతుల్లో 101; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలు పూర్తి చేసుకున్నారు. పాయింట్ దిశగా బంతిని పంపిన మిచెల్ మార్ష్ సెంచరీ సంబరాల్లో పడి రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తొలి పరుగు పూర్తవగానే పిచ్ మధ్యలో సోదరుడిని హత్తుకొని రెండో పరుగు పూర్తి చేయడం మరిచాడు. అనంతరం షాన్ మార్ష్ గుర్తుచేయడంతో క్రీజులోకి చేరి బతికిపోయాడు.

- ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో అన్నదమ్ములు సెంచరీలు చేయడం ఇది మూడోసారి. గతంలో చాపెల్ సోదరులు గ్రెగ్, ఇయాన్ (1972లో)... 'వా' సోదరులు మార్క్, స్టీవ్ (2001లో)లు కూడా ఇంగ్లండ్‌పైనే ఈ ఘనత సాధించడం విశేషం. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్‌లో అన్నదమ్ములిద్దరూ ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీలు చేయడం ఇది ఎనిమిదో సారి.
- రెండో ఇన్నింగ్స్‌లో 4 పరుగుల వద్ద కుక్ టెస్టుల్లో 12 వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన ఆరో బ్యాట్స్‌మన్‌గా కుక్ రికార్డు నమోదు చేశాడు.
- గత 80 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా సిడ్నీలో ఆదివారం 47.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. విపరీతమైన ఉక్కపోతతో ఇంగ్లండ్ బౌలర్లు ఉక్కిరిబిక్కిరయ్యారు.

'వారి' కోసం ప్రత్యేక అధికారి వద్దు!

బీసీసీఐ ప్రతిపాదనను తిరస్కరించిన సీఓఏ



కోహ్లి, అనుష్క శర్మ (ఫైల్)

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనలోని భారత క్రికెటర్ల సతీమణుల బాగోగులు చూసుకునేందుకు ప్రత్యేక అధికారిని పంపాలనుకున్న బీసీసీఐ ప్రతిపాదనను కొత్త పరిపాలక కమిటీ (సీఓఏ) తిరస్కరించినట్లు సమాచారం. దీంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), సీఓఏల మధ్య విబేధాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఈ నెల 3న ముంబైలోని క్రికెట్ సెంటర్‌లో జరిగిన బీసీసీఐ సమావేశంలో క్రికెటర్ల భార్యల సంరక్షణాధికారిగా మయాంక్ పారిఖ్‌ను పంపాలని నిర్ణయించింది. ఇప్పటికే సఫారీలో ఉన్న రిషికేశ్ ఉపాధ్యాయ వారికి అందుబాటులోనే ఉన్నారని అలాంటపుడు మరొకరిని పంపడం ఎందుకని సీఓఏ... బోర్డు నిర్ణయాన్ని తిరస్కరించింది. అనుష్క శర్మ (కోహ్లి భార్య), రితిక (రోహిత్ భార్య), నుపుర్ (భువనేశ్వర్ భార్య), నికిత (మురళీ విజయ్ భార్య), రాధిక (రహానే భార్య), రోమి (సాహా భార్య)లు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నారు. వీరందరికీ రెండు వారాల పాటు సఫారీలో జట్టుతో పాటు ఉండేందుకు అనుమతినిచ్చారు. తొలి టెస్టు ముగియడంతోనే ఈ వ్యవధి పూర్తవుతుంది. పొడిగింపు ఉంటుందో లేదో ఇప్పుడైతే నిర్ణయం తీసుకోలేదు. అయితే తాజా వివాదంపై కేప్‌టౌన్‌లో ఉన్న జట్టు మేనేజర్ సునీల్ సుబ్రమణియమ్ స్పందించేందుకు నిరాకరించారు. మరోవైపు మయాంక్ పారిఖ్ దీనిపై తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. నిజానికి క్రికెటర్ల భార్యల సంరక్షణార్థం ప్రత్యేక అధికారిని తీసుకెళ్లే సంస్కృతి ఇంగ్లండ్‌ది. విదేశీ పర్యటనల సమయంలో ఇంగ్లండ్ జట్టు వర్గాల్లో సదరు అధికారికీ చోటు ఉంటుంది.

అండర్–14 చాంప్స్ అర్జున్, జిషిత





సాక్షి, హైదరాబాద్: ముంబై ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్ ఎరిగైసి అర్జున్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జిషిత ఆకట్టుకున్నారు. అండర్–14 ఓపెన్ విభాగంలో అర్జున్... అండర్–14 బాలికల విభాగంలో జిషిత అగ్రస్థానాన్ని సంపాదించారు. ముంబైలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ తొమ్మిది రౌండ్లకుగాను 6.5 పాయింట్లు సంపాదించి ఓవరాల్‌గా 16వ స్థానంలో... తన విభాగంలో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. నాలుగు గేముల్లో గెలిచి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని ఈ టోర్నీలో అర్జున్ అజేయంగా నిలిచాడు. జిషిత 5.5 పాయింట్లు సంపాదించింది. ఆమె ఐదు గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయింది. అండర్–14 ఓపెన్ విభాగంలో హైదరాబాద్‌కే చెందిన రాజా రిత్విక్ 6 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. అండర్–20 బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి బొడ్డ ప్రత్యూష ఆరు పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది.

రన్నరప్ నీల్ జోషి



బర్మింగ్‌హమ్: బ్రిటిష్ ఓపెన్ జూనియర్ స్క్వాష్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుడు నీల్ జోషి రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన బాలుర అండర్–15 సింగిల్స్ ఫైనల్లో నీల్ జోషి 8–11, 16–14, 0–11, 12–14తో టాప్ సీడ్ సామ్ టాడ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడిపోయాడు. అండర్–17 బాలుర సెమీఫైనల్లో తుషార్ సహాని 11–9, 2–11, 3–11, 8–11తో టాప్ సీడ్ ఒమర్ టోర్కీ (ఈజిప్ట్) చేతిలో పరాజయం చవిచూశాడు.

టాప్-6లో నిలుస్తాం

చెస్ ఒలింపియాడ్‌పై ఆనంద్

ముంబై: త్వరలో జరిగే చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్టు మంచి ప్రదర్శన కనబర్చే అవకాశం ఉందని వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్, దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ అభిప్రాయపడ్డాడు. 'చెస్ ఒలింపియాడ్‌లో భారత్ ఐదు లేదా ఆరో స్థానంలో నిలిచే అవకాశముంది. రేటింగ్ పాయింట్లలో చాలా స్వల్ప తేడా మాత్రమే ఉంటుంది. ఒలింపియాడ్‌లో ఉండే ఫార్మాట్ ప్రకారం చూస్తే మనం స్వర్ణం గెలిచే అవకాశాన్ని కూడా కొట్టి పారేయలేం. అయితే ఇతర జట్లూ బలంగా ఉన్నాయి. ఒలింపియాడ్‌లో నేను కూడా పాల్గొనాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని ఆనంద్ వ్యాఖ్యానించాడు.



హైదరాబాద్ వేటాడింది

● మూకుమ్మడిగా విఫలమైన సైనా, శ్రీకాంత్, కశ్యప్
● పీబీఎల్–3లో అవధ్‌కు ఘోర పరాజయం



సాయి ప్రణీత్

చెన్నై: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్–3)లో హైదరాబాద్ హంటర్స్ అసాధారణ విజయంతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. ఆదివారం ఇక్కడ జరిగిన పోరులో హంటర్స్ ధాటికి కిడాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్‌లాంటి హేమాహేమీలున్న అవధ్ వారియర్స్ మూకుమ్మడిగా చేతులెత్తేసింది. దీంతో హైదరాబాద్ 6–(–1) తేడాతో అవధ్ వారియర్స్‌ను కంగుతినిపించింది. మొదట మిక్స్‌డ్ డబుల్స్‌లో మార్కిస్ కిడో– సియాంగ్ (హైదరాబాద్) జంట 14–15, 15–6, 15–11తో ఒర్ చిన్ చంగ్–తంగ్ చన్ మాన్ (అవధ్) జోడీపై నెగ్గింది. తొలి పురుషుల సింగిల్స్‌లో లీ హ్యూన్ ఇల్ (హైదరాబాద్) 13–15, 15–9, 15–14తో పారుపల్లి కశ్యప్‌పై గెలుపొందాడు. రెండో సింగిల్స్ అవధ్‌కు 'ట్రంప్' కాగా ఇందులోనూ హైదరాబాద్ ఆటగాడు సాయి ప్రణీత్ 15–10, 15–10తో అనూహ్యంగా కిడాంబి శ్రీకాంత్‌కు వరుస గేముల్లో షాకిచ్చాడు. దీంతో అవధ్ 3– (–1)తో మైనస్‌లోకి పడిపోయింది. తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌ను హైదరాబాద్ 'ట్రంప్'గా ఎంచుకుంది. కరోలినా మారిన్ (హైదరాబాద్) 15–5, 15–7తో సైనా నెహ్వాల్‌ను ఓడించింది. చివరగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో పియా జెబాదియా–సాత్విక్ సాయిరాజ్ (హైదరాబాద్) జోడీ 15–9, 15–9తో హెంద్రా సెతియవాన్–క్రిస్టియానా జంటపై గెలిచింది. ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లాడిన హంటర్స్‌కు ఇది రెండో గెలుపు. మ్యాచ్‌కు ముందు 8 పాయింట్లతో పట్టికలో అట్టడుగున ఉన్న హైదరాబాద్ తాజా ఘనవిజయంతో 14 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నేడు జరిగే పోరులో చెన్నై స్మాషర్స్‌తో బెంగళూరు బ్లాస్టర్స్ తలపడుతుంది.

ట్రోఫీతో వస్తాం: పృథ్వీ షా

క్రైస్ట్‌చర్చ్: ఐసీసీ అండర్–19 ప్రపంచకప్ కోసం జట్టు పూర్తిస్థాయిలో సన్నద్ధమైందని జూనియర్ టీమిండియా కెప్టెన్ పృథ్వీ షా అన్నాడు. స్వదేశానికి ట్రోఫీతోనే తిరిగొస్తామని అతను ధీమా వ్యక్తం చేశాడు. నేటి నుంచి ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరుగనుండటంతో ఆదివారం ప్రపంచకప్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 16 దేశాల కెప్టెన్లు, న్యూజిలాండ్ క్రికెట్ అధ్యక్షురాలు డెబ్బీ హాక్లీ, పలువురు ఐసీసీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం భారత సారథి పృథ్వీ షా మాట్లాడుతూ 'కోచ్ ద్రవిడ్ మార్గదర్శనంలో కుర్రాళ్లంతా ప్రపంచకప్ సవాలుకు సిద్ధమయ్యారు. మా లక్ష్యం ట్రోఫీ సాధించడమే. ఆస్ట్రేలియాతో ఈ నెల 13న జరిగే తొలి మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. తప్పకుండా మా శక్తిమేర రాణిస్తాం' అని అన్నాడు.



‘ఓఆర్ఆర్’ ప్రైవేటుకు!

నిర్వహణ, టోల్ వసూళ్లను అప్పగించేందుకు హెచ్ఎండీఏ కసరత్తు

రెండు నెలల్లో నివేదిక.. ఆ వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదన



సాక్షి, హైదరాబాద్

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కాసుల వర్షం కురిపించనుంది. నిర్వహణ భారం తొలగడంతోపాటు ఇతర అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు ఆదాయ వనరవబోతోంది. టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) పద్ధతిన టెండర్ పిలిచి 20–30 ఏళ్ల పాటు టోల్ వసూళ్లు, నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే అప్ ఫ్రంట్ ఫీజు రూపంలో రూ.2,000 కోట్లు–రూ.3,000 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని హెచ్ఎండీఏ భావిస్తోంది.



టీవోటీ పద్ధతితో..

ప్రస్తుతం టోల్ వసూళ్లను చూసుకుంటున్న ఈగల్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్.. హెచ్ఎండీఏకు ప్రతి నెలా రూ.16.5 కోట్లు చెల్లిస్తోంది. ఓఆర్ఆర్ నిర్వహణను మాత్రం హెచ్ఎండీఏ పర్యవేక్షిస్తోంది. కానీ రింగ్ రోడ్డు నిర్వహణ నగరాభివృద్ధి సంస్థకు తలనొప్పిగా మారింది. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ మార్గం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. దీంతో నిర్వహణను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనాలతో పాటు సిబ్బందికి ప్రతి నెలా రూ.30 లక్షలు హెచ్ఎండీఏ చెల్లిస్తోంది. ఇతర అవసరాలకు రూ.20 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. అయితే ఇతర రాష్ట్రాల్లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అనుసరిస్తున్న టీవోటీ పద్ధతితో ఏకకాలంలో భారీగా డబ్బులు రావడంతో పాటు నిర్వహణ భారమూ తొలగుతుందని హెచ్ఎండీఏ భావిస్తోంది. దీనిపై అధ్యయనానికి ట్రాన్సాక్షన్ అడ్వైజర్ (లావాదేవీల సలహాదారులు)లుగా లీ అసోసియేట్స్ సౌత్ ఆసియా, క్రిసిల్‌ను నియమించింది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా సదరు సంస్థలు నివేదిక సమర్పించనున్నాయి. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అనుమతి రాగానే ముందుకెళ్లాలని భావిస్తోంది.

వైఎస్సార్ దూరదృష్టి..

వైఎస్సార్ హయాంలో రూ.6,696 కోట్లు వెచ్చించి 158 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించారు. ఆయన దూరదృష్టితో నిర్మించిన ఎనిమిది లేన్ల ఓఆర్ఆర్.. ఇప్పుడు హైదరాబాద్‌కు తలమానికంగా నిలిచింది. శివారు ప్రాంతాల అభివృద్ధికి దిక్సూచిగా మారింది. నగరంపై సగం ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించింది. తాజాగా అదే ఓఆర్ఆర్ ప్రస్తుత ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూర్చబోతోంది. ఇలా మరెన్నో అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కేందుకు ఆదాయ వనరవబోతోంది.



యూపీలో లౌడ్ స్పీకర్లపై నిషేధం

లక్నో: గుళ్లు, మసీదులు, చర్చిలతో పాటు వివిధ ఆధ్యాత్మిక కేంద్రాలు.. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్లను వినియోగించరాదని యూపీ సర్కారు ఆదేశించింది. యూపీలో శబ్దకాలుష్యంపై ఇటీవలే అలహాబాద్ హైకోర్టు విమర్శలు చేసిన నేపథ్యంలో యోగి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.





ఉస్మానియాలో ఆగిన అత్యవసర సేవలు

- విధులకు హౌస్ సర్జన్లు గైర్హాజరు
- అర్ధరాత్రి ఆస్పత్రిలో సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ
- తెల్లవారుజామున చక్కబడిన పరిస్థితి.. ఊపిరిపీల్చుకున్న రోగులు



తనిఖీ చేస్తున్న నాగేందర్

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. రోగులకు అందుబాటులో ఉండాల్సిన క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు విశ్రాంతి గదులకే పరిమితం కావడం, కనీస సమాచారం లేకుండా ముగ్గురు హౌస్‌సర్జన్లు విధులకు డుమ్మాకొట్టడంతో శనివారం రాత్రి అత్యవసర విభాగంలో వైద్య సేవలు నిలిచిపోయాయి. అర్ధరాత్రి తర్వాత సూపరింటెండెంట్ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ చేసి, విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హౌస్‌సర్జన్లు విధులకు డుమ్మా...

అత్యవసర విభాగానికి రోజుకు వందకుపైగా కేసులు వస్తుంటాయి. వీటిలో రోడ్డు, ఇతర ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రుల కేసులే అధికం. శనివారం రాత్రి క్యాజువాలిటీలో ముగ్గురు హౌస్ సర్జన్లు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే విధులకు గైర్హాజరయ్యారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో అర్ధరాత్రి వరకు వైద్యసేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు, వారి బంధువులు ఆందోళనకు గురయ్యారు.

రోగులు, బంధువులు ఆగ్రహం

వైద్యులు లేకపోవడంతో బాధితులకు రాత్రంతా నిరీక్షణ తప్పలేదు. దీంతో రోగులు, బంధువులు ఆస్పత్రి వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆస్పత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేశా రు. విధుల్లో ఉన్న సీఎంఓలు రోగులను పట్టించుకోకపోవడంతో పాటు, ముగ్గురు హౌస్ సర్జన్లు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర విభాగాల్లో ఉన్న సీనియర్ రెసిడెంట్లను పిలిపించి వైద్యసేవలను పునరుద్ధరించారు.

చర్యలు తీసుకుంటాం: నాగేందర్

విధులకు గైర్హాజరైన ముగ్గురు హౌస్ సర్జన్లపై చర్యలు తీసుకుంటామని నాగేందర్ తెలిపారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.